

‘పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు’

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 | సంచిక: 119

SUNDAY Special | ఆదివారం 20-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఏదీ ఈజీ కాదు..

జీవితంలో కొన్నిసార్లు ఓటమి తప్పదు. ప్రపంచంలో గొప్పవారుగా పేరొందిన వారు కూడా తమ పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకున్నారు కాబట్టే ఆ స్థాయిలో ఉన్నారని ఫెదరర్ అన్నారు.


- వివరాలు 4లో



మీ బిడ్డలం... బోనమందుకో తల్లీ...

బోనాల వేడుకలు ఆషాఢ బహుళ అమావాస్యతో ముగియనున్నాయి. నేడు లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తారు.

- వివరాలు 13లో



5 ఫైటర్ జెట్లు నేలమట్టం

ఆపరేషన్ సిందూర్ వేళ భారత్–పాక్ మధ్య జరిగిన దాడుల్లో ఐదు యుద్ధవిమానాలు నేలమట్టమయ్యాయని ట్రంప్ పేర్కొన్నారు.

- వివరాలు 6లో



మనకు ‘బ్యూటిఫుల్’ కాదు!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెచ్చిన ది వన్ బిగ్, బ్యూటిఫుల్’ చట్టం అక్కడి భారతీయులకు పెను సమస్యగా మారేలా ఉంది.


- వివరాలు 6లో



34 మంది జలసమాధి

వియత్నాంలో విరుచుకుపడిన తుపానులో చిక్కుకొని ఓ పర్యాటకుల పడవ నీటమునగడంతో 34 మంది మృతిచెందారు.

- వివరాలు 6లో



బ్రహ్మపుత్రపై చైనా డ్యామ్

చైనా ప్రపంచంలోనే అత్యంత భారీ జలవిద్యుత్ ప్రాజెక్ట్‌ను బ్రహ్మపుత్ర నదీ ప్రవాహ మార్గంలో మొదలుపెట్టింది.

- వివరాలు 6లో

2026 నుంచి కాజీపేటలో

చిక్‌బుక్ చిక్‌బుక్ రైలే

రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో రైలింజన్ల ఉత్పత్తి

రైలు బోగీలు, మెట్రో రైళ్ల తయారీ కూడా: రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్



మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నమూనాను పరిశీలిస్తున్న అశ్వినీ వైష్ణవ్, జి.కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు తదితరులు

- అతిపెద్ద మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌గా కాజీపేట ఫ్యాక్టరీ వెల్లడి
- రాష్ట్రం సిఫారసు, ఆర్‌ఆర్ పాలసీ ప్రకారం కోచ్ ఫ్యాక్టరీలో ఉద్యోగాలు
- రాష్ట్ర ప్రభుత్వం భూమి అప్పగిస్తే వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- కాజీపేట యూనిట్‌ను సందర్శించిన మంత్రులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో 2026 నాటికి ఉత్పత్తి ప్రారంభమవుతుందని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వచ్చే డిసెంబర్ కల్లా యూనిట్ సివిల్ నిర్మాణ పనులు పూర్తవుతాయని చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ యూనిట్ నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. కాజీపేట యూనిట్‌లో రైల్వే ఇంజిన్లతోపాటు కోచ్‌లు, మెట్రో రైళ్ల తయారీ, డిజైన్ పనులు కూడా చేపడతామని వెల్లడించారు. ఈ యూనిట్ ఒక మెగా ఫ్యాక్టరీగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. శనివారం హనుమకొండ జిల్లా అయోధ్యపురంలోని కాజీపేట రైల్వే కోచ్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో జరుగుతున్న పనులను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బీజేపీఎల్పీ నేత ఎ.మహేశ్వర్‌రెడ్డితో కలిసి అశ్వినీ వైష్ణవ్ పరిశీలించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైలులో కాజీపేట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఆయన.. ఫ్యాక్టరీలో జరుగుతున్న పనుల గురించి రైల్వే అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల పురోగతిని వివరించారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణలోనే

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రంలో భారీగా రైల్వే సేవల విస్తరణ

కాచిగూడ–జోధ్‌పూర్ రైలు ప్రారంభోత్సవంలో అశ్వినీ వైష్ణవ్

2లో



శనివారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో

పరాకాష్టకు బాబు భేతాళకుట్ర

మద్యం అక్రమ కేసులో చంద్రబాబు ప్రభుత్వ బరితెగింపు

వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు

- టీడీపీ కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతతో చంద్రబాబు బెంబేలు
- డైవర్షన్ రాజకీయాలలో భాగంగానే అక్రమ కేసు
- పారదర్శకంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మద్యం విధానం
- అందుకే దర్యాప్తు ముసుగులో బాబు ప్రభుత్వ గూండాగిరీ
- అవాస్తవ వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో కుతంత్రం
- వేధింపులే అస్త్రంగా సిట్ బరితెగింపు



- లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపించే పన్నాగం
- అబద్ధాల పుట్టగా చార్జ్‌షీట్ దాఖలు

- వివరాలు 12లో

న్యూస్‌రీల్

మరో 2 రోజులు భారీ వర్షాలు



రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాజధాని హైదరాబాద్ సహా పరిసర జిల్లాలతోపాటు ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయంటూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

- వివరాలు 15లో

కమీషన్ కోసం డీలర్ల పరేషాన్..



రాష్ట్రంలో వచ్చే ఆగస్టు వరకు పేదలకు పీడీఎస్ బియ్యం పంపిణీ చేసిన రేషన్ డీలర్లు ప్రభుత్వం నుంచి రావాల్సిన కమీషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెల వరకే ప్రభుత్వం రేషన్ కమీషన్ అందజేసింది.

- వివరాలు 5లో

స్ట్రెయిట్ ఫైట్ తప్ప స్ట్రీట్ ఫైట్ రాదు



‘నాకు స్ట్రెయిట్ ఫైట్ తప్ప స్ట్రీట్ ఫైట్ రాదు. కడుపులో కత్తులు పెట్టుకుని రాజకీయం చేయడం చేతకాదు. శత్రువుతో నేరుగానే కొట్లాడతా’ అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

- వివరాలు 3లో

కంటికీ కాటే..!



ఆధునిక జీవనశైలి వల్ల పట్టణాలు, నగరాల్లోని ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఒత్తిడి కంటిపైనా ప్రభావం చూపుతుందని.. అనేక కంటి సమస్యలకు కారణమవుతుందని కంటి వైద్య నిపుణులు చెబుతున్నారు.

- వివరాలు 13లో

ఇదండీ సంగతి





సీఎం రేవంత్‌రెడ్డికి అధ్యయన నివేదికను అందిస్తున్న స్వతంత్ర నిపుణుల కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో నివేదిక ప్రతులతో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొన్నం, సీతక్క, కమిటీ వైస్ చైర్మన్ కంచ ఐలయ్య తదితరులు

సమగ్ర సర్వే మెగా హెల్త్ చెకప్‌లాంటిది..

- అది కేవలం సమాచార నివేదిక కాదు
- సామాజిక న్యాయానికి అదే కీలకం
- సర్వేపై నియమించిన నిపుణుల కమిటీ భేటీలో సీఎం రేవంత్
- కుల సర్వేపై సీఎంకు కమిటీ నివేదిక.. దీనిపై కేబినెట్‌లో చర్చించి చర్యలు తీసుకుంటామన్న సీఎం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే.. కేవలం సమాచార నివేదిక కాదని, రాష్ట్రానికి మెగా హెల్త్ చెకప్ లాంటిదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సర్వే నివేదికపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వతంత్ర

మిగతా 3వ పేజీలో ▶



తోటపని.. పిల్లలకు మంచిదని

- ఇల్లు, బడి మాత్రమే కాకుండా పిల్లలకు మంచి బుద్ధులు నేర్పే పాఠాల్లో మరో ముఖ్యమైనది ఒకటి ఉంది. అదే తోట పని. తోటను చూస్తూ, తోటలో పని చేస్తూ పెరిగి పెద్దయిన పిల్లలు సాటి మనుషులకు చల్లని నీడ అవుతారని, మానవత్వానికి ఊడలు అవుతారని మనో వైజ్ఞానిక నిపుణులు చెబుతున్నారు. -16లో

పదేళ్లు సీఎంననడం అభ్యంతరకరం

రేవంత్ వ్యాఖ్యలపై ‘ఎక్స్’లో రాజగోపాల్‌రెడ్డి పోస్ట్



Komatireddy Raj Gopal Reddy
@rajgopalreddy_K
Follow

రాబోయే పదేళ్ళు నేనే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి గారు ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ లో అధిష్టానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుంది. తెలంగాణ కాంగ్రెస్ ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరు.

నల్లగొండ: మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై మరోమారు విరుచుకు పడ్డారు. మరో పదేళ్ల పాటు తానే సీఎంనని రేవంత్ రెడ్డి ప్రకటించడంపై రాజగోపాల్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ శనివారం ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. ‘రాబోయే పదేళ్లు నేనే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్టానం ఆదేశాల మేరకు ప్రజాస్వామ్య బద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుంది. తెలంగాణ కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరు’.. అని రాజగోపాల్‌రెడ్డి ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో కలకలం సృష్టించాయి.



కాలుష్య పరిశ్రమలు ఓఆర్‌ఆర్ వెలుపలకు..

- తరలింపునకు తక్షణమే కార్యాచరణ రూపొందించండి
- రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు భూముల అమ్మకాల్లో వేగం పెంచండి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు
- ఆదాయవనరుల పెంపుపై సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- హాజరైన మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు, జూపల్లి

12లో

టెస్లా బ్రాండ్ బాజా బారాత్

- భారత్‌లో టెస్లా రేస్ ప్రారంభించింది. పైగా ప్రపంచవ్యాప్తంగా ఈ బ్రాండ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ‘బ్రాండ్స్’ అంటే భారతీయులకు మక్కువ. రూ.50 లక్షలకుపైగా విలువ చేసే లగ్జరీ కార్లు సగటున గంటకు ఆరు రోడ్డెక్కుతున్న మార్కెట్ మనది. ఇలాంటి మార్కెట్లో రిటైల్‌తో పరుగు మొదలుపెట్టిన ఈ అమెరికన్ ఆటోమొబైల్ దిగ్గజం రానున్న రోజుల్లో తయారీ చేపట్టే అవకాశమూ లేకపోలేదు.



- వివరాలు 2లో

స్మార్ట్ గూఢచారి!

- అకస్మాత్తుగా మీ ఫోన్ దానంతటదే బ్లింక్ అవుతుంది. ఏదో మెసేజ్! తెరిచి చూస్తే అంకెలు, అక్షరాలు ఉంటాయి. అవేమిటో అర్థం కాదు. హఠాత్తుగా మీ ఫోన్ బ్యాటరీ 20 శాతానికి పడిపోతుంది. ఇది ఏదో సాంకేతిక సమస్య అని మీరు పట్టించుకోక పోవచ్చు. కానీ అవన్నీ.. స్పైయింగ్ సాఫ్ట్‌వేర్ లేదా స్పైవేర్ మీ ఫోన్‌లో చొరబడి ఉండొచ్చనే దానికి సంకేతాలని అంటున్నారు నిపుణులు.



- వివరాలు 3లో

భారత్‌లో టెస్లా

బ్రాండ్ బాజా బారాత్!



- సాక్షి, స్పెషల్ డెస్క్

విశాల భారతావని.. 140 కోట్లకుపైగా జనాభా. విభిన్న తరాలు.. ఖర్చుల్లో అంతరాలు. పది రూపాయలకూ వెనుకడుగు వేసే కస్టమరే కాదు.. బ్రాండ్ కోసం రూ.10 కోట్లకూ సై అనే వినియోగదార్లు ఉన్నారు. ఇలా ప్రీమియం ధర చెల్లించే కొనుగోలుదారులు ఉన్నారు కాబట్టే భారత్‌లో టెస్లా రేస్ ప్రారంభించింది. పైగా ప్రపంచవ్యాప్తంగా ఈ బ్రాండ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. 'బ్రాండ్స్' అంటే భారతీయులకు మక్కువ. రూ.50 లక్షలకుపైగా విలువ చేసే లగ్జరీ కార్లు సగటున గంటకు ఆరు రోడ్డెక్కుతున్న మార్కెట్ మనది. ఇలాంటి మార్కెట్లో రిటైల్‌తో పరుగు మొదలుపెట్టిన ఈ అమెరికన్ ఆటోమొబైల్ దిగ్గజం రానున్న రోజుల్లో తయారీ చేపట్టే అవకాశమూ లేకపోలేదు.

చైనాలో ఈవీలు పెరగడంలో టెస్లా కీలకపాత్ర

దేశంలో సంస్థకు కలిసిరానున్న బ్రాండ్ ఇమేజ్


తొలుత అమ్మకాలు.. ఆ తరువాతే తయారీ

భారత్‌లో ఎలాన్ మస్క్ కంపెనీ ప్రణాళిక ఇదే

ప్రస్తుతం బీఎండబ్ల్యూ నం.1

భారత్‌లో ప్రీమియం కార్ల మార్కెట్ విభాగంలో 2024–25లో 51,406 యూనిట్లు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయి. మెర్సిడెస్–బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి, జాగ్వార్ ల్యాండ్ రోవర్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇప్పటికే దేశీయంగా బలమైన తయారీ, సర్వీస్ నెట్‌వర్క్ వ్యవస్థలను నిర్మించాయి. ప్యాసింజర్ వాహనాల (పీవీ) రంగంలో 2025 జూన్ నాటికి ఈవీల వాటా 4.5 శాతం మాత్రమే. లగ్జరీ పీవీల విభాగంలో ఈవీల వాటా 10 శాతం. ఇందులో బీఎండబ్ల్యూ 53 శాతం మార్కెట్ వాటాతో ఆధిపత్యం చెలాయిస్తోంది. 33 శాతం వాటాతో రెండో స్థానంలో మెర్సిడెస్–బెంజ్ పోటీపడుతోంది. టెస్లాకు ఇప్పటికే ఉన్న సవాళ్లకు తోడు ఈ సంస్థకు ప్రపంచ పోటీదారుగా ఉన్న చైనా దిగ్గజం బీవైడీ ఇండియాలో ఇప్పటికే అడుగుపెట్టింది. వియత్నాం కంపెనీ విన్‌ఫాస్ట్ ఇక్కడ అడుగుపెట్టబోతోంది.

భారత్‌లో కార్ల సగటు అమ్మకపు ధర కంటే మోడల్–వై ధర ఆరు రెట్లు ఎక్కువ. టెస్లా ధరలతో పోలిస్తే ప్రస్తుతానికి భారతీయ కంపెనీలకు ఎటువంటి పోటీ ముప్పులేదు. ఒకవేళ దేశీయంగా టెస్లా తయారీ చేపట్టి, అందుబాటు ధరలో మోడళ్లను తీసుకొస్తే పోటీ తీవ్రమవడం ఖాయం.



భారత్‌లో లగ్జరీ కార్ల విక్రయాలు

2022	38,000
2023	47,000
2024	51,200

పదేళ్ల నిరీక్షణ తర్వాత మనదేశంలోకి టెస్లా ఎంట్రీ ఇచ్చింది. తొలి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను ముంబైలో ఆవిష్కరించింది. పూర్తిగా తయారైన కార్లకు దిగుమతి సుంకం భారత్‌లో 100 శాతం వరకు ఉంది. మనదేశంలో తయారీ చేపడితేనే ప్రయోజనాలు ఇస్తామని భారత్ స్పష్టం చేసింది. ఈ అంశాలే టెస్లా రాక ఆలస్యానికి కారణమయ్యాయి. మొత్తానికి పాలసీ అడ్డంకులు, సుంకాల సంక్లిష్టతలు, ఇతర బ్రాండ్లతో పోటీ, భౌగోళిక రాజకీయ ఒత్తిడి.. ఇవన్నీ అధిగమించి ఎట్టకేలకు అరంగేట్రం జరిగింది. దేశీయంగా తయారీ చేపట్టే అంశానికి కట్టుబడేముందు ఇక్కడి మార్కెట్‌ను పరీక్షిస్తామని టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ పలు సందర్భాల్లో పునరుద్ఘాటించారు. సుమారు రూ.60 లక్షల ధరతో తొలుత వై మోడల్‌ను టెస్లా ప్రవేశపెడుతోంది. ప్రపంచంలో అత్యధిక సుంకం ఉన్నది భారత్‌లోనే అని టెస్లా అధిపతి ఎలాన్ మస్క్ పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు. అందువల్లే, ఇతర దేశాలతో పోలిస్తే టెస్లా కారు ధర మనదేశంలోనే ఎక్కువ.

టెస్లానా మజాకా!



యూఎస్, జర్మనీ, చైనాలో టెస్లాకు తయారీ కేంద్రాలున్నాయి. ఇవి ఏటా 25–30 లక్షల యూనిట్లు ఉత్పత్తి చేయగలవు. 2019లో చైనాలో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 3.8 శాతం మాత్రమే. అదే ఏడాది డిసెంబర్‌లో టెస్లా మార్కెట్లోకి ప్రవేశించింది. అప్పటి నుంచి చైనాలో ఎలక్ట్రిక్ వాహనాల వ్యాప్తి క్రమంగా పెరుగుతోంది. 2024లో ఇది 24.6 శాతానికి చేరడంలో టెస్లా కీలకపాత్ర పోషించింది. ఆటో దిగ్గజాల మాదిరిగా కాకుండా ప్రకటనల విషయంలో టీవీలు, ఇతర మాధ్యమాలకు బదులు సెలబ్రిటీల ప్రభావం, నోటి మాటగా ప్రచారంపై టెస్లా ఆధారపడింది. ప్రీమియం, ప్రత్యేక బ్రాండ్‌గా కంపెనీ ఇమేజ్‌ను నిలబెట్టడంలో ఈ విధానం సహాయపడింది. నటుడు బ్రాడ్ పిట్, గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్, 'ఈబే' మొదటి అధ్యక్షుడు జెఫ్ స్కోల్, షావోమీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ లే యూ.. ఇలా ఎందరో ప్రముఖులు టెస్లా కస్టమర్ల జాబితాలో ఉన్నారు.

డెలివరీలు తగ్గాయ్



అంతర్జాతీయంగా 2025 జనవరి–మార్చిలో టెస్లా డెలివరీలు 13% పడిపోయాయి. గడిచిన మూడేళ్లలో ఇది అత్యంత భారీ క్షీణత. పెరుగుతున్న ప్రపంచ పోటీ, నూతన మోడళ్ల రాక ముఖ్యంగా మోడల్–వై ఆలస్యం కావడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సలహాదారుగా ఎలాన్ మస్క్ పాత్రపై పెరుగుతున్న వ్యతిరేకత వంటివి ఈ క్షీణతకు దారితీశాయి. ఒకప్పుడు టెస్లాకు బలమైన మార్కెట్లలో ఒకటైన చైనాలో సంస్థ ఈవీ వాటా 2025 మొదటి ఐదు నెలల్లో 7.6%కి పడిపోయింది. ఇది గత సంవత్సరం 10%, 2020లో గరిష్ఠ స్థాయిలో 15%గా నమోదైంది. బీవైడీ, షావోమీ వంటి ప్రత్యర్థులు ఫీచర్–రిచ్ మోడళ్లు, పోటీ ధరలతో సవాల్ విసిరి మార్కెట్ వాటాను పెంచుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా టెస్లా 2025 జనవరి–మార్చి కాలంలో 3,36,681 వాహనాలను విక్రయించింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 3,86,810గా నమోదైంది.

క్లుప్తంగా...

మరో ఏడాది పొడిగింపు!

ఎన్‌హెచ్‌ఎంలో 51,451 కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉపశమనం

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద రాష్ట్రంలో పనిచేస్తున్న 51,451 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసును ప్రభుత్వం వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. మార్చి నెలాఖరుతో కాంట్రాక్ట్ గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం మూడు నెలలుగా వారి సర్వీస్ పొడిగించలేదు. దాంతో అప్పటినుంచి 51,451 మంది వేతనాలు ఆగిపోయాయి. ఉద్యోగాలను రెన్యువల్ చేయడంతో మూడు నెలల వేతనాలు కూడా వారికి అందించనుంది. ఇందులో 31,028 మంది ఆశా వర్కర్లు ఉన్నారు. అలాగే బ్లడ్ సెల్ విభాగంలో దాదాపు 20 రకాల ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాంలలో పనిచేసే వారి సర్వీసును కూడా వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొనసాగిస్తున్నట్లు ఆ జీవోలో ప్రభుత్వం పేర్కొంది. అలాగే పీఎం అభిమ్ పథకం కింద 1,500 మంది కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మరో ఏడాది పాటు పొడిగింపు ఇచ్చారు. ఎన్‌హెచ్‌ఎంలోని వివిధ పథకాల కింద పనిజేసే మరో 1,760 మందిని వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగిస్తున్నట్లు జీవో జారీ చేసింది.

భద్రాద్రి భూముల రక్షణకు ప్రభుత్వాలు చొరవ చూపాలి

రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు వీహెచ్‌పీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి రాములవారి భూముల రక్షణకు రెండు తెలుగు ప్రభుత్వాలు చొరవ చూపాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విజ్ఞప్తి చేసింది. రాముడి పేరుపై ఉన్న భూముల రక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ప్రస్తుతం రాములవారి గోశాల ప్రహరీ గోడ నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలని, గోశాల నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. 2018 నుంచి దేవాలయానికి చెల్లించాల్సిన కౌలు (డ్యామేజింగ్ చార్జెస్) వెంటనే చెల్లించాలంది. పురుషోత్తపట్నంలోని రామయ్య భూములపై పూర్తి హక్కులు భద్రాద్రి దేవస్థానానికే చెందుతాయని తెలిపింది. ఇందుకు పాలకులు రాజకీయాలకు అతీతంగా స్పందించి, దేవాలయ భూములు కాపాడాలని వీహెచ్‌పీ కోరింది. దేవాలయం చుట్టూ ఫెన్సింగ్ వేసి, కబ్జాదారుల నుంచి దేవాలయ భూములకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఆవేదన వ్యక్తంచేశారు.

మెట్రో రెండో దశపై కేంద్రం నిర్లక్ష్యం

డీపీఆర్‌లు ఇచ్చి 9 నెలలైనా ఆమోదించలేదు

- ఈ ప్రాజెక్టు కోసం కలిసికట్టుగా పోరాడుదాం
- రాష్ట్రంలోని ఎంపీల సమావేశంలో భట్టి, కోమటిరెడ్డి
- ఆదాయం ఎలా పంచుకుంటారని బీజేపీ ఎంపీల ప్రశ్న



మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఎదురవుతున్న సవాళ్లపై జరిగిన సమావేశంలో పాల్గొన్న భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి, ఈటల, కొండా విశ్వేశ్వరరెడ్డి, బలరాం నాయక్, రఘురాంరెడ్డి, మల్లు రవి, చామల కిరణ్, రఘునందన్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై 9 నెలల క్రితమే కేంద్రానికి డీపీఆర్‌లు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఆమోదించకపోవడం అన్యాయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పార్టీలకు అతీతంగా ఈ ప్రాజెక్టు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల నేపథ్యంలో మెట్రో రైల్ ప్రాజెక్టు విషయంలో ఎదురవుతున్న సవాళ్లపై శనివారం పార్క్‌హయత్ హోటల్‌లో ప్రభుత్వం వివిధ పార్టీల ఎంపీలతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, కిరణ్ కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, పోరిక బలరాం నాయక్, అనిల్ కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్, బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్ రావు తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మెట్రో రెండో దశపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, అన్ని పార్టీల ఎంపీలు సహకరిస్తేనే మెట్రో రెండో దశను సాధించుకోగలమని చెప్పారు. తెలంగాణ కంటే చిన్న రాష్ట్రాల్లో మెట్రో నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని, మన రాష్ట్రంపై మాత్రం కేంద్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎల్‌అండ్‌టీతో ఎలా ముందుకెళ్తారు?

పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో మెట్రో మొదటి దశ నిర్మాణం చేపట్టిన ఎల్‌అండ్‌టీ సంస్థతో కలిసి రెండో దశపై ఎలా ముందుకెళ్తారని బీజేపీ ఎంపీలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రెండోదశ పూర్తయితే ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగి ఎల్‌అండ్‌టీకి కూడా ఆదాయం లభిస్తుంది. ప్రయాణికుల నుంచి టికెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఎల్‌అండ్‌టీతో కలిసి ఎలా పంచుకుంటారు? విద్యుత్ భారం, నిర్వహణ ఖర్చులపై కూడా స్పష్టత రావాల్సి ఉంది' అని పేర్కొన్నారు. ఎంపీలు లేవనెత్తిన సందేహాలపై ఎన్వీఎస్ రెడ్డి వివరణ ఇచ్చారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ మహా నగరాన్ని రాజకీయాలకతీతంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. ట్రిపుల్ ఆర్ పూర్తయిన తర్వాత హైదరాబాద్ లోపలి వైపున రవాణా వ్యవస్థను ఎంత అభివృద్ధి చేసుకుంటే ప్రపంచ స్థాయి నగరాలతో హైదరాబాద్ అంతగా పోటీ పడుతుందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో భారీగా రైల్వే సేవల విస్తరణ

కాచిగూడ-జోధ్‌పూర్ రైలు ప్రారంభోత్సవంలో రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్



కాచిగూడ-జోధ్‌పూర్ రైలు సర్వీసును ప్రారంభిస్తున్న అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్/కాచిగూడ: తెలంగాణలో రైల్వే మౌలిక వసతులను భారీగా విస్తరించినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దశలవారీగా రైల్వే నెట్‌వర్క్ పెంచినట్లు చెప్పారు. కాచిగూడ-జోధ్‌పూర్ డెయిలీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును శనివారం కాచిగూడ స్టేషన్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న రాజస్తాన్ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు. హైదరాబాద్ నుంచి భోపాల్ మీదుగా జోధ్‌పూర్‌కు ప్రతిరోజూ రైలు రాకపోకలు సాగిస్తుందని చెప్పారు. ఈ రైలును అహ్మదాబాద్ మీదుగా నడపాలని డిమాండ్లు వస్తున్నాయని, కానీ అహ్మదాబాద్‌లో కొన్ని నిర్మాణ పనుల వల్ల ప్రస్తుతం ఆ మార్గంలో నడపడం సాధ్యం కాదని తెలిపారు. మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైల్వేస్టేషన్లను ఆధునిక హంగులతో పునరాభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రూ.720 కోట్లతో చేపట్టిన సికింద్రాబాద్ స్టేషన్ పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సహా సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి టు కాజీపేట రైలు ప్రయాణం

శంకర్‌పల్లి: సంగారెడ్డి జిల్లాలోని ఐఐటీ హైదరాబాద్ స్నాతకోత్సవానికి శనివారం వచ్చిన కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్.. అక్కడ నుంచి కాజీపేటకు వెళ్లేందుకు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అక్కడి నుంచి రైలులో కాజీపేటకు ప్రయాణించారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులు ఉన్నారు.

'విపత్తుల నివారణ నిధి'కి 3 జిల్లాల ఎంపిక

- మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్‌కు రెండేళ్లలో రూ.150 కోట్లు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ), జాతీయ వర్షాధార ప్రాంత అథారిటీ (ఎన్‌ఆర్‌ఏఏ) సూచనల మేరకు రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలను జాతీయ విపత్తుల నివారణ నిధి (ఎన్‌డీఎంఎఫ్) కింద ఆర్థిక సహాయానికి ఎంపిక చేశారు. 15వ ఆర్థిక సంఘం సూచనల మేరకు వర్షాభావ తీవ్రత ఎక్కువగా ఉన్న రాష్ట్రంలోని 3 జిల్లాలకు రెండేళ్లలో ఎన్‌డీఎంఎఫ్ కింద రూ.150 కోట్లు వెచ్చిస్తారు. ఈ నిధుల వినియోగానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రణాళికలు రూపొందించాల్సి ఉంటుంది. ఈ మేరకు శనివారం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సచివాలయంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, వ్యవసాయశాఖ అధికారులు, వాసన్ సంస్థతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈ పథకం కార్యాచరణకు నాలుగు ప్రధాన నమూనాల ఆధారంగా నిధుల వినియోగ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. మూడు జిల్లాల్లో లబ్ధిదారులకు జీవనోపాధికి ఊతమిచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

చిక్‌బుక్ చిక్‌బుక్ రైలే

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అశ్వినీ వైష్ణవ్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లపాటు కలగానే మిగిలిన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సాకారం చేశారని అన్నారు. రూ.500 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశ్రమలో బహుళ రకాల రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రాజెక్టు పురోగతిపై చాలా సంతోషంగా ఉన్నట్లు చెప్పారు.

మోదీ మాట తప్పరు అనేందుకు ఇదే నిదర్శనం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన మాట తప్పరు అనేందుకు కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ ఫ్యాక్టరీనే ఉదాహరణ అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ఫ్యాక్టరీ కోసం సుమారు 40 ఏళ్లుగా వరంగల్ జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారని, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు హయాంలో కూడా కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత కాజీపేటలో రైల్వే ఇంజిన్లు, కోచ్‌లు, వ్యాగన్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారని.. ఆయనే స్వయంగా వచ్చి భూమి పూజ చేశారని గుర్తుచేశారు. తెలంగాణలో మొత్తం 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధి జరుగుతోందని, వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి కూడా అందులో భాగమేనని వెల్లడించారు. ఈ యూనిట్ ద్వారా సుమారు 3 వేల మందికి ప్రత్యక్షంగా, వేల మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి లభిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సిఫారసు, ఆర్‌ఆర్ పాలసీ ప్రకారం స్థానికులకు ఫ్యాక్టరీలో ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు.



కాజీపేట ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులను పలకరిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇస్తే త్వరలోనే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు

వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ అవసరం ఎంతో ఉందని.. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని సేకరించి పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు అప్పగిస్తే వరంగల్ ప్రజలకు విమాన రాకపోకల సౌకర్యం కలుగుతుందని కిషన్‌రెడ్డి తెలిపారు. భూమి కోసం గత సీఎం కేసీఆర్‌కు అనేకసార్లు లిఖితపూర్వకంగా విన్నవించానని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఇదే విషయంపై విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. 'ప్రధాని మోదీ తెలంగాణకు ఏం ఇచ్చారు? బీజేపీ ఏం తెచ్చింది? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. అలాంటివారు తమ కళ్లు తెరిచి చూడాలి. చెవులుంటే వినాలి. మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా చూడాలి' అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు సీజేగా ప్రమాణం చేసిన

జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్

ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్, ప్రముఖులు, జడ్జీలు



ప్రమాణస్వీకారం అనంతరం సంతకం చేస్తున్న జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో శనివారం మధ్యాహ్నం 12.30కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఏకే సింగ్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రమాణస్వీకారం అనంతరం గవర్నర్, సీఎం రేవంత్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి సీజేను అభినందించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు, లోకాయుక్త జస్టిస్ రాజశేఖరరెడ్డి, అడిషనల్ సాలిసిటర్ జనరల్ నర్సింహశర్మ, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, డిప్యూటీ సాలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టు ఏడో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ ఏకే సింగ్ మంగళవారం నుంచి హైకోర్టు విచారణ ప్రారంభించే అవకాశం ఉంది.

వ్యవసాయ శాఖకు 2 వేల గజాల సొంత భూమి అందజేత

ఉదారత చాటుకున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



భూమి పత్రాలను అందజేస్తున్న సందర్భంగా మంత్రి తుమ్మలతో మాట్లాడుతున్న కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: యాచారం మండల కేంద్రంలోని రూ.4 కోట్ల విలువైన 2 వేల గజాల సొంత భూమిని వ్యవసాయ శాఖకు అందజేస్తున్నట్లు రైతు కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి భూమికి సంబంధించిన పత్రాలను వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపికి అందజేశారు. తన చిన్నాయన మల్లారెడ్డి వారసత్వంగా తనకిచ్చిన భూమితో పాటు అందులో నిర్మించిన భవనాన్ని కూడా రాసిచ్చారు. నెలరోజుల కిందటే రైతు కమిషన్ బృందం, వ్యవసాయ అధికారులు కలిసి యాచారం మండలంలో పర్యటించారు. ఆ సమయంలో కోదండరెడ్డి ప్రభుత్వానికి ఇవ్వాలనుకున్న భూమిని అగ్రికల్చర్ డైరెక్టర్ గోపితోపాటు మార్కెటింగ్ అధికారులకు చూపించారు. ప్రస్తుతం ఆ స్థలంలో రైతు మిత్ర కమ్యూనిటీ భవనం ఉంది. అందులో రైతులు వ్యవసాయ సామగ్రి, ధాన్యం కొనుగోలు కేంద్రం, సీజన్ పంటలు నిల్వ కోసం వాడుకుంటున్నారు. అయితే ఆ స్థలాన్ని, ఆ స్థలంలో ఉన్న భవనాన్ని వ్యవసాయ శాఖకు అప్పగిస్తే, రైతులకు మేలు జరుగుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోదండరెడ్డి తెలిపారు. సమావేశంలో కమిషన్ సభ్యులు గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి, వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్, కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్, ఏవో హరి వెంకటప్రసాద్ ఉన్నారు.

మొబైల్ వలస సహాయ కేంద్రం వాహనం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్లే వలసదారుల సంక్షేమం కోసం ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ మైగ్రేషన్ ఆర్గనైజేషన్ (ఐవోఎం), ఆహారం, వ్యవసాయ సంస్థ (ఎఫ్‌ఏవో) రూపొందించిన 'మొబైల్ వలస సహాయ కేంద్రం' వాహనాన్ని శనివారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రారంభించారు. ఈ మొబైల్ వలస సహాయ కేంద్రం ద్వారా నిజామాబాద్, నారాయణపేట జిల్లాల్లో.. వలస వెళ్తున్న గ్రామీణ కుటుంబాలకు తగిన మార్గదర్శక సేవలను అందించనున్నారు. వలసకు ముందు, వలస సమయంలో, తిరిగి వచ్చిన తరువాత.. వారి జీవన ప్రమాణాల్లో మార్పులను వివరించే కార్యక్రమాన్ని ఈ మొబైల్ కేంద్రం ద్వారా చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, ఎఫ్‌ఏవో అగ్రిబిజినెస్ స్పెషలిస్ట్ జగన్మోహన్ రెడ్డి, ఐవోఎం రాష్ట్ర సమన్వయకర్త జలజ, ఎన్‌డబ్ల్యూడబ్ల్యూటీ అధ్యక్షురాలు సిస్టర్ లిస్సీ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ గోపి కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. జిల్లా స్థాయి అధికారుల సమన్వయంతో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

స్మార్ట్ గూఢచారి!

అకస్మాత్తుగా మీ ఫోన్ దానంతటదే బ్లింక్ అవుతుంది. ఏదో మెసేజ్! తెరిచి చూస్తే అంకెలు, అక్షరాలు ఉంటాయి. అవేమిటో అర్థం కాదు. హఠాత్తుగా మీ ఫోన్ బ్యాటరీ 20 శాతానికి పడిపోయి ఉంటుంది. నిజానికి అప్పటికి గంట క్రితమే మీరు మీ ఫోన్‌ని పూర్తిగా చార్జి చేసి ఉంటారు. మీ ఫోన్‌ని మీరు ఉపయోగించకుండానే వేడెక్కిపోతుంటుంది. ఏదో సాంకేతిక సమస్య అని మీరు పట్టించుకోక పోవచ్చు. కానీ అవన్నీ... స్పైయింగ్ సాఫ్ట్‌వేర్ లేదా స్పైవేర్ మీ ఫోన్‌లో చొరబడి ఉండొచ్చనే దానికి సంకేతాలు కావచ్చునని అంటున్నారు నిపుణులు. మరోవైపు - స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా నిఘా, గూఢచర్యం, సైబర్‌క్రైమ్‌లు పెరగటం పట్ల కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆందోళన వ్యక్తం చేసింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



స్మార్ట్‌ఫోన్‌లో మన వ్యక్తిగత వివరాలన్నీ నిక్షిప్తమై ఉంటాయి. మనం వాడే అనేక యాప్‌లు.. మనకు సంబంధించిన కాంటాక్ట్‌లు, లొకేషన్ హిస్టరీ, ఫొటోలు.. ఇలా అన్నింటి యాక్సెస్ తీసేసుకుంటున్నాయి. అందువల్ల స్మార్ట్‌ఫోన్‌లో మన జీవితం తెరిచిన పుస్తకం అయిపోయింది. ఎంతో అమూల్యమైన ఆ సమాచారాన్ని ఎవరో, ఎక్కడి నుంచో రహస్యంగా వెతుకుతూ ఉంటే? చూస్తూ ఉంటే? మనకు తెలియకుండా వేరెవరికో ఇచ్చేస్తే? సర్వం పోగొట్టుకున్నట్లే. జీవితమే తలకిందులైపోవచ్చు కూడా. అందుకే స్పైవేర్ సంకేతాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

ఏమిటీ స్పైవేర్? స్పైవేర్ అనేది మన ఫోన్‌లోని విలువైన సమాచారాన్నంతా రాబట్టేందుకు రూపొందిన హానికరమైన సాఫ్ట్‌వేర్. మనకు తెలియకుండానే అది మన పాస్‌వర్డ్‌లన్నీ కనిపెట్టేస్తుంది. మన కదలికలన్నిటినీ గమనిస్తుంటుంది. మనం చేసిన కాల్స్‌నీ, మనకు వచ్చిన కాల్స్‌నీ రికార్డ్ చేస్తుంటుంది. మనకు తెలియకుండానే మన మైక్రోఫోన్, కెమెరాలను కూడా పని చేయించటం మొదలుపెట్టేస్తుంది.



మనకెలా తెలుస్తుంది?..: మీ ఫోన్‌లో స్పైవేర్ చొరబడి మిమ్మల్ని గమనిస్తున్న విషయాన్ని కొన్ని సంకేతాల ద్వారా తెలుసుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. అవి :

ఫోన్ పనితీరులో ఆకస్మిక సమస్యలు: యాప్‌లు పని చేయటం మానేస్తాయి లేదా ఫోన్ బాగా స్లో అయిపోతుంది.

బ్యాటరీ త్వరగా డౌన్ అయిపోవటం: స్పైవేర్ అన్నది ఇరవై నాలుగు గంటలూ పని చేస్తుంటుంది. ఫోన్ బ్యాటరీ మొత్తాన్ని తాగేస్తుంది.

అంతుచిక్కని డేటా వినియోగం: మీ మొబైల్ డేటా బిల్లు మీ వాడకానికి మించి అమాంతం పెరిగిపోయిందీ అంటే స్పైవేర్ మీ డేటాను వేరొకరికి బదిలీ చేస్తోందని అర్థం!

వేడెక్కడం: మీ ఫోన్ వాడకంలో లేనప్పుడు కూడా వేడెక్కుతూ ఉంటే వెనుక ఏదో స్పయింగ్ పని నడుస్తూ ఉండొచ్చు.

వింత సందేశాలు: వింత అక్షరాలు లేదా లింక్‌లతో కూడిన టెక్స్ట్ మెసేజ్‌లు వస్తుంటే అవి మీ ఫోన్‌లోని స్పైవేర్‌కు అందుతున్న ఆదేశాలు / సందేశాలు కావచ్చు.

నివారణే ఉత్తమ పరిష్కారం



స్పైవేర్‌ను గుర్తించడం కాస్త కష్టమే అయినప్పటికీ, దాన్ని నివారించడం మాత్రం సులభమే. అధికారిక యాప్ స్టోర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోండి. ఎస్.ఎం.ఎస్., వాట్సాప్, లేదా ఈమెయిల్ నుంచి వచ్చే అనుమానాస్పద లింకులను తెరవకూడదు. ఫోన్ ఆపరేటింగ్ సిస్టంలోని 'జైల్‌బ్రేక్' చేయకూడదు. అలా చేస్తే కీలకమైన భద్రతా కవచాలు తొలగిపోతాయి. అలాగే పటిష్టమైన, ఎవ్వరికీ ఊహకు కూడా అందని పాస్‌వర్డ్‌లను ఉపయోగించండి. సాధ్యమైన రెండంచెల భద్రతను ఏర్పాటు చేసుకోండి. పబ్లిక్ వై-ఫైలు ఫ్రీగా వస్తున్నాయి కదా అని ఓ ఫోన్‌ని తెరిచి పెట్టుకోకండి. ఫైళ్లు, సినిమాలు వంటి డౌన్లోడ్ చేయడం చేశారో.. మీ పని అయిపోయినట్టే. ఇక మీ ఫోన్ హ్యాక్ అయిందని అనుమానం వస్తే ఫ్యాక్టరీ సెట్టింగ్స్‌ని తొలగించి, ఆపరేటింగ్ సిస్టమ్‌ను తిరిగి ఇన్‌స్టాల్ చేయడం స్పైవేర్‌ను తొలగించడానికి మిగిలిన ఏకైక, ఉత్తమమైన మార్గం.

కేంద్ర ప్రభుత్వ ఆందోళన

డిజిటల్ గూఢచర్యానికి స్మార్ట్‌ఫోన్‌లు, ఇతర డివైజ్‌లను సోషల్ మీడియా ఉపయోగిస్తున్న ధోరణిపై కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆందోళన వ్యక్తం చేసింది. వ్యక్తులకు రాజ్యాంగ హక్కులు ఉన్నట్టే సోషల్ మీడియా సంస్థలకూ ఉండాలని కర్ణాటక హైకోర్టులో 'ట్విట్టర్' చేసిన వాదనలకు స్పందిస్తూ, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా డిజిటల్ గూఢచర్యం అంశాన్ని ప్రస్తావనకు తెచ్చారు. సెలబ్రిటీలు తమ కోసం వచ్చే సందర్శకులను ఫోన్‌లు బయటే పెట్టి రమ్మని విజ్ఞప్తి చేయవలసిన పరిస్థితి నేడు నెలకొని ఉందని ఆయన వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

మీ ఫోన్‌లో దూరి మిమ్మల్ని గమనిస్తూ ఉంటాడు	మీ రహస్యాల్ని, రాకపోకల్ని ట్రాక్ చేస్తుంటాడు	కొత్త యాప్‌లు ఎక్కిస్తాడు, పాస్‌వర్డ్‌లు కొట్టేస్తాడు

అతడి పేరు స్పైవేర్ - మారువేషపు మహా చోర్

స్పైవేర్‌ను వేటాడటం ఎలా?

మీ ఫోన్‌లో స్పైవేర్ సంకేతాలు కనిపిస్తే కనుక మీరు దానిని వేటాడి మట్టుపెట్టాల్సిన సమయం ఆసన్నమైందని అర్థం. అయితే ఆ వేట మీది ఏ రకం ఫోన్ అనే దాన్ని బట్టి ఉంటుంది.

మీది ఆండ్రాయిడ్ అయితే

- మొదట సెట్టింగ్స్‌లోకి వెళ్లండి. అక్కడి నుంచి యాప్స్‌లోకి వెళ్లండి. అక్కడ మీకేమైనా తెలియని యాప్‌లు కనిపిస్తున్నాయేమో చూడండి.
- డివైజ్ అడ్మిన్ యాప్స్‌ని చెక్ చేసి, అక్కడ ఏయే పర్మిషన్‌లు హైలైట్ అయి ఉన్నాయో గమనించండి.
- మాల్వేర్‌బైట్స్, లేదా అవస్ట్ వంటి పేరున్న యాంటీ స్పైవేర్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోండి.
- ఆ తర్వాత వైరస్‌ల కోసం పూర్తిగా స్కాన్ చెయ్యండి. కొత్త ఫైల్స్ ఏమైనా వచ్చి చేరాయా అని తెలుసుకోవటం కోసం డౌన్‌లోడ్ ఫోల్డర్స్ చెక్ చేయండి.
- గూగుల్ ప్లే ప్రొటెక్షన్ ఆన్‌లో పెట్టుకోండి.

మీది ఐఫోన్ అయితే

- మొదట సెట్టింగ్స్‌లోకి వెళ్లి.. అక్కడి నుంచి ప్రైవసీ అండ్ సెక్యూరిటీలోకి యాప్స్ పర్మిషన్స్ పరిశీలించాలి.
- అక్కడి వి.పి.ఎన్. అండ్ డివైజ్ మేనేజ్‌మెంట్ ఆప్షన్‌లో అపరిచిత ఫైల్స్ ఉన్నాయేమో చూడాలి.
- ముఖ్యంగా ఐఓస్‌ను అప్‌డేటెడ్‌గా ఉంచుకోవాలి. చాలావరకు స్పైవేర్‌లు సాంకేతిక లోపాలను ఉపయోగించుకుని లోనికి ప్రవేశిస్తాయి.
- సాధారణంగా యాపిల్‌లోని 'వాల్డ్ గార్డెన్' రక్షణ వ్యవస్థ ఉండటం వల్ల స్పైవేర్ అంత ఈజీగా చొరబడలేదు. అలాగని స్పైవేర్ అటాక్ అసాధ్యం అని చెప్పలేం. ఫోన్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై వినియోగదారులకు పూర్తి నియంత్రణను, అధికారిక యాప్ స్టోర్ వెలుపల ఉన్న యాప్‌లను ఇన్‌స్టాల్ చేసే సామర్థ్యాన్ని అందించడానికి ఫోన్ తయారీదారు విధించిన సాఫ్ట్‌వేర్ పరిమితులను తొలగించే 'జైల్‌బ్రేక్' మార్గాన్ని స్పైవేర్ ఉపయోగించుకోవచ్చు. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి.

హై'పవర్' డేటా సెంటర్స్!

- విద్యుత్ శాఖకు చుక్కలు చూపిస్తున్న బిగ్ డేటా కేంద్రాలు
- ఒక్కో కేంద్రానికి 500 మెగావాట్లు అవసరం
- బిగ్ డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- వీటితో రెట్టింపుకానున్న డిమాండ్.. విద్యుత్ శాఖ గుబులు.. బొగ్గు కొరతపై జెన్‌కో ఆందోళన
- డిమాండ్‌ను అందుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాష్ట్ర విద్యుత్ శాఖకు షాక్ ఇస్తోంది. అంచనాలకు మించిన విద్యుత్ డిమాండ్‌ను సృష్టిస్తుంది. అన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలూ ఏఐతో కనెక్ట్ అవుతుండటంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో డేటా కేంద్రాలు పెరుగుతున్నాయి. బిగ్ డేటా కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వస్తున్నాయి. ఒక్కోటి 500 మెగావాట్ల కెపాసిటీ విద్యుత్‌ను ఉపయోగించే స్థాయిలో ఉంటాయని అంచనా. ఇది జెన్‌కోలో ఒక ప్లాంట్ సామర్థ్యంతో సమానం. ఇదే ఇప్పుడు విద్యుత్ శాఖకు గుబులు పుట్టిస్తోంది. అయితే, విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా చేయాలని విద్యుత్ శాఖను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

ఏం చేద్దాం?

రాష్ట్రంలో పీక్ సమయంలో 15497 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదవుతోంది. 2034 నాటికి ఇది 33773 మెగావాట్లకు చేరుతుందని అంచనా. డిమాండ్‌లో ప్రధాన భూమిక ఐటీ కేంద్రాలదే. ముఖ్యంగా డేటా కేంద్రాల వల్లే డిమాండ్ పెరిగే వీలుంది. విద్యుత్ లభ్యతను పెంచకపోతే ప్రతిపాదిత డేటా కేంద్రాలు వెనక్కుపోయే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర ప్రణాళిక రూపకల్పనకు ప్రభుత్వం విద్యుత్‌శాఖను ఆదేశించింది. కొత్తగా వచ్చిన యాదాద్రితో కలుపుకొంటే 5580 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ కేంద్రాలున్నాయి. 70 శాతం లోడ్ ఫ్యాక్టర్‌తో పనిచేసినా ఇవి 109 మిలియన్ యూనిట్లు ఇవ్వగలవు. అయితే, బొగ్గు కొరత, తరచూ బ్యాక్‌డౌన్ కారణంగా గరిష్టంగా రోజుకు 60 మిలియన్ యూనిట్లే ఇస్తున్నాయి. పీక్ సమయంలో రాష్ట్రంలో రోజుకు 308 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటోంది. డేటా కేంద్రాల ఏర్పాటుతో డిమాండ్ రెట్టింపు అయితే రోజుకు 600 మిలియన్ యూనిట్లు కావాలి. ఈ నేపథ్యంలో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేందుకు జెన్‌కో మార్గాన్వేషణకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడం జెన్‌కోకు కీలకం. దీని సామర్థ్యం 4 వేల మెగావాట్లు. ఇక్కడ 55 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉంటే తప్ప ముందుకెళ్లలేని పరిస్థితి. ఈ బొగ్గుపై సింగరేణి సంస్థ స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం 4 ర్యాకులతో బొగ్గు సరఫరా జరుగుతోంది. దీన్ని 14 రేకులకు పెంచాలి. దీంతో జెన్‌కో అధికారులు రైల్వే, సింగరేణితో భేటీకి సన్నద్ధమవుతున్నారు.

కొనుగోలు తప్పదా?

ప్రస్తుతం రోజుకు 300 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ డిమాండ్ ఉంటేనే... మార్కెట్లో విద్యుత్ కొనాల్సి వస్తోంది. జెన్‌కో థర్మల్ 57, హైడల్ 25, సింగరేణి నుంచి 23 మిలియన్ యూనిట్ల విద్యుత్ అందుతోంది. రోజూ 149 మిలియన్ యూనిట్లు కేంద్ర సంస్థలు, మార్కెట్ నుంచి సమకూర్చుకుంటున్నారు. మధ్యాహ్నం యూనిట్ గరిష్టంగా రూ.2.5కు లభిస్తున్నా, రాత్రిపూట మాత్రం యూనిట్ రూ.8 వరకూ వెళ్తోంది. రాబోయే రోజుల్లో రోజుకు 600 ఎంయూ డిమాండ్ ఉంటే... ధర ఎంత ఉన్నా మార్కెట్ నుంచి భారీగా కొనుగోలుచేయాల్సి రావొచ్చు.

డిమాండ్ అందుకుంటాం

కేంద్ర విద్యుత్ సంస్థల అంచనాను మించి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. హైదరాబాద్‌లో ఐటీ కేంద్రాల్లో వస్తున్న మార్పులూ కారణమే. అయితే, డిమాండ్‌ను అందుకునేందుకు జెన్‌కో అన్నివిధాలా సిద్ధమతోంది. యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తెస్తాం. ఇతర ప్లాంట్లలోనూ ఉత్పత్తి పెంచుతాం. ఎంత డిమాండ్ పెరిగినా అందుకోగల సామర్థ్యం జెన్‌కోకు ఉంది.

–ఎస్.హరీశ్, సీఎండీ, తెలంగాణ జెన్‌కో

క్లుప్తంగా...

నిజంగానే రేవంత్ వస్తే.. కేటీఆర్ తట్టుకోగలరా?

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అధికారం పోయిందన్న ఫ్రస్ట్రేషన్‌లో కేటీఆర్ ఏదో మాట్లాడుతున్నాడని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి నాటుకోడి అయితే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాయిలర్ కోడి అని ఆయన వ్యాఖ్యానించారు. 'రేవంత్.. నువ్వు మొగోడివి అయితే రా అని కేటీఆర్ అంటున్నాడు. ఒకవేళ నిజంగానే రేవంత్‌రెడ్డి వస్తే కేటీఆర్ నిలబడగలడా? రేవంత్ మూడ్ ఖరాబై సెక్యూరిటీని వదిలి వచ్చినా వస్తాడు. కేటీఆర్ సవాల్ చేస్తున్నట్టు రేవంత్ నిజంగా వస్తే తట్టుకునే గట్స్ కేటీఆర్‌కు ఉన్నాయా? ఇక నేను, రేవంత్ కలిసి వస్తే బీఆర్ఎస్ వాళ్లు తట్టుకోగలరా?' అని ఆయన ప్రశ్నించారు.

సీఎంవి నియంత పోకడలు

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎన్నిసార్లు మందలించినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన భాషను మార్చుకోవడం లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం కొల్లాపూర్‌లో జరిగిన సభలో సీఎం రేవంత్ 40 నిమిషాల ప్రసంగంలో 38 పర్యాయాలు కేసీఆర్ నామస్మరణతో పాప ప్రక్షాళన చేసుకున్నాడన్నారు. లక్కీ భాస్కర్‌లా అందివచ్చిన రాజకీయ అవకాశాలతో సీఎం పదవి చేపట్టినా, పాలమూరు జిల్లాకు మాత్రం ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలతో కలిసి శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ బిడ్డల బలిదానాలకు కారకుడైన చంద్రబాబుని వేడుకుంటున్న రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌ను విషం తీసుకుని చావమనడాన్ని ఖండించారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ చావును కోరుకుంటున్న సీఎం రేవంత్ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకున్న చంద్రబాబును అడుక్కుంటున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు.

ఎరుపు అంటే ప్రధాని మోదీకి భయం

- సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



నిజామాబాద్ సిటీ: ఎరుపు అంటేనే ప్రధాని మోదీకి భయం పట్టుకుందని, కమ్యూనిస్టు పార్టీ అంటేనే ప్రశ్నించే గొంతుక అని, మావోయిస్టులను చంపగలరు కానీ, సిద్ధాంతాలను అంతం చేయలేరని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ 22వ జిల్లా మహాసభలకు అధ్యక్షత వహించారు. అనంతరం చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు నల్ల చట్టాలపై సీపీఐ చేసిన పోరాటాలతోనే వెనక్కి తగ్గారన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలను చంపుతున్నారని, అక్కడి సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను ఆపకపోతే బీజేపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చాడ హెచ్చరించారు. పార్టీ భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనకు, చేయబోయే పోరాటాలకు జిల్లా మహాసభలు దోహద పడతాయన్నారు.

స్ట్రెయిట్ ఫైట్ తప్ప స్ట్రీట్ ఫైట్ రాదు

- ఎందరో ముఖ్యమంత్రులతో కొట్లాడిన
- నాపై నాడు కేసీఆర్.. నేడు రేవంత్ కుట్రలు
- దుష్ప్రచారం చేస్తున్నవారిపై బీజేపీ హైకమాండ్‌కు ఫిర్యాదు చేస్తా
- కార్యకర్తలు, అనుచరుల సమావేశంలో బీజేపీ ఎంపీ ఈటల



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

మేడ్చల్‌రూరల్: 'నాకు స్ట్రెయిట్ ఫైట్ తప్ప స్ట్రీట్ ఫైట్ రాదు. కడుపులో కత్తులు పెట్టుకుని రాజకీయం చేయడం చేతకాదు. పైకి ఒక మాట.. లోపల మరో మాట మాట్లాడటం తెలియదు. శత్రువుతో నేరుగానే కొట్లాడతా' అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అనుచరులతో శనివారం శామీర్‌పేట్‌లోని తన నివాసంలో ఈటల సమావేశమయ్యారు. పార్టీలో తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమకు అవకాశం కల్పించాలని వారు ఈటలకు విన్నవించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. కొందరు సామాజిక మాధ్యమాల్లో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను పదవుల కోసం పనిచేసే వ్యక్తిని కాదని స్పష్టంచేశారు. పదవుల కోసం తాను బీఆర్ఎస్ నుంచి బయటకు రాలేదని, ఆ పార్టీ తనను కుట్రలతో బయటకు పంపిందని ఆరోపించారు.

బీ కేర్ ఫుల్..

ప్రత్యర్థితో నేరుగా కొట్లాడటమే తనకు తెలుసు అని ఈటల అన్నారు. 'స్వరాష్ట్రం కోసం ఉద్యమం చేసిన చరిత్ర నాది. సమైక్య పాలనలో ఎంతోమంది సీఎంలతో కొట్లాడిన. ఇప్పుడు నాకు సరితూగలేనివారు కూడా నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. వారిపై హైకమాండ్‌కు ఫిర్యాదు చేస్తా. నాకు స్ట్రెయిట్ ఫైట్ తప్ప స్ట్రీట్ ఫైట్ రాదు. కడుపులో కత్తులు పెట్టుకుని రాజకీయం చేయడం మాకు చేతకాదు. శత్రువుతో నేరుగా కొట్లాడతా. నాపై గతంలో కేసీఆర్.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి, మరికొందరు కుట్రలు చేస్తున్నారు. రాజకీయాల్లో అబద్ధాల పునాదులపై కొందరు బతుకుతున్నారు. అన్ని వ్యవస్థల్లో కోవర్టులు ఉంటారు. నిజాయితీగా పార్టీ కోసం కష్టపడటం తప్ప నాకు మరొకటి తెలియదు. నా సేవలు ఉపయోగించుకొని రాష్ట్రంలోని బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 20 ఏళ్లుగా తనను గుండెల్లో నిలుపుకున్న హుజూరాబాద్ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఈటల తెలిపారు. 'ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నా అడుగు పడని గ్రామం లేదు. హుజూరాబాద్ చైతన్యానికి మారుపేరు. క్యాడర్‌కు అందుబాటులో ఉంటా. హుజూరాబాద్ వస్తా.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించుకుంటా. కార్యకర్తలు కుంగిపోవద్దు' అని ఈటల భరోసా ఇచ్చారు.

ఇప్పటివరకు నీ చరిత్ర గురించి చదివింది ఒక్క పేజీనే

- కేటీఆర్‌పై ఏఐసీసీ కార్యదర్శి సంపత్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్.సంపత్‌కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడేటప్పుడు నాలుక జాగ్రత్తగా పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. 'పైకి చూస్తే చదువుకున్న వాడిలా ఉంటాడు. పదేళ్ల ఉద్యమం పేరుతో, ఆ తర్వాత పదేళ్ల అధికారం పేరుతో అనుభవించారు. ఇప్పుడు ప్రజలు బండకేసి కొట్టేసరికి 18 నెలలకే కేటీఆర్ అల్లల్లాడుతున్నాడు' అని శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వ్యాఖ్యానించారు. 'ఇప్పటివరకు నీ గురించి మేం చెప్పింది ఒక్క పేజీ మాత్రమే. కల్వకుంట్ల కథాకమామిషు, తారక్ తొడేళ్ల కథ, రావుగారి రాసలీలలు పేరిట మూడు పుస్తకాలు ఇంకా చదవాల్సినవి ఉన్నాయి. సమయం వచ్చినప్పుడు వాటిని బయటపెడతాం. అవి బయటకు వస్తే నీ కుటుంబమే నిన్ను చీదరించుకుంటుంది. తెలంగాణ సమాజం తరిమికొడుతుంది. నీకు ఆత్మహత్య తప్ప వేరే మార్గం కూడా ఉండదు' అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

కేటీఆర్‌వి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు

- టీపీసీసీ అధికార ప్రతినిధి సుధాకర్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై.. మాజీ మంత్రి కేటీఆర్ బాధ్యతారాహిత్యంగా వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని టీపీసీసీ అధికార ప్రతినిధి సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. ఆయన శనివారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికైనా కేటీఆర్ తాను చేసిన తప్పుడు వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ నోటిని అదుపులో పెట్టుకోని మాట్లాడకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ హెచ్చరించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ భాష, వ్యవహార శైలిపై కేసీఆర్ స్పందించాలని డిమాండ్ చేశారు.



ఒకే కాడి.. మూడు నాగళ్లు

సాత్నాల మండలం రామాయి ప్రాంతంలో ఆశన్న అనే రైతు 14 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సోయాబీన్ పంట సాగు చేస్తున్నాడు. పంట సాగులో భాగంగా.. ఒకే కాడికి మూడు నాగళ్లను జోడించి పనులు చేస్తున్నాడు. దీంతో పది రోజుల్లో కావలసిన దౌర పని మూడు రోజుల్లో పూర్తవుతుందని సదరు రైతు తెలిపాడు. ఇందువల్ల శ్రమ తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని చెప్పాడు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సమగ్ర సర్వే మెగా హెల్త్ చెకప్ లాంటిది

▶ మొదటి పేజీ తరువాయి

నిపుణుల కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కంచె ఐలయ్య, సభ్యులు ప్రొఫెసర్ శాంతాసిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, డా.సుఖ్‌దేవ్ తొరాట్, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య భూక్య, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, ప్రొఫెసర్ జీన్‌డ్రెజ్, ప్రొఫెసర్ థామస్ పికెట్టి, ప్రవీణ్ చక్రవర్తి, కార్యదర్శి అనుదీప్ దురిశెట్టితో సీఎం శనివారం సమావేశమయ్యారు. కమిటీ తన అధ్యయన నివేదికను సీఎం సమర్పించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో సమగ్ర సర్వేను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సమగ్ర సర్వేపై చేపట్టిన అధ్యయన నివేదిక రాష్ట్రంలో బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయాన్ని అమలు చేసేందుకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు, ఇందుకుగల కారణాలపై నిపుణుల కమిటీ అధ్యయనం చేయాలని కోరారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. నిపుణుల కమిటీ నివేదికలోని అంశాలపై కేబినెట్ సమావేశంలో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దేశ దిశను మార్చనున్న సమగ్ర సర్వే..

సమగ్ర సర్వే, దానిపై నిపుణుల కమిటీ అధ్యయన నివేదిక దేశ దిశను మారుస్తాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సమగ్ర సర్వేపై వివాద రహితులైన వివిధ రంగాల మేధావులతో కమిటీ వేయటం చరిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఇలాంటి సర్వే దేశంలో ఇప్పటివరకు ఎక్కడా జరగలేదని తెలిపారు. బిహార్‌లో సర్వే చేసినప్పటికీ న్యాయస్థానాల్లో దానికి బ్రేకులు పడ్డాయని గుర్తుచేశారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడితే లోపం ఉందని ఎవరూ చెప్పలేదని తెలిపారు. సీఎంగా, స్వతంత్ర నిపుణుల కమిటీ చైర్మన్‌గా, కుల గణన కమిటీ చైర్మన్‌గా రెడ్లు ఉన్నప్పటికీ ఎలాంటి భేదాలు లేకుండా అణగారిన వర్గాలకు ప్రయోజనం చేకూర్చాలన్న బాధ్యతతో పని చేయడంతో సర్వే విజయవంతమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

రెండు భాగాలుగా నివేదిక

సమగ్ర సర్వేను దాదాపు నాలుగు నెలల పాటు స్వతంత్ర కమిటీ అధ్యయనం చేసింది. సమగ్ర సర్వే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల ప్రజల స్థితిగతులు.. విద్య, భూమి, సంక్షేమం, ఉపాధి రంగాల్లో ఎవరెవరి పరిస్థితి ఎలా ఉందనే అంశాలను భిన్న కోణాల్లో పరిశీలించింది. రాష్ట్రంలో 242 కులాల వెనుకబాటుతనాన్ని విశ్లేషణ చేసింది. కంపోజిట్ బ్యాక్‌వర్డ్‌నెస్ ఇండెక్స్‌ను తయారు చేసి కులాలకు గ్రేడింగ్/ర్యాంకు ఇచ్చింది. ఈ నివేదిక 320 పేజీల్లో ఉండగా... దీన్ని రెండు భాగాలుగా ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికను పూర్తిగా పరిశీలించిన తర్వాత ప్రజలకు అనువైన విధంగా సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచాలని కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా సూచించారు.



విస్తారమైన జ్ఞానాభ్యాసము చేత విస్తారమైన దుఃఖము కలుగును;
అధిక విద్య సంపాదించిన వానికి అధిక శోకము కలుగును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, **తిథి:** బ.దశమి ప.10.56 వరకు తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** కృత్తిక రా.10.33 వరకు తదుపరి రోహిణి, **వర్జ్యం:** ప.11.25 నుండి 12.54 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.50 నుండి 5.42 వరకు, **అమృత ఘడియలు:** రా.8.20 నుండి 9.51 వరకు.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం : 6.34
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మిషెల్ ఒబామా (మాజీ ఫస్ట్ లేడీ)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"మీరిద్దరూ ఒకే గదిలో కలిసి కనిపించటం ఎంతో బాగుంది మిస్టర్ అండ్ మిసెస్ ఒబామా" అన్నారు క్రెయిగ్, నవ్వుతూ.

క్రెయిగ్ 'ఐఎంఓ' పాడ్ కాస్ట్ హోస్ట్.

'ఇన్ మై ఒపీనియన్' అనే ఆ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలలో క్రెయిగ్ తన సుతిమెత్తనైన చిరునవ్వులతో గెస్టుల గుండె కవాటాలను తెరుచుకుని ఏ విధమైన అనుమతి, ఆహ్వానం లేకుండానే లోపలికి చొరబడతారు.

"మేమిద్దరం ఒకే గదిలో కలిసి ఉండటం అనే విషయానికి మీరిస్తున్న ప్రాధాన్యం దేనిని సంకేతపరుస్తున్నట్లుగా నేను భావించవచ్చు మిస్టర్ క్రెయిగ్?" అన్నాను, నవ్వుతూ.

ఆ మాటకు క్రెయిగ్ తగు మోతాదులోనే నవ్వారు కానీ, అక్కడే ఉన్న నా హస్బెండ్ బరాక్ ఒబామా... ఆ చిన్న పాడ్‌కాస్ట్ స్టూడియో మొత్తం అదిరిపడేంతగా నవ్వారు.

అంతలా నవ్వటం ద్వారా ఆయన ఆ స్టూడియో వాళ్లకి ఏం తెలియపరచాలని అనుకుంటున్నారు? "నిజమే, మేమిద్దరం ఒకే గదిలో కలిసి ఉండటం లేదు" అనా? "ఉండక పోవటానికి కారణం నా వైఫ్" అనా?



భర్తలు భార్యలకు తలనొప్పిగా మారటానికి పెద్ద పెద్ద కారణాలు అక్కర్లేదు. చిన్న చిన్న అకారణాలు చాలు.

"ఏమీ లేదు" అని బరాక్ చెప్పటం, "ఏదో ఉంది" అనుకునేలా ఉంటుంది!

"వెల్, చెప్పండి మిస్టర్ ఒబామా... మీరిద్దరూ ఒకే గదిలో కలిసి ఉండలేని 'యుగాంతం' వంటిదొకటి మీ దాంపత్య జీవితంలోకి ఒక దుర్భరమైన శీతాకాలంలా అడుగుపెట్టిందని అమెరికన్ ప్రజలంతా అనుకోవటానికి కారణం ఏమై ఉంటుందని మీరు ఊహిస్తున్నారు?" అని అడిగారు క్రెయిగ్... 'యుగాంతం' అన్న మాటను మృదువుగా నొక్కి వదులుతూ.

బరాక్ కొద్ది క్షణాలు మౌనంగా ఉన్నారు. ఆయన ఏం చెబుతారా అని ఆ కొద్ది క్షణాలూ నేను టెన్షన్‌తో చచ్చిపోయాను.

"మిస్టర్ క్రెయిగ్... మీరంటున్నది నేనూ, మిషెల్ ఒకే 'గది'లో కలిసి ఉండక పోవటం గురించా లేక, ఒకే 'ఇంట్లో' కలిసి ఉండక పోవటం గురించా? ఎందుకంటే, ఇంట్లో గది ఉంటుంది కానీ, గదిలో ఇల్లు ఉండదు కదా" అని పెద్దగా నవ్వారు.

నేను కోపంగా బరాక్ వైపు చూశాను.

ఏమిటతని ఉద్దేశం? ఒకే ఇంట్లో ఉంటున్నాం కనుక ఒకే గదిలో లేకుంటే మాత్రం ఏమిటని ప్రశ్నించటమా? లేక, "అవును, మేము ఒకే గదిలో ఉండటం లేదు" అని నిర్ధారణ చేసి చెప్పటమా?

క్రెయిగ్, చిరునవ్వుతో నన్నే గమనిస్తూ ఉన్నారు. ఆయన 'ఐఎంఓ' పాడ్ కాస్ట్ హోస్ట్ మాత్రమే కాదు. నా సొంత అన్నయ్య కూడా.

బరాక్ అంటే క్రెయిగ్‌కి చాలా రెస్పెక్ట్. నేనంటే అంతకు మించిన ఇష్టం. బరాక్ మీద ఉండే రెస్పెక్ట్‌నీ, నేనంటే ఉండే ఇష్టాన్నీ బ్యాలెన్స్ చేసుకుంటూ ఒక ఔట్‌సైడర్‌గా మమ్మల్ని ఇంటర్వ్యూ చేస్తున్నారు క్రెయిగ్.

"మీరు చెప్పండి మిసెస్ ఒబామా. కొంతకాలంగా మీరు మిస్టర్ ఒబామాతో కలిసి బయటెక్కడా కనిపించలేదు. మీ దాంపత్య జీవితం హ్యాపీగానే ఉందని మీరు చెప్పగలుగుతారా?" అన్నారు క్రెయిగ్.

"ఎస్, అఫ్‌కోర్స్ మిస్టర్ క్రెయిగ్! హ్యాపీగా ఉన్నాం. ఇక మీదటా హ్యాపీగా ఉంటాం. ఎప్పటికీ హ్యాపీగా ఉంటాం. నా భర్తను వదిలేయాలని నేను ఏ క్షణమూ అనుకోలేదు. మాకు చాలా కష్టాలు ఎదురయ్యాయి. అయినా ఒకటిగా ఉన్నాం" అని చెప్పాను.


"అవును, నా భార్య నన్ను మళ్లీ స్వీకరించింది" అన్నారు ఒబామా, హఠాత్తుగా మధ్యలోకి వచ్చి!

దేవుడా! ఈయనెందుకు అడగని విషయాలన్నీ చెబుతుంటారు?! భర్తలంతా ఇంతేనా, బరాక్ ఒబామా ఒక్కరే ఇలానా?

నయం, ఇద్దరూ కూతుళ్లే అయ్యారు! కొడుకు కూడా ఉందుంటే, ఊపిరి ఆడకుండా ప్రేమగా నా మెడను చుట్టేయటానికి 'మరొక బరాక్' తయారై ఉండేవాడు!

ఏదీ సునాయాసం కాదు!

విశ్వ గురు



డార్ట్‌మౌత్ కాలేజీ... అమెరికా, న్యూ హాంప్‌షైర్‌లోని ప్రైవేట్ ఐవీ లీగ్ రిసెర్చ్ యూనివర్సిటీ. అక్కడ 2024 గ్రాడ్యుయేట్ల బ్యాచ్‌ను ఉద్దేశించి ఆ ఏడాది జూన్‌లో టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ మాట్లాడారు. ఈ ఉత్సవానికి 11,000 మంది హాజరయ్యారు. యువతను ఉత్సాహపరిచే ఆ ప్రసంగం సంక్షిప్త పాఠం ఇది.

థాంక్యూ! హలో క్లాస్ ఆఫ్ 2024!

నేనెంత ఉత్సాహంగా ఉన్నానో మీకెవరికీ తెలియదు. నేనొక కాలేజీ క్యాంపస్‌లో అడుగుపెట్టడం నా జీవితంలో ఇది రెండోసారి. కానీ, మీరు దేన్నో దృష్టిలో పెట్టుకుని నాకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేస్తున్నారు. నేనిక్కడ ప్రసంగించడానికి వచ్చాను. కానీ, 'డాక్టర్ రోజర్'గా ఇంటికి తిరిగి వెళతాను. అది నాకు గొప్ప బోనస్ లాంటిది. 'డాక్టర్ రోజర్'. ఇది నేను ఏమాత్రం ఊహించని విజయం!

ఇది నాకు కొద్దిగా పరిచయం లేని వాతావరణం. ఇది నేను ఎప్పుడూ చూసే దృశ్యం కాదు... ఈ దుస్తులు కూడా నేను సాధారణంగా వేసుకునేవి కావు. ఈ పొడవాటి గౌను బరువుగా ఉంది. గత 35 ఏళ్ళుగా ఇంచుమించుగా ప్రతి రోజు నేను పొట్టి నిక్కర్లు, టీ షర్టులతోనే గడిపాను.

నాలుగు పదాలే చెప్పగలిగాను!

నేను ఇలాంటి ప్రసంగాలు చేసే వ్యక్తిని కూడా కాను. నేను స్విట్జర్లాండ్ జాతీయ జట్టులో చేరేనాటికి నాకు 17 ఏళ్ళు. అప్పట్లో నేను ఎంతగా కలవరపడ్డానంటే నాలుగు పదాలకు మించి మాట్లాడలేకపోయాను. ''ఇక్కడకు రావడం సంతోషంగా ఉంది'' అన్నానంతే. ఇప్పుడు ఇక్కడ 25 ఏళ్ళ తర్వాత, నాకు ఇప్పటికీ కొద్ది కలవరంగానే ఉంది. కాకపోతే ఇపుడు మీకు చెప్ప డానికి నా దగ్గర నాలుగు మాటలకు మించి చాలా ఉన్నాయి.

ఈ స్థాయికి వచ్చేందుకు మీరెంతో కష్టపడి ఉంటారు. మీరంతా సాధించిన దానిపట్ల నాకెంతో గౌరవం ఉంది. ఎందుకంటే, పూర్తి స్థాయి టెన్నిస్ ఆటగాడిగా మారేందుకు నేను 16వ ఏటనే స్కూలు చదువుకు స్వస్తి చెప్పేశాను. కనుక, నేను కాలేజీలో అడుగు పెట్టింది లేదు. కానీ, నేను ఇటీవలే టెన్నిస్‌లో గ్రాడ్యుయేట్‌నయ్యా. 'రిటైర్' అనే మాట ఉపయోగించాలని నాకు తెలుసు. ''రోజర్ ఫెదరర్ టెన్నిస్ నుంచి రిటైర్ అయ్యాడు.'' రిటైర్ అవడమా? ఆ మాట వినడానికే బాగా లేదు. కాలేజీ నుంచి రిటైర్ అవుతున్నామని మీరు చెప్పలేరు. ఔనా?

మీలాగే నేను కూడా ఒక పెద్ద పని పూర్తి చేసి మరో దానికి మరలుతున్నా. మీలాగే నేను కూడా తదుపరి ఏం చేయాలనే ఆలోచనలో ఉన్నా. మీ బాధ నాకు అర్థమవుతోంది. చదువు పూర్తయిందిగా, ఏం చేయబోతున్నావు? అని అందరూ అడ గడం మొదలెడతారు. ఆ మాటకొస్తే, ''ఇంక ఇపుడు నువ్వు వృత్తిపరమైన టెన్నిస్ ఆటగాడివి కాదు కదా! ఏం చేయ బోతున్నావు?'' అని నన్నూ అడుగుతారు. ఏం చేయాలో నాకూ తెలియదు. తెలియకపోవడమూ మంచిదే.

మరి నేను కాలాన్ని ఎలా వెళ్ళబుచ్చుతా? తండ్రిగా పిల్లల్ని స్కూల్లో దింపి రావచ్చు. ఎవరో అపరిచితులతో ఆన్‌లైన్‌లో చదరంగం ఆడవచ్చు. వాక్యూమ్ క్లీనర్‌తో ఇంటిని శుభ్రం చేయ వచ్చు. వాస్తవానికి, టెన్నిస్ పట్టభద్రునిగా జీవితాన్ని నేను ఇష్టపడతున్నా. నేను 2022లో టెన్నిస్‌లో గ్రాడ్యుయేట్‌నయ్యా. మీరు 2024లో పట్టభద్రులవుతున్నారు. ఈ పరిణామ క్రమంలో నేను ఆకళింపు చేసుకున్న కొద్ది పాఠాలను మీతో పంచుకోవా లనుకుంటున్నా. వాటిని మనం టెన్నిస్ పాఠాలు అనుకోవచ్చు.

టెన్నిస్ పాఠాలు

1

మొదటిది. 'సునాయాసంగా' అనే మాట ఒక భ్రమ! నేను సునాయాసంగా ఆడతానని అంటూంటారు. చాలా సందర్భాల్లో దాన్ని ఒక పొగడ్తగానే చెబుతారు. కానీ, ''అతని దేహంపై ఒక్క స్వేద బిందువు కూడా లేదు చూడండి'' లాంటి మాటలు వారి నుంచి విన్నప్పుడు నాకు అసహనంగా ఉండేది. సత్యం ఏమంటే, తేలిగ్గా ఆడినట్లు కనిపించడం వెనుక నేను చేసిన కఠోర శ్రమ ఉంది. నన్ను నేను తమాయించుకోవడం నేర్చుకోవడానికి ముందు చాలా ఏళ్ళు కోర్ట్‌లో విసుగు ప్రదర్శించేవాడిని, అనుచితమైన మాటలనేవాడిని, చేతిలో రాకెట్‌ను విసిరేసేవాడిని.

కానీ, క్రీడా జీవితం ఆరంభంలోనే, వాటిని సరిదిద్దుకునే అవకాశం లభించింది. ఒకసారి ఇటాలియన్ ఓపెన్‌లో నా ప్రత్యర్థి ఒకరు నా మానసిక క్రమశిక్షణను బాహాటంగానే ప్రశ్నిం చాడు. ''మొదటి రెండు గంటలు రోజర్ గెలుస్తాడనుకుంటారు. ఆ తర్వాత, నేను ఫేవరెట్‌గా మారతాను'' అని వ్యాఖ్యానిం చాడు. మొదట, నాకు ఆ మాటలు అర్థం కాలేదు. తర్వాత, అతని మాటలలోని ఆంతర్యాన్ని గ్రహించాను. మొదటి రెండు గంటలపాటు ప్రతి ఆటగాడు బాగానే ఆడతాడు. శారీరకంగా శక్తితో ఉంటారు. వేగంగా కదులుతారు. రెండు గంటల తర్వాత, కాళ్ళు పీకడం మొదలెడతాయి. మనసు ఏకాగ్రతను కోల్పో తుంది. నేను నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని ఆ మాటలతో అర్థం చేసుకున్నా. ఆ దిశగా ప్రయాణం ప్రారంభించి, కోరుకున్న స్థితికి చేరుకున్నా. ఆ క్రమంలో నా తల్లితండ్రులు, కోచ్‌లు, ఫిట్ నెస్ కోచ్ నా ప్రవర్తనను సరిదిద్దుతూ వచ్చారు. నా ప్రత్యర్థి ఆటగాళ్ళు కూడా ఆ పని చేస్తున్నారు. ఈ విషయంలో, నాతోటి ఆటగాళ్ళకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను.

ప్రతిభ అనే మాటకు విస్తృతమైన నిర్వచనం ఉంది. జీవితంలో మాదిరిగానే... టెన్నిస్‌లో కూడా క్రమశిక్షణే ప్రతిభగా పరిణమిస్తుంది. మీపై మీకు నమ్మకం ఉండటం కూడా ప్రతిభే. ఏ ప్రక్రియనైనా సరే స్వాగతిం చడం, ప్రేమించడం ప్రతిభ కిందకే వస్తుంది. కొందరికి పుట్టుకతోనే ఆ లక్షణాలు ఉంటాయి. మిగిలిన అందరూ వాటిని సంతరించుకునే కృషి చేయాలి.

డార్ట్‌మౌత్‌లో మీరు దీన్ని మరో విధంగా గమనించి ఉంటారు. తోటి విద్యార్థులు ర్యాంకుల మీద ర్యాంకులు సాధిం చడాన్ని చూసి శాన్‌బర్న్ లైబ్రరీలో మీరు ఓ మూలన మౌనంగా రోదించి ఉంటారు. నా లాగానే మీరు కూడా 'అప్రయత్నంగా' అనే మాట ఒక భ్రమేనని తెలుసుకుని ఉంటారని భావిస్తున్నా. కేవలం ప్రతిభతోనే నేను ఈ స్థితికి చేరుకోలేదు. ప్రత్యర్థులకన్నా ఎక్కువసేపు, ప్రభావశీలంగా, కఠిన శ్రమకోర్చి ప్రాక్టీసు చేయ బట్టే ఈ స్థితికి చేరా.

నిజంగా గర్వపడే విజయాలు అవే!

మనం నిరాశతో చతికిలపడే సందర్భాలూ ఎదురవుతా యని గుర్తుంచుకోవాలి. వెన్ను, మోకాళ్ళు నొప్పి పుట్టవచ్చు. స్వల్పంగా అనారోగ్యం పాలుకావచ్చు లేదా ముందున్న లక్ష్యం భయపెట్టనూవచ్చు. అయినా, గెలుపొందడానికి మీరొక మార్గాన్ని కనుగొని తీరాలి. అలా సాధించిన విజయాల గురించి మనం గర్వంగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే, మీరు ఉత్తమమైన స్థితిలో ఉన్నప్పుడే కాదు, లేనప్పుడు కూడా విజయాలు సాధిం చగలరని అవి నిరూపిస్తాయి.

ఔను. ప్రతిభ కూడా ఉండి తీరాలి. దానితో పని లేదని చెప్పడానికి నేను ఇక్కడ నుంచో లేదు. కానీ, ప్రతిభ అనే మాటకు విస్తృతమైన నిర్వచనం ఉంది. చాలా సందర్భాలలో, దాన్ని వరంగా చూడకూడదని, వజ్ర సమాన సంకల్పంగా భావించాలని చెప్పదలచుకున్నాను. కానీ, జీవితంలో మాదిరి గానే... టెన్నిస్‌లో కూడా క్రమశిక్షణే ప్రతిభగా పరిణమిస్తుంది. ఓర్పు కూడా అంతే అవసరం. మీపై మీకు నమ్మకం ఉండటం కూడా ప్రతిభే. ఏ ప్రక్రియనైనా సరే స్వాగతించడం, ప్రేమిం చడం ప్రతిభ కిందకే వస్తుంది. మీ జీవితాన్ని, మిమ్మల్ని నడుపుకోవడం కూడా ప్రతిభ కోవలోకే వస్తుందేమో. కొందరికి పుట్టుకతోనే ఆ లక్షణాలు ఉంటాయి. మిగిలిన అందరూ వాటిని సంతరించుకునే కృషి చేయాలి.



స్నేహపూరిత ప్రత్యర్థులు: రఫేల్ నదాల్‌తో రోజర్ ఫెదరర్

అదొక పాయింట్ అంతే!

2

రెండవ పాఠం. అదొక పాయింట్ మాత్రమే! మీరు సాధ్యం అనుకున్నదానికన్నా ఎక్కువగానే శ్రమించి ఉంటారు... అయినా పరాజయం పాలయ్యారు. ఈ రోజు మీలో ఒక్కరే డిగ్రీ పొందా రని ఊహించుకుందాం. విజేతకు అభినందనలు తెలుపుదాం. మిగిలిన వెయ్యి మంది మాటేమిటి? తదుపరి విడతలో ఉత్తీర్ణులు కావచ్చు...

నేనెప్పుడూ గెలుపొందడానికే ప్రయత్నిం చానని మీకు తెలుసు. కానీ, నేను ఓడిన సందర్భాలున్నాయి. కొన్నిసార్లు పెద్ద టోర్నమెంట్లలోనే ఓటమి చెందా. వింబుల్డన్ 2008 ఫైనల్స్ వాటిలో ఒకటి. నేను, రఫేల్ నదాల్ తలపడ్డాం. కొందరు దాన్ని చరిత్రలోనే మరపురాని మ్యాచ్‌గా అభివర్ణిస్తారు. రఫా మీద నాకు పూర్తి గౌరవం ఉంది. కానీ, ఆ మ్యాచ్‌లో నేను గెలుపొంది ఉంటే ఇంకా బాగుండేది. వింబుల్డన్‌లో ఓటమిని తేలిగ్గా తీసు కోలేం... ఏ టెన్నిస్ ఆటగాడికైనా వింబుల్డన్‌లో విజయమే సర్వస్వం. నేను 2008లో వరుసగా ఆరవసారి టైటిల్ సాధించేందుకు బరిలోకి దిగా. చరిత్రలో సుస్థిర స్థానం కోసం ఆడుతున్నా. ఆ మ్యాచ్‌లో ఒక్కో పాయింట్ మా ఇద్దరిలో ఎవరెవరికి ఎలా వచ్చిందీ నేను ఇపుడు వివరించబోవడం లేదు. అదంతా చెప్పా లంటే కొన్ని గంటలు పడుతుంది. సరిగ్గా చెప్పాలంటే, ఆ మ్యాచ్ దాదాపు ఐదు గంటలు సాగింది. రఫా రెండు సెట్లు గెలి చాడు. టై-బ్రేక్స్‌లో తదుపరి రెండు సెట్లు నేను గెలిచా. ఐదవ సెట్లో ఏడు పాయింట్లతో ఇద్దరం సమ స్థితిలో ఉన్నాం. ఆట చివరి భాగంపై అందరూ ఎందుకు అంత దృష్టి కేంద్రీ కరిస్తారో నాకు అపుడు అర్థమైంది... చివరి నిమిషాల్లో నాకు కళ్ళు బైర్లు కమ్మాయి. గ్రాస్ కోర్టుపై తెల్లని చారలు కూడా మసకగా కనిపించడం మొదలెట్టాయి.

అన్నిసార్లూ గెలవలేము!

ఇపుడు వెనుతిరిగి చూసుకుంటే... ఆ మ్యాచ్‌లో మొదటి పాయింట్ అప్పుడే నేను ఓటమి పాలయ్యాననిపిస్తుంది. 'ఏయ్, నువ్వు ఐదు విడతలుగా గెలుస్తూ వస్తున్న డిఫెండింగ్ చాంపియన్‌వి! పైగా, ఆడుతున్నది గ్రాస్ కోర్ట్‌లో. ఇక్కడ ఎలా ఆడాలో నీకు బాగా తెలుసు' అని నా అంతరంగంలో నేను గుర్తు తెచ్చుకోవడానికి మూడవ సెట్ దాకా సమయం పట్టింది. కానీ, ఆ ధైర్యం చాలా ఆలస్యంగా వచ్చింది. రఫా గెలుపొందాడు. దానికతను అన్ని విధాలా యోగ్యుడే!

కొన్ని ఓటములు మిగిలినవాటికన్నా ఎక్కువ బాధిస్తాయి. వరుసగా ఆరవసారి టైటిల్ కోసం పోటీ పడే అవకాశం జీవి తంలో మళ్ళీ లభించదని నాకు తెలుసు. వింబుల్డన్‌లో ఓడాను. నంబర్ వన్ ర్యాంకింగ్ కోల్పోయాను. టెన్నిస్‌లో పరిపూర్ణత అనేది అసాధ్యం. నా వృత్తి జీవితంలో నేను ఆడిన 1,526 సింగిల్స్ మ్యాచ్‌లలో దాదాపు 80% గెలుపొందా. కానీ, ఇక్కడ నేను మీకో ప్రశ్న వేయదలచుకున్నా. ఆ మ్యాచ్‌లలో, నేను గెలి చిన పాయింట్ల శాతం ఎంతనుకుంటున్నారు? కేవలం 54%. మరో విధంగా చెప్పాలంటే, అగ్రశ్రేణి టెన్నిస్ ఆటగాళ్ళు కూడా వారు ఆడిన మ్యాచ్‌ల పాయింట్లలో కేవలం సగంపైన మాత్రమే గెలిచి ఉంటారు. కొంపేం మునిగిపోయింది. అది ఒక పాయింట్ మాత్రమే అని మీకు మీరే నేర్చుకోవాలి.

జీవితంలో మీరు ఏ ఆట ఆడినా... కొన్నిసార్లు ఓటమి తప్పదు. అది ఒక పాయింట్, ఒక మ్యాచ్, ఒక సీజన్, ఒక ఉద్యోగం కోల్పోవడం ఏదైనా కావచ్చు. జీవితం అనేక ఎత్తు పల్లాలున్న రోలర్ కోస్టర్. కుంగిపోయినపుడు మీ సామర్థ్యంపై మీకు సందేహాలు ఏర్పడటం సహజం. కానీ, మీ ప్రత్యర్థులకు కూడా వారి సామర్థ్యాలపై వారికి సందేహాలుంటాయని మరచి పోకండి. కానీ, నెగెటివ్ ఎనర్జీ వృథా ఎనర్జీ! ప్రపంచంలో ఉత్తములుగా పరిగణన పొందుతున్నవారు అన్నింటిలోనూ గెలవడం వల్ల అలాంటి హోదా ఏమీ పొందడం లేదు. ఓటమి పాలవుతామనీ, పరాజయాలు పదే పదే వెక్కిరి స్తాయనీ వారికి తెలుసు. వాటిని తట్టుకుని ఎలా నిలబడాలో వారు నేర్చుకుం టారు కాబట్టి గొప్పవారు అనిపించుకుంటారు.

నేను ఆడిన 1,526 సింగిల్స్ మ్యాచ్‌లలో దాదాపు 80% గెలుపొందా. నేను గెలిచిన పాయింట్ల శాతం ఎంతనుకుంటున్నారు? కేవలం 54%. జీవితంలో మీరు ఏ ఆట ఆడినా... కొన్నిసార్లు ఓటమి తప్పదు. ప్రపం చంలో ఉత్తములుగా పరిగణన పొందుతున్నవారు అన్నింటిలోనూ గెలవడం వల్ల అలాంటి హోదా పొంద డం లేదు. పరాజయాలను తట్టుకుని ఎలా నిలబడాలో నేర్చుకుంటారు కాబట్టి గొప్పవారు అనిపించుకుంటారు.

చేస్తున్న పనిని ఆనందించండి!


3

మూడవ పాఠం. జీవితం కోర్ట్ కన్నా పెద్దది. టెన్నిస్ కోర్ట్ చిన్న ప్రదేశం. నిక్కచ్చిగా చెప్పాలంటే, 2,106 చదరపు అడుగులు. అది సింగిల్స్ మ్యాచ్‌లు ఆడే కోర్ట్ వైశాల్యం. ఒక సత్రం గదికన్నా మరీ పెద్దదిగా ఏమీ ఉండదు. ఆ చిన్న ప్రదేశంలోనే నేను ఎంతో శ్రమించాను. నేర్చుకున్నాను. ఎన్నో మైళ్ళు పరుగెత్తాను. కానీ, ప్రపంచం దానికన్నా చాలా చాలా పెద్దది. టెన్నిస్ లోకి అడుగు పెట్టినప్పుడే, టెన్నిస్ నాకు ప్రపంచాన్ని చూపిస్తుంది కానీ, టెన్నిస్సే ప్రపంచం కాదన్న సంగతి నాకు తెలుసు. టెన్నిస్ నుంచి నిష్క్రమించగానే నేను మాజీ టెన్నిస్ క్రీడాకారుడిని అయి పోయా. కానీ, మీరు దేనికీ మాజీలు కాదు. మీరు భవిష్యత్ రికార్డు బ్రేకర్లు. ప్రపంచ యాత్రికులు. భవిష్యత్ కార్యకర్తలు. దాతలు. విజేతలు, నాయకులు.

ఈ గౌరవ డిగ్రీ ఇచ్చినందుకు ధన్యవాదాలు. మీ విజయో త్సవంలో నాకూ భాగం కల్పించినందుకు కృతజ్ఞతలు. మీలో ప్రతి ఒక్కరి తదుపరి భవిష్యత్ కార్యాచరణ ఏమిటో చూడాలని నాకు ఉత్సాహంగా ఉంది. మీరు ఏ రంగాన్ని ఎంచుకున్నా, మీ శక్తి మేరకు ప్రతిభను ప్రదర్శించండి. మీకు నచ్చిన రీతిలో ఆడండి. స్వేచ్ఛగా ఆడండి. అన్నింటిని ప్రయత్నించి చూడండి. అన్నింటికన్నా ముఖ్యంగా, పరస్పరం దయ కలిగి ఉండండి. చేస్తున్న పనిని ఆనందించండి. క్లాస్ ఆఫ్ 2024కి మరోసారి అభినందనలు. ◆

అంబేడ్కర్ తాత్త్విక కవితా పయనంలో...

సందర్భం



జి. లక్ష్మీనరసయ్య

1970లలో విప్లవ కవిత్వం ఉధృతంగా వచ్చింది. ఒక పక్క అభ్యుదయ కవిత్వం కొనసాగుతూనే ఉన్నా విప్లవ కవిత్వ ప్రభంజనం నడిచింది. ఒక రకంగా ఆనాడు విప్లవ కవిత్వం రాయడం ఫ్యాషనైపోయింది. భారత విప్లవానికి మహాత్మా పూలే, బాబాసాహెబ్ అంబే డ్కర్, పెరియార్‌ల కన్నా మార్క్స్, లెనిన్, మావోలు మిన్న అనే స్పృహ మేధా వుల్లోనూ, కవుల్లోనూ పెరిగింది. కంచికచర్ల కోటేశు మరణం కన్నా విప్లవ కవుల్ని నక్సల్బరీ రైతుల మరణం ఎక్కువగా కదిలించింది. ఈ విప్లవ కవుల్లో దళిత మూలాలున్న కవులది కూడా ఇదే దారి.

ఇలాంటి సమయంలో కొంతమంది దళిత కవులు అంటరాని సమస్య గురించీ, కుల సమస్య గురించీ సీరియస్‌గా రాశారు. కవిత్వంలో అంబేడ్కర్ భావజాలానికి సమున్నత స్థానమిచ్చారు. అంబేడ్కర్ నడిచిన బుద్ధిస్టు దారిని అనుసరించారు. 'మాకొద్దీ నల్లదొర తన'మని కుసుమ ధర్మన్న ప్రకటించిన అర్థంతో మమేకమై కవిత్వం రాశారు. అలాంటి కవుల్లో చోడగిరి చంద్ర రావు ప్రముఖుడు. అంబేడ్కర్ ఉద్యమాన్నీ, ఆలోచనల్నీ పద్యా లుగా, గేయాలుగా మలిచి పదునైన కవిత్వం రాశాడు. రాయటమే కాకుండా వాటిని ఆలపించి పల్లెపల్లెనా వినిపించి అంబేడ్కర్‌ను అణగారిన జనంలో ప్రతిష్ఠించాడు.

చోడగిరి చంద్రరావు తన సమకాలీన కాంగ్రెస్ రాజకీ యాలనీ, అభ్యుదయ, విప్లవ రాజకీయాలనీ త్రోసిరాజని అంబే డ్కరిస్టు తాత్త్వికతనీ, కులనిర్మూలనా రాజకీయాలనీ అగ్రభాగాన నిలిపాడు. తన 'భీమ శతకం' పద్య కావ్యం ఇందుకు చెక్కు చెదరని ఉదాహరణ. 'కుశల ప్రశ్న లేదు కుల ప్రశ్నయే గాని' అని చమత్కరించి ఊరుకోలేదాయన. ఇందులో వర్గపోరాటం దశకు మనం చేరుకోవాలంటే కుల నిర్మూలనా పోరాటం ముందుగా జరగాలనే అంబేడ్కరిస్టు అవగాహన ఇచ్చాడు. సమసమాజం అంటే కుల మతాల మధ్య హెచ్చుతగ్గులు లేని సమతా సమాజ మేనని ఈయన నొక్కిచెబుతాడు.

'సమసమాజ మంచు చాటింపకొనువారు/ చెప్పుకున్న డెల్ల చేయవలయు/ చెప్పుకొనుట యొకటి సేయున దొక్కటా/ ఏమి సెప్పన్నయ్య భీమరాయ' అనడంలోని విమర్శను గమనిస్తే బోధ పడేది ఇదే.

దళితులకు కావాల్సింది ఆత్మగౌరవం. అది కులాల అంత రాలు పోయినప్పుడే చేకూరుతుందని చాటుతూ, 'కులము లేనినాడు కలుగు శాంతి/ కులము వేళ్ళతోడ కృళ్ళి పోవాలిరా' అని అంటాడు కవి. మరో పద్యంలో మరో విధంగా కుల నిర్మూలన గురించి మాట్లాడతాడు. **'పాతికేండ్లు కడచె పారతం త్ర్యంము బాసి/ మమ్ము బాయలేదు మాయ కులము/ కులము చచ్చు వరకు కలుగదా సౌఖ్యమ్ము.'**



◆ అంబేడ్కర్ గురించి 1956లో మొదటి పాట రాసిన కవి చోడగిరి చంద్రరావు. హార్మోనియం ప్లే చేస్తూ ఊరూరూ తిరిగి ఈ పాట పాడి అందరినీ ఏడిపించిన కవి. 1965 లోనే కాకినాడలో 'భీమ సాహితీ స్రవంతి' అనే సంస్థను స్థాపించి తన కావ్యాలను ప్రచురిం చారు. అంబేడ్కర్ గురించి రెండు శతకాలు రాశారు. పద్యం, వచనం, కవిత, పాట లాంటి ప్రక్రియల్లో ఆరు పుస్తకాలు వెలువరించారు.

ఇలా కులనిర్మూలనే దళిత విముక్తికి మార్గమని పదే పదే గుర్తు చేసిన కవి చోడగిరి.

కుల వ్యవస్థ దుర్మార్గాన్ని ఎండగట్టినా, కుల నిర్మూలన అవసరాన్ని నొక్కి చెప్పినా, బుద్ధిజాన్ని కొనియాడినా, ఇదంతా అంబేడ్కర్ చేసిన పోరాటాల వల్లా, ఆలోచనల వల్లా తనకు అబ్బి నట్లు కవి సగర్వంగా చెప్పుకున్నాడు. అంబేడ్కర్ చేసిన ఉద్యమం గురించీ, ఆయన నడిపిన సాంఘిక, రాజకీయ పోరాటాల గురించీ, చేసిన త్యాగాల గురించీ గొప్పగా రాశాడు.

దళితుల కోసం అంబేడ్కర్ సాధించిన రాజకీయ రిజర్వేషన్లనూ, హక్కులనూ గాంధీ అడ్డుకున్న తీరును కూడా కవి ఏకరువు పెట్టాడు. భారత చరిత్రలో దళిత రాజకీయ సదవకాశాన్ని దెబ్బ తీసిన 'పూనా ఒడంబడిక'ను తన కవిత్వం లోకి తెచ్చాడు. **'కులము గూర్చి దాని కుటిలత్వము గూర్చి/ ఎన్ని పగలు రాత్రులెన్ని యేండ్లు/ బాధ నందినావొ బాబు నే నెరుగనా/ ఏమి సెప్పన్నయ్య భీమరాయ'** అని అంబేడ్కర్ గురించి కన్నీరై కరిగిపోతాడు. గాంధీ గురించీ ఆయన దళి తులకు వ్యతిరేకంగా చేసిన దీక్ష గురించీ రాస్తూ వ్యంగ్యంగా పలికిన పద్యం చూడండి: **'ఎందుకిట్టి దీక్ష ఎర్రవాడ జైలులో/ పదియ రెండు కోట్ల ప్రజల పైన/ గాంధీతాత కెంత కరుణయో పాపమ్ము.'**

ఇలా చరిత్రను కవిత్వంలోకి తెచ్చిన ఘనత ఈ కవికి దక్కింది. సమకాలీనతనూ, చరిత్రనూ కలిపి తాడులా పేనిన కవిత్వమిది. తన కాలపు కవిత్వానికి ప్రత్యామ్నాయం చంద్రరావు కవిత్వం. కవిత్వం రాణించటానికీ కులమే బలాన్నిస్తున్న పరి స్థితిని సూచిస్తూ **'కవియు గాయకుండు కమనీయ శిల్పాల/ కల్పనమ్ము సేయు శిల్పియైన/ కులము లేక నిచ్చట వెలుగు చూడదు లెమ్ము'** అని రాశాడు.

కుసుమ ధర్మన్న నుంచి నేటివరకూ వచ్చిన, వస్తున్న దళిత కవిత్వంలో ఎన్నదగినది 'భీమ శతకం'. ముఖ్యంగా అంబేడ్కర్ తాత్త్వికతను అందుకున్న గ్రంథంగా ఇది విలువ వెలకట్టలేనిది.

వ్యాసకర్త కవి, సాహిత్య విమర్శకుడు | 98494 08204

(చోడగిరి చంద్రరావు సమగ్ర కవిత్వం పుస్తకావిష్కరణ నేడు ఉదయం కాకినాడ, సాయంత్రం అమలాపురంలో జరగనుంది.)

అసలైన మంగళాచరణ

సాధారణంగా ఏదైనా గ్రంథాన్ని రాసే ముందు, మధ్యలో, చివర్లో మంగళాచరణ చేస్తారు. అంటే 'శ్రీ గణేశాయ నమః', 'సీతారామాభ్యాం నమః', 'రాధా కృష్ణాభ్యాం నమః', 'హనుమతే నమః', 'శివాయ నమః' అని రాస్తుంటారు. కానీ ఆర్యసమాజ స్థాప కుడు స్వామీ దయానంద సరస్వతి దాన్ని ఆచరిం చరు. 'మీరు ఎందుకు మంగళాచరణ చేయరు?' అని ప్రశ్నిస్తే...

జ్యోతిర్మయం

'ఆది, మధ్య, అంతము లందు మంగళము చేయువాని గ్రంథమున ఆది, మధ్య, అంత్య ముల మధ్యలో అతడు వ్రాసిన దంతయు అమంగళమే అగును. ఈశ్వరుని న్యాయ పక్షపాత రహిత, సత్యమైన ఆజ్ఞను ఉన్నది ఉన్నట్లు అంతటా సదాచరణ ఒనర్చుటయే మంగళాచరణ మనబడుచున్నది. గ్రంథము నారం భించినది మొదలు సమాప్తి వరకు సత్యాచరణ మొన ర్చుటయే మంగళాచరణము అనబడుచున్నది. అంతే గాని అక్కడక్కడ మంగళము, ఇతర స్థలముల అమం గళము గ్రంథమున వ్రాయుట కాదు' అని అంటారు.

నేడు చాలామంది రచయితలు చేయు మంగళా చరణ విధానము వేదవిరుద్ధం అని ఆయన అంటారు. ఆర్ష గ్రంథాలు 'ఓమ్', 'అథ' శబ్దాలతో ప్రారంభిప బడుతాయని వారు అంటారు. కొంతమంది వైదికులు 'హరిః ఓమ్' అని రాస్తున్నారనీ, చదువుచున్నారనీ అలా చేయరాదనీ, వేదాది శాస్త్రములందు 'హరి' శబ్దము ఆదిలో ఎక్కడా లేదనీ మహర్షి దయా నందుడు అంటారు. ఏదైనా గ్రంథాన్ని రచించే వారు మొదటి నుంచి చివరివరకు మంగళకరమైన సత్యాన్నే చెప్పటం మంగళాచరణ అని భావించాలి (పుటలు 19–20, సత్యార్థ ప్రకాశము– మహర్షి దయా నంద సరస్వతి).

దైవ నామంతో ప్రారంభించి ఆ తర్వాత గ్రంథం నిండా అసత్యమే రాస్తే అక్కడ మంగళాచరణ లేనట్లే!

– రాచమడుగు శ్రీనివాసులు

కండ ఎక్కువుండే కాలాజామూన్

- త్వరలో అందుబాటులోకి అల్లనేరేడులో కొత్త వెరైటీ
- అభివృద్ధి చేసిన సంగారెడ్డి ఫ్రూట్ రీసెర్చ్ స్టేషన్..
- గుజ్జు, రుచి బాగుంటుందంటున్న శాస్త్రవేత్తలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అల్లనేరేడు (కాలా జామూన్) ఫలంలో సరికొత్త వెరైటీ అందుబాటులోకి రానుంది. సంగారెడ్డిలోని ఫల పరిశోధన స్థానం (ఎఫ్ఆర్ఎస్) శాస్త్రవేత్తలు ఈ కొత్త వెరైటీని అభివృద్ధి చేశారు. కండ (గుజ్జు) ఎక్కువగా ఉండే ఈ కాలాజామూన్ ఎంతో రుచికరంగా ఉంటుందని, దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో ఈ పంట సాగుచేసే ఉద్యానవన రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం ఈ అల్లనేరేడులో కొంకన్, కృష్ణ, నీలం, పంత్‌ప్రభాత్, ఆజాద్–1, అర్కా కిరణ్, సీడ్‌లెస్, బ్లాక్‌పెర్ల్ వంటి వెరైటీలున్నాయి. ఒక్కో వెరైటీ పండు పరిమాణం, రంగు, రుచిలో తేడాలుంటాయి. ఇప్పుడు మరో కొత్త వెరైటీ అందుబాటులోకి రానుంది.

ఎనిమిదేళ్ల పరిశోధన..

శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయానికి సంబంధించి సంగారెడ్డిలో ఫల పరిశోధన స్థానం (ఎఫ్ఆర్ఎస్) ఉంది. ఈ యూనివర్సిటీకి సంబంధించి స్టేట్ ప్లాన్‌లో భాగంగా ఈ కొత్త రకం అల్లనేరేడు వెరైటీపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టుపై దాదాపు ఎనిమిది సంవత్సరాలకు పైగా సాగిన పరిశోధనలు మంచి ఫలితాలనిచ్చాయని చెబుతున్నారు. ఈ కొత్త వెరైటీని త్వరలో ప్రకటించేందుకు ఎఫ్ఆర్ఎస్ శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

దిగుబడి కూడా ఎక్కువే..

బీడు భూముల్లో సైతం ఈ పంట పండుతుంది. నీటి సౌకర్యం ఉన్నా.. లేకపోయినా నిలదొక్కుకుంటుంది. ఒక ఎకరంలో సుమారు 150 వరకు ఈ చెట్లు నాటొచ్చు. ఇప్పుడున్న వెరైటీల్లో ఒక్కో చెట్టుకు సుమారు 80 కిలోల వరకు దిగుబడి ఉండగా, ఈ కొత్త వెరైటీలో 100 నుంచి 120 కేజీల వరకు దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీంతో ఈ పంట సాగుచేసే రైతులకు ఆదాయం సుమారు 40 శాతం వరకు పెరుగుతుందని అంటున్నారు. సంవత్సరానికి ఒకసారే ఈ పంట చేతికందుతుంది. నాటిన ఏడేళ్ల తర్వాత ఈ పంట రాక ప్రారంభమవుతుందని, సుమారు 40 సంవత్సరాల వరకు దిగుబడి వస్తూనే ఉంటుందని చెబుతున్నారు.

ఔషధ ఫలంగా పేరు..

ఏటా వర్షాకాలం ప్రారంభంలో ఈ పండ్లు మార్కెట్‌లోకి అమ్మకానికి వస్తుంటాయి. అల్లనేరేడును ఔషధఫలంగా కూడా పిలుస్తారు. మధుమేహ రోగులకు ఈ పండు ఎంతో మేలుచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ పంట తెలంగాణతో పాటు, ఏపీ, అస్సాం, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో సాగవుతోంది.

క్లుప్తంగా...

పిచ్చికుక్కల స్వైర విహారం.. పలువురికి గాయాలు



కుక్క దాడిలో గాయపడిన ముప్పిడి కుమార్

కాజీపేట/మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధి కాజీపేట, మడికొండ ప్రాంతాల్లో శనివారం పిచ్చికుక్కలు స్వైర విహారం చేసి పలువురిని గాయపరిచాయి. కాజీపేట పరిధి భవానీ నగర్, డీజిల్ కాలనీ ప్రాంతాల్లో ఒక కుక్క శనివారం సాయంత్రం ఒక్కసారిగా పాదచారులపై దాడిచేసి గాయపరిచింది. కొదిరిపాక రాజేశ్వరి, లద్దనూరి హరి, శ్రీనివాస్, బాబు సహా పలువురిని కరిచింది. ఆ కుక్కను స్థానిక యువకులు కర్రలతో కొట్టి చంపేశారు. బాధితులు ఎంజీఎం ఆస్పత్రి కి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. కాగా, 46, 64 వ డివిజన్‌లో కూడా ఏడుగురిపై కుక్కలు దాడి చేశాయి. మడికొండ ఖండాల దాబా వద్ద ముప్పిడి కుమార్ అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచాయి. మరో ఆరుగురిపై కూడా కుక్కలు దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. వారిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఇన్నోవా కారులో ఆవుల అపహరణ

భైంసా రూరల్: దొంగలు దొంగతనానికి కొత్త దారులు ఎంచుకుంటున్నారు. ఖరీదైన ఇన్నోవా కారులో రెండు ఆవులను అపహరించుకెళ్లారు. కాస్త వింతగా అనిపించినా సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యంతో నిజమేనని తెలుస్తోంది. నిర్మల్ జిల్లా భైంసా మండలం సుంక్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని రాజేందర్, రాజవ్వకు చెందిన రెండు ఆవులు కనిపించలేదు. రాత్రి సమయంలో ఆవులు ఎక్కడికి వెళ్లాయోనని వెతికారు. శనివారం ఉదయం 8 గంటల వరకు జాడ కనిపించలేదు. దొంగతనం జరిగి ఉంటుందని భావించి సమీప ఇళ్లలో సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఎదుట రోడ్డు పక్కన ఇన్నోవా కారును నిలిపి ఉంచి ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు ఆవులను తీసుకెళ్లి వెనుకవైపు నుంచి లోపలికి ఎక్కించిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఆవుల చోరీకి ఇన్నోవా కారు వినియోగించడం, వెనుక వైపు డోరు తెరిచి ఎక్కించడం చూసి అవాక్కయ్యారు. బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తల్లికి అనారోగ్యం.. వైద్యసిబ్బంది నిర్లక్ష్యం

- మనస్తాపంతో కొడుకు ఆత్మహత్యాయత్నం



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రేమ్‌కుమార్

గజ్వేల్ రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న తల్లికి ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో మెరుగైన వైద్యం అందడం లేదని ఆరోపిస్తూ ఒక యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో జరిగిన ఈ సంఘటనపై బాధితుని కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన చిక్కుడు ప్రేమ్‌కుమార్ తల్లి రాజమణి ఏడాది క్రితం అనారోగ్యానికి గురయ్యారు. వైద్య పరీక్షలు చేయించగా ఆమె క్యాన్సర్ బారిన పడినట్లు తేలింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఏడాదిగా అక్కడి వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం వహించారని, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయిద్దామంటే చేతిలో డబ్బులు లేవంటూ.. కొడుకు ప్రేమ్‌కుమార్ శనివారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగు మందు తాగాడు. ఇది గమనించిన స్థానికులు, పోలీసులు వెంటనే ప్రేమ్‌కుమార్‌ను పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఎంఎన్‌జే ఆస్పత్రి వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తాను చనిపోయాక కిడ్నీలు అమ్మి ప్రైవేటు ఆస్పత్రిలో తల్లికి వైద్యం అందించాలని లేఖ రాశాడు.

కమీషన్ కోసం డీలర్ల పరేషన్..

- ఏప్రిల్ నుంచి కమీషన్ అందని వైనం
- రాష్ట్రవ్యాప్తంగా రూ.115 కోట్లకుపైగా బకాయిలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే ఆగస్టు వరకు పేదలకు పీడీఎస్ బియ్యం పంపిణీ చేసిన రేషన్ డీలర్లు ప్రభుత్వం నుంచి రావాల్సిన కమీషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మార్చినెల వరకే ప్రభుత్వం రేషన్ కమీషన్ అందజేసింది. ఏప్రిల్ నెల నుంచి ఇవ్వకపోగా, జూన్ నెలలో ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని పేదలకు పంపిణీ చేయడంతో ఐదు నెలల కమీషన్ పెండింగ్‌లో ఉంది.

17,286 రేషన్ దుకాణాలు

రాష్ట్ర వ్యాప్తంగా 92 లక్షల ఆహార భద్రతాకార్డులు (రేషన్‌కార్డులు) ఉండగా, ఆయా కార్డుదారులకు 17,286 రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెల 1.70 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. క్వింటాల్‌కు రూ.140 చొప్పున ప్రభుత్వం డీలర్లకు చెల్లిస్తుంది. ఈ లెక్కన 1.70 లక్షల మెట్రిక్ టన్నులకు ప్రతి నెలా రూ.23 కోట్ల వరకు కమీషన్ కింద ఇస్తోంది. ఐదు నెలలకుగాను రూ.115కోట్ల వరకు డీలర్లకు చెల్లించాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఒక్కో డీలర్‌కు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు బకాయిలు రావాల్సి ఉండగా, జీహెచ్ఎంసీతోపాటు మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో రూ.లక్షకు పైగానే బకాయిలు ఉన్నాయి. ఇటీవల రేషన్ డీలర్ల కమీషన్ విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొక్కొండ వైకుంఠం పౌరసరఫరాల శాఖ సంయుక్త కమిషనర్ మనోహర్‌కుమార్ రాథోడ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కమీషన్‌ను రూ.140 నుంచి 300కు పెంచాలని డీలర్లు కోరుతున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కమీషన్ పెంపుపై హామీ ఇచ్చింది. ప్రతి రేషన్ డీలర్‌కు నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం కూడా ఇస్తామని చెప్పింది. అయితే రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదు.

అమ్మను ఇంట్లోకి రానివ్వని కొడుకు

- ముగ్గురు కొడుకులున్నా ఒంటరైన వృద్ధురాలు



ధనమ్మ

నార్కట్‌పల్లి: ఆరు నెలల పాటు వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధురాలు మతిస్థిమితం కోల్పోవడంతో ఆశ్రమం నిర్వాహకులు ఆమెను తన రెండో కుమారుడి ఇంటికి తీసుకెళ్తే.. ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుకున్నాడు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన ఇల్లందుల కిష్టయ్య, ధనమ్మ (80) దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. కిష్టయ్య గతంలోనే మృతి చెందాడు. తల్లిని తమ వద్ద ఉంచుకోలేక కుమారులు నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలోని శ్రీవాసవి వృద్ధాశ్రమంలో 2024 డిసెంబర్ 19న చేర్పించారు. ఆరునెలల పాటు అక్కడే ఉన్న ధనమ్మ.. వయసు మీరి మతిస్థిమితం కోల్పోయింది. దీంతో ఆమెను తీసుకెళ్లాలని నిర్వాహకులు కుమారులకు ఫోన్ చేసి చెప్పినా స్పందించలేదు. పైగా పోలీసులకు ఫోన్ చేసి వృద్ధాశ్రమం నిర్వాహకులు తమ తల్లిని బాగా చూసుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శుక్రవారం ఆశ్రమం వద్దకు చేరుకుని ధనమ్మను పలకరించగా.. వృద్ధాశ్రమం నిర్వాహకులు మంచిగానే చూస్తున్నారని చెప్పింది. శనివారం కట్టంగూర్‌లో ఉంటున్న ధనమ్మ రెండో కుమారుడు రామ్మూర్తి వద్దకు ఆమెను ఆశ్రమ నిర్వాహకులు ఆటోలో తీసుకెళ్లగా.. లోపలికి రానివ్వలేదు. దీంతో వృద్ధాశ్రమం నిర్వాహకులు రంగా శేఖర్, మీల సోమయ్య నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ధనమ్మ కుమారులపై ఫిర్యాదు చేశారు.

పాఠశాల భవనం పైనుంచి దూకి టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

- ఇన్‌స్టాగ్రామ్ చాటింగ్ విషయం బయటపడిందని ఆందోళన



షేక్ రిజ్వాన్

మియాపూర్: పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి పాఠశాల భవనంపైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...మాధవనగర్ కాలనీలో నివాసముంటున్న షేక్ అహ్మద్-జహీరున్నీసాబేగం దంపతుల చిన్న కుమారుడు రిజ్వాన్ (15) కాలనీలోని సెయింట్ మార్టిన్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల రిజ్వాన్ తన స్నేహితులతో ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేయడాన్ని క్లాస్ టీచర్ గమనించి స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రిజ్వాన్ తల్లిదండ్రులను పాఠశాలకు రావాల్సిందిగా ప్రిన్సిపాల్ కోరారు. శనివారం సాయంత్రం రిజ్వాన్ తల్లి జహీరున్నీసా పాఠశాలకు వచ్చింది. ఇన్‌స్టాగామ్ చాటింగ్ విషయం విద్యార్థి తల్లికి ప్రిన్సిపాల్ చెప్పగా..అందరికీ విషయం తెలిసిందని ఆందోళన చెందిన రిజ్వాన్ స్కూల్ భవనం ఐదో అంతస్తు పైనుంచి కిందకు దూకాడు. స్కూల్ యాజమాన్యం వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా..అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రిజ్వాన్ తండ్రి ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణపూర్ ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టులను గుర్తించినట్లు పోలీసు ఉన్నతాధికారులు శనివారం వెల్లడించారు. మరణించిన పీఎల్‌జీఏ ఒకటో నంబర్ కమాండర్ రాహుల్ పూనెం అలియాస్ లచ్చూ పూనెం సుకుమా జిల్లా ఉల్లా గ్రామానికి చెందినవాడని, అలాగే పీఎల్‌జీఏ సభ్యులు సుకుమా జిల్లా సుర్పన్‌గూడకు చెందిన ఉంగి తాతి, నారాయణపూర్ జిల్లా వాలా గ్రామానికి చెందిన మనీషా, గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తోడ్కాకు చెందిన మీనా తాతి అలియాస్ సోమారీ, అలియాస్ చోటీ, బీజాపూర్ జిల్లా కమలాపురం గ్రామస్తుడు హరీశ్ అలియాస్ కోసా, నారాయణపూర్ జిల్లా మల్‌సరుట్టా గ్రామానికి చెందిన కుడుమ్ బుద్రీ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారని తెలిపారు. వీరందరిపైనా రూ.8 లక్షల చొప్పున రివార్డులున్నాయని చెప్పారు. ఈ మేరకు ఆయా గ్రామాల వారికి సమాచారం అందించామని, కుటుంబసభ్యులు గుర్తింపు పత్రాలతో వస్తే మృతదేహాలను అప్పగిస్తామని నారాయణపూర్ జిల్లా ఎస్పీ మోహిత్ గర్గ్ వెల్లడించారు.

గురుకుల విద్యార్థి ఆత్మహత్య

- ఇంటర్‌లో నాలుగు సబ్జెక్టులు తప్పిన విద్యార్థి
- పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వల్లేనని విద్యార్థి సంఘాల ఆరోపణ
- ప్రిన్సిపాల్, అధ్యాపకులు వేధించలేదు: ఆకునూరి మురళి



సంతోష్

ఆర్మూర్‌టౌన్/నిజాంసాగర్ (జుక్కల్): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ శివారులోని వేల్పూర్ ఎస్సీ గురుకుల కళాశాల విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం ఆరేడు గ్రామానికి చెందిన గడ్డం నాగయ్య, నిర్మల దంపతుల ముగ్గురు కుమారుల్లో చిన్నవాడైన సంతోష్ (17) గురుకుల కళాశాలలో బైపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం వేకువజామున సంతోష్ తోటి విద్యార్థులతో కలిసి మైదానంలో వ్యాయామం చేశాడు. అనంతరం తువ్వాలు తీసుకుని కళాశాల గోడ దూకి బయటకు వెళ్లినట్లు సమాచారం. కొద్దిసేపటి తర్వాత డిగ్రీ కళాశాల వెనుకగల నర్సరీలో తువ్వాలుతో చెట్టుకు ఉరివేసుకుని కనపడ్డాడు. ప్రిన్సిపాల్ సుదర్శన్ అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. ఆర్మూర్ పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

నాలుగు సబ్జెక్టులు తప్పిన బాలుడు..

విద్యార్థి సంతోష్ ఇంటర్ ఫస్టియర్‌లో నాలుగు సబ్జెక్టులు తప్పినట్టు తెలుస్తోంది. దీంతో మనస్తాపంతోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు చెబుతున్నారు. సంతోష్ 5వ తరగతి నుంచి 10 వరకు అచ్చంపేట ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియం చదువుకున్నాడు. ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ మీడియం కావడంతో సబ్జెకులు పోయాయి. విద్యార్థి మృతికి కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది బాధ్యత వహించాలంటూ విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ ఎదుట ధర్నా చేశారు.

వేధింపులు లేవు: మురళి

సంతోష్ ఆత్మహత్యకు గురుకులంలో కారణాలు కనబడటం లేదని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అభిప్రాయపడ్డారు. ఆయన గురుకులానికి వెళ్లి విద్యార్థులతో, సిబ్బందితో మాట్లాడారు. సంతోష్ నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడని తెలిసిందన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకుల నుంచి ఎలాంటి వేధింపుల్లేవని తన పరిశీలనలో తేలిందన్నారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఎస్సీ గురుకుల పాఠశాలల జోనల్ ఇన్‌చార్జి పూర్ణ చందర్‌రావు, ఆర్డీవో రాజాగౌడ్ కళాశాలను సందర్శించి విద్యార్థి మృతికి గల కారణాలను ఆరా తీశారు. కాగా, కుమారుని మృతి విషయం తెలుసుకున్న తల్లి నిర్మల ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని విలపించడం కలిచివేసింది.

వీడియో తీసి.. ఉరివేసుకుని..

- ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వ ఉపాధ్యాయుని బలవన్మరణం



రమేశ్

మెదక్‌జోన్/హవేళిఘనాపూర్/మేడ్చల్ రూరల్: అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులతో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు బలవన్మరణానికి పాల్పడ్డారు. బలవన్మరణానికి ముందు వీడియో రికార్డు చేసి, స్నేహితులు, కుటుంబ సభ్యులకు పంపారు. మేడ్చల్‌లో శనివారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలివి. మెదక్ పట్టణానికి చెందిన కామిని రమేశ్ హవేళి ఘనాపూర్ మండలం సర్దన గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే.. చిట్టీలు, రియల్ ఎస్టేట్‌తో పాటు ఇతరత్రా వ్యాపారాలు చేశారు. అన్నింట్లో నష్టం రావడంతో స్నేహితులు, తెలిసిన వారి వద్ద దాదాపు రూ.7 కోట్ల వరకు అప్పు చేశారు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిళ్లు అధికం కావడంతో.. ఆస్తులు అమ్మి తిరిగి చెల్లించినట్టు వీడియోలో తెలిపారు. అయినా ఇంకా డబ్బులు చెల్లించాల్సి ఉందని కొందరు వేధిస్తున్నారని ఆరోపిస్తూ.. వారి పేర్లు వీడియోలో వివరించారు. కోర్టులో చెక్‌బౌన్స్ కేసులు వేసి, మానసికంగా కుంగదీశారని ఆరోపించారు. దీంతో తనతో పాటు భార్య, పిల్లలు ఇబ్బంది పడుతున్నామని, హత్య చేసేందుకు కూడా ప్రయత్నం చేశారని తెలిపారు. ఇక తట్టుకునే శక్తి, ఓపిక లేక ఆత్మహత్య చేసుకుంటున్నానని ఆ వీడియోలో తెలిపారు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీకి తరలించారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

- మృతుల్లో రైతు, బాలుడు



రవి

చంద్రుగొండ/మహబూబ్ నగర్ క్రైం: వేర్వేరు జిల్లాల్లో పిడుగుపాటుకు రైతు, బాలుడు బలయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం వెంకటియాతండాకు చెందిన రైతు బానోత్ రవి (33) రెండున్నర ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాడు. శనివారం భార్య కవితతో కలిసి చేనుకు వెళ్లిన రవి.. వర్షం ప్రారంభం కావడంతో చెట్టు కిందకు చేరాడు. అదే సమయంలో పిడుగు పడటంతో రవి అక్కడికక్కడే మరణించగా.. భార్య స్పృహ కోల్పోయింది. స్థానిక రైతులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. మహబూబ్‌నగర్ జిల్లా న్యూ మోతీనగర్‌కు చెందిన దాసరి సమ్మయ్య (16), అంజి కలిసి శనివారం మధ్యాహ్నం ద్వారకాపురి కాలనీ సమీపంలోని చెరువులో చేపలు, కొంగలు పట్టడానికి వెళ్లారు. సాయంత్రం వర్షంతో కూడిన పిడుగు పడటంతో.. దాసరి సమ్మయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన అంజిని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

మనకు బ్యూటిఫుల్ కాదు!

ట్రంప్ చట్టంతో భారతీయులకు ఇక్కట్లే

- వేలాది మంది బీమా రక్షణకు దూరం
- విద్యార్థులు మొదలు గ్రీన్‌కార్డ్‌దారుల దాకా అందర్లోనూ గుబులే

అమెరికాను మరింత గొప్ప (బిగ్)గా, మరింత చూడచక్కగా (బ్యూటిఫుల్)గా తీర్చిదిద్దుతానంటూ ట్రంప్ తెచ్చిన 'ది వన్ బిగ్, బ్యూటిఫుల్'చట్టం అక్కడి భారతీయులకు పెను సమస్యగా మారేలా ఉంది. వలస, వలసేతర వీసాల ద్వారా అమెరికాలో కాలుపెట్టిన మనవాళ్లకు ఈ చట్టం సమస్యల స్వాగతం పలకడం ఖాయంగా కన్పిస్తోంది. ముఖ్యంగా వేలాది భారతీయ అమెరికన్లకు వైద్య బీమా రక్షణ ఛత్రాన్ని ఈ చట్టం దూరం చేస్తోంది. శాశ్వత స్థిరనివాస హోదా అయిన గ్రీన్‌కార్డ్‌దారులకు కూడా 'బ్యూటిఫుల్'కష్టాల నుంచి ఊరట దక్కడం లేదు. హెచ్‌-1బీ వీసాదారుతోపాటు విద్యార్థి వీసాలపై అమెరికాకు వచ్చిన భారతీయులకు కూడా కొత్త చట్టం సమస్యాత్మకంగా మారుతోంది. ఏకంగా 20 లక్షల మంది భారత అమెరికన్లు దీని దెబ్బకు ఆరోగ్య బీమా సౌకర్యం కోల్పోయారు. ఖజానాపై ఏకంగా 1.7 లక్షల కోట్ల డాలర్ల భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ కొత్త చట్టం తేవడం తెలిసిందే. ఉచితంగా, అన్యాయంగా వైద్య సేవలు, సాయం వాళ్లకు మాత్రమే కోతలు పెడతానని అమెరికా పౌరులకు ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థి వీసాపై అమెరికా వర్సిటీల్లో చదివే మనవాళ్లకు ఇన్నాళ్లు కొనసాగిన వైద్య బీమా సదుపాయం ఎత్తేశారు. అది లేకపోతే అమెరికాలో వైద్య ఖర్చులకు చుక్కలు కనిపిస్తాయి. తమకిది పెను ఆర్థిక భారమేనని న్యూజెర్సీలోని రూత్‌జర్స్ విశ్వవిద్యాలయానికి చెందిన భారత విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ''కాలేజీలో ఎలాగోలా నెట్టుకొస్తాం. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక మా పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడుతుంది. ఆ వెంటనే ఉద్యోగం రాకుండా మరిన్ని ఇక్కట్లు తప్పవు''అంటూ వాపోయారు.

శరణార్థులకు అరిగోస!

శరణార్థులుగా అమెరికాకు వచ్చిన వారిలో అత్యధికులు మెడిక్‌ఎయిడ్, ఎమర్జెన్సీ హెల్త్ కేర్ ప్రోగ్రాంతోనే లబ్ధి పొందుతున్నారు. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) గణాంకాల ప్రకారం 2020లో 6,000 మంది భారతీయులు శరణార్థి హోదా పొందారు. **2023లో ఆ సంఖ్య 8 రెట్లు పెరిగి 51,000కు చేరింది. దాంతో శరణార్థుల్లో కొందరికే మెడిక్‌ఎయిడ్‌ను పరిమితం చేయాలని 'బ్యూటిఫు**ల్'చట్టంలో పేర్కొన్నారు. మిగతా వారంతా వైద్య బీమాకు దూరం కానున్నారు. కనీసం 80,000 మంది భారత శరణార్థులకు బీమా సౌకర్యం దూరమవుతుందని చెబుతున్నారు. విద్యార్థులనూ కలుపుకుంటే కనీసం లక్ష మందికి పైగా భారతీయులు బీమాకు దూరమవుతున్నారు. బరాక్ ఒబామా హయాంలో గ్రీన్ కార్డ్‌దారులు, శరణార్థులు, గృహహింస బాధితులు, హెచ్‌-1బీ వీసాదారులు, ఎఫ్‌-1 వీసా ఉన్న విద్యార్థులు 'ఒబామాకేర్' పథకంలో భాగంగా వైద్య బీమా పొందే వాళ్లు. దీనికింద కుటుంబాలు, చిన్న వ్యాపారులకూ బీమా అందేది.

- సాక్షి, నేషనల్ డెస్క్

వారికీ రెడ్ అలర్టే!

గ్రీన్ కార్డు కేవలం శాశ్వతస్థిర నివాస హామీ మాత్రమే. అది లభించినంత మాత్రాన అమెరికా పౌరసత్వం ఇవ్వరు. ట్రంప్ సర్కారు సరిగ్గా ఇదే పాయింటు పట్టుకుంది. పౌరసత్వంలేని వాళ్లకు మెడిక్‌ఎయిడ్ తెగ్గోయాలని చట్టంలో పేర్కొంది. తద్వారా గ్రీన్‌కార్డ్‌దారుల్లో అత్యధికులకు వైద్య బీమా ఎత్తేస్తోంది. మిగతా వారి అర్హతను కూడా ప్రతి ఆర్నెల్లకోసారి సమీక్షిస్తారు. ఆ లెక్కన త్వరలో వారికీ బీమా ఎత్తేయడం ఖాయమంటున్నారు. ''నేను న్యూజెర్సీలో ఓ ప్రముఖ టెక్ కంపెనీలో పనిచేస్తున్నా. నేను, నా భార్య కలిసి ఏటా 27,000 డాలర్లు పన్నుగా కడుతున్నాం. అయినా ట్రంప్ ప్రభుత్వం దృష్టిలో మేం తక్కువ పన్ను కడుతున్నట్టే లెక్క. నెలకు 450 డాలర్లున్న నా ఒక్కని నెలవారీ వైద్య బీమా ప్రీమియమే కొత్త చట్టంతో 1,200 డాలర్లకు పెరగనుంది'' అని సుహాస్ ప్రతాప్ అనే తెలుగు ఎన్నారై వాపోయారు. ఆయన హెచ్‌-1బీ వీసా మీద అమెరికాకు వచ్చారు.



స్తంభాన్ని ఢీకొని నిలిచిపోయిన కారు

జనంపైకి దూసుకెళ్లిన కారు

- లాస్‌ఏంజెలెస్‌లో 30 మందికి గాయాలు.. ఐదుగురికి విషమం
- వాహనం డ్రైవర్‌పై జనం దాడి..
- బుల్లెట్ గాయంతో ఆస్పత్రిలో చేరిక

లాస్ ఏంజెలెస్: అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలో నైట్‌క్లబ్ వద్ద ఉన్న జనంపైకి కారు దూసుకెళ్లిన ఘటనలో కనీసం 30 మంది గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఘటనకు కారణమైన కారు డ్రైవర్ బుల్లెట్ గాయంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. హాలీవుడ్ తూర్పుప్రాంతంలోని సాంటామోనికా బౌల్‌యార్డులో శనివారం ఘటన చోటుచేసుకుంది. జనంతో కిటకిటలాడుతుండే బౌల్‌యార్డ్‌లోని ఓ నైట్ క్లబ్ ప్రవేశద్వారం వద్ద బారులు తీరిన వారిపై కారువేగంగా దూసుకెళ్లింది. దీంతో, జనం హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. ఆ కారు ట్యాకో ట్రక్కుతోపాటు వాలెట్ స్టాండ్‌ను ఢీకొట్టింది. ట్రక్కు ఢీకొనడంతో 30 మంది వరకు గాయాలపాలయ్యారు. వీరిలో 23 మందిని వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల్లో అత్యధికులు మహిళలున్నారు. కారు ఆగిపోయాక చుట్టూపోగైన జనం అందులో ఉన్న డ్రైవర్‌పై దాడి చేశారని పోలీసులు చెప్పారు. అయితే, కారు డ్రైవర్‌కు బుల్లెట్ గాయమైందని సహాయక సిబ్బంది తెలిపారు. అతడి వద్ద రివాల్వర్ కూడా ఉందన్నారు. ఈ ఘటనకు ముందు క్లబ్ వద్ద ఘర్షణ చోటుచేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. డ్రైవర్‌కు బుల్లెట్ గాయం ఘటనకు ముందు అయిందా లేక జనం దాడితో అయ్యిందా అనే విషయం వెల్లడికాలేదు. ఫైర్ సిబ్బందితోపాటు క్లబ్‌లోని వారు వచ్చి, సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై దర్యాప్తు చేపట్టామని, ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదన్నారు.

భారత్-పాక్ ఘర్షణలో 5 ఫైటర్ జెట్లు నేలమట్టం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ

- అవి ఏ దేశానివో చెప్పని వైనం
- రెండు దేశాల యుద్ధాన్ని తానే ఆపేశానని పునరుద్ఘాటన

న్యూయార్క్: ఆపరేషన్ సిందూర్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య మే నెలలో జరిగిన ఘర్షణలో ఐదు యుద్ధ విమానాలు నేలమట్టమయ్యాయని చెప్పారు. అవి గాల్లోనే పేలిపోయి నేలకూలాయని, అది నిజంగా దారుణమైన సంఘటన అని పేర్కొన్నారు. అయితే, కూలిపోయిన యుద్ధ విమానాలు ఏ దేశానికి చెందినవి? అనే సంగతి ట్రంప్ బయటపెట్టలేదు. అవి భారత్‌కు చెందినవా? లేక పాకిస్తాన్‌కు చెందినవా? లేక ఇరు దేశాలకు చెందినవా? అనేది ప్రకటించకపోవడం గమనార్హం. వైట్‌హౌస్‌లో శుక్రవారం రాత్రి రిపబ్లికన్ సెనేటర్లు ఇచ్చిన విందు కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. తాను చొరవ తీసుకోవడం వల్లే భారత్-పాక్ మధ్య యుద్ధంగా ఆగిపోయిందని పునరుద్ఘాటించారు. శక్తివంతమైన అణ్వాయుధాలు కలిగిన రెండు దేశాలు పరస్పరం ఘర్షణకు దిగాయని, దాడులు చేసుకున్నాయని.. తాను రంగంలోకి దిగి ఆపకపోతే అది తీవ్రమైన యుద్ధంగా మారేదని అన్నారు. తన హెచ్చరికలతో రెండు దేశాలు దిగొచ్చాయని, ఘర్షణకు ముగింపు పలికాయని స్పష్టంచేశారు. భారత్, పాక్‌లపై 'వాణిజ్య'హెచ్చరికల అస్త్రం ప్రయోగించానని, దాంతో అవి తన మాట విన్నాయని తెలిపారు. గత ఆరు నెలల పాలనలో ఎంతో సాధించామని, ఎన్నో యుద్ధాలు ఆపేశామని, అందుకు గర్వపడుతున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఐదు యుద్ధ విమానాలు కూలిపోయాయంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం ఇంకా స్పందించలేదు.



వైట్‌హౌస్‌లో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రంప్

ట్రంప్ ప్రమేయం లేదు

ఆపరేషన్ సిందూర్‌లో తమకు కొంత నష్టం వాటిల్లిందని, యుద్ధ విమానాలు కోల్పోయామని భారత్ సైన్యం ఇప్పటికే అంగీకరించింది. అయితే, పూర్తి వివరాలు బహిర్గతం చేయలేదు. భారత వైమానిక దళానికి చెందిన ఆరు ఫైటర్ జెట్లను కూల్చివేశామని పాకిస్తాన్ ప్రకటించింది. కానీ, అందుకు ఆధారాలేవీ చూపించలేదు. పాక్ ప్రకటనను భారత సైన్యం ఖండించింది. మే 31వ తేదీన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ సింగపూర్‌లో మాట్లాడుతూ.. పాకిస్తాన్ భూభాగంలోకి ప్రవేశించి ఉగ్రవాద స్థావరాలపై, శిక్షణా శిబిరాలపై దాడులు చేశామని వెల్లడించారు. ముష్కరులను కోలుకోలేని విధంగా దెబ్బకొట్టామని, ఈ క్రమంలో తమకు కొంత నష్టం జరిగిన మాట నిజమేనని తెలిపారు. ఇండియాకు చెందిన ఆరు ఫైటర్ జెట్లను కూల్చేశామంటూ పాక్ చేసిన ప్రకటనలో ఎంతమాత్రం నిజం లేదన్నారు. భారత్-పాక్ ఘర్షణను ఆపేశానంటూ ట్రంప్ గతంలోనూ తనకు తానే కితాబిచ్చుకోగా, భారత్ గట్టిగా తిప్పికొట్టింది. పాక్ ప్రభుత్వం పదేపదే విజ్ఞప్తి చేయడంతో స్పందించి దాడులు నిలిపేశామని, ఇందులో ట్రంప్ ప్రమేయం ఏమీ లేదని తేల్చిచెప్పింది. భారత సైన్యం మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. నాలుగు రోజుల పాటు ఈ ఆపరేషన్ కొనసాగింది.

ప్రధాని మోదీ వివరణివ్వాలి

ప్రజలకు నిజం తెలపాలి: రాహుల్ డిమాండ్

న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ మధ్య మే నెలలో జరిగిన దాడుల సమయంలో ఐదు యుద్ధ విమానాలు కూలాయంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన అస్పష్ట ప్రకటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ట్రంప్ తరచూ చేస్తున్న ఇటువంటి వ్యాఖ్యలపై ప్రధాని మోదీ మౌనంగా ఎందుకు ఉంటున్నారంటూ ప్రశ్నించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై ప్రధాని మోదీ స్పష్టమైన, నిర్దిష్టమైన ఒక ప్రకటన చేయాలన్నారు. అసలు నిజాన్ని దేశ ప్రజలకు తెలపాల్సిన అవసరం ఎంతో ఉందని రాహుల్ శనివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన దాడుల్లో ఐదు యుద్ధ విమానాలు కూలాయన్న ట్రంప్..ఆ విమానాలు ఏ దేశానివనే విషయం స్పష్టం చేయలేదు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య యుద్ధం తన జోక్యం వల్లే ఆగిందంటూ ట్రంప్ ప్రకటించుకోవడం తెల్సిందే. ఇలా ఉండగా, పార్లమెంట్ సమావేశాలు మరో రెండు రోజుల్లో మొదలవుతాయనగా ట్రంప్ ఈ వ్యాఖ్య చేయడంలో ఔచిత్యాన్ని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు. ట్రంప్ ఇలాంటి ప్రకటన చేయడం ఇది 24వ సారని గుర్తు చేశారు. వీటిపై మౌనంగా ఉండటం సమాధానం కాదు, స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రధాని మోదీని ఆయన డిమాండ్ చేశారు.



క్షతగాత్రులకు ఖాన్‌యూనిస్ ఆస్పత్రిలో నేలపైనే సిబ్బంది చికిత్స

ఇజ్రాయెల్ మారణకాండ

అన్నార్తులపై కాల్పులు ● రఫాలో 36 మంది మృతి

దెయిర్ అల్-బలాహ్: గాజా ప్రాంతంలో అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఏర్పాటు చేసిన ఆహార పంపిణీ కేంద్రాల వద్ద ఇజ్రాయెల్ ఆర్మీ మారణకాండ కొనసాగుతోంది. తాజాగా, రఫాలో జరిగిన కాల్పుల్లో మరో 36 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని ప్రత్యక్ష సాక్షులు, స్థానిక ఆస్పత్రులు తెలిపాయి. ఖాన్‌యూనిస్ నగర సమీపంలోని టెయినా ప్రాంతంలోని ఆహార పంపిణీ కేంద్రం వద్ద శనివారం ఉదయం 6 గంటల సమయంలో పెద్ద సంఖ్యలో జనం గుమికూడారు. వారిపైకి ఆర్మీ హెచ్చరిక కాల్పులు జరిపింది. జనం ఆగకుండా ముందుకు వస్తుండటంతో వారిని చుట్టుముట్టి నేరుగా మెషీన్ గన్‌లతో కాల్పులకు దిగిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. కొందరు గాయాలపాలై నేలకొరగ్గా, మరికొందరు పరుగులు తీశారన్నారు. తమ ఆస్పత్రి మార్చురీకి 25 మృతదేహాలను తరలించారని నాస్సెర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సుమారు 70 మంది క్షతగాత్రులకు వైద్యం అందించామని పేర్కొంది. పెద్ద సంఖ్యలో తరలి వస్తున్న బాధితులకు అవసరమైన మేర వైద్య సరఫరాలు లేవని ఆవేదన వ్యక్తం చేసింది. అదేవిధంగా, ఇజ్రాయెల్ వివిధ ప్రాంతాల్లో సాగించిన దాడుల్లో మరో 50 మందికి పైగా మృతి చెందినట్లు అల్ జజీరా తెలిపింది. గాజా నగరంపై జరిపిన వేర్వేరు వైమానిక దాడుల్లో 11 మంది చనిపోయారని ఆరోగ్య విభాగం పేర్కొంది. సెంట్రల్‌గాజాలో జరిగిన మరో దాడిలో ఇద్దరు చిన్నారులు సహా 9 మంది చనిపోయినట్లు నుసెయిరత్ ఆస్పత్రి పేర్కొంది. కాగా, 24 గంటల వ్యవధిలో గాజాలోని 90 లక్ష్యాలపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించుకుంది.

రాష్ట్రపతి అభ్యంతరాలపై 22న విచారణ

న్యూఢిల్లీ: రాష్ట్రాల శాసనసభల్లో ఆమోదించిన బిల్లులపై గవర్నర్ లేదా రాష్ట్రపతి నిర్దేశిత గడువులోగా తమ నిర్ణయాన్ని వెల్లడించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన జ్యుడీషియల్ ఉత్తర్వు పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వ్యక్తి చేసిన అభ్యంతరాలపై రాజ్యాంగ ధర్మాసనం ఈ నెల 22న విచారణ చేపట్టనుంది. ఈ మేరకు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపర్చారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎస్.చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం విచారణ ప్రారంభించనుంది. అసెంబ్లీ నుంచి వచ్చిన బిల్లులపై గవర్నర్ లేదా రాష్ట్రపతి గడువుగా నిర్ణయం తెలపాలని సూచిస్తూ ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పందించారు. జ్యుడీషియల్ ఆర్డర్ ద్వారా గవర్నర్‌కు, రాష్ట్రపతికి టైమ్‌లైన్ నిర్దేశించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించారు. రాష్ట్రపతి అభ్యంతరాలపై ఈ నెల 22న రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టబోతోంది.

అడవులను కాపాడుదాం

జస్టిస్ బి.ఆర్.గవాయ్ పిలుపు

న్యూఢిల్లీ: అడవులను జాగ్రత్తగా కాపాడుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పిలుపునిచ్చారు. అడవులపై కేవలం మనకు మాత్రమే హక్కు ఉందని అనుకోవద్దని, అవి భవిష్యత్తు తరాలకు చెందుతాయని స్పష్టంచేశారు. అభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు మధ్య కచ్చితంగా సమతూకం అవసరమని అన్నారు. వన మహోత్సవ్-2025లో భాగంగా ఢిల్లీ ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ పాల్గొన్నారు. ఢిల్లీలో అక్టోబర్ వస్తోందంటే భయపడే పరిస్థితి ఉందన్నారు. అక్టోబర్ నుంచి కాలుష్యం పెరిగిపోవడమే అందుకు కారణమని తెలిపారు. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ దానికి చెల్లించాల్సిన మూల్యం గురించి కూడా ఆలోచించాలని సూచించారు. కాలుష్యాన్ని అరికట్టడంలో మొక్కలదే కీలక పాత్ర అని, అందరూ మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. అడవులు మనకే సొంతం అనే విధానం మానుకోవాలన్నారు. కాలుష్యాన్ని నియంత్రించడం, భూగోళాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని తేల్చిచెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమంలో జస్టిస్ గవాయ్‌తోపాటు 20 మంది న్యాయమూర్తులు, ఢిల్లీ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా పాల్గొన్నారు.



తలకిందులైన పడవపై సాయం కోసం ఎదురుచూస్తున్న కొందరు బాధితులు

తుపానులో చిక్కుకున్న పడవ

వియత్నాంలో 34 మంది జలసమాధి

హా లాంగ్ బే(వియత్నాం): వియత్నాంలో ఆకస్మాత్తుగా విరుచుకుపడిన తుపానులో చిక్కుకుపోయిన ఒక పర్యాటకుల పడవ నీటిలో మునిగిపోయింది. వియత్నాంలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన హా లాంగ్ బే ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం మధ్యాహ్నం పడవ మునిగిన ఘటనలో 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎనిమిది మంది జాడ గల్లంతైంది. విషయం తెల్సుకున్న వియత్నాం సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగి గాలింపు తీవ్రతరం చేశాయి. 11 మందిని కాపాడారు. ప్రమాదం జరిగినప్పుడు 'ది వండర్ సీ'బోటులో 48 మంది పర్యాటకులు, ఐదుగురు సిబ్బంది ఉన్నారు. తుపాను కారణంగా పెనుగాలులు వీయడంతో ఆ గాలుల ధాటికి పడవ ఒక్కసారిగా పల్టీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వియత్నాం రాజధాని హనోయి నుంచి 20 మంది చిన్నారులతోకూడిన కొన్ని కుటుంబాలు సైతం ఇదే పడవలో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగిందని వీఎన్ ఎక్స్‌ప్రెస్ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. హా లాంగ్ బే ప్రాంతాన్ని ఇప్పటికే ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించడం తెల్సిందే. సతతహరిత అరణ్యాలకు, అందమైన నీలిరంగు బీచ్‌లకు ఈ ప్రాంతం పెట్టింది పేరు. వారాంతం కావడంతో ఇక్కడికి పర్యాటకుల తాకిడి ఎక్కువైందని తెలుస్తోంది. రెండేళ్ల క్రితం సైతం హా లాంగ్ బే సమీప ఖ్యాంగ్‌నిన్ ప్రావిన్సును యాగీ టైఫూన్ అతలాకుతలం చేసింది. ఆనాడు ఈ ప్రావిన్సులో 30 పడవలు బోల్తాపడి నీటమునిగాయి. ఈ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా మారడం సాధారణమని ఇక్కడి స్థానికులు చెప్పారు. ముఖ్యంగా వర్షాకాలంలో మరింత పర్యాటకులు మరింత అప్రమత్తంగా ఉండి తమ పర్యాటక షెడ్యూల్‌ను మార్చుకోవాలని స్థానికులు సూచించారు. వచ్చే వారం హా లాంగ్ బే తీర ప్రాంతాన్ని విఫా తుపాను తాకొచ్చని జాతీయ వాతావరణ అంచనా విభాగం ప్రకటించింది.

బ్రహ్మపుత్రపై డ్యామ్ పనులు మొదలెట్టిన చైనా

- అరుణాచల్, అస్సాంలపై పెను ప్రతికూలప్రభావం చూపనున్న డ్యామ్

బీజింగ్: చైనా ప్రపంచంలోనే అత్యంత భారీ జలవిద్యుత్ ప్రాజెక్ట్‌ను బ్రహ్మపుత్ర నదీ ప్రవాహ మార్గంలో మొదలెట్టింది. సరిహద్దు రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాంల నీటి అవసరాలు తీర్చే బ్రహ్మపుత్రపై ఇంతటి భారీ ప్రాజెక్ట్ నిర్మిస్తే తమపై పెను ప్రతికూల ప్రభావం పడుతుందని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసినా అవేం పట్టించుకోకుండా చైనా ఏకపక్షంగా వ్యవహరించింది. 167.8 బిలియన్ డాలర్ల అంచనావ్యయంతో ఈ డ్యామ్‌ను నిర్మిస్తోంది. బ్రహ్మపుత్ర నదిని చైనాలో యార్లాంగ్ జాంగ్‌బోగా పిలుస్తారు. నింగ్చి నగరంలో శనివారం చైనా ప్రధాని లీ కియాంగ్ భూమి పూజ చేసి నిర్మాణ పనులను మొదలుపెట్టినట్లు చైనా అధికారిక మీడియా ప్రకటించింది. టిబెట్ ప్రాంతంలోని నింగ్చి మెయిన్‌లింగ్ జలవిద్యుత్ కేంద్రం వద్ద ఈ పనులు శనివారం మొదలయ్యాయి. ఈ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అత్యంత భారీ మౌలికసదుపాయాల ప్రాజెక్టుగా రికార్డులకెక్కనుంది. ప్రాజెక్ట్‌లో భాగంగా 1.2 ట్రిలియన్ యువాన్ల అంచనా వ్యయంతో వేర్వేరు చోట్ల ఐదు హైడ్రోపవర్ స్టేషన్లను నిర్మించనున్నారు. 2023నాటి ఓ నివేదిక ప్రకారం ఈ జలవిద్యుత్ ప్రాజెక్ట్ పూర్తయితే దీని ద్వారా ఏటా ఏకంగా 300 బిలియన్ కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యం కానుంది. ఇది 30 కోట్ల మంది చైనీయుల ఏడాది అవసరాలను సరిపోతుంది. ప్రాజెక్ట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను అధికశాతం విదేశాలకు సరఫరాచేయనున్నారు.

కీలక ప్రాంతంలో నిర్మాణాన్ని తప్పుబట్టిన భారత్

ఒకవేళ రెండు దేశాల మధ్య సంఘర్షణ సంభవిస్తే చైనా ఈ కొత్త డ్యామ్ నుంచి ఒక్కసారిగా భారీ పరిమాణంలో నీటిని విడుదల చేస్తే అక్కడి భూభాగాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఇప్పటికే భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. తనకు నచ్చినప్పుడు నీటిని విడుదల చేస్తూ, నీటిని డ్యామ్‌లో పట్టి ఉంచుతూ నదీజలాలపై చైనా గుత్తాధిపత్యం వహించే ప్రమాదముందని భారత్ అభ్యంతరాలను ఇప్పటికే వెల్లడించింది. మరోవైపు తరచూ భూకంపాలు సంభవించే ప్రాంతంలోనే ఈ డ్యామ్‌ను నిర్మిస్తుండటంతో డ్యామ్ పటిష్టతపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ పైకప్పుగా పిలిచే టిబెట్ పీఠభూమి ప్రాంతంలో ఈ డ్యామ్ నిర్మిస్తున్నారు. అద్భుత నిర్మాణాలకు పేరెన్నికగన్న చైనా ఈ డ్యామ్‌ను అత్యంత పటిష్టంగా నిర్మించనుందని వార్తలొస్తున్నా భారత్ తన నదీజలాల పరిరక్షణ ప్రమాదంలో పడిందని ఇప్పటికే చైనాకు అధికారికంగా సమాచారమిచ్చింది. గతేడాది డిసెంబర్ 18న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు.



ఒడెసాలోని నివాస భవనంలో దాడితో చెలరేగిన మంటలు

300 డ్రోన్లు.. 30 క్షిపణులు..!

ఉక్రెయిన్‌పైకి ప్రయోగించిన రష్యా

కీవ్: ఉక్రెయిన్‌పై దాడులను రష్యా తీవ్రతరం చేసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఏకంగా 300కి పైగా డ్రోన్లు, 30కి పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. నల్ల సముద్ర తీర నగరం ఒడెసాపైకి 20 డ్రోన్లు, ఒక క్షిపణిని రష్యా ప్రయోగించిందని, ఈ దాడుల్లో ఒకరు చనిపోయినట్లు ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. బహుళ అంతస్తుల నివాస భవనంలో మంటలు చెలరేగాయి. చిన్నారి సహా ఆరుగురు గాయపడ్డారు. మంటల్లో చిక్కుకుపోయిన ఐదుగురిని కాపాడామని తెలిపింది. ఈ నెల 8న రష్యా రికార్డు స్థాయిలో 700కు పైగా డ్రోన్లను ఉక్రెయిన్ వ్యాప్తంగా ప్రయోగించడం తెల్సిందే. అదేవిధంగా, శుక్రవారం రాత్రి నుంచి ఉక్రెయిన్ ప్రయోగించిన 71 డ్రోన్లను కూల్చినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. రాజధాని మాస్కోకు సమీపంలో 13 డ్రోన్లను ధ్వంసం చేశామంది.

డిజిటల్ అరెస్ట్ కేసులో... 9 మందికి యావజ్జీవం

పశ్చిమబెంగాల్ కోర్టు చారిత్రక తీర్పు

కోల్‌కతా: డిజిటల్ అరెస్ట్ సైబర్ మోసం కేసులో దేశంలోనే మొట్టమొదటిసారిగా పశ్చిమబెంగాల్ కోర్టు 9 మందికి యావజ్జీవ శిక్షలు విధిస్తూ తీర్పు వెలువరించింది. పెరిగిపోతున్న సైబర్ నేరాల కట్టడికి దేశం సాగిస్తున్న పోరులో నడియా జిల్లా కల్యాణి కోర్టు తీర్పు మైలురాయిగా నిలిచిపోనుంది. ఘటన జరిగిన ఎనిమిది నెలల్లోనే విచారణ పూర్తి చేసి, అదనపు సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించడం మరో విశేషం. దోషుల్లో మహారాష్ట్రకు చెందిన నలుగురు, హరియాణా వాసులు ముగ్గురు, గుజరాత్‌కు చెందిన ఇద్దరు ఉన్నారు. పార్థ కుమార్ ముఖర్జీ అనే రిటైర్డు సైంటిస్ట్ నుంచి సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ బూచి చూపి ఏకంగా కోటి రూపాయలు గుంజారు. ముంబై పోలీస్ అధికారినంటూ ఈ ముఠాలోని వ్యక్తి ముఖర్జీకి వాట్సాప్ కాల్ చేసి ఆర్థిక నేరాలకు పాల్పడినందున డిజిటల్ అరెస్ట్ తప్పదంటూ బెదిరించాడు. దీంతో, ఆయన ఈ ముఠా సభ్యులకు చెందిన పలు బ్యాంకు అక్కౌంట్లకు రూ.కోటి ట్రాన్స్‌ఫర్ చేశారు. మోసపోయినట్లు గుర్తించిన ముఖర్జీ 2024 అక్టోబర్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రాణాఘాట్ సైబర్ క్రైం స్టేషన్ పోలీసులు నిందితులను గుర్తించి నాలుగున్నర నెలల్లో అంటే 2025 ఫిబ్రవరి 24వ తేదీతో విచారణ ముగించారు. మొత్తం విచారణ ప్రక్రియ 8 నెలల్లోనే పూర్తవడం విశేషమని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బివాస్ చటర్జీ చెప్పారు. ఈ ముఠా భారత సిమ్ కార్డులతో కంబోడియా నుంచి బాధితుడికి ఫోన్లు చేసి బెదిరించారన్నారు. ఇలా వీరు 100 మందిని మోసగించారని తెలిపారు. మహారాష్ట్ర, హరియాణా, గుజరాత్, రాజస్తాన్‌లకు చెందిన 13 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు 9 మందిపై ఫోర్జరీ, కుట్ర తదితర నేరారోపణలు చేశారన్నారు.

23 నుంచి మోదీ విదేశీ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 23 నుంచి 26వ తేదీ దాకా యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), మాల్దీవ్స్ దేశాల్లో పర్యటించనున్నారు. రెండు దేశాలతో దౌత్య, వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. మోదీ తొలుత ఈ నెల 23, 24న యూకేలో పర్యటిస్తారు. అత్యంత కీలకమైన ఇండియా-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకం చేస్తారు. రక్షణ రంగంలో పరస్పర సహకారంపై యూకే ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్‌తో చర్చలు జరుపుతారు. అలాగే ఈ నెల 25, 26న మాల్దీవ్స్‌లో మోదీ పర్యటన కొనసాగనుంది. మాల్దీవ్స్ 60వ జాతీయ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

రేపటి నుంచి పార్లమెంట్.. నేడు అఖిలపక్షం

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఆదివారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. ఉభయ సభల్లోని వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్ల సమావేశాన్ని ఉదయం 11 గంటలకు పార్లమెంట్ అనెక్స్‌లో ఏర్పాటు చేసింది. ఆయా పార్టీలు ప్రస్తావించదలిచిన అంశాలను తెలుసుకోవడంతో పాటు, సభ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేయనుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అధ్యక్షతన ఈ భేటీ జరగనుంది. జూలై 21 నుంచి ఆగస్ట్ 21 వరకు వర్షాకాల సమావేశాలు జరుగనుండగా, ఇందులో పలు కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టనుంది. ప్రతిపక్షాలు లేవనెత్తేందుకు అవకాశమున్న ప్రధాన అంశాల్లో పహల్గాం దాడి, భద్రతా లోపాలు, ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్‌తో కాల్పుల విరమణలో అమెరికా జోక్యం, నిరుద్యోగం, మౌలిక సదుపాయాల పతనం వంటివి ఉన్నాయి. వీటిపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసేందుకు ఇండియా కూటమి పక్షాలు వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నాయి. సోమవారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు సైతం మరోమారు చర్చించుకోనున్నాయి.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 20 । జూలై । 2025



రెండు తుపాకులు.. ముగ్గురు షూటర్లు
సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేతావత్ చందు రాథోడ్ కళ్లల్లో కారం కొట్టి, కాల్చి చంపిన కేసులో ఐదుగురు నిందితులను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. -8లో



బహుత్ అచ్ఛీ..‘బాత్’ హై..
నగరంలో బాత్‌రూమ్ ట్రెండ్స్ కొంత పుంతలు తొక్కుతున్నాయి. అత్యాధునిక హంగులను అద్దుకుంటున్నాయి. ఇంటీరియర్ డిజైనింగ్ సైతం కీలకపాత్ర పోషిస్తోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 32.0/23.0
నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

అవార్డులు వస్తున్నా.. పారిశుద్ధ్యం అధ్వానమే!

పెనాల్టీలు వేస్తున్నా మారని పరిస్థితులు



బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసినందుకు అధిక పెనాల్టీలు పడ్డ జీహెచ్ఎంసీ సర్కిళ్లు.. పెనాల్టీల వివరాలు

సర్కిల్	(రూ.లక్షలు)
మూసాపేట	10.38
కూకట్‌పల్లి	6.21
ఉప్పల్	6.57
ఖైరతాబాద్	3.41
సికింద్రాబాద్	4.70
చందానగర్	7.03

- నిర్మాణ వ్యర్థాలకు అధిక పెనాల్టీలు విధించిన సర్కిళ్లలో సికింద్రాబాద్ (రూ.6.50 లక్షలు), మల్కాజిగిరి (రూ.6.85 లక్షలు), బేగంపేట (రూ.9.75లక్షలు), జూబ్లీహిల్స్ (రూ.3.10 లక్షలు), కాప్రా (రూ.2.30లక్షలు) ఉన్నాయి.

సాక్షి, సిటీబ్యూరో: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో గార్బేజ్ ఫ్రీ సిటీ కేటగిరీలో జీహెచ్ఎంసీ మిలియన్ ప్లస్ నగరాల్లో ఆరో స్థానం దక్కించుకుంది. దీంతోపాటే సెవెన్‌స్టార్ హోదాను సైతం పొందింది. రాష్ట్రంలోనూ ప్రామిసింగ్ స్వచ్ఛ షహర్‌గా రాష్ట్రస్థాయి అవార్డు పొందింది. ఇవన్నీ నగరానికి గర్వకారణమే అయినప్పటికీ, వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయని నగర ప్రజలు అంటున్నారు. ఇదే విషయాన్ని అధికారుల వద్ద ప్రస్తావిస్తే.. మిగతా నగరాల కంటే మనం మెరుగ్గా ఉండటమే అందుకు కారణమంటున్నారు. దాంతో పాటు ర్యాంకుల కోసం పాటించాల్సిన నిబంధనలు, ప్రొటోకాల్స్ వంటివి పరిగణనలోకి తీసుకోవడం కూడా అందుకు కారణం.

సవ్యంగా జరగని చెత్త సేకరణ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు పొందాలంటే బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదు. గార్బేజ్ ఫ్రీ సిటీ అంటేనే బయట ఎక్కడా చెత్త కనపడకూడదు. వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేసేవారికి పెనాల్టీలు విధించాలి. ఈ కార్యక్రమాన్ని మాత్రం జీహెచ్ఎంసీ నిర్వహిస్తోంది. ర్యాంకులను పరిగణనలోకి తీసుకున్న ఎనిమిది అంశాల్లో ఏడింటిలో జీహెచ్ఎంసీ నూరుశాతం మార్కులు పొందింది. అందులో ఇంటింటి నుంచి చెత్త సేకరణ కూడా ఉంది. నగరంలో మాత్రం అది సవ్యంగా జరగకపోవడం అందరికీ అనుభవైకవేద్యమే. ప్రతిరోజూ చెత్త సేకరణ జరగకపోవడంతో ప్రజలు బయటే చెత్త వేస్తున్నారు. రోజుల తరబడి చెత్తను ఇంట్లో ఉంచుకోలేక పెనాల్టీలను సైతం పట్టించుకోకుండా బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్నారు. దీంతో, అవార్డులు వస్తున్నా పారిశుద్ధ్యం మాత్రం అధ్వానంగానే ఉంది.

రూ. కోటి దాటిన పెనాల్టీలు.. అయినా తగ్గని వ్యర్థాలు

ఈ సంవత్సరం మార్చి ఆరంభం నుంచి గత వారం వరకు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారికి రూ. 69 లక్షలు, నిర్మాణ.. కూల్చివేతల వ్యర్థాలు వేసిన వారికి రూ. 48 లక్షలు కలిపి మొత్తం రూ.కోటికి పైగా పెనాల్టీలు విధించారు. అయినప్పటికీ పరిస్థితి మారడం లేదు. బహుశా దీన్ని దృష్టిలో ఉంచుకునే కావచ్చు ఇటీవల ఫోన్ చేస్తే చెత్త తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతోనైనా స్వచ్ఛత కనిపిస్తుందేమో వేచి చూడాలి మరి!

శనివారం రాత్రి 8 గంటల వరకు నమోదైన వర్షపాతం (సెం.మీ)	కాప్రా	మల్కాజిగిరి	ఉప్పల్	లాలాపేట	న్యూ మెట్టుగూడ	అడ్డగుట్ట	చిలుకలగూడ	సికింద్రాబాద్
	7.7	6.8	6.8	6.6	6.2	5.9	5.9	5.6

చర్లపల్లి	నాచారం	సరూర్‌నగర్	హయత్‌నగర్	మోండా మార్కెట్	మౌలాలి	బండ్లగూడ	సైనిక్‌పురి	నేరేడ్‌మెట్	రాక్‌టౌన్ కాలనీ
5.2	4.8	4.6	4.4	4.4	4.3	4.2	4.0	3.9	3.8

జలమయమైన రహదారులు
- పొంగిపొర్లిన నాలాలు, డ్రైనేజీలు
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- నరకయాతనలో వాహనదారులు

రెండోరోజూ కుండపోత



మన్సూరాబాద్ - ఆనంద్‌నగర్ రహదారిపై..

సాక్షి, సిటీబ్యూరో

మధ్యాహ్నం వరకూ ఎండవేడి.. 3 గంటల తర్వాత వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. పెద్ద పెద్ద చినుకులతో ప్రారంభమై వర్షం కుండపోతగా మారింది. ఏకధాటిగా కురిసిన వర్షంతో ఎప్పటి మాదిరిగానే నిమిషాల్లో రహదారులన్నీ చెరువులను తలపించాయి. నాలాలు, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. శనివారం అత్యధికంగా కాప్రాలో 7.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాయంత్రం ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడింది. వాహనదారులు, విద్యార్థులు, ప్రజలు నరకయాతనకు గురయ్యారు. వరద ఉద్ధృతికి కొన్ని ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ఇళ్లలోకి నీరు వచ్చి చేరింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు.

భారీగా ట్రాఫిక్ జాం

కుండపోత వర్షానికి రోడ్లపై వరద నీరు చేరడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ జాం అయింది. పంజాగుట్ట- లింగంపల్లి మార్గంలో వాహనాలు ముందుకు కదలలేదు. మియాపూర్ నుంచి లింగంపల్లి రోడ్‌లో హఫీజ్‌పేట క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు స్తంభించిపోయాయి. దిల్‌సుఖ్ నగర్, చాదర్‌ఘాట్, మోజంజాహీ మార్కెట్, అసెంబ్లీ, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్, అమీర్‌పేట, బేగంపేట మార్గాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీసులు నానా తంటాలు పడ్డారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. భారీ వర్షాలపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, కలెక్టర్ దాసరి హరిచందన, సీపీ ఆనంద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లతో ఆయన ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా బృందాలు ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



సోమాజిగూడ మార్గంలో ట్రాఫిక్ జాం

మరో 5 రోజులు వర్షాలు..

నైరుతి రుతుపవనాల ప్రభావంతో మరో 5 రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం వెల్లడించింది. ఈ మేరకు నాలుగు రోజులు ఎల్లో అలర్ట్, మూడో రోజున ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలను జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. వర్షాల కారణంగా సమస్యలు తలెత్తితే వెంటనే 040-29555500, 9000113667 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించింది.

అందుబాటులో ఉండండి

వర్షాలు, బోనాల ఉత్సవాల నేపథ్యంలో..

సాక్షి, సిటీబ్యూరో: ఏకధాటి వర్షాలు.. బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆది, సోమవారాల్లో విద్యుత్ శాఖ సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం ఆయా సర్కిళ్ల ఎస్ఈలు, సీజీఎంతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. వచ్చే రెండు 3 రోజులు అంతా అలర్ట్‌గా ఉండాలని సూచించారు. సూపరింటెండింగ్ ఇంజినీర్లు, డీఈలు, ఏడీఈలు, ఎస్ఈలు సహా క్షేత్రస్థాయి సిబ్బంది అంతా వినియోగదారులకు అందుబాటులో ఉండాలని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలకు ఆస్కారం లేకుండా, 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఉత్సవాలు జరిగే ప్రదేశాల్లోని సబ్‌స్టేషన్లలో షిఫ్టులవారీగా విధులు నిర్వర్తించాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది విధిగా భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు.


గుంతల పూడ్చివేత వారంలో పూర్తి కావాలి

సాక్షి, సిటీబ్యూరో: వారంలోగా రోడ్లపై గుంతల పూడ్చివేత పనుల్ని పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వారం క్రితం ప్రారంభించిన ‘రోడ్ సేఫ్టీ డ్రైవ్’ పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. గుర్తించిన 8వేల గుంతల్లో ఇప్పటి వరకు 4,500 గుంతల పూడ్చివేత పూర్తయినట్లు అధికారులు తెలపగా, వారంలోగా అన్నీ పూర్తి చేయాలని సూచించారు. వాటితోపాటు వాటర్‌లాగింగ్ ప్రాంతాల్లోని పనులు సత్వరం పూర్తి చేయాలన్నారు. అనంతరం కమిషనర్ వారం రోజుల క్రితం నగరంలో ప్రారంభించిన రోడ్ సేఫ్టీ డ్రైవ్ పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. నగరంలో గుంతలు పూడ్చడం, క్యాచ్‌పిట్స్, సెంట్రల్ మీడియం మరమ్మతులపై వివరాలు అడిగారు. మొత్తం 8 వేల గుంతలు గుర్తించగా 4500 గుంతలను పూడ్చివేశామని ఇంజినీరింగ్ అధికారులు చెప్పారు.

ఫ్యూచర్ సిటీ.. ప్రొసీడింగ్స్ పిటీ

ఎఫ్‌సీడీఏ, హెచ్ఎండీఏల మధ్య కొరవడిన సమన్వయం

- హెచ్ఎండీఏలోనే ఫ్యూచర్ సిటీ ఫైళ్ల పరిశీలన
- రెండు సంస్థల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు



సాక్షి, సిటీబ్యూరో: ఫ్యూచర్‌సిటీలో లే అవుట్‌లు, భవన నిర్మాణ అనుమతుల్లో గందరగోళం నెలకొంది. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా హెచ్ఎండీఏ తరహాలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సంస్థకు ప్రత్యేక యంత్రాంగాన్ని కూడా నియమించారు. అయినా.. ఎఫ్‌సీడీఏలో ఇప్పటి వరకు నిర్మాణరంగానికి సంబంధించిన అనుమతుల ప్రక్రియ గాడిలో పడలేదు. దీంతో భవన యజమానులు, రియల్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పరిశీలన దశలోనే..

ఎఫ్‌సీడీఏలో సిబ్బంది కొరత కారణంగా లేఅవుట్‌లు, బిల్డింగ్‌ల నిర్మాణం కోసం వచ్చే దరఖాస్తులన్నింటినీ హెచ్ఎండీఏ స్వీకరించి పరిష్కరిస్తుంది. అంతిమంగా ప్రొసీడింగ్‌లు (అనుమతులు) మాత్రం ఎఫ్‌సీడీఏ నుంచి లభిస్తాయి. కానీ ఈ ప్రక్రియ ఇంకా స్థిరంగా కొనసాగడం లేదు. వందల కొద్దీ దరఖాస్తులు పరిశీలన దశలోనే ఉన్నాయి. గతంలో డీటీసీపీ వద్ద నమోదైన వాటిని సైతం ప్రస్తుతం హెచ్ఎండీఏకు బదిలీ చేశారు. ట్రిపుల్ ఆర్ వరకు హెచ్ఎండీఏ పరిధికి చెందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ యథాతథంగా కొనసాగుతోంది. హెచ్ఎండీఏ నుంచే స్వయంగా అనుమతులు లభిస్తున్నాయి. ఫ్యూచర్ సిటీ పరిధికి చెందిన దరఖాస్తుల పరిశీలనలో మాత్రం జాప్యంనెలకొంటోంది. దీంతో నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టి భూములు కొనుగోలు చేసినప్పటికీ సకాలంలో అనుమతులు లభించకపోవడంతో లే అవుట్‌లను అభివృద్ధి చేయలేకపోతున్నట్లు ఎఫ్‌సీడీఏ పరిధికి చెందిన పలు నిర్మాణ సంస్థల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలయాపన కారణంగా ఆర్థికంగా నష్టాలను చవిచూడాల్సి వస్తోందని పేర్కొన్నారు.

కొరవడిన సమన్వయం..

- హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిని రీజనల్‌రింగ్ రోడ్డు వరకు విస్తరించిన సంగతి తెలిసిందే. దీంతో 7,250 చ.కి.మీల నుంచి 10,472 చ.కి.మీ వరకు హెచ్ఎండీఏ కార్యకలాపాలు విస్తరించాయి. 7 నుంచి 11 జిల్లాలకు ఈ పరిధి పెరిగింది. కొత్తగా 1,355 గ్రామాలు హెచ్ఎండీఏలో విలీనమయ్యాయి. మరోవైపు ఈ పరిధిలోనే ఉన్న 56 గ్రామాలను ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ పరిధిలోకి తెచ్చింది. దీంతో 765 చ.కి.మీ. ప్రాంతం ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీలో భాగమైంది. గతంలో డీటీసీపీ/హెచ్ఎండీఏ, స్థానిక గ్రామపంచాయతీల నుంచి నిర్మాణ అనుమతులు లభించగా ఇప్పుడు అనూహ్యంగా ఈ ప్రాంతాలన్నీ అనూహ్యంగా కొన్ని పంచాయతీలు హెచ్ఎండీఏ, మరికొన్ని ఎఫ్‌సీడీఏ పరిధిలోకి రావడంతో గందరగోళం నెలకొంది.
- ఎఫ్‌సీడీఏకు ప్రత్యేక అధికారిని, సిబ్బందిని నియమించిన అనంతరం ప్రభుత్వం జూన్ 15 నుంచి నిర్మాణరంగ అనుమతులను అందజేసే అధికారాలను సైతం ఆ సంస్థకు అప్పగించింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ హెచ్ఎండీఏ తరహాలో బలమైన ప్రణాళికా విభాగం ఎఫ్‌సీడీఏకు లేదు. దీంతో బిల్డ్‌నౌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ దశ నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులను అందజేయడం వరకు హెచ్ఎండీఏ విధినిర్వహణలో భాగమైంది. అంతిమంగా ఎఫ్‌సీడీఏ నుంచి మాత్రం అధికారికంగా అనుమతులను (ప్రొసీడింగ్స్)ను అందజేస్తారు. ప్రస్తుతం ఈ రెండు సంస్థల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో కాలయాపన జరుగుతోందని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.

సంప్రదింపులు ఎలా...

‘ఒక్క లే అవుట్ కోసం దరఖాస్తు చేస్తే ఇటు ఎఫ్‌సీడీఏ అటు హెచ్ఎండీఏ అధికారుల చుట్టూ పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఫైల్ ఎక్కడ ఏ దశలో ఉందో తెలియడం లేదు. హెచ్ఎండీఏ పని పూర్తి చేసినా చివరకు ఎఫ్‌సీడీఏను ఆశ్రయించాల్సిందే. ఇలా రెండు సంస్థల చుట్టూ తిరగడం చాలా ఇబ్బందిగా ఉంది’ అని షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన ఒక రియల్టర్ అభిప్రాయపడ్డారు. గతంలో డీటీసీపీ వద్ద అన్ని పనులు పూర్తయ్యేవి. మరో చోటికి వెళ్లాల్సిన అవసరం లేదు. కానీ.. ఇప్పుడు అలా లేదని ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. కొద్ది రోజులుగా రియల్ ఎస్టేట్ రంగంలో సానుకూల వాతావరణం నెలకొని ఉంది. అనుమతుల్లో జాప్యంతో ముందుకు వెళ్లలేకపోతున్నట్లు పలువురు చెబుతున్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ అంటే నాకు తెలిసేదికాదు

హైడ్రాలో చేరిన తర్వాతే అవేంటో తెలిసింది

- ఇప్పుడు విద్యార్థులకూ ఇవి తెలుస్తున్నాయి
- అందరిలోనూ ఇలాంటి అవగాహన రావాలి
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: ‘హైడ్రా కమిషనర్ అయ్యే వరకు నాకు చెరువుల ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ అంటే ఏంటో తెలీదు. ఇప్పుడు నాలుగు, ఐదో తరగతి విద్యార్థులకూ ఇవి తెలుస్తున్నాయి. హైడ్రా మొదటి వార్షికోత్సవంలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సామాజిక, పర్యావరణ అవగాహన ప్రదర్శన ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ప్రతి ఒక్కరిలోనూ ఈ అవగాహన రావాలి’ అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైడ్రా ఏర్పాటుకు ఏడాది పూర్తయిన నేపథ్యంలో శనివారం రవీంద్రభారతిలో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ‘గ్రేటర్’లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 30 పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ఇందులో ప్రదర్శించారు. కార్యక్రమంలో దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. ‘ప్రకృతిని పరిరక్షించుకుంటే అందరం సురక్షితంగా ఉంటాం. ఈ క్రతువులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి. నగర భవిష్యత్తు కోసమే చెరువులు, పార్కులు, రహదారులు, నాలాలు ఆక్రమణల పాలు కాకుండా కాపాడుతున్నాం. ఈ ప్రయాణంలో అనేక ఆటంకాలు ఎదురవుతున్నా వెరవకుండా హైడ్రా భవిష్యత్తు తరాల కోసం అకుంఠిత దీక్షతో పని చేస్తోంది. నగరంలోని గొలుసుకట్టు చెరువులను పరిరక్షించి భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన హైడ్రాకు పోలీసు, మున్సిపాలిటీ, ఇరిగేషన్, రెవెన్యూ ఇలా వివిధ శాఖలకు చెందిన అధికారాలను ప్రభుత్వం కట్టపెట్టింది. ఇలాంటి వ్యవస్థ దేశంలో ఇదొక్కటే ఉంది’ అన్నారు. హైడ్రా కార్యక్రమాలపై ఇండ్ ఫేమ్ విజ్యువల్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు దాస్యం గీతా భాస్కర్ నిర్వహించిన పోటీల్లో విజేతలు నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

నేడు బోనమెత్తనున్న పాతబస్తీ

ఉత్సవాలకు అమ్మవార్ల ప్రధాన ఆలయాలు ముస్తాబు

- దక్షిణ మండలంలో పోలీసుల భారీ బందోబస్తు



లాల్‌దర్వాజా సింహవాహిని

చార్మినార్/చాంద్రాయణగుట్ట: నగరంతో పాటు పాతబస్తీలో ఆదివారం జరిగే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బోనాల జాతర కోసం లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం సహా పాతబస్తీలోని ప్రధాన ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. కాగా.. లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు బలిహరణ, అనంతరం ఉదయం 6 గంటలకు మాజీ ఎంపీ దేవేందర్ గౌడ్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా మహాభిషేకం ఉంటుంది. తదనంతరం బోనాల సమర్పణ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్ తెలిపారు. రాత్రి 8 గంటలకు శాంతి కల్యాణం జరగనుంది.

పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రులు..

బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఆలయాల పరిసరాల్లో బాంబు, డాగ్ స్క్వాడ్, నిఘా వర్గాలు భారీగా మోహరించాయి. దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, అదనపు డీసీపీ మజీద్, ఛత్రినాక ఏసీపీ సి.హెచ్.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ప్రసాద్ వర్మ లు బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.



హిమాయత్ సాగర్ జలాశయం

జంట జలాశయాలకు భారీ వరద

సాక్షి, సిటీబ్యూరో: జంట జలాశయాలకు భారీ స్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లకు వరద ప్రవాహం పెరిగింది. ఉస్మాన్‌సాగర్ జలాశయంలోకి పరీవాహక ప్రాంతాలైన చేవెళ్ల, వికారాబాద్, శంకర్‌పల్లి, దోబీపేట్ ప్రాంతాల్లోని వర్షపు నీరు మూసీ నది ద్వారా వచ్చి చేరుతోంది. హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌కు చేవెళ్ల, అందాపూర్, కొత్వాల్‌పేట్, నర్కూడ, తాండూరు, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కురిసే వర్షం నీరు ఈసీ నది ద్వారా చేరుతోంది. శనివారం కూడా భారీ వర్షం కురవడంతో జంట జలాశయాలకు వరద ప్రవాహం పెరిగింది. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు అప్రమత్తమై వరద ఉద్ధతిని పరిశీలిస్తున్నారు.

ఉస్మాన్‌సాగర్
పూర్తి స్థాయి నీటి మట్టం: 1,790 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం : 1782.75 అడుగులు
ఇన్‌ఫ్లో : 1200 క్యూసెక్కులు
మొత్తం గేట్లు : 15

హిమాయత్‌సాగర్
పూర్తి స్థాయి నీటి మట్టం :1763.50 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం :1759.10 అడుగులు
ఇన్‌ఫ్లో : 1300 క్యూసెక్కులు
మొత్తం గేట్లు : 17

డెంగీ నివారణకు చర్యలు చేపట్టండి

అధికారులకు కమిషనర్ ఆదేశం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో డెంగీ ప్రబలకుండా యుద్ధ ప్రాతిపదికన పకడ్బందీ చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం వైద్యారోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మురికివాడలతో పాటు గృహాలు, అపార్ట్‌మెంట్లకు వైద్యాధికారులు స్వయంగా వెళ్లి ప్రజల భాగస్వామ్యంతో యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలన్నారు. డెంగీ నివారణకు మంచినీరు నిల్వ ఉంచకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వచ్చే వారం పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ వసతిగృహాల్లో ప్రతి వారం క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలన్నారు. మూసీతోపాటు అన్ని చెరువుల్లో దోమల వృద్ధి జరగకుండా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు ప్రతిరోజూ ప్రాథమిక దవాఖానాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణన్

ఖాళీ స్థలంలో గంజాయి మొక్కల పెంపకం

వాచ్‌మెన్ అరెస్టు..4.2 కేజీల గంజాయి మొక్కలు స్వాధీనం



హిమాయత్‌నగర్: వాచ్‌మెన్‌గా పని చేస్తూ అపార్ట్‌మెంట్ సమీపంలోని ఖాళీ స్థలంలో గంజాయి మొక్కలు సాగుచేస్తున్న వ్యక్తిని నారాయణగూడ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరాఖండ్‌కు చెందిన కై లాష్ జోషి విఠల్‌వాడిలోని నీరజ్ విల్లా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అతనికి గంజాయిని పాలల్లో మరిగించి తాగే అలవాటు ఉంది. ఇటీవల గంజాయి లభ్యం కాకపోవడంతో అపార్ట్‌మెంట్ పక్కన పదేళ్లుగా వివాదంలో ఉన్న ఖాళీ స్థలంలో గంజాయి సాగు చేయాలని ప్లాన్ వేశాడు. ఎవరికి అనుమానం రాకుండా సొరకాయ, కాకరకాయ విత్తనాల మధ్య అతని స్వస్థలం నుండి తెచ్చిన గంజాయి విత్తనాలను నాటి సాగు చేస్తున్నాడు. శుక్రవారం భారీగా వర్షం కురవడంతో శనివారం ఉదయం గంజాయి మొక్కల వద్ద పారతో పాదులు తీస్తుండటంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నారాయణగూడ ఎస్ఐ నాగరాజు క్లూస్ టీమ్‌తో అపార్ట్‌మెంట్ వద్దకు యూనిఫామ్‌లో రావడంతో గమనించిన నీరజ్ జోషి పరారయ్యాడు. అతన్ని పట్టుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. దీంతో అతని వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌తో పాటు, 4.2 కేజీల 15 గంజాయి మొక్కలను సీజ్ చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ గంజాయిని ఎవరికైనా విక్రయిస్తున్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు తుపాకులు.. ముగ్గురు షూటర్లు!

సీపీఐ నేత చందు రాథోడ్ హత్య కేసులో ఆరుగురు నిందితులు

- ఐదుగురిని అరెస్టు చేసిన సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్
- వీరిలో ఇద్దరిపై విశాఖపట్నంలో భారీ చోరీ కేసు సైతం
- పరారీలో ఉన్న ఓ నిందితుడి కోసం ముమ్మర గాలింపు
- దర్యాప్తుపై ఆరోపణలు చేస్తున్న హతుడి కుటుంబీకులు



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసు అధికారులు

సాక్షి, సిటీబ్యూరో/సైదాబాద్: సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేతావత్ చందు రాథోడ్ కళ్లల్లో కారం కొట్టి, కాల్చి చంపిన కేసులో ఐదుగురు నిందితులను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు దొంతి రాజేష్ అలియాస్ రాజన్న సహా ముగ్గురు రెండు తుపాకులతో ఐదు రౌండ్లు కాల్పులు జరిపినట్లు తేల్చారు. ఈ కేసులో అరెస్టు అయిన ఐదుగురిలో ఇద్దరిపై విశాఖపట్నంలో ఓ భారీ చోరీ కేసు నమోదై ఉందని, ఆ నేరం చేసిన తర్వాత హైదరాబాద్ వచ్చి ఈ హత్యలో పాలు పంచుకున్నారని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ ఎస్.చైతన్యకుమార్ శనివారం వెల్లడించారు. అదనపు డీసీపీలు కె.శ్రీకాంత్, అందె శ్రీనివాసరావులతో కలిసి సైదాబాద్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించారు.

వాటా ఇవ్వకుండా కాజేసిన చందు..

జనగాం జిల్లాకు చెందిన రాజన్న ప్రస్తుతం ఉప్పల్ భగాయత్‌లో ఉంటూ సీపీఐ ఎంఎల్ తెలంగాణ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. గతంలో మావోయిస్టులకు సహకరించారనే ఆరోపణలు ఉన్న ఇతడిపై మూడు క్రిమినల్ కేసులు ఉన్నాయి. రాజన్నకు నాలుగేళ్ల క్రితం చందు నాయక్‌తో పరిచయమైంది. 2022 జనవరిలో కుంట్లూరులో ఉన్న భూదాన్ భూముల్లో పేదలతో గుడిసెలు వేయించే వ్యవహారం నడిచింది. అక్కడ చందు దాదాపు రెండు వేల మంది పేదలతో గుడిసెలు వేయించారు. వీరిలో 1300 మంది రాజన్నతో పాటు ఇతడి అనుచరులు శ్రీను, ప్రశాంత్ పంపిన వాళ్లే. తమ పార్టీకి ఎక్కువ ప్రాచుర్యం లేని కారణంగా చందు ద్వారా వీరితో గుడిసెలు వేయించాడు. ఒక్కో గుడిసె వాసి నుంచి రూ.1000 చొప్పున 1300 మంది నుంచి వసూలు చేసిన రూ.13 లక్షల నుంచి రాజన్నకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వలేదు. చందు సమీప బంధువుకు, బిల్డర్ బాల్‌రెడ్డికి మధ్య ఉన్న వివాదాన్ని రాజన్న తన మావోయిస్టు లింకులు వాడి పరిష్కరించారు. అప్పట్లో బాల్‌రెడ్డి నుంచి రూ.12 లక్షలు వసూలు చేసినా రాజన్నకు ఏమీ చెల్లించలేదు.

ఆర్థిక వివాదాలకు తోడు వ్యక్తిగత కారణాలు..

చందు, రాజన్న మధ్య ఓపక్క ఈ ఆర్థిక లావాదేవీల వల్ల ఏర్పడిన వివాదాలు మరోపక్క కొన్ని వ్యక్తిగత అంశాలతోనూ స్పర్ధలు వచ్చాయి. గతంలో రాజన్న ఓ మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉండగా..అతడి భార్యను ఆమె ఇంటికి తీసుకువెళ్లిన చందు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించాడు. దీంతో పాటు తన భార్యతో చందుకు వివాహేతర సంబంధం ఉందని రాజన్న అనుమానించాడు. తన అనుచరులతోనే తనకి వ్యతిరేకంగా సీపీఐ ఎంఎల్ నాయకత్వానికి చందు ఫిర్యాదు చేయించాడని రాజన్న భావించారు. ఇలా దాదాపు రూ.50 లక్షలు నష్టపోవడం, రాజకీయ కారణాలతో చందును చంపాలని కొన్నాళ్ల క్రితమే రాజన్న నిర్ణయించుకున్నాడు. ఈ విషయం గతంలో చందు స్నేహితులు రాయుడు, సుధాకర్, మున్నా వద్ద ప్రస్తావించాడు. వీళ్లు విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లడంతో వాళ్లు రాజన్న–చందును కూర్చోబెట్టి రాజీ చేశారు. అయినప్పటికీ కక్షతోనే ఉన్న రాజన్న గతంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరికి చందుపై సుపారీ ఇచ్చినా సఫలీకృతం కాలేదు.

ఈసారి ఐదుగురితో కలిసి రంగంలోకి దిగి..

రాజన్న ఈసారి తన అనుచరులు ఏడుకొండలు, శ్రీను, కందుకూరి ప్రశాంత్‌లతో పాటు ఏడుకొండలుకు పరిచయం ఉన్న నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన అర్జున్, రాంబాబులతో కలిసి రంగంలోకి దిగాడు. 2018 నుంచి తన వద్ద ఉన్న రెండు తుపాకులను దీనికి వాడుతూ... ఇప్పుడు తన వద్ద డబ్బు లేదని, భవిష్యత్తులో రియల్ ఎస్టేట్‌లో సంపాదించేది ఇస్తానంటూ వీరికి హామీ ఇచ్చాడు. ఈ నెల 12న నాగేశ్వరరావుతో కలిసి అర్జున్, రాంబాబు కాకినాడలో ఓ బైక్ చోరీ చేశారు. దీనిపై వెళ్లి విశాఖపట్నంలోని గాజువాకలో ఉన్న షీలానగర్‌లోని ఓ ఇంట్లో భారీ దొంగతనం చేశారు. ఈ సొత్తు నుంచి తమ వాటాగా వచ్చింది తీసుకుని 13న నగరానికి వచ్చి ఉప్పల్ భగాయత్‌లో షెల్టర్ ఏర్పాటు చేసుకున్నారు. ఏడుకొండలు అద్దెకు తీసుకున్న కారులో 14న చందు కదలికలపై రెక్కీ చేశారు. 15వ తేదీ ఉదయం తొలుత ఇంటి వద్దే చందును చంపాలని భావించారు. అయితే ఆ సమయంలో చందు భార్య, కుమార్తె మాత్రమే వాకింగ్‌కు బయలుదేరడంతో వెనక్కు తగ్గారు.



స్వాధీనం చేసుకున్న తుపాకులు, నగలు

రెండు ప్రాంతాల్లో ఐదుగురు అరెస్టు..

కొద్దిసేపటికి చందు తన ద్విచక్ర వాహనంపై పార్కు వద్దకు రావడాన్ని గమనించి అక్కడకు చేరుకున్నారు. వాకింగ్ పూర్తి చేసుకుని బయటకు వచ్చిన చందుపై తొలుత అర్జున్, శ్రీను కాల్పులు జరిపారు. అతడు చనిపోయాడో, లేదో అనే సందేహంతో రాజన్న కూడా అర్జున్ నుంచి తుపాకీ తీసుకుని మరోసారి కాల్చాడు. ఆపై పరారైన ఈ నిందితుల కోసం టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల విభాగం అధికారులు గాలింపు మొదలెట్టారు. ఇన్‌స్పెక్టర్లు ఎస్.సైదాబాబు, ఎస్.రాఘవేంద్ర, ఎ.నాగార్జున తమ బృందాలతో గాలించి అర్జున్, రాంబాబుల్ని కావలి చెక్‌పోస్టు వద్ద, రాజన్న, ప్రశాంత్, ఏడుకొండల్ని జనగాంలో పట్టుకుని రెండు తుపాకులు, వైజాగ్ కేసుకు సంబంధించిన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న శ్రీను కోసం గాలిస్తున్నామని, ఈ కేసులో రవీంద్రచారి, యాది ప్రమేయంపై ఇప్పటికి ఆధారాలు లేవని, దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ చైతన్యకుమార్ తెలిపారు.

ఠాణా ఎదుట ఆందోళనకు దిగిన కుటుంబీకులు..

ఈ నిందితులను తీసుకువెళ్తున్న పోలీసు వాహనాన్ని అడ్డగించిన చందు భార్య నారీ బాయి, కుమార్తె సింధు సైదాబాద్ పోలీసుస్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. వీరికి గిరిజన సంఘాలు మద్దతు పలికాయి. అరెస్టు చేసిన నిందితులను తమకు అప్పగించాలని, వారిని తక్షణం ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కేసు పోలీసులు తప్పుదోవ పట్టిస్తున్నారని, రవీంద్రచారి, యాది పాత్ర ఉందని ఆరోపించారు. చందు పేదల పక్షాన నిలబడి, వారి వసూళ్లను అడ్డుకుంటున్నందుకు హత్య చేశారని అన్నారు. చందు డబ్బు వసూలు చేయడం అబద్ధమన్నారు. ఈ నేపథ్యంలో పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ముగిసిన ఫిష్ వెంకట్ అంత్యక్రియలు



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, తలసాని, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్

అడ్డగుట్ట: అనారోగ్య సమస్యతో బాధపడుతూ శుక్రవారం ఆస్పత్రిలో తుది శ్వాస విడిచిన నటుడు ఫిష్ వెంకట్(53) అంత్యక్రియలు శనివారం ముగిశాయి. మొదట అభిమానుల సందర్శనార్థం ఆయన పార్థివదేహాన్ని మధ్యాహ్నం 3 గంటల వరకు అడ్డగుట్టలోని ఇంటి వద్దనే ఉంచారు. ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌లు ఫిష్ వెంకట్‌కు శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. సినీ నటుడు ఫిష్ వెంకట్ మృతి చాలా బాధాకరమని వారు విచారం వ్యక్తం చేశారు. వెంకట్ మంచి నటుడు అని, అనేక చిత్రాలలో తన నటనతో ప్రేక్షకుల అభిమానం పొందారని అన్నారు. కాగా తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ నటులు ఎవరూ కూడా రాలేదు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన అంతిమయాత్ర కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గబ్బర్‌సింగ్ టీం, సహచర నటులు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. మారేడుపల్లిలోని హిందూ శ్మశాన వాటికలో సాయంత్రం దహన సంస్కారాలు నిర్వహించారు. కాగా వెంకట్‌కు పెద్ద నటులు ఎవ్వరూ సహాయం అందించ లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీనిపై సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదన్నారు. కొందరు యూట్యూబర్లు, చిన్న నటులు తమవంతు సహాయ సహకారాలు అందించారని చెప్పారు.

లోడ్ లారీ బోల్తా: ట్రాఫిక్‌కు అంతరాయం

పంజగుట్ట: పంజగుట్ట కూడలి వద్ద ఓ లారీ బోల్తాపడడంతో తెల్లవారు జామున ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జమ్మూకాశ్మీర్ నుండి ఆటోనగర్ వైపు పత్తి పంటకు కొట్టే క్రిమిసంహారక మందు లోడ్‌తో వెళ్తున్న లారీ మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టింది. క్రిమిసంహారక మందు వాసన రాకుండా లారీ పైభాగంలో వెల్లుల్లి సంచులు ఉంచడంతో వెల్లుల్లి పూర్తిగా రోడ్డుపై పడిపోయింది. అంతేకాకుండా క్రిమిసంహారక మందు ఉన్న కార్టన్‌లు కూడా రోడ్డుపై పడిపోయాయి. లారీ నడుపుతున్న పవన్‌సింగ్ తెల్లవారు జామున కావడంతో నిద్రలోకి జారుకుని పంజగుట్ట నుండి ఖైరతాబాద్ వెళ్లే మార్గంలో కూడలి వద్ద పోచమ్మబస్తీ ఎదురుగా ఉన్న మెట్రో పిల్లర్‌ను ఢీ కొట్టాడు. దీంతో ఒక్కసారిగా లారీ ఒకవైపు పడిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో పక్కనుండి వాహనాలు ఏమీ వెళ్లకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు కూడా ఎలాంటి గాయాలు కాలేదు. కాగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు కిలోమీటర్ మేర వాహనాలు ఆగిపోవడంతో ట్రాఫిక్ పోలీసులు ఒకవైపు నుండే రాకపోకలు సాగించి క్రేన్ సాయంతో లారీని తొలగించి..ట్రాఫిక్ క్లియర్ చేశారు.



గొర్రెల కాపరి నుంచి.. డ్రగ్స్ డాన్‌గా ఎదిగి..

అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ సందీప్ నేపథ్యమిదీ..

- వందకు పైగా కస్టమర్లతో వాట్సాప్ గ్రూప్
- కోడ్ భాషలతో కస్టమర్లకు మేసేజ్‌లు
- ఐటీ ఉద్యోగులే లక్ష్యంగా మాదక ద్రవ్యాల సరఫరా
- వాట్సాప్ గ్రూప్ గుట్టురట్టు చేసే పనిలో ఈగల్ టీం

సాక్షి, సిటీబ్యూరో: బీదర్‌లో గొర్రెలు కాపుకాసే వ్యక్తి..హైదరాబాద్‌కు వలస వచ్చి ఏకంగా డ్రగ్స్ డాన్‌గా ఎదిగాడు. తండ్రిని చూసి మాదక ద్రవ్యాలకు బానిసగా మారిన కర్ణాటకకు చెందిన సందీప్ అలియాస్ సందేశ్.. క్రమంగా డ్రగ్స్ పెడ్లర్‌గా ఎదిగాడు. ఇటీవల సైబరాబాద్ నార్కోటిక్ బృందం (ఈగల్) నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర డ్రగ్స్ సరఫరాదారుడు సందీప్ పోలీసులకు చిక్కిన సంగతి తెలిసిందే. సొంతూరులో మూడో తరగతి వరకు చదివిన సందీప్..2006లో ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి బాలానగర్‌లోని ఓ హోటల్‌లో పనిలో చేరాడు. సందీప్ తండ్రి బలిరామ్ గంజాయి సేవించేవాడు. ఇదే అలవాటు ఇతడికీ వచ్చిందని పోలీసుల విచారణలో తేలింది. ఇతని వాట్సాప్ గ్రూప్‌లో వందలాది కస్టమర్ల డేటా ఉండటంతో వీరందరి గుట్టురట్టు చేసే పనిలో పడ్డారు.

కస్టమర్లతో వాట్సాప్ గ్రూప్..

జల్సాలు, వ్యసనాలకు బానిసైన సందీప్ అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. మహారాష్ట్రలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో యాకుత్‌పురాకు చెందిన డ్రగ్‌పెడ్లర్ అహ్మద్‌తో ఏర్పడిన పరిచయంతో నగరంలో గంజాయి కొనుగోలుదారుల సమాచారం, ఫోన్ నంబర్లు సేకరించాడు. వీరందరితో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాడు. ప్రధానంగా ఐటీ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని డ్రగ్స్ సరఫరా చేసేవాడు. మహారాష్ట్ర నుంచి 5 కిలోల మేర ప్యాకెట్లుగా అక్రమ మార్గంలో హైదరాబాద్ తీసుచ్చి..ఒక్కో ప్యాకెట్ (50 గ్రాములు) రూ.3 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకునేవాడు.

కోడ్ భాషలో..

డ్రగ్స్ సిటీకి చేరగానే వాట్సాప్ గ్రూప్‌లో 'భాయ్..బచ్చా ఆగయా భాయ్' అని సందేశం పోస్టు చేసేవాడు. ఇది చూసి ఫోన్ చేసిన వారికి లొకేషన్ వివరాలు చెప్పేవాడు. ఈ క్రమంలోనే ఈనెల 13న మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకొచ్చి గచ్చిబౌలిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద ఉన్నట్లు సమాచారం ఇచ్చాడు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఈగల్ బృందం..సందీప్‌ను పట్టుకుంది. అయితే అప్పటికే కస్టమర్లు ఎవరూ లొకేషన్‌కు రాకపోవడంతో పోలీసులే సందీప్ ఫోన్ నుంచి వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేయగా అక్కడికి వచ్చిన 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి డ్రగ్స్ కిట్స్‌తో పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. దీంతో అందర్నీ డీ-అడిక్షన్ కేంద్రానికి తరలించారు. వీరి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని విశ్లేషించగా.. మరో 99 మంది కస్టమర్ల వివరాలు పోలీసులకు చిక్కాయి. దీంతో వీరి పేర్లనూ ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు.

దేశంలో నేటికీ బ్రిటీష్ కాలం నాటి చట్టాలే..

సంస్కరణలు చేపట్టాలన్న పలువురు వక్తలు

హిమాయత్‌నగర్: దేశ న్యాయ వ్యవస్థలో బ్రిటీష్ కాలంలో ప్రవేశపెట్టిన చట్టాలే నేటికీ కొనసాగుతున్నాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్, గ్రేటర్ హైదరాబాద్ సొసైటీ ఫర్ ఫాస్ట్ జస్టిస్ సంయుక్త ఆధ్వర్యంలో 'సకాలంలో న్యాయం కోసం న్యాయ సంస్కరణలు అత్యవసరం' అనే అంశంపై సదస్సు శనివారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఓయూ లా పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ అపర్ణ, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రఘునాథ్ పాల్గొని మాట్లాడారు. సత్వరమే న్యాయం జరగాలంటే న్యాయ వ్యవస్థలో మార్పులు అవసరం అన్నారు. హైకోర్టు న్యాయవాది నాజీర్‌ఖాన్, ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్ చైర్మన్ భగవాన్జీ బాయ్ రైయని, కన్వీనర్ ప్రవీణ్ పటేల్, న్యాయవాదులు టీవీ రమేష్, సయ్యద్ ముజీబుద్దీన్, హైకోర్టు న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

120 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరంలో వైద్యులు

బంజారాహిల్స్: రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో రోటరీ సెవెన్ అవెన్యూస్ ఆఫ్ సర్వీసెస్‌లో భాగంగా దత్తత పాఠశాల అయిన ఉదయ్‌నగర్ బస్తీలోని వెంకటగిరి ప్రభుత్వ స్కూల్‌లో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రెయిన్‌బో హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ దీపక్, డాక్టర్ కలయిసెల్వి, సిబ్బంది పూజ, అర్జబ్, రాకేష్, రవిచంద్ర తదితరులు హాజరై సేవలు అందించారు. శిబిరం అనంతరం విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ అధ్యక్షురాలు నీరజ గొడవర్తి, సెక్రటరీ రాహుల్‌జైన్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ జువ్వారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గైడ్‌లైన్స్ పాటించాల్సిందే..

నార్త్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్

బంజారాహిల్స్: పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు, కేఫ్‌లు, కాఫీషాపుల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన గైడ్‌లైన్స్‌ను తప్పనిసరిగా పాటించాల్సిందేనని వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ సూచించారు. పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు, కేఫ్‌లు, కాఫీషాపుల నిర్వాహకులతో శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన విధానాలను వివరించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రాంగణంలో రద్దీగా ఉండకుండా చూసుకోవాలన్నారు. ఏదైనా కార్యక్రమం నిర్వహించాల్సి వస్తే పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. కటాఫ్ సమయాల ప్రకారం అన్ని సంస్థలు వ్యాపారాలను కొనసాగించాలన్నారు. సరైన నంబర్ ప్లేట్ లేదా అనుమానాస్పద కదలికలు కలిగిన ఆటో రిక్షాలు, క్యాబ్‌లు వంటి రవాణా వాహనాల విషయంలో అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. పౌరుల భద్రతకు పోలీసుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. ఆయా సంస్థల యజమానులు తమ ప్రాంగణానికి దారితీసే ప్రధాన రహదారులు కవర్ అయ్యేవిధంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇవి సంస్థలో, దాని చుట్టూ జరుగుతున్న ఇతర నేరాలను గుర్తించడంలో కీలకమైన ఆధారాలుగా ఉంటాయన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో తొక్కిసలాట వంటి పరిస్థితులను నివారించడానికి సరైన సన్‌బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మీ ప్రాంగణంలో మైనర్లు పొగ, మద్యం తాగడానికి అనుమతించవద్దని సూచించారు. అన్ని వినోద లైసెన్స్ హోల్డర్లు శబ్ద కాలుష్యాన్ని నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. పబ్‌లు, బార్ల నిర్వాహకులు ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాల వినియోగాన్ని ప్రోత్సహించడం, డ్రైవర్లను నియమించుకోవాలన్నారు.

తపాలా 'ఐటీ 2.0' సేవలు

సాక్షి, సిటీబ్యూరో: వినియోగదారులకు మరింత వేగవంతమైన సేవలందించేందుకు ఆధునిక తపాలా సాంకేతికత 'ఐటీ 2.0' ని ప్రవేశపెడుతున్నట్లు సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఏ.సుబ్రహ్మణ్యం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర తపాలా శాఖ సర్కిల్, రీజినల్ కార్యాలయాల ఆదేశాల మేరకు సికింద్రబాద్ డివిజన్ లో ఈనెల 22వ తేదీ నుంచి ఈ సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. 21న డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో ఎలాంటి లావాదేవీలు జరగవని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



వరద సాఫీగా సాగేలా చర్యలు చేపట్టిన హైడ్రా, జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ టీమ్‌లు



ఎంజీనగర్‌లో నాలా నుంచి బస్తీ మొత్తం పొంగుతున్న మురుగు



శ్రీకృష్ణానగర్‌లో విద్యార్థులను వరద నీటి నుంచి బయటకు తీసుకొస్తున్న హైడ్రా సిబ్బంది

ఎటు చూసినా వరద తిప్పలే..

- కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలు
- మరికొన్ని ప్రాంతాల్లో వ్యర్థాలతో నిండిపోయిన నాలాలు
- అక్కడక్కడా ఇళ్లలోకి చేరిన వరద
- స్థానికులకు తప్పని కష్టాలు
- వాహనదారుల ఇక్కట్లు డబుల్
- వెంటనే స్పందించిన హైడ్రా టీమ్స్
- వరద సాఫీగా సాగేలా వెంటవెంటనే చర్యలు



నాలా వద్ద హైడ్రా మాన్‌సూన్ సిబ్బంది సహాయక చర్యలు

బంజారాహిల్స్: భారీ వర్షానికి ఫిలింనగర్ కొత్త చెరువు పక్కన ఉన్న నాలా పరిసర ప్రాంతాలన్నీ అతలాకుతలమయ్యాయి. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన వానకు నాలాలోని వరద ముందుకు వెళ్లకపోవడంతో స్థానికంగా ఉన్న నివాసాలను ముంచెత్తింది. నాలాలో పెద్ద ఎత్తున చెత్తా చెదారం పేరుకుపోవడంతో వరద నీరు వెనక్కి తన్నినట్లు అధికారులు గుర్తించారు. హైడ్రా మాన్‌సూన్ సిబ్బంది ఎంజీనగర్ బస్తీకి చేరుకొని నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను శనివారం తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. వర్షాకాలానికి ముందు నాలాల్లో వ్యర్థాలు తొలగించే కార్యక్రమాన్ని సరిగ్గా చేయకపోవడం వల్లే తాము ఈ ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక బస్తీవాసులు అధికారుల తీరుపై మండిపడ్డారు.

బస్తీలను ముంచెత్తిన మురుగు

భారీ వరద అనంతరం బస్తీలన్నీ మురికికూపంగా మారాయి. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఏ బస్తీ చూసినా మ్యాన్‌హోళ్ల నుంచి పొంగుతున్న మురుగు దృశ్యాలే కనిపించాయి. జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్, జవహర్‌కాలనీ, దీన్‌దయాల్‌నగర్, వినాయక నగర్ బస్తీల్లో శనివారం మురుగు రోడ్లపై పారుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడికక్కడ మ్యాన్‌హోళ్లు నిండిపోవడంతో కొన్ని చోట్ల అంతర్గత రహదారులతో పాటు ప్రధాన రహదారుల్లో కూడా మురుగు ప్రవాహం కనిపించింది.

హైడ్రా సిబ్బంది అలర్ట్‌గా ఉండి

రెండో రోజూ శనివారం మధ్యాహ్నం తర్వాత మొదలైన వాన సుమారు గంట పాటు కురిసింది. దీంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, శ్రీకృష్ణానగర్, సోమాజిగూడ ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోయింది. వరద నిల్వ ఉండే ప్రాంతాల్లో హైడ్రా సిబ్బంది ఎప్పటికప్పుడు వరద సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. శ్రీకృష్ణానగర్‌లో ఎగువ ప్రాంతంలో నుంచి వచ్చిన వరదతో వీధులు చెరువులను తలపించాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

బసవతారకనగర్‌లో పొంగిన నాలా

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బసవతారకనగర్‌లో నాలా పొంగి వరద ఉప్పొంగి ఇళ్లలోకి చేరింది. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ స్పందించి హైడ్రా మన్సూన్‌టీం, జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ టీమ్‌కు సమాచారం అందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వెంటనే ఈ సమస్యపై కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రంగంలోకి దిగిన హైడ్రా టీమ్, ఇతర సిబ్బంది నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు రోడ్లపై ఆగిన వరద సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.



నెక్లెస్ రోడ్డులో నిలిచిన వరద నీరు





వర్షంలో తడవకుండా జాగ్రత్త పడుతున్న ప్రజలు

ఘనంగా బోనాల వేడుకలు





బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో బోనాల వేడుకల్లో విద్యార్థులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో బోనాల వేడుకలను పాఠశాలలో నిర్వహించడంతో పాటు ఈ పండగ ప్రాముఖ్యతను వివరిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోతరాజుల వేషధారణలో అలరించారు.

వెంగళరావునగర్: చిన్నపిల్లలు బోనాలు ఎత్తుకుని, పోతరాజు వేషధారణలో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ఒకరోజు ముందే బోనాల సందడి చూపించారు. మధురానగర్ కాలనీలో ఉన్న స్వీట్ ఏంజిల్స్ హైస్కూల్ విద్యార్థులు శనివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్, అధ్యాపకులు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నారాయణ టెక్నో స్కూల్‌లో..

హిమాయత్‌నగర్: బోనాల ఉత్సవాలను నారాయణగూడలోని నారాయణ టెక్నో స్కూల్‌లో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పోతరాజు వేషధారణలో అలరించారు. పాఠశాల ఈ చాంప్స్ కో–ఆర్డినేటర్స్ రాధిక మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు నేర్పించి వారిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడం ఎంతో గొప్ప విషయం అన్నారు. పాఠశాల ఏజీఎం బాలపరమేశ్వర్, హైస్కూల్ కో–ఆర్డినేటర్ ఆజాద్, ఆర్‌ఎన్‌డీ మహేశ్వరి, ప్రిన్సిపాల్ హర్నిత్ కౌర్, వైస్ ప్రిన్సిపల్ మోహిఉన్నిసా, ఏవో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.





స్వీట్ ఏంజిల్స్ పాఠశాలలో బోనాల వేడుకలు



నారాయణగూడలోని నారాయణ టెక్నో స్కూల్‌లో బోనాలతో చిన్నారులు

ఎర్రగడ్డలో వైభవంగా..

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డలో బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానికులు అమ్మవారి ఆలయాలలో పూజలు నిర్వహించి ఫలహార బండి ఊరేగింపు ఘనంగా చేపట్టారు. బీఆర్‌ఎస్ నేత దివంగత ఎమ్మెల్యే మాగంటి సోదరుడు మాగంటి వజ్రనాథ్ శనివారం ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లో బోనాల వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. హేమావతినగర్‌లోని బోనాల వేడుకల్లో గ్రేటర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రవిగౌడ్, ఎస్టీ సెల్ స్టేట్ కో ఆర్డినేటర్ రమేష్‌నాయక్ ఫలహారబండి ఊరేగింపులో పాల్గొన్నారు.



ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లో బోనాల ఉత్సవాల్లో మాగంటి వజ్రనాథ్



హేమావతినగర్‌లో వేడుకల్లో కాంగ్రెస్ నేతలు రవిగౌడ్, రమేష్‌నాయక్

ఫిలింనగర్‌లో డెంగీ కలకలం

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో డెంగీ కేసులు కలకలం సృష్టిస్తున్నాయి. బస్తీలోని ఇద్దరికి డెంగీ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు ఎంటమాలజీ అధికారులకు సమాచారం రావడంతో శనివారం వారు బస్తీలో పర్యటించారు. గడిచిన వారం రోజుల్లో ఫిలింనగర్ వినాయకనగర్‌బస్తీలో డెంగీ లక్షణాలతో ఇద్దరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండటం అధికారులను కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లో దోమల మందు పిచికారితో పాటు ఫాగింగ్ చేయించారు. జ్వర లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, దోమల బెడద ఎక్కువగా ఉంటే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని రజిత స్థానికులకు సూచించారు.



వినాయకనగర్ బస్తీలో దోమల మందు పిచికారి చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

యువతకు ఉచితంగా ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు

హిమాయత్‌నగర్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు భాషా, తెలంగాణ సాంస్కృతిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ(శాప్) సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా 5వ బ్యాచ్ ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని అకాడమీ చైర్మన్ ఎం.సి.శేఖర్ వెల్లడించారు. హిమాయత్‌నగర్‌లోని సిగ్మా కార్యాలయంలో '5వ బ్యాచ్' ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు వాల్ పోస్టర్‌ను అకాడమీ చైర్మన్ ఎం.సి.శేఖర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణతో కలిసి వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ కోర్సుకు వచ్చేనెల 5వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు ఫోన్: 80080 21075, 70956 92175 నంబర్లలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎం.సి.శేఖర్, మామిడి హరికృష్ణ

రాజకీయ బానిసత్వంలోనే బహుజన కులాలు



బహుజన డిక్లరేషన్‌ను ప్రకటించిన వివిధ పార్టీల నేతలు

హిమాయత్‌నగర్: ఆరు వేల కులాలున్న దేశంలో స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు దాటినా 1800 బహుజన కులాలు రాజకీయ బానిసత్వంలోనే ఉన్నాయని రాజ్యాధికార పార్టీ జాతీయ అధ్యక్షుడు వీజీఆర్ నారగోని ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా, రాజ్యాధికార పార్టీ, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ, బహుజన ద్రవిడియన్ పార్టీ, మన దేశం పార్టీల నేతలు పాల్గొని బహుజన డిక్లరేషన్‌ను ప్రకటించారు. అనంతరం బహుజన ద్రావిడ పార్టీ జాతీయ అధ్యక్షుడు జీవన్ మల్లతో కలిసి నారగోని మాట్లాడారు. అన్ని వర్గాలకు జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కల్పించడానికి బహుజన డిక్లరేషన్ ఫర్ పొలిటికల్ జస్టిస్ అనే కాన్సెప్ట్‌తో ఉద్యమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పలు పార్టీల ప్రతినిధులు, మేధావులు నూరుల్ అమీన్, సుభద్రారెడ్డి, కే.బీ.శ్రీధర్, పి.వి.కృష్ణయ్య, అన్వర్ ఖాన్, జగదీశ్ యాదవ్, శంకర్ పాల్గొన్నారు.

వరద రాకుండా చర్యలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నాలా వరద ప్యాట్నీనగర్ నివాస ప్రాంతాల్లోకి రాకుండా హెచ్‌ఎండీఏ అధికారులు శనివారం తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. ప్యాట్నీ నాలా కబ్జాలకు గురవడంతో నాలా విస్తరణ పనులు హెచ్‌ఎండీఏ చేపట్టింది. స్థానికంగా నివాసం ఉంటున్న అశోక్ ప్యాట్నీ కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించడంతో నాలా విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంలో జాప్యం కావడంతో శుక్రవారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి ప్యాట్నీనగర్ లోకి వరద ముంచెత్తడంతో హైడ్రా సహాయక చర్యలు చేపట్టి ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల సహాయంతో పలువురిని బోట్లల్లో కాలనీ వెలుపలికి పంపించారు. తాత్కాలికంగా సంచుల్లో ఇసుక మట్టి నింపి అడ్డుకట్ట వేశారు.



ప్యాట్నీ నాలా వద్ద తాత్కాలికంగా అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం

ముగిసిన 7-హెచ్ స్పోర్ట్స్ టెన్ పిన్ బౌలింగ్ టోర్నీ



జూబ్లీహిల్స్: టెన్ పిన్ బౌలింగ్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో తెలంగాణ బౌలర్ల కోసం 7–హెచ్ స్పోర్ట్స్ నిర్వహించిన టోర్నమెంట్‌కు మంచి స్పందన లభించింది. జూబ్లీహిల్స్‌లోని గ్యాలివాంట్ బౌలింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో పురుషుల విభాగంలో 32 మంది, మహిళల విభాగంలో ఆరుగురు పాల్గొన్నారు. ఫైనల్స్‌లో పురుషుల కేటగిరీకి సంబంధించి నితీశ్, గర్వ్, రేవంత్, మహిళల విభాగంలో ప్రసన్న, నేహ, శృతి సూర్య మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు బీఆర్‌ఎస్ నేత, ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, తృష్ణ ఫుడ్స్ ఎండీ భరత్ రెడ్డి, తెలంగాణ ఫుట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఫల్గుణ ట్రోఫీలు అందజేశారు. టెన్ పిన్ బౌలింగ్‌లో యువ టాలెంట్‌ను ఈ వేదికగా పరిచయం చేయడం సంతోషంగా ఉందని 7–హెచ్ స్పోర్ట్స్ ఫౌండర్ వెంకటేశ్ చెప్పారు. మహిళలను సైతం బౌలింగ్‌లో ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా వారికి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

బోనాలకు ఆలయాలు ముస్తాబు

బంజారాహిల్స్: ఆషాఢ మాసం బోనాల వేడుకకు ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. ఇప్పటికే ఆయా ఆలయ కమిటీలకు ప్రభుత్వం నుంచి అందించే ప్రోత్సాహకాలను అధికారులు పంపిణీ చేశారు. దీంతో ఆయా ఆలయాలు విద్యుత్ దీపాలతో కమిటీవాసులు ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అమ్మవారి ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసేందుకు ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సోమాజిగూడ, హిమాయత్‌నగర్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలో ఉన్న అన్ని అమ్మవారి ఆలయాల వద్ద శానిటేషన్ అధికారులను నియమించినట్లు సర్కిల్–18 డీఎంసీ సమ్మయ్య తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్ నల్లపోచమ్మ ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.



ఇందిరానగర్ నల్లపోచమ్మ గుడి

క్రేన్ ఇన్‌చార్జిని సత్కరించిన ఏసీపీ



అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళకు ప్రథమ చికిత్స అందించి తన మానవత్వాన్ని చాటుకున్న బేగంపేట క్రేన్–4 ఇన్‌ఛార్జి అశోక్‌రెడ్డిని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు శనివారం సన్మానించారు. బేగంపేట హెచ్‌పీఎస్ అవుట్‌గేటు వద్ద ఓ మహిళా డాక్టర్ ఈ నెల 17న సాయంత్రం రసూల్‌పురా వైపు వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆమె కుడి కాలుకు గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. దీనిని గమనించిన అశోక్‌రెడ్డి ప్రథమ చికిత్స కిట్ ద్వారా వెంటనే బాధిత మహిళా డాక్టర్‌కు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఆమెను మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. వెంటనే అప్రమత్తమై ప్రథమ చికిత్స సేవలు అందించిన అశోక్‌రెడ్డిని నార్త్‌జోన్ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట ఇన్‌స్పెక్టర్ జానకిరాములు శాలువాతో సత్కరించారు.

ఇక సర్కారు బడుల్లో
నో బ్యాక్ బెంచ్!

- తరగతి గదిలో 'యూ' ఆకారంలో బెంచీల అమరిక
- మలయాళ సినిమా 'స్థానార్థి శ్రీకుట్టన్' క్లైమాక్స్ సీన్ ప్రేరణ
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ హరిచందన దాసరి



నగరంలోని అలియా ప్రభుత్వ మోడల్ హైస్కూల్‌లో యూ - టైప్ సిట్టింగ్ విద్యాబోధన

సాక్షి, సిటీ బ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదుల్లో ఇక బ్యాక్ బెంచ్‌లు లేవు. 'యూ'ఆకారంలో బెంచీలను అమర్చి వినూత్నంగా విద్యాబోధన చేపట్టేందుకు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. ఇటీవల వినేశ్ విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన మలయాళ సినిమా 'స్థానార్థి శ్రీకుట్టన్ క్లైమాక్స్' సీన్ స్ఫూర్తితో తొలుత ప్రయోగాత్మకంగా కేరళలోని కొల్లం జిల్లాలోని రామవిలాసం ఒకేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో అక్కడి అధికారులు ఈ విధానాన్ని ప్రారంభించారు. ఈ విధానం సత్ఫలితాలిచ్చినట్లుగా అధికారులు గుర్తించారు. కేరళతోపాటు ఒడిశా, పంజాబ్, తమిళనాడుల్లోని పలు పాఠశాలల తరగతి గదుల్లో కూడా విజయవంతంగా యూ ఆకారపు బెంచీల అమరిక విధానం అమలవుతున్న తీరు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి సికింద్రాబాద్ బోయనపల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఒక తరగతి గదిలోని బెంచీలను 'యూ'ఆకారంలో ఏర్పాటు చేయించారు. మధ్యలో టీచర్ నిలబడి పాఠాలు చెప్పే విధానాన్ని పరిశీలించారు. ఆ తర్వాత విద్యార్థులతో కూడా ముచ్చటించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక అన్ని సర్కారు పాఠశాలలో యూ ఆకారంలో బెంచీలు ఏర్పాటు చేసి విద్యాబోధన జరిగే విధంగా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

సంప్రదాయ పద్ధతికి భిన్నంగా..

సాధారణంగా బ్యాక్ బెంచ్ అనే పదం వినగానే సరిగ్గా చదవని పిల్లలు అందులో కూర్చుంటారన్న భావన అందరి మదిని తడుతుంది. అయితే వెనుక బెంచీల్లో ఉన్న విద్యార్థులు తక్కువ శ్రద్ధ, ముందు భాగంలో ఉన్నవారు ఎక్కువ శ్రద్ధ కనబర్చడంతోపాటు పాఠ్యాంశాలను సరిగ్గా అర్థం చేసుకోవడంలో కూడా వ్యత్యాసం ఉందని అధికారులు గుర్తించారు. యూ టైప్ సిట్టింగ్‌లో టీచర్ సందేహాలను నివృత్తిలో వ్యక్తిగత శ్రద్ధ సాధ్యమవుతోందనే అంచనా అధికారుల్లో ఉంది. ఇది విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, అభ్యాస ప్రక్రియలో చురుగ్గా పాల్గొనేలా చేస్తుందని భావిస్తున్నారు. ఇది విద్యార్థి కేంద్రీకృత అభ్యాసానికి ప్రాధాన్యతనిస్తుందని, విద్యార్థులందరూ ఒకే స్థాయిలో అభ్యసన ప్రక్రియలో పాలుపంచుకోవడానికి అవకాశం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ఇంటరాక్టివ్ లెర్నింగ్..

ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి వృత్తాకార, సెమీ-వృత్తాకార తరగతి గది అమరికలు కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో, ముఖ్యంగా ఇంటరాక్టివ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యతనిచ్చే విద్యాసంస్థల్లో అమలులో ఉన్నాయి. ఫిన్‌లాండ్ వంటి దేశాలు విద్యార్థుల మధ్య పరస్పర చర్చలను ప్రోత్సహించడానికి ఇలాంటి అమరికలను ఉపయోగిస్తాయి. యూ–టైప్ అమరిక అనేది కేవలం కూర్చునే విధానాన్ని మార్చడం మాత్రమే కాకుండా, సమగ్రమైన సమానమైన విద్యావ్యవస్థను రూపొందించడంలో ఒక ముఖ్యమైన అడుగు అని అధికారులు భావిస్తున్నారు.

యూ టైప్ సిట్టింగ్‌తో సత్ఫలితాలు



ప్రభుత్వ పాఠశాలల్లో యూ టైప్ సిట్టింగ్ విద్యాబోధనతో మెరుగైన ఫలితాలు రావచ్చని భావిస్తున్నాం. సంప్రదాయ తరగతి గది సిట్టింగ్‌ను మార్చడం ద్వారా బ్యాక్ బెంచర్ సంస్కృతికి చెక్ పడుతోంది. యూ ఆకారం సిట్టింగ్ అమరిక విద్యార్థుల్లో సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. చదువుపట్ల మరింత ఆసక్తి పెంపొందిస్తోంది. ఉపాధ్యాయులు స్పష్టమైన సూచనలు ఇవ్వడానికి, విద్యార్థులు సులభంగా వినడం, ఆచరించడం, చర్చల్లో మెరుగ్గా సంభాషించడానికి ఎంతో దోహదపడుతోంది.

\- హరిచందన దాసరి, కలెక్టర్, హైదరాబాద్

మరింత ఇంటరాక్షన్ పెరుగుతుంది



తరగతి గదిలో యూ ఆకారంలో సిట్టింగ్ ఉపాధ్యాయులు- విద్యార్థుల మధ్య ఇంటరాక్షన్‌ను పెంచుతుంది. తరగతి గదిలో సాధారణంగా టీచర్‌తో మాట్లాడటానికి ఇష్టపడని విద్యార్థులు ఈ తరహా సిట్టింగ్‌తో చురుగ్గా సంభావిస్తారు. తరగతి గదిలో విద్యార్థులందరూ ఏం చేస్తున్నారో టీచర్ సులువుగా గమనించవచ్చు.

\- ఆర్.రోహిణి, జిల్లా విద్యాశాఖాధికారి, హైదరాబాద్

విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతోంది



తరగతి గదిలో సరికొత్త యూ–టైప్ సిట్టింగ్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతోంది. టీచర్ల దృష్టి విద్యార్థులందరిపైనా ఉంటుంది. ప్రతి విద్యార్థి క్రమశిక్షణగా పాఠాలు వినక తప్పదు. విద్యార్థులు యూ టైప్ సిట్టింగ్‌పై ఆసక్తి కనబర్చుతున్నారు.

\- డాక్టర్ విశ్వనాథ గుప్త, జీహెచ్‌ఎం, నాంపల్లి

రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన మంత్రి శ్రీధర్‌బాబు



అధికారులతో సమావేశమైన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నిజాంపేట్: రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం మినిస్టర్ చాంబర్‌లో ఫారెస్ట్ ఆఫీసర్లు, పార్టీ నాయకులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ నుంచి గండిమైసమ్మ వరకు 6లైన్ల రోడ్డు విస్తరణ, బాచుపల్లి ఫ్లైఓవర్ మల్లంపేట్ ఎగ్జిట్ ఓఆర్ఆర్ నుంచి బాచుపల్లి వరకు, కొంపల్లి నుంచి బహదూర్‌పల్లి వరకు రోడ్డు విస్తరణ, గండిమైసమ్మ నుంచి బాచుపల్లి వెళ్లే రహదారిలో 1.5 కి.మీ. రోడ్డు ఫారెస్ట్‌ని ఆనుకొని ఉండటం వల్ల విస్తరణకు సంబంధించి అటవీ శాఖ అనుమతులపై చర్చించారు. సదరు ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి ప్రణాళిక రూపొందించి జూలై నెలాఖరులోపు పనులు పూర్తి చేసుకొని సెప్టెంబర్‌లో ప్రారంభించాలని తెలిపారు. జీడిమెట్ల నుంచి షాపూర్ వెళ్లే పైప్‌లైన్ రహదారిలో షీల్డ్ బ్రిడ్జ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మల్కాజ్‌గిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంత్‌రావు, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జూబ్లీహిల్స్'ను కైవసం చేసుకుంటాం: మహేశ్‌గౌడ్



సాక్షి,సిటీ బ్యూరో: రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా బీఆర్ఎస్ ఉనికి ఉండదని, రాబోయే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో తమ పార్టీ గెలుపు ఖాయమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం గాంధీభవన్‌లో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ నేత మురళీగౌడ్,, మాజీ కార్పొరేటర్ సంజయ్ గౌడ్‌తోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మహేశ్‌గౌడ్ మట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్, కూతురు కవిత అబద్దాలు ఆడి ప్రజలను మోసం చేశారని, బనకచర్ల విషయంలో హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌ను ప్రపంచపటంలో ఉన్నతంగా ఉంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకే రేవంత్‌రెడ్డి పాలన జరుగుతోందని, అందుకే ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు.

లలిత కళలకు ప్రాధాన్యతనివ్వాలి

పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభారాజు

మాదాపూర్: చదువుతోపాటు లలిత కళలకు ప్రాధాన్యత ఇవ్వాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభారాజు తెలిపారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం అన్నమయ్య పదకోకిల, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభారాజు దంపతులు కూచిపూడి నాట్య గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ పాటిని ఘనంగా సత్కరించారు. ఇందిరా మయూరి డ్యాన్స్ అకాడమీ సంస్థ గురువు యుక్తారెడ్డి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. కళాకారులు యామిని, నేహా, శాన్వి, స్వీటీ, అక్షర, సిద్ధి, ఉపజ్ఞ, వేదాన్షి, బిందు సంయుక్తంగా పలు అంశాలపై నృత్యప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. దేశ విదేశాల్లో ఉన్న వారికి ఆన్‌లైన్‌లో కూచిపూడి తరగతులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను శోభారాజు అభినందించారు. భావితరాలకు లలితకళల గొప్పదనాన్ని తెలుపుతూ విద్యార్థులు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేవిధంగా తీర్చిదిద్దాలన్నారు. శ్రీనివాస వరప్రసాద్ పాటి మాట్లాడుతూ 18 ఏళ్లుగా కూచిపూడి నృత్యంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. భరతవేద ఆర్ట్ అకాడమీ ద్వారా విద్యార్థులకు శిక్షణ తరగతులను అందిస్తూ మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్యపురం సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ అసమర్థత వల్లే రాష్ట్రానికి నష్టం

జలవివాదాలపై ఎర్ర సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

కాచిగూడ: సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత వల్ల జలవివాదాల్లో తెలంగాణకు నష్టం జరిగే ప్రమాదముందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. ఆంధ్రా జలదోపిడికి క్లియరెన్స్ కోసమే తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల సమావేశం జరిగిందని ఆరోపించారు. బనకచర్ల సమస్య పరిష్కారానికే భేటీ జరిగిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఈ అంశంపై చర్చ జరిగిందని ఏపీ మంత్రి రామానాయుడు ప్రకటిస్తుంటే బనకచర్ల ఎజెండాలో లేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జరిగిన మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. గంగా, నర్మదా, గోదావరి, కృష్ణా, కావేరి నదుల అనుసంధానం జరగాలే తప్ప తెలంగాణకు ఉపయోగపడని గోదావరి, కావేరి నదుల అనుసంధానం తమకెందుకని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఆంధ్రా ప్రోద్బలమున్న పార్టీలు, వెన్నముక లేని బీజేపీ నాయకులు, అమ్ముడు పోతున్న అధికార పార్టీల నాయకుల అతిపెద్ద మోసాన్ని ఎదుర్కొవటానికి, మరో పోరాటానికి సన్నద్ధం కావాలని ఆయన రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో శ్రీనివాస్ యాదవ్, టి.నందగోపాల్, పి.సుధాకర్ ముదిరాజ్, ఉదయ్ నేత, బోయ గోపి తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టేలా మాట్లాడితే దాడులు చేస్తాం

బీఆర్ఎస్ నేతలను హెచ్చరించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

సాక్షి,మేడ్చల్ జిల్లా: రెచ్చగొట్టేలా మాట్లాడితే దాడులు చేస్తామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్ఎస్ నేతలను హెచ్చరించారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జీవితంలో ఎప్పటికీ సీఎం కాలేరని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురయ్యారని ఆరోపించారు. కేటీఆర్‌కు సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు బుద్ధి చెప్పే రోజులు వస్తాయని అన్నారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్‌పై కేటీఆర్ విషప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. 'రెడ్ బుక్ అంటున్నావ్.. కేటీఆర్ ఏం చేస్తావో చేయి, చూసుకుంటా'అని మైనంపల్లి అన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని, దళితుల్ని సీఎం చేస్తామని, భూములు పంచుతామని బీఆర్ఎస్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల అరాచక పాలనపై ఓ పుస్తకం రాసి గడప గడపకూ పంచుతామన్నారు. కేసీఆర్ హయాంలో తన గన్‌మెన్లు, కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నాయకులు భూపతిరెడ్డి, నర్సారెడ్డి, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ విద్యార్థుల ధూంధాం



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం ఓయూ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఆటపాటలతో ధూంధాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐఓబీసీఎస్ఏ ఓయూ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో టీజీఎండీసీ చైర్మన్ అనిల్, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి, విశ్రాంత డీజీపీ డాక్టర్ జుజ్జవరపు పూర్ణచందర్‌రావు ప్రసంగించారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి.

నిజాం కాలేజీ హాస్టల్‌ను తెరిపించాలని రాస్తారోకో



గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాల వసతిగృహాన్ని తెరిపించాలని కోరుతూ శనివారం నిజాం కళాశాల విద్యార్థులు బషీర్‌బాగ్ చౌరస్తాలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ వసతిగృహంలో సీటు పొందిన విద్యార్థుల నుంచి ఫీజు తీసుకున్న ప్రిన్సిపాల్ 20 రోజులైనా ఇంకా హాస్టల్‌ను తెరవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బయట ఉండలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు హాస్టల్ వసతి లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. తక్షణమే హాస్టల్ తెరవాలని కోరుతూ రోడ్డుపై బైటాయించారు. దీంతో బషీర్‌బాగ్ చౌరస్తాలో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సర్ది చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

'కేజ్రీవాల్‌ని విమర్శించే హక్కు రేవంత్‌కు లేదు'

కవాడిగూడ: 'సినిమలో విలన్ మొదట చనిపోడు. మీరు సినిమాలు చూస్తారా? ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో చాలాకాలం తర్వాత అరెస్టు చేయబడ్డాడు''అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం తీవ్ర అభ్యంతరకరమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరచరిత్ర ఉన్న రేవంత్‌కు కేజ్రీవాల్‌ని విమర్శించే హక్కు లేదని అన్నారు. శనివారం లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ ఓటుకు నోటు కుంభకోణంలో రేవంత్‌రెడ్డి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని గుర్తు చేశారు. వెంటనే క్షమాపణ చెప్పకుంటే 'చలో సీఎం రేవంత్‌రెడ్డి ఘర్'కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆప్ నేతలు ఎం ఏ మజీద్, విజయ్ మల్లంగి, సుధారాణి, డా.లక్ష్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణలతకు మంత్రి పొన్నం ఆర్థిక సాయం



స్వర్ణలతకు నగదును అందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరలో భాగంగా రంగంలో భవిష్యవాణి వినిపించే స్వర్ణలతకు మంత్రి పొన్నం ప్రభాకర్ లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. మారేడుపల్లిలో నివసించే స్వర్ణలతకు కొద్దిరోజుల క్రితమే మంత్రి డబుల్ బెడ్‌రూమ్ మంజూరు చేసి పట్టా అందించారు. అయితే ఇటీవల బోనాల జాతర సందర్భంగా ఆలయానికి వచ్చిన మంత్రి ఆమెను పలకరిస్తూ గృహ ప్రవేశం చేశావా అని అడిగారు. పక్కనే ఉన్న ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి జోక్యం చేసికుని 'ఆ ఇంట్లో తలుపులు పగిలిపోయి ఉన్నాయి, ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి' అని చెప్పారు. ఎంత ఖర్చు అవుతుందని మంత్రి ప్రశ్నించగా లక్ష రూపాయలని చెప్పారు. ఈ మేరకు పొన్నం స్పందిస్తూ ఆ డబ్బును ఇస్తానని హామీ ఇచ్చారు. కొద్ది గంటల్లోనే తన వ్యక్తిగత సహాయకుడి ద్వారా లక్ష రూపాయల నగదును ఆమెకు అందించి ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఈ నగదును ఈవో మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా స్వర్ణలతకు అందించారు.

మంత్రికి ధన్యవాదాలు: స్వర్ణలత

డబుల్ బెడ్‌రూమ్ మొదటి లిస్టులో నా పేరు రాకపోవడంతో చాలా రోజులు ఎదురుచూశాను. ఈ విషయం ఈవో మనోహర్‌రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకుపోగా రెండు రోజుల్లో డబుల్ బెడ్‌రూమ్ కేటాయించారు. ఇప్పుడు మరమ్మతుల కోసం లక్ష రూపాయలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. మంత్రికి, ఈవోకు ప్రత్యేక ధన్యవాదాలు.

తాగునీటి పంపిణీలో స్మార్ట్ టెక్నాలజీ

సమీక్షించిన జలమండలి ఎండీ, ఇతర అధికారులు



సాక్షి,సిటీబ్యూరో: నీటి పంపిణీ వ్యవస్థను ఆధునీకరించడానికి, సరఫరా అయ్యే ప్రతీ చుక్కను లెక్కించడానికి జలమండలి కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి సమాయత్తమవుతోంది. ఈ మేరకు స్మార్ట్ వాల్వ్స్ - మీటర్స్ టెక్నాలజీ మీద జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ఐటీ, రెవెన్యూ అధికారులతో కలిసి శనివారం జలమండలి ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జలమండలి తాగునీటి పంపిణీలో దాదాపు 15 వేల చిన్న, పెద్ద వాల్వ్‌లు ఉంటాయి. అందులో 35 శాతం మాత్రమే తరుచూ ఆపరేట్ చేస్తూ ఉంటారు. ప్రయోగాత్మకంగా వెయ్యి వాల్వ్‌ల ఆటోమేషన్ సాధ్యసాధ్యాలను అధ్యయనం చేయాలని అధికారులను అశోక్‌రెడ్డి ఆదేశించారు. దీంతోపాటు రిజర్వాయర్ అవుట్ లెట్ వద్ద, బల్క్ కనెక్షన్లు ఉన్న ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి, సరఫరా అయ్యే ప్రతీ చుక్కను లెక్కలోనికి తీసుకురావడానికి అనువైన టెక్నాలజీని అన్వేషించాలని సూచించారు. ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఏకీకృత వ్యవస్థ ద్వారా వాల్వ్‌ల ఆపరేషన్, నియంత్రణ, పర్యవేక్షణకు వ్యవస్థను రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. స్మార్ట్ మీటర్ల పనితీరు, పంపిణీ చేసిన క్వాంటిటీ, క్వాలిటీతోపాటు బిల్లింగ్ వివరాలను సైతం ఈ వ్యవస్థకు అనుసంధానం అయ్యేలాగా సాంకేతికతకు రూపకల్పన చేయాలని అన్నారు.

స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ..

నగరంలో అధిక శాతం వాల్వ్‌లు రహదారులపై ఉన్నాయి. వాటిని తిప్పే సందర్భంలో వాహనాల రాకపోకల వల్ల పలువురు లైన్‌మెన్లు ప్రమాదానికి గురవుతున్నారు. ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి దుర్ఘటనలు నివారించడానికి స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ(ఆటోమేటిక్ వాల్వ్ ఆపరేషన్ పద్ధతి)ని ప్రయోగాత్మకంగా సనత్‌నగర్‌లో ఏర్పాటు చేసి విజయం సాధించారు. ఈ టెక్నాలజీతో లైన్‌మెన్లు క్షేత్రస్థాయిలో తిరగాల్సిన అవసరం లేకుండానే మొబైల్ యాప్‌తో వాల్వులను నిర్వహించే వెసులుబాటు ఉంటుంది. ఇంటర్ నెట్ ఆధారిత కమ్యూనికేషన్‌తో ఆపరేట్ చేయొచ్చు. దీనివల్ల వాల్వ్ ఆపరేషన్‌తోపాటు వాటర్ క్వాలిటీ, క్వాంటిటీ, క్లోరిన్ శాతం వివరాల్ని తెలుసుకోవచ్చు. ఈ స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ పూర్తిగా సోలార్ ఎనర్జీని ఉపయోగించుకుని పనిచేస్తుంది. బ్యాటరీ బ్యాకప్ సైతం ఉండటంతో నిర్వహణలో పవర్ సమస్యలు ఉండవు.

ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద ఉద్రిక్తత



ఉప్పల్: ఉప్పల్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద శనివారం తీవ్ర ఉద్రికత్త నెలకొంది. స్టేడియంలో హెచ్‌సీఏ సమావేశం జరుగుతుందన్న సమాచారం అందుకున్న తెలంగాణ క్రికెట్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీసీజేఏసీ) ప్రతినిధులు వచ్చి స్టేడియం గేట్లను తోసుకుంటూ లోనికి వెళ్లేందుకు యత్నించారు. అప్పటికే స్టేడియం వద్ద భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఇరువురి మధ్య తోపులాట జరగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎట్టకేలకు పోలీసులు ఆందోళకారులను అదుపులోకి తీసుకుని వ్యాన్‌లోకి బలంవతంగా ఎక్కించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ హైదరాబాద్, సికింద్రాబాద్‌లో కలిపి మొత్తం 209 క్లబ్‌లు ఉండగా, జిల్లాల్లో 8 క్లబ్‌లు మాత్రమే ఉన్నాయని అన్నారు. వెంటనే 33 జిల్లాలకు జిల్లాకు ఒకటి చొప్పున క్రికెట్ క్లబ్ ఏర్పాటు చేసి హెచ్‌సీఏ సభ్యత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఏసీపీ చక్రపాణి ఆధ్వర్యంలో స్టేడియం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పార్కింగ్‌కు ఆ స్థలం చాలా ముఖ్యం: వీహెచ్

ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉప్పల్ స్టేడియానికి వాడుతున్న పార్కింగ్ స్థలం స్టేడియానికే చెందాలని డిమాండ్ చేశారు. వేలంలో ఆ స్థలాన్ని ఓ ప్రైవేట్ సంస్థ కొనుగోలు చేసిందని, ప్రభుత్వం చొరవ తీసుకుని భూమిని వెనక్కి తీసుకోవాలన్నారు.

ఓయూలో పీహెచ్‌డీ జాబితా విడుదల వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ కేటగిరీ–2లో సీటు సాధించిన అభ్యర్థుల జాబితా విడుదల వాయిదా పడింది. సీట్లు సాధించిన విద్యార్థుల జాబితాను ఈ నెల 19న విడుదల చేస్తామని ప్రకటించిన అధికారులు అనుకున్న తేదీన విడుదల చేయలేకపోయారు. పీహెచ్‌డీ ఇంటర్వ్యూల అనంతరం స్టాండింగ్ కమిటీ సమావేశం ఇంతవరకు జరగనందున పీహెచ్‌డీ జాబితా విడుదలకు మరో వారం రోజులు పట్టవచ్చని డీన్స్ తెలిపారు.

అమలులోకి అంబేడ్కర్ వర్సిటీ కొత్త లోగో

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కొత్త లోగోను అమల్లోకి తెచ్చిందని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మార్పును అన్ని మీడియా సంస్థలు, ఎడిటర్లు, మీడియా అధికారులు గమనించాలని కోరారు. ఇక ముందు విశ్వవిద్యాలయానికి సంబంధించిన అన్ని వార్తాంశాల ప్రచురణలకు ఈ కొత్త లోగోను ఉపయోగించాలని అభ్యర్థించారు.

న్యాక్ గుర్తింపుపై ఓయూలో వీసీల సమావేశం



ఉస్మానియా యూనివర్సిటీ: యూజీసీ న్యాక్ గుర్తింపు, వర్సిటీల బడ్జెట్ ప్రతిపాదనలపై ఓయూలో ఆయా యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్ల సమావేశం జరిగింది. శనివారం దూరవిద్య కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి సీఎం సలహాదారు కె.కేశవరావుతోపాటు విద్యాశాఖ కమిషనర్ దేవసేన, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి అనేక అంశాలపై చర్చించి వీసీలకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తు కార్యాచరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

తెలుగును కాపాడే ప్రవాసాంధ్రులకూ పురస్కారాలు

తెలుగు వర్సిటీ పురస్కారాల ప్రదానోత్సవంలో మంత్రి వివేక్



పురస్కార గ్రహీతలతో మంత్రి గడ్డం వివేక్. చిత్రంలో నిత్యానందరావు, వ్యాసకృష్ణ

నాంపల్లి: తెలుగు భాష, సాహిత్యం, లలితకళల్లో కృషి చేస్తున్న లబ్ధప్రతిష్టులతోపాటుగా విదేశాల్లో ఉంటూ తెలుగుభాషను కాపాడుతున్న ప్రవాసాంధ్రులను కూడా గుర్తించి పురస్కారాలను అందజేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావుకు సూచించారు. శనివారం నాంపల్లి ప్రాంగణంలోని నందమూరి తారక రామారావు కళామందిరంలో తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలు–2024 ప్రదానోత్సవ సభ జరిగింది. మంత్రి వివేక్ పురస్కార గ్రహీతలకు రూ.20,116 నగదుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు వర్సిటీ చేస్తున్న కృషి భావితరాలకు స్ఫూర్తిని కలుగజేస్తుందని అన్నారు. తెలుగు వర్సిటీ ప్రగతికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్(ఉగాండ) వ్యాసకృష్ణ మాట్లాడుతూ ఆఫ్రికన్ దేశాల్లో ఉన్న తెలుగు పిల్లలకు తెలుగు బోధించేందుకు విశ్వవిద్యాలయం శ్రీకారం చుట్టాలని కోరారు. పురస్కారాల నగదు పారితోషికాన్ని పెంచడానికి రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. తొలుత వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు స్వాగతం పలుకగా, సమన్వయకర్తగా రింగు రామ్మూర్తి వ్యవహరించారు.

పురస్కార గ్రహీతలు వీరే..

డాక్టర్ యాకూబ్(కవిత్వం), డాక్టర్ ఎం.ఎ.శ్రీనివాసన్(పరిశోధన), ఎల్.నరేందర్(చిత్రలేఖనం), బైరోజు చంద్రశేఖర్(శిల్పం), డాక్టర్ ఆర్.ప్రసన్న రాణి (నృత్యం), డాక్టర్ రాధా సారంగపాణి(సంగీతం), కె.కైలాష్(పత్రికారంగం), దప్పల్లి శ్రీరాములు(నాటకరంగం), గజవెల్లి సమ్మయ్య(జానపద కళారంగం), ఆముదాల మురళి(అవధానం), డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మి(ఉత్తమ రచయిత్రి), పోల్కంపల్లి శాంతాదేవి(నవల) పురస్కారాలను స్వీకరించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 20 జూలై 2025



నగరంలో ఏడీ డిజైన్ షో..

నవంబర్ 21 నుంచి నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే కళలు, డిజైన్ల మేలు కలయిక అయిన వేడుక ఏడీ డిజైన్ షో నగరంలో ఏర్పాటు కానుంది. ఈ విషయాన్ని నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. గతంలో ముంబైకు మాత్రమే పరిమితమైన ఈ ప్రదర్శన ఈ సారి హైదరాబాద్‌కు కూడా విస్తరించనుందని, నవంబర్ 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ప్రదర్శన పూర్తి అయిన తర్వాత డిసెంబరు 5 నుంచి రెండు రోజుల పాటు నగరంలో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా పేరొందిన 150కిపైగా ప్రీమియం బ్రాండ్‌లు పాల్గొంటాయని, 30పైగా అంతర్జాతీయ సంస్థలు హాజరవుతున్నాయని ఆర్ట్, డిజైన్, కల్చర్‌ల సమ్మేళనంగా మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా దీనిని నిర్వహిస్తున్నామని వివరించారు.





నగర జీవనం అత్యాధునికం, సంకేతికం అవుతోంది.. రోజు రోజుకూ అందుబాటులోకొస్తున్న టెక్నాలజీ పుణ్యమాని కొత్త కొత్త ట్రెండ్స్ నడుస్తున్నాయి. ఇందులో మరీ ముఖ్యంగా ఇటీవలి కాలంలో చెప్పకోదగిన విషయం ఏదైనా ఉందంటే అది బాత్‌రూమ్ ట్రెండ్స్.. సగటు మానవుని జీవితం మూడేళ్ల పాటు బాత్‌రూమ్స్‌లోనే గడుపుతున్నారని ఓ అధ్యయనం తెలిపింది. అంతేకాదు.. 'ఛేంజింగ్ ఫేస్ ఆఫ్ బాత్ రూమ్స్' పేరిట నగరంలో ఓ సెమినార్ కూడా నిర్వహించారట.. దీన్ని బట్టి స్నానాల గదికి ఇస్తున్న ప్రాధాన్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు.. దీన్ని దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక హంగులను అద్దుతున్నారు. ఇంటీరియర్ డిజైనింగ్‌లోనూ కీలకపాత్ర పోషిస్తోందనడంలో సందేహం లేదు.. - సాక్షి, సిటీబ్యూరో





బహుత్ అచ్చీ.. బాత్ హై..

రిలాక్సేషన్ టు రీచార్జ్ అంటున్న సిటిజనులు

- రోజు రోజుకూ అందుబాటులోకి కొత్త ట్రెండ్స్
- అత్యాధునిక హంగులద్దుకుంటున్న బాత్‌రూమ్స్
- ఇంటీరియర్ డిజైనింగ్‌లో వాష్ రూమ్స్‌ది కీలకపాత్ర
- 'ఛేంజింగ్ ఫేస్ ఆఫ్ బాత్‌రూమ్స్' పేరిట నగరంలో సెమినార్

ఇటీవల కాలంలో మొబైల్స్ పుణ్యమాని మానవులు, మరీ ముఖ్యంగా నగరవాసులు సగటున మూడేళ్ల పాటు సమయాన్ని బాత్‌రూమ్స్‌లోనే గడుపుతున్నారని ఓ అధ్యయనంలో తేలింది. అంతేకాదు ఏడాదికి 70 లక్షల మంది తమ మొబైల్స్‌ను పోగొట్టుకుంటున్నారని మరో అధ్యయనం తేల్చింది. అదీ ఎక్కడో కాదు.. బాత్‌రూమ్స్‌లోనే.. మన జీవితంలో ఏడాదికి 2500 సార్లు రెస్ట్‌రూమ్స్ వినియోగిస్తామని మరో స్టడీ పేర్కొంటోంది.. ఇక దేశంలో దంపతుల మధ్య గొడవలకుగల కారణాల్లో బాత్‌రూమ్‌దే ప్రధాన పాత్ర అని మరో స్టడీ చెబుతోంది.. ఇలా చూస్తే.. డ్రాయింగ్ రూమ్స్, జిమ్స్ వంటి వాటికన్నా బాత్‌రూమ్ కోసమే ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తున్నారట. స్నానాలగది గురించి ఇంతకు మించిన ఆసక్తికరమైన అంశాలు చాలానే ఉన్నాయి..

బాత్ చుట్టూ బాతాఖానీ..

'ఛేంజింగ్ ఫేస్ ఆఫ్ బాత్‌రూమ్స్' పేరిట నగరంలో జరిగిన ఓ సెమినార్‌లో ఇలాంటి విషయాలెన్నో చర్చకు వచ్చాయి. 'బాత్‌రూమ్‌లు మన జీవనశైలిలో అత్యంత ప్రధానమైన భాగంగా మారాయి. ఇంటిని కొనుగోలు చేసేటప్పుడు, నిర్మించుకునేటప్పుడు సిటిజనులు బాత్‌రూమ్‌లకు చాలా ప్రాధాన్యం ఇస్తున్నారు. బిల్డర్స్ కూడా అత్యధికంగా వ్యయం చేసి వినూత్నంగా తీర్చిదిద్దిన, బాత్‌రూమ్స్‌తో కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు' అని చెప్పారు నగరంలోని ఓ భవన నిర్మాణ సంస్థకు చెందిన చైతన్య. వీటిని ఇప్పుడు డిజైనర్ బాత్ రూమ్ స్పేసెస్ అని వ్యవహరిస్తున్నారు అని అన్నారాయన.

ఒత్తిడి చిత్తు.. రీచార్జ్ ఎత్తు..

'బాత్‌రూమ్స్ అంటే కొత్త ఐడియాలకు పుట్టినిల్లు' అని చెప్పారు ఓ స్టార్టప్ కంపెనీ యజమాని సందీప్. అంతేకాదు ఇవి ఐ కెన్ డూ అనిపిస్తాయి. నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్ అని వెన్ను తడతాయి. నెగెటివ్ ఆలోచనల్ని నురగతో పాటు కొట్టుకుపోయేలా చేస్తాయి. ఒత్తిడిని దూరం చేసి రిలాక్స్‌డ్ మైండ్‌ని అందిస్తాయని, మెదడులో డోపమైన్ హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తాయని పరిశోధకులు అంటున్నారు. స్విమ్మింగ్, జాగింగ్ వంటివాటితో వచ్చే లాభాలతో సమానంగా బాత్‌రూమ్ పనిచేస్తుంది.

అందంగా.. విశాలంగా..

గతంలో బాత్‌రూమ్స్ నిర్లక్ష్యానికి గురి అయిన ప్లేసులు. అయితే ప్రస్తుతం వీటికి బాగా ప్రాధాన్యం పెరిగింది. విశాలంగా అవసరమైన అన్ని సౌకర్యాలు, ఫిట్‌మెంట్స్ ఏర్పరచుకుంటున్నాయి. ఇందులో భాగంగా తడి, పొడి ప్రదేశాలుగా బాత్ రూమ్‌ని రెండు భాగాలుగా విభజిస్తారు. వెట్ ప్లేస్‌లో షవర్, టబ్‌లు ఉంటాయి. గ్లాస్‌తో విభజించి మరో భాగంలో శానిటరీ, వాష్ బేసిన్, మిర్రర్.. ఉంటాయి.



హైలెట్ టైల్స్ : బాత్‌రూమ్‌లో ఒక ప్లేస్‌లో పెడితే బాత్‌రూమ్ మొత్తాన్ని హైలెట్ చేసే హైలైటర్స్‌లో వాల్ పేపర్స్/టైల్స్/మిర్రర్స్ ఉన్నాయి. ఇవి రూ.50 వేల నుంచి ధరల్లో అందుబాటులో ఉన్నాయి. బాత్‌రూమ్ ప్లేస్‌ని బట్టి ఖరీదు ఉంటుంది. కింద ఫ్లోరింగ్ చూస్తే అచ్చం వాటర్‌లో ఉన్నట్టు అనిపిస్తుంది. ఓషన్ థీమ్‌లా లేదా మరే థీమ్ అయినా తీసుకోవచ్చు.

ప్లాంట్స్ : బాత్‌రూమ్‌లో వాల్‌కి పక్కన, లేదా బాత్‌టబ్ పక్కన ప్లాంట్స్‌ని ఏర్పాటు చేస్తున్నారు. మంచి పరిమళాలు పంచే బోన్‌సాయ్ మొక్కలైన హైపర్ బోల్స్, సిల్క్ ఫ్లవర్, టైడ్ రిబ్బన్స్‌తో పాటు అలోవీరా, స్పైడర్ ప్లాంట్ వంటివి పాపులర్ అయ్యాయి. ఇవి రూ.10వేల నుంచి లభిస్తున్నాయి. బోన్సాయి అయితే రూ.25వేల నుంచి ప్రారంభమవుతాయి. గ్రీనరీ లుక్ కోసం విండో ప్లేస్‌లో ఐరన్ బదులు బ్యాంబూ పెడతారు. చిన్న చిన్న లైట్స్ దీనికి అమరుస్తారు.

జెట్ మసాజెస్ : ఇవి అమర్చుకుంటే మన మీద పడే నీళ్లతోనే మనకు మసాజ్ అనుభూతి కలుగుతుంది. నీళ్ల వేగానికి శరీరం రిలాక్స్ అవుతుంది. షవర్ ప్యానెల్‌లో లేదా టబ్‌లో అయితే అడుగున లేదా ఇరుపక్కల అమరుస్తారు. వాటర్ ప్రెజర్‌ని మనం తగ్గించుకునే, పెంచుకునే వెసులుబాటు ఉంటుంది. రూ.15వేల నుంచి వీటి ధర మొదలవుతుంది. అయితే నిర్మాణ సమయంలో ముందస్తు ప్లాన్ చేసుకుని గోడలో ఉండే పైప్‌లోనే ప్రెషర్ వాల్ ఉండేలా చూడాలి.

ఇ–టబ్స్ : బాత్‌రూమ్ టబ్స్‌లో రేడియో, ఎఫ్ఎం, బ్లూటూత్, మొబైల్ కాలింగ్ కూడా ఉంటాయి. టబ్‌కి రైట్‌సైడ్ టచ్ స్క్రీన్ ఉంటుంది. దీనిని ఆపరేట్ చేసుకోవచ్చు. నీళ్లలో తడిచినా ఆ టచ్‌స్క్రీన్‌కు ఏమీ కాదు. ఇది టబ్‌తో పాటు కలిపి వస్తుంది. దీన్ని తర్వాత ఫిట్ చేసుకోవడం కుదరదు. ఇవి రూ.2లక్షల నుంచి మొదలువుతాయి.

స్ట్రిప్ లైట్స్ : సీలింగ్‌లో లైటింగ్ కోసం మిర్రర్ కానీ స్ట్రిప్ లైట్స్ కానీ ఎక్కువగా వినియోగిస్తారు. దీని వల్ల కొంచెం ఎక్కువ వెలుగు వస్తుంది. సీలింగ్ కోసం 3డీ వాల్‌పేపర్స్ కూడా వాడుతున్నారు. చూడడానికి టేకు చెక్కతో చేసినవిలా అనిపించే డబ్ల్యూపీవీసీ సీలింగ్ ప్యానెల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఒకరకమైన ప్లాస్టిక్ తరహాలో ఉండే ఇవి రిమూవబుల్ కూడా.

సిరి ఉంటే ఆవిరి : మరింత రిలాక్సేషన్ కోసం. స్టీమ్‌బాత్ సౌకర్యం ఏర్పాటు చేసుకుంటున్నారు. స్టీమ్ ఉంటే ఫాల్స్ సీలింగ్ చేయించకూడదు. త్రీడీ వాల్ పేపర్స్, టైల్స్ మాత్రమే వాడతారు. వీటినే జకోజీ బాత్‌రూమ్స్‌గా పిలుస్తున్నారు. వీటి విలువ కనీసం రూ.5లక్షల నుంచి మొదలవుతుంది. స్టీమ్ బాత్, షవర్ ఏరియా, జెట్స్ మసాజ్ అన్నీ కలిపి షవర్ యూనిట్ అంటారని చెప్పారు నగరానికి చెందిన ఇంటీరియర్ డిజైనర్ కాత్యాయని..

వానిటీ : టవల్స్, షేవింగ్ కిట్స్, అవసరమైతే బుక్స్ పెట్టుకోడానికి బాత్‌రూమ్‌లోనే వార్డ్‌రోబ్స్ పెట్టుకుంటున్నారు. ఒకప్పుడు హోటల్స్‌కి పరిమితమైనవి.. ఇప్పుడు ఇళ్లలోకి కూడా వచ్చేశాయి.





- సృజనాత్మక ఆలోచనలు పంచుకున్న విద్యార్థులు
- ఆకట్టుకున్న అంతర్జాతీయస్థాయి అవగాహన కార్యక్రమం

విజ్ఞానం, వికాసం.. మేరు జేమూన్

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు విజ్ఞానాన్ని, వికాసాన్ని కల్పించేదుకు, వారిలో దాగివున్న సృజనాత్మక ఆలోచనలను పంచుకునే వేదికగా నిలిచింది 'మేరు జేమూన్' (జూనియర్ మోడల్ యునైటెడ్ నేషన్స్) కార్యక్రమం. అంతర్జాతీయ స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం నగరంలోని మేరు ఇంటర్నేషన్ స్కూల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా డబ్ల్యూహెచ్ఓ, యుఎన్‌హెచ్ఆర్‌సీ, యునిసెఫ్, యుఎన్ఎస్‌సీ, యుఎన్‌డీపీ వంటి అంతర్జాతీయ ఫోరమ్‌లపై అవగాహన కల్పించారు. ఇందులో మేరు సహా వివిధ పాఠశాలల నుంచి 300కు పైగా విద్యార్థులు పాల్గొని గ్లోబల్ హెల్త్ సమస్యలు, యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో విద్యార్థుల శ్రమ, స్వేచ్ఛ, మౌలిక వసతుల అభివృద్ధి వంటటి అంశాలపై చర్చించి తమ ఆలోచనలను పంచుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన నవాబ్ సయ్యద్ అల్గిజీ (కాన్సుల్ జనరల్, ఇండియా–ఎస్ఏఏఆర్‌సీ దేశాల ప్రత్యేక రాయబారి) మాట్లాడారు. నాయకత్వం అనేది వినడం నుంచే మొదలవుతుందన్నారు. ప్రజలను వారి దృక్కోణాలను, ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. స్కూల్ వ్యవస్థాపకురాలు మేఘనా గోరుకంటి జూపల్లి తదితరులు పాల్గొన్నారు.



డ్రీమ్ ల్యాండ్‌లో ది మెలాంజ్



- ఆకట్టుకున్న నృత్యాలు, ర్యాంప్‌వాక్
- హైలైట్‌గా మిస్ ఫ్రెషర్స్ కాంటెస్ట్

రసూల్‌పురా : కంటోన్మెంట్‌లోని డ్రీమ్ ల్యాండ్ గార్డెన్‌లో 'ది మెలాంజ్' పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఆసాంతం అలరించింది. ఇందులో భాగంగా విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, ర్యాంప్‌వాక్, సినీగీతాలు, వెస్ట్రన్ బీట్స్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సోమాజిగూడ రాజ్ భవన్ రోడ్డులోని విల్లా మేరి బాలికల జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో భాగంగా శనివారం నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌కి స్వాగతం పలికారు. విద్యార్థినులు సంప్రదాయ, మోడ్రన్ వస్త్రధారణతో నృత్యాలు చేశారు. మిస్ ఫ్రెషర్స్ పేరుతో నిర్వహించిన కాంటెస్ట్, ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ ఫిలోమినా, కార్యదర్శి చిన్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



27న సన్‌రైజ్ స్పోర్ట్స్ ఈవెంట్

- గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహణ
- హాజరుకానున్న రెండు వేల మంది సన్‌రైజ్ పూర్వ విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా ఈ నెల 27న సన్‌రైజ్ హైస్కూల్ ఆధ్వర్యంలో సెరిమోనియల్ స్పోర్ట్స్ ఈవెంట్ నిర్వహించనున్నారు. నగరంలో 1958 నుంచి విద్యా సేవలందిస్తున్న సన్‌రైజ్ హై స్కూల్ పూర్వ విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ సిమీన్ మునీర్ మాట్లాడుతూ.. ప్రముఖ విద్యావేత్త అదీబ్ మునీర్ సాహెబా వారసత్వంగా కొనసాగిన ఈ సన్‌రైజ్ వేదికలో పలువురు విద్యార్థులు మైక్రోసాఫ్ట్, అమెజాన్, డాక్యుసైన్, టీసీఎస్, ఐబీఎం వంటి సంస్థల్లో ఉన్నత స్థాయిల్లో ఉన్నారని, వీరందితో పాటు దేశవిదేశాల్లోని దాదాపు 2వేల మంది పూర్వ విద్యార్థులు ఈ సెరిమోనియల్ స్పోర్ట్స్ ఈవెంట్‌లో భాగస్వామ్యం కానున్నారని పేర్కొన్నారు.

అనురాగ్ కాన్వొకేషన్

2,260 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

సాక్షి, సిటీబ్యూరో: సాధించిన విజయాలను, ఉన్నత ఆశయాలను, అద్భుతమైన చదువులను వేడుకలా చేసుకుంటూ అనురాగ్ యూనివర్సిటీ రెండో కాన్వొకేషన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలో 2,260 మందికి పైగా విద్యార్థులకు పట్టాలు అందించారు. ఈ కాన్వొకేషన్ వేడుకల్లో అనురాగ్ యూనివర్సిటీలోని ఏడు ప్రధాన విద్యా సంస్థల్లో మూడు ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ విభాగాలకు చెందిన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్, ప్రొఫెసర్ టీజీ సీతారాం మాట్లాడారు. గ్రాడ్యుయేట్లు ఆవిష్కరణలు (ఇన్నోవేషన్), సామాజిక బాధ్యత రెండింటినీ స్వీకరించాలని కోరారు. విద్యా రంగంలో వస్తున్న వేగవంతమైన మార్పులను అందిపుచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో దేశ అంతరిక్ష, ఉపగ్రహ రంగంలో ప్రముఖ సంస్థ అయిన అనంత్ టెక్నాలజీస్ చైర్మన్, డాక్టర్ పి.సుబ్బారావు, అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి, ఛాన్సలర్ డాక్టర్ యుబీ.దేశాయ్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ అర్చనా మంత్రి, సీఈఓ ఎస్.నీలిమతో సహా యూనివర్సిటీ ప్రముఖులు పాల్గొన్నారు.





ప్రపంచంలోనే అతిపెద్ద పాల ఉత్పత్తిదారు భారత్. అంతేకాదు వినియోగంలోనూ మనది అగ్రస్థానమే. అందుకే, మన డెయిరీ మార్కెట్లోకి ప్రవేశించాలని అగ్ర రాజ్యం ఉవ్విళ్లూరుతోంది. భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చల నేపథ్యంలో 'మాంసాహార పాల' అంశం తెరపైకి వచ్చింది. ఈ పాలను భారత్‌కు ఎగుమతి చేస్తామని యూఎస్.. కుదరదని మనదేశం పట్టుపడుతున్నాయి. మనదేశంపై ప్రతీకార సుంకాలకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ఆగస్టు 1 గడువు ముగిసేలోపు ఒక ఉమ్మడి పరిష్కారాన్ని కనుగొనడంలో ఇరు పక్షాలు తలమునకలయ్యాయి. వాణిజ్య చర్చల నేపథ్యంలో మన పాడి పరిశ్రమ తలుపులను అమెరికా దిగుమతులకు తెరవడానికి మనదేశం చూపుతున్న ప్రతిఘటన కేవలం ఆర్థికపరమైనది మాత్రమే కాదన్నది మాత్రం సుస్పష్టం.

- సాక్షి, స్పెషల్ డెస్క్

అమెరికా నుంచి 'మాంసాహార పాల'కు నో

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న భారత ప్రభుత్వం

వాణిజ్య అవరోధం అంటున్న అగ్ర రాజ్యం

యూఎస్ పాలు వస్తే రూ.లక్ష కోట్లకుపైగా నష్టం!

- **ధ్రువీకరణ ఉండాల్సిందే..:** ఆహార దిగుమతులకు భారత పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ పశువైద్య ధ్రువీకరణను తప్పనిసరి చేసింది. ఇది పాల ఉత్పత్తులు సహా అన్ని రకాల ఉత్పత్తులు జంతువుల ఆధారిత దాణా తీసుకోని ఆవుల నుండి వచ్చాయని నిర్ధారిస్తుంది. ఈ నిబంధనను డబ్ల్యూటీఓ వేదికగా అమెరికా విమర్శించింది. యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌ఆర్‌టీ) నేషనల్ ట్రేడ్ ఎస్టిమేట్ నివేదిక ప్రకారం .. జంతువుల ఆధారిత దాణా తీసుకున్న ఆవుల నుండి సేకరించిన పాలతో తయారైన ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడంపై భారత్ తన నిషేధాన్ని కొనసాగిస్తోంది.
- **సుంకాలు ఎక్కువే..:** ప్రస్తుతానికి పాలు, పాల ఉత్పత్తుల దిగుమతులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోంది. చీజ్‌పై 30%, వెన్న 40%, పాలపొడిపై 60% సుంకం ఉంది. తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసే న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాల దిగుమతులు కూడా మనకు లాభదాయకం కావు.

విషయం	సంవత్సరం	భారత్	యూఎస్
పాల ఉత్పత్తి (మిలియన్ మెట్రిక్ టన్నుల్లో)	2023-24	239.3	102.5
పశు సంపద	2025	30 కోట్లు	93.8 లక్షలు
ఉపాధి (కుటుంబాలు)		8.5 కోట్లు	1.5 లక్షలు
డెయిరీ ఎగుమతులు (లక్షల మెట్రిక్ టన్నుల్లో)	2023-24	63.7	19.6
ఎగుమతుల విలువ	2023-24	రూ.2,317 కోట్లు	రూ.69,700 కోట్లు

ఆ పా'పాలు' మాకొద్దు!

ఆవును గోమాతగా, ఆవు నుంచి వచ్చే పాలు, పేడ అన్నింటినీ అత్యంత పవిత్రమైన వస్తువులుగా భావించే దేశం మనది. రోజువారీ ఆహారంలోనూ, సనాతన ధర్మ సంప్రదాయాల్లోనూ పాలు, పెరుగు, నెయ్యికి ఉన్న విలువ అందరికీ తెలిసిందే. అలాంటి గోవుకు మనం గడ్డి, ఇతర శాకాహార దాణాను మాత్రమే వినియోగిస్తాం. కానీ, విదేశాల్లో అలా కాదు. జంతువుల ఆధారిత దాణా కూడా వినియోగిస్తారు. ఇప్పుడు ఇదే భారత్ – అమెరికా వాణిజ్యంలో చర్చనీయాంశంగా మారింది. దిగుమతి చేసుకునే పాలకు 'జంతువుల ఆధారిత దాణా తీసుకోని ఆవుల నుండి సేకరించాం' అన్న కఠిన ధ్రువీకరణ ఉండాలని భారత్ పట్టుపడుతోంది.

అమెరికా ఏమంటోంది?

మన డిమాండ్లను 'అనవసర వాణిజ్య అవరోధం' అని అమెరికా పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) వద్ద కూడా ఈ విషయాన్ని లేవనెత్తింది. 2024 నవంబర్‌లో అమలులోకి వచ్చిన 'నవీకరించిన పాల ధ్రువీకరణ'లో అలాంటి ఆందోళనలను భారత్ పేర్కొనలేదని అగ్ర రాజ్యం అంటోంది.

అదే జరిగితే..



కుటుంబ వినియోగ వ్యయ సర్వే (2023–24 ప్రకారం) దేశంలో సుమారు 94% జనాభా పాలు, పాల ఉత్పత్తులు వినియోగిస్తున్నారు. ప్రపంచం డెయిరీ రంగంలో అప్రతిహతంగా దూసుకుపోతున్న భారత్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని యూఎస్ ప్రయత్నిస్తోంది. ఇదే జరిగితే ఇక్కడి మార్కెట్లోకి చవక పాలు, పాల ఉత్పత్తులు వెల్లువెత్తుతాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) విశ్లేషణ ప్రకారం.. యూఎస్ డెయిరీ ఉత్పత్తుల దిగుమతులను ప్రభుత్వం అనుమతిస్తే భారత్ ఏటా ఏకంగా రూ.1.03 లక్షల కోట్ల నష్టాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది.

మాంసాహార పాలు అంటే..

మాంసం లేదా రక్తం వంటి జంతువుల ఆధారిత దాణాను ఆహారంగా తీసుకునే ఆవుల నుండి వచ్చేవే మాంసాహార పాలు.

- వివిధ నివేదికల ప్రకారం.. యూఎస్‌లో పశువులకు ఆహారంగా జంతు ఆధారిత దాణా కూడా వాడుతున్నారు.
- పందులు, చేపలు, కోళ్లు, గుర్రాలు, పిల్లులు లేదా కుక్కల మాంసం, వ్యర్థాల ఆధారంగా తయారైన దాణా వీటిలో ఉంది.
- పశువులకు ప్రోటీన్ కోసం పంది, గుర్రపు రక్తాన్ని, అలాగే బలిష్టంగా తయారయ్యేందుకు పశువుల భాగాల నుండి తీసిన కొవ్వును ఆహారంగా ఇస్తున్నారట.

భారత్ - పాల ఉత్పత్తి

1998 నుంచి ప్రపంచంలో పాల ఉత్పత్తిలో మనమే నం.1. ప్రస్తుతం ప్రపంచ పాల ఉత్పత్తిలో 25% వాటా మనదే.

దేశంలో పాల ఉత్పత్తి 2014-15లో 146.31 మిలియన్ టన్నుల నుంచి 2023-24లో 239.30 మిలియన్ టన్నులకు పెరిగింది. ప్రపంచ దేశాల మొత్తం పాల ఉత్పత్తి 2023-24లో 981 మిలియన్ టన్నులు.

దేశంలో తలసరి పాల లభ్యత అప్పట్లో రోజుకు 319 గ్రాముల నుంచి ఇప్పుడు 471 గ్రాములకు చేరింది.

ప్రపంచ సగటు తలసరి పాల లభ్యత 2024లో 329 గ్రాములు.

దేశ జీడీపీలో 4-5% వాటా డెయిరీ రంగానిదే.

కేంద్ర ప్రభుత్వ 'ప్రాథమిక పశు సంవర్ధక గణాంకాలు 2024' ప్రకారం.. 2023-24లో దేశంలో పాల ఉత్పత్తిలో ఆవులదే అగ్రస్థానం. అన్ని రకాల గోవులూ కలిపి మొత్తం పాలలో సుమారు 55% ఉత్పత్తి చేస్తున్నాయి.

పాల ఉత్పత్తిలో మన తరవాత అమెరికా (11.04%), పాకిస్తాన్ (6.73%) ఉన్నాయి.

పరాకాష్టకు బాబు భేతాళ కుట్ర

మద్యం అక్రమ కేసులో చంద్రబాబు ప్రభుత్వ బరితెగింపు

వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు

సాక్షి, అమరావతి: బాబు స్క్రిప్టు... భేతాళ కుట్ర... అందుకు తగ్గట్టు అబద్ధపు వాంగ్మూలాలు...! చంద్రబాబు డైరెక్షన్‌లో సాగుతున్న భేతాళ కుట్ర కేసులో సిట్ దర్యాప్తు పేరిట బరితెగిస్తోంది. అక్రమ కేసులో లేని ఆధారాలను సృష్టించేందుకు వేధింపులనే అస్త్రంగా చేసుకుంది. సిట్ దాఖలు చేసిన చార్జిషీట్‌లో పేర్కొన్న వాంగ్మూలాలన్నీ కూడా బెదిరించి, వేధించి నమోదు చేసినవే కావడం గమనార్హం. బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి అబద్ధపు వాంగ్మూలాన్నే సిట్ ఈ అక్రమ కేసుకు ప్రధాన ఆధారంగా చేసుకుంది. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్టు తొలుత అబద్ధపు వాంగ్మూలం నమోదుకు నిరాకరించిన ఆయన సిట్ బెదిరింపులకు వ్యతిరేకంగా మూడుసార్లు హైకోర్టును ఆశ్రయించారు. అయినా సరే ప్రభుత్వం వాసుదేవరెడ్డిని వెంటాడి వేధించింది. డెప్యుటేషన్ ముగిసినా రిలీవ్ చేయకుండా అడ్డుకుంది. కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేసింది. చివరికి సిట్ చెప్పినట్టుగా ఆయన అబద్ధపు వాంగ్మూలం ఇచ్చారు. ఆ వెంటనే వాసుదేవరెడ్డిని రిలీవ్ చేసి కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది.

- ఇదే రీతిలో బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ ఉద్యోగులు సత్యప్రసాద్, అనూషలను వేధించి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేయించింది.
- చంద్రబాబు కుట్రలో మాజీ ఎంపీ విజయ్‌సాయిరెడ్డి కూడా భాగస్వామి అయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా మరో మూడున్నరేళ్ల సమయం ఉన్నా సరే పదవికి రాజీనామా చేసి.. టీడీపీ కూటమికి రాజ్యసభలో ఎంపీ సీటు దక్కేలా చేశారు. అనంతరం చంద్రబాబు చెప్పమన్నట్టుగా.. సిట్ విచారణకు హాజరై అబద్ధపు వాంగ్మూలం ఇవ్వడం గమనార్హం.
- ఈ అక్రమ కేసులో అబద్ధపు వాంగ్మూలాలు ఇచ్చేందుకు అంగీకరించని వారిపైన సిట్ తన ప్రతాపం చూపించింది. కొన్ని డిస్టిలరీల ప్రతినిధులు వృద్ధులు అని కూడా చూడకుండా విచారణ పేరుతో హైదరాబాద్ నుంచి విజయవాడ తీసుకొచ్చి వేధించింది. దాంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో... హైదరాబాద్‌లోని వారి నివాసంలోనే విచారించాలని కోర్టు ఆదేశించింది. కేసుతో ఏమాత్రం సంబంధం లేని రాజ్ కేసిరెడ్డి తండ్రిని బలవంతంగా తీసుకొచ్చి విచారణ పేరుతో వేధించింది. మరో నిందితుడి తండ్రి, రిటైర్డ్ కానిస్టేబుల్‌ను అక్రమంగా నిర్బంధించి మరీ వేధించడంతో ఆ కుటుంబం హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.
- ఈ కేసులో అరెస్టయిన రాజ్ కేసిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి విచారణలో చెప్పని విషయాలు చెప్పినట్టుగా రిమాండ్ నివేదికలో పేర్కొనడం సిట్ కుట్రను బట్టబయలు చేసింది.
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వద్ద గతంలో గన్‌మన్‌గా పనిచేసిన గిరి, మదన్‌రెడ్డిలను అక్రమంగా నిర్బంధించి అబద్ధపు వాంగ్మూలం కోసం తీవ్రంగా వేధించారు. బెంబేలెత్తిన గిరి సిట్ అధికారులు చెప్పినట్టు అబద్ధపు వాంగ్మూలం ఇచ్చారు. అందుకు సమ్మతించని మదన్‌రెడ్డిపై సిట్ అధికారులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం విభ్రాంతికర విషయం. సిట్ అధికారులు తనపై భౌతికంగా దాడి చేశారని మదన్‌రెడ్డి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు కూడా. ఇక అబద్ధపు వాంగ్మూలం ఇస్తే నామినేటెడ్ పదవితో పాటు రూ.2కోట్లు ఇస్తామని ప్రభుత్వ పెద్దలు సిట్ అధికారుల ద్వారా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్నేహితుడు వెంకటేశ్‌నాయుడు దంపతులను ప్రలోభపెట్టారు. వారు తిరస్కరించడంతో అక్రమ కేసులో వెంకటేశ్‌నాయుడును అరెస్టు చేశారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంతో ఏమాత్రం సంబంధం లేని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిలను కూడా సిట్ అక్రమంగా అరెస్టు చేసింది.
- అసలు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలతో కూడా సంబంధం లేని ప్రపంచ దిగ్గజ సిమెంట్ కంపెనీ వికాట్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను అక్రమంగా అరెస్టు చేయడం సిట్ కుట్రకు పరాకాష్ట.



విజయవాడ సిట్ కార్యాలయానికి వెళుతున్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

అవినీతి, అక్రమాలు లేనే లేవు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సాధికారికంగా తేల్చిచెప్పారు. ఎంపీ అయిన తనకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలలో ఏమాత్రం ప్రమేయం ఉండదని కుండబద్దలు కొట్టారు. శనివారం ఎంపీ మిథున్‌రెడ్డి స్వచ్ఛందంగా సిట్ అధికారుల ఎదుట హాజరయ్యారు. ఈ అక్రమ కేసులో గతంలో ఓసారి ఆయన సిట్ విచారణకు హాజరయ్యారు.

- ఢిల్లీ నుంచి వచ్చిన మిథున్‌రెడ్డి నేరుగా సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 వరకు సిట్ అధికారులు విచారించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంపై పలు ప్రశ్నలు వేశారు. కాగా,ఆయనపై అభియోగాలకు సంబంధించి సిట్ అధికారులు సరైన ఆధారాలను చూపించలేకపోయారు. ఈ కేసులో సిట్ బెదిరించి, వేధించి నమోదు చేసిన అబద్ధపు వాంగ్మూలాల ఆధారంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఆ అవాస్తవ ఆరోపణలను ఆయన సమర్థంగా తిప్పికొట్టారు.
- సిట్ అరెస్టు చేసిన రాజ్ కేసిరెడ్డితో తనకు ఎలాంటి వ్యాపార సంబంధాలు లేవని మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. అయినా సరే, ప్రభుత్వ పెద్దల కుట్రనే సిట్ అధికారులు ఏకపక్షంగా అమలు చేశారు. మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు. ఆ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు తెలిపారు. మిథున్‌రెడ్డిని ఆదివారం ఉదయం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం ఏసీబీ న్యాయస్థానం న్యాయమూర్తి నివాసంలో హాజరుపరుస్తారని తెలుస్తోంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మద్యం డాన్ చంద్రబాబే

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై టీడీపీ కూటమి ప్రభుత్వం అక్రమ కేసు నమోదు వెనుక పక్కా పన్నాగం దాగుంది. ఎందుకంటే గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో తెగించి పాల్పడిన మద్యం దోపిడీని కప్పిపుచ్చే కుతంత్రం ఉంది. అసలు రాష్ట్రంలో మద్యం దందాకు ఆద్యుడు చంద్రబాబే అన్నది బహిరంగ రహస్యం. మద్యం మాఫియాను పెంచి పోషించిన వ్యవస్థీకృత దందాను స్థిర పరచింది ఆయనే. 2014–19లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే తన బినామీలు, సన్నిహితుల మద్యం కంపెనీల ముసుగులో ఖజానాకు భారీగా గండి కొట్టారు. నిబంధనలకు విరుద్ధంగా అస్మదీయుల కంపెనీలకు అడ్డగోలు లబ్ధి కలిగించారు. అందుకోసం ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు స్వయంగా సంతకాలు చేసి మరీ రెండు చీకటి జీవోలతో కుంభకోణానికి పాల్పడ్డారు. తద్వారా ఖజానాకు ఏటా రూ.1,300 కోట్ల చొప్పున 2015 నుంచి 2019 వరకు రూ.5,200 కోట్లు గండికొట్టారు. ఈ విషయాన్ని రాజ్యాంగబద్ధ సంస్థ 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్'(కాగ్) ఆధ్వర్యంలో స్వతంత్రంగా విధులు నిర్వర్తించే ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ తన అభ్యంతరాలను స్పష్టంగా నివేదించారు కూడా. ఇక టీడీపీ సిండికేట్ ఆధ్వర్యంలో 4,380 ప్రైవేటు మద్యం దుకాణాలు.. వాటికి అనుబంధంగా 4,380 పర్మిట్ రూమ్‌లు.. 43 వేల బెల్ట్ దుకాణాలతో మద్యం ఏరులై పారించారు. ఎంఆర్‌పీ కంటే 20 శాతం అధిక ధరలకు మద్యం విక్రయాలు సాగించి, ఐదేళ్లలో రూ.20 వేల కోట్లు కొల్లగొట్టారు. వెరసి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏకంగా రూ.25 వేల కోట్ల దోపిడీకి పాల్పడ్డారు. చంద్రబాబు ముఠా బాగోతం ఆధారాలతో సహా బయట పడటంతో 2023లోనే సీఐడీ కేసు నమోదు చేసింది. 2014–19 టీడీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ కమిషనర్‌గా వ్యవహరించిన ఐఎస్ నరేశ్, అప్పటి ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, అప్పటి సీఎం చంద్రబాబు, తదితరులపై ఐపీసీ సెక్షన్లు 166, 167, 409, 120(బి) రెడ్ విత్ 34, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు: 13(1),(డి), రెడ్ విత్ 13(2) కింద సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ కేసులో చంద్రబాబు అప్పటి నుంచి ముందస్తు బెయిల్‌పైనే ఉన్నారు. 2024లో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మద్యం విధానం ముసుగులో మహా దోపిడీకి మరోసారి తెగబడ్డారు. 3,396 ప్రైవేటు మద్యం దుకాణాలను టీడీపీ సిండికేట్‌కు ఏకపక్షంగా కట్టబెట్టడంతోపాటు ఏకంగా 75 వేల బెల్ట్ దుకాణాలతో భారీ దోపిడీకి బరితెగించారు. టీడీపీ ప్రభుత్వంలో గతంలో చేసిన దోపిడీ.. ప్రస్తుతం బరితెగించి సాగిస్తున్న దోపిడీ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే సిట్ ద్వారా మద్యం అక్రమ కేసు కుట్రకు తెగబడ్డారు.

మహిళల్ని అసభ్యంగా దూషించటం టీడీపీకి ఆనవాయితీ

- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మాజీ మంత్రి ఆర్‌కే రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వ్యాఖ్యలు అత్యంత హేయం



సాక్షి,అమరావతి: మహిళలను అసభ్యకర పదజాలంతో దూషించటం టీడీపీకి ఆనవాయితీ అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. 'మాజీమంత్రి ఆర్‌కే రోజా సెల్వమణిపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయం. తెలుగుదేశం పార్టీలో దారుణంగా మారిన దుష్ట సంస్కృతికి ఆ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపుతూ గట్టిగా మాట్లాడుతున్నందుకు, వాటిని ప్రశ్నిస్తున్నందుకు ఓర్చుకోలేక, నా సోదరి రెండుసార్లు ఎమ్మెల్యేగాను, మంత్రిగాను పనిచేసిన ఆర్‌కే రోజాను అత్యంత అసభ్యకరమైన పదజాలంతో దూషించారు. ఇది ఏదో యాదృచ్ఛికంగా జరిగింది కాదు. తమను విమర్శించే మహిళల గొంతు నొక్కడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీలో ఒక తంతుగా మారిన అత్యంత హేయమైన సంస్కృతికి ఇది ఒక నిదర్శనం'అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆ పోస్టులో ఆయన ఏమన్నారంటే..

నోరు మూయించడానికే నిస్సిగ్గుగా వ్యాఖ్యలు

'వ్యక్తిత్వ హననం ద్వారానే చంద్రబాబు తన రాజకీయ జీవితం కొనసాగిస్తున్నారు. నిజం చెప్పాలంటే ఒక మహిళపై అత్యంత హేయంగా ఆరోపణలు చేసి, దుష్ప్రచారం చేసే ఆయన ఉన్నత పదవి పొందారు. అప్పటినుంచే వ్యక్తిగత దాడులు, స్త్రీలను ద్వేషించే తత్వం తెలుగుదేశం పార్టీకి ఒక బ్రాండ్‌గా మారింది. ధైర్యంగా మాట్లాడే మహిళలను భయపెట్టి వారి నోరు మూయించడానికే నిస్సిగ్గుగా అత్యంత అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంతో పాటు విమర్శించడాన్ని ఆ పార్టీ నాయకులు ఒక ఆనవాయితీగా పెట్టుకున్నారు'అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా మాజీ మంత్రి ఆర్‌కే రోజాను దారుణంగా అవమానించిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను తక్షణమే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.

దుర్గమ్మకు స్వర్ణ కంఠాభరణం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన అడ్డగట్ల శ్రీకాంత్, సంతోషిణి దంపతులు రూ.12 లక్షల విలువైన స్వర్ణ కంఠాభరణాన్ని శనివారం సమర్పించారు. వారు ఆలయ ఏఈవో ఎస్.రమేశ్‌బాబును కలిసి సుమారు 114 గ్రాముల బంగారం, పచ్చరాళ్లతో తయారు చేసిన కంఠాభరణాన్ని అందజేశారు. వారు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితుల ఆశీర్వదించారు. దాతలకు ఆలయ అధికారులు, స్థానాచార్య శివప్రసాద్‌శర్మ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

త్వరలో వాణిజ్య స్థాయి చిప్ ఉత్పత్తి

- నిర్మాణంలో ఆరు సెమీ కండక్టర్ యూనిట్లు
- కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్


సంగారెడ్డి జోన్: భారతదేశం త్వరలోనే మొదటి వాణిజ్య స్థాయి చిప్‌ను ఉత్పత్తి చేయనుందని కేంద్ర రైల్వే, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కంది ఐఐటీ హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 14వ స్నాతకోత్సవంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఆరు సెమీకండక్టర్ యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు, ప్రధాన డిజైన్‌తో పాటు వాటి అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అంతకుముందు కేంద్ర మంత్రికి కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ స్వాగతం పలికారు.

ముద్రగడకు అస్వస్థత



సాక్షి, ప్రతినిధి, కాకినాడ: కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం అస్వస్థతకు గురయ్యారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన శనివారం శ్వాస సంబంధిత సమస్యతో అస్వస్థతకు గురి కావడంతో కాకినాడ అహోబిలం ఆస్పత్రిలో చేర్చి, చికిత్స అందించారు. రాత్రి 10.30 గంటల సమయంలో మెరుగైన వైద్యం కోసం ఆయన్ను స్థానిక మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ముద్రగడ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

కాలుష్య పరిశ్రమలు ఓఆర్ఆర్ వెలుపలకు



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి, చిత్రంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి

- తరలింపునకు తక్షణమే కార్యాచరణ రూపొందించండి
- రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు భూముల అమ్మకాల్లో వేగం పెంచండి
- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి ఆదేశాలు
- ఆదాయవనరుల పెంపుపై సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ
- హాజరైన మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, జూపల్లి

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి వైపున ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని ఆదాయ వనరుల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. ఈ మేరకు తక్షణ కార్యాచరణ రూపొందించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం భట్టివిక్రమార్క అధ్యక్షతన సమావేశమైంది. ఈ సమావేశంలో పలుఅంశాలపై చర్చించారు. సమావేశంలో భాగంగా భట్టి మాట్లాడుతూ, పరిశ్రమల తరలింపునకు సంబంధించిన విధివిధానాలతో పాటు కేలండర్‌ను సిద్ధం చేయాలని, తరలింపు ప్రక్రియకు తుది గడువును నిర్దేశించుకోవాలని సూచించారు. సమావేశంలో భాగంగా గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలోని ఇళ్లు, ఖాళీ స్థలాల విక్రయాలను సమీక్షించారు. ఈ ఇళ్లు, స్థలాల అమ్మకాల కోసం జరిగే బహిరంగ వేలం ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సామాన్యులు, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా ధరలు నిర్ణయించాలని సూచించారు. అదేవిధంగా వివిధ ఆదాయ రాబడి శాఖల పనితీరు, ఆదాయ సమీకరణపై కూడా ఉపసంఘం చర్చించింది. నెల రోజుల వ్యవధిలో పన్నుల శాఖ 1.8 శాతం, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ 3.6 శాతం, గనుల శాఖ 7 శాతం అధిక ఆదాయం సాధించాయని మంత్రులు వెల్లడించారు. ఈ ఉపసంఘం భేటీకి సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పలు శాఖల ఉన్నతాధికారులు సంజయ్‌కుమార్, శ్రీధర్, ఇలంబర్తి, సర్ఫరాజ్, శశాంక, పలు జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

పంటలకు సమృద్ధిగా సాగునీరు

- అత్యుత్తమంగా సాగునీటి సద్వినియోగానికి ప్రణాళికలు
- ఆధునిక పరిజ్ఞానంతో ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ
- సమీక్షలో నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వానాకాలం పంటలకు సమృద్ధిగా నీరు అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అటు వానాకాలం ఇటు యాసంగిలో పంటలకు ప్రణాళికాబద్ధంగా సాగునీటిని అందించి రికార్డు స్థాయిలో 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించామని తెలిపారు. నీటిపారుదల శాఖపై శనివారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వానాకాలంలో అత్యుత్తమ రీతిలో సాగునీటిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలన్నారు. భారీ నుంచి అతిభారీ వర్షాలతో ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధతతో ఉండాలని సూచించారు. ఆనకట్టలు, జలాశయాలు, కాల్వల భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని, జలవనరులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకాల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నామని ఉత్తమ్ వెల్లడించారు. జాతీయ భౌగోళిక పరిశోధన సంస్థ (ఎన్జీఆర్ఐ), జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)ల సహకారంతో 10 కి.మీ.ల సొరంగ మార్గం పనులను సత్వరంగా పూర్తి చేస్తామని చెప్పారు. పనుల్లో అవాంతరాలు రాకుండా ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్తల సహకారంతో ఏరియల్ లైడార్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సొరంగాల నిర్మాణంలో అనుభవం కలిగిన ఆర్మీ మాజీ ఈఎన్సీ హర్పాల్ సింగ్‌ను శాఖకి గౌరవ సలహాదారుడిగా నియమిస్తున్నామని ఉత్తమ్ తెలిపారు. పూడికతీత పనులను సత్వరంగా పూర్తి చేయాలన్నారు. మున్సిపల్, పోలీసు శాఖల సహకారంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలకు గురైన వాలంతరి, ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబొరేటరీల స్థలాలను సత్వరంగా స్వాధీనం చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డీఈల నుంచి ఈఎన్సీల వరకు పదోన్నతులు కల్పించే ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఉత్తమ్ ఆదేశించారు.

ఆషాఢ





తెలంగాణ ప్రాంతంలో పెద్దమ్మ, పోచమ్మ, కట్ట మైసమ్మ, ఆరె మైసమ్మ, గండి మైసమ్మ, మాంకాళమ్మ, నల్లపోచమ్మ, పోలేరమ్మ, ఎల్లమ్మ జగదాంబిక పేర్లతో ప్రతి ఆషాఢమాసంలో అమ్మవార్లు బోనాలందుకుంటారు. అందుకే ఆషాఢం వచ్చిందంటే చాలు.... ప్రతి ఇంటా బోనాల హడావిడి కనిపిస్తుంది. ఆషాఢమాసం సందర్భంగా గత నెలలో ఆరంభమైన తెలంగాణ సాంస్కృతిక సంబురం బోనాల వేడుకలు ఆషాఢ బహుళ అమావాస్యతో ముగియనున్నాయి. నేడు పాతబస్తీలోని లాల్ దర్వాజాలో కొలువై ఉన్న సింహవాహిని అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తారు.

మీ బిడ్డలం... బోనమందుకో తల్లీ...

భక్తి, ఉత్సాహభరితమైన ఊరేగింపులు, సంబురాలు, ఆచారాలకు ప్రసిద్ధి చెందిన బోనాల పండుగ భాగ్యనగర వాసుల జీవితాలలో కొన్ని శతాబ్దాలుగా భాగమై ఉంది. ఒక్క హైదరాబాద్‌లోనే కాదు, తెలంగాణలో అత్యధికులు ఎక్కువగా జరుపుకునే పండుగల్లో బోనాలు ముఖ్యమైనది.

తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో గ్రామదేవతలకు ప్రతియేటా ఆషాఢమాసంలో పూజలు జరిపి, బోనాలు సమర్పించే ఈ సంప్రదాయం ఈనాటిది కాదు, వందల ఏళ్లుగా వస్తున్నదే. నగర వాతావరణంలో ఎన్ని హంగులు, ఆర్భాటాలు మార్పులు చేర్పులు చోటు చేసుకున్నా, కాలగమనంలో సంప్రదాయక పండుగలెన్నో పేరు తెలీకుండా అదృశ్యమై పోతున్నా, ఈ బోనాల వేడుకలు మాత్రం తమ వైభవాన్ని ఏమాత్రం కోల్పోకుండా అలనాటి ఆచార సంప్రదాయాలతో వైభవోపేతంగా నేటికీ కొనసాగుతుండడం విశేషం.

ఫొటో: ఎస్.ఎస్.ఠాకూర్

నవాబుల కాలం నుంచి...

మూసీ నది వరదల కారణంగా అంటువ్యాధులకు ఆలవాలమైన నగరంలో నాటి హైదరాబాద్ రాష్ట్ర ప్రధాని మహారాజా కిషన్‌ప్రసాద్ సలహా మేరకు నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ లాల్‌దర్వాజ సమీపంలోని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి చార్మినార్ వద్దకు చేరిన వరదనీటిలో పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలు సమర్పించాడట. అప్పటికి అమ్మ తల్లి శాంతించి నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో నవాబులే బోనాల ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఎందుకీ బోనాలు?

ఆషాఢమాసమంటే వర్షాకాలం.. అంటే అంటువ్యాధులకు ఆలవాలమైన మాసం. కలరా, ప్లేగు, మశూచి, క్షయ, తట్టు, పొంగు, అమ్మవారు వంటి అంటువ్యాధుల బారిన పడకుండా గ్రామదేవతలు గ్రామాలను చల్లంగా చూసేందుకే బోనాలు సమర్పిస్తారు. నియమనిష్ఠలతో అమ్మవారికి పసుపునీళ్లు, వేపాకులతో సాక పెడతారు. తర్వాత ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఆ తర్వాత అమ్మవారికి సమర్పించగా మిగిలిన పదార్థాలను ప్రసాదాలుగా స్వీకరిస్తారు.

అచ్చ తెలంగాణ జానపదాలు బోనాల పాటలు

ఆడామగా, చిన్న పెద్ద, ధనిక బీద తారతమ్యం లేకుండా ఆనందంతో చిందులేస్తూ చెవులకింపైన అచ్చ తెలంగాణ జానపదాలు ''గండిపేట గండెమ్మా దండం బెడత ఉండమ్మా.., బోనాలంటే బోనాలాయే బోనాల మీద బోనాలాయే.., అమ్మా బైలెల్లినాదే... అమ్మా సల్లంగ సూడమ్మ... మైసమ్మా మైసమ్మా... వంటి పాటలు, పోతురాజుల నృత్యవిన్యాసాలు, శివసత్తుల చిందులు చూపరులను అలరిస్తాయి.

పోతురాజుల చేతి కొరడా దెబ్బ...

పోతురాజు అంటే అమ్మవారికి సోదరుడు. తమ ఇంటి ఆడపడుచును ఆదరించేందుకు, ఆమెకు సమర్పించే ఫలహారపు బండ్లకు కాపలా కాసేందుకు విచ్చేసే పోతురాజులు నృత్యవిన్యాసాలు తప్పక చూడతగ్గవి. చిన్న అంగవస్త్రాన్ని ధరించి ఒళ్ళంతా పసుపు రాసుకుని కాళ్ళకు మువ్వల గజ్జెలు, బుగ్గన నిమ్మపండ్లు, కంటికి కాటుక, నుదుట కుంకుమ దిద్దుకుని మందంగా పేనిన పసుపుతాడును కొరడాగా ఝళిపిస్తూ, తప్పెట్ల వాద్యాలకు అనుగుణంగా గజ్జెల సవ్వడి చేస్తూ లయబద్ధంగా పాదాలు కదుపుతూ కన్నుల పండుగ చేస్తారు. పోతురాజుల చేతి కొరడా దెబ్బతినడానికి చాలామంది పోటీ పడుతుంటారు. ఎందుకంటే ఆ కొరడా దెబ్బ దుష్టశక్తులను, శారీరక రుగ్మతలను దూరంగా తరిమి కొడుతుందని వారి విశ్వాసం.

గోల్కొండ జగదాంబికదే తొలిబోనం

మొదట వేడుకలు గోల్కొండ జగదాంబిక ఆలయంలో ఆరంభమవడం ఆచారం. తర్వాత ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో, ఇక ఆ తర్వాత అన్నిచోట్లా బోనాల సంరంభం మొదలవుతుంది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఒక్కోరోజు ఆషాఢ ఘటోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఘటాల ఊరేగింపు తర్వాతే బోనాల వేడుకలు ప్రారంభమవుతాయి. గోల్కొండ జగదాంబిక ఆలయంలో మొదలైన ఉత్సవాలు తిరిగి ఆ అమ్మకు సమర్పించే తుదిబోనంతో ముగియడం ఆచారం.

అమ్మ... ప్రతి ఇంటి ఆడపిల్ల

ఆషాఢ మాసంలో అమ్మవారు తన పుట్టింటికి వెళుతుందని నమ్మకం. అందుకే భక్తులు ఈ పండుగ సమయంలో దేవిని దర్శించుకుని తమ స్వంత కూతురు తమ ఇంటికి వచ్చిన భావనతో, భక్తిశ్రద్ధలతోనేగాక, ప్రేమానురాగాలతో బోనాలను ఆహార నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ తంతును ఊరడి అంటారు. వేర్వేరు ప్రాంతాల్లో పెద్ద పండుగ, ఊరపండుగ వంటి పేర్లతో పిలిచేవారు. అదే తర్వాతి కాలంలో బోనాలుగా మారింది.

పండుగ రోజున స్త్రీలు పట్టుచీరలు, నగలు ధరిస్తారు. పూనకం పట్టిన కొందరు స్త్రీలు తలపై కుండని (బోనం) మోస్తూ డప్పుగాళ్ళ లయబద్ధమైన మోతలకు అనుగుణంగా దేవిని స్మరిస్తూ నర్తిస్తారు. బోనాలను మోసుకెళ్తున్న మహిళలను అమ్మవారు ఆవహిస్తారని విశ్వాసం. మహంకాళి అంశ రౌద్రాన్ని ప్రతిబింబిస్తుంది కాబట్టి ఆమెను శాంతపరచడానికై ఈ మహిళలు ఆలయాన్ని సమీపించే సమయంలో వారి పాదాలపై మిగిలిన భక్తులు నీళ్ళు కుమ్మరిస్తారు.

తొట్టెల సమర్పణ

తమ భక్తికి చిహ్నంగా ప్రతి భక్తబృందమూ ఒక తొట్టెను సమర్పించడం ఆచారంగా ఉంది.

బోనాల పండుగ సందోహం గోల్కొండ కోటలోని గోల్కొండ ఎల్లమ్మ ఆలయం వద్ద మొదలయ్యి లష్కర్ బోనాలుగా పిలువబడే సికింద్రాబాదులోని ఉజ్జయిని మహంకాళి ఆలయం, బల్కంపేట్ లోని ఎల్లమ్మ దేవాలయాల మీదుగా పాతబస్తీ ప్రాంతానికి చేరుకుంటుంది. ఆషాడంలోనే కాకుండా కొన్ని ప్రాంతాల్లో శ్రావణంలో కూడా జరుపుకుంటారు.

– డి.వి.ఆర్.



చేపకళ్ల బుజ్జీ.. బజ్జోవమ్మా!
అమ్మ నిన్ను పతంగుల ప్రపంచానికి తీసుకెళ్తుంది..
అక్కడవి మబ్బుల్లా తేలుతుంటాయి.. గాలి తరగల మీద ఎగురుతుంటాయి..
ఎరుపు, ఆకుపచ్చ.. బులుగు.. పసుపు రకరకాల వర్ణాలతో ఆకాశానికి రంగులద్దుతాయి..
నీకూ నింగిలో ఎగరాలనుందా.. మబ్బుల్లా.. పతంగుల్లా.. గాలి తెమ్మెరలా..
అయితే చిట్టి చిలకమ్మా.. నిద్దురపో హాయిగా.. సూరీడూ సద్దు మణిగి నిద్దరోయాడు..
నువ్వూ బజ్జో.. పతంగుల లోకాన్ని చూసొద్దాం!

పిల్లల కోసం కలలను నేస్తున్నారు

ఇలాంటి పోయమ్స్, రైమ్స్ మీ పాపాయి బెడ్ షీట్స్ మీదో.. బ్లాంకెట్ల మీదో ఉంటే..! హాయిగా బజ్జోవడమే కాదు.. కంటికి ఇంపైన రంగుల్లోని ఆ అక్షరాలకు ఆకర్షితులై వేవేల వర్ణాల ఊహలను పోగేసుకుంటారు.. పెద్దయ్యాక దాన్నో అద్భుత జ్ఞాపకంలా పొదువుకుంటారు. అలాంటి బాల్యాన్ని స్వచ్ఛమైన నూలు గుడ్డలో అంతే స్వచ్ఛమైన రంగుల్లో ముంచి మెత్తగా అందిస్తోంది 'వైట్‌వాటర్' అనే కిడ్స్ వేర్ బ్రాండ్! ప్యూర్ కాటన్ ఫాబ్రిక్ మీద అజ్రక్, కాంతా, కచ్, ఇక్కత్.. ఇలా దేశం నలుమూలల నైపుణ్యాలను డిజైన్ చేస్తున్నారు. వీటికి దేశంలో సరే పశ్చిమాసియా, సింగపూర్, అమెరికా, ఇటలీ దేశాల్లోనూ డిమాండ్ ఉంది. 'వైట్ వాటర్' ఇద్దరు అక్కాచెల్లెళ్ల బ్రెయిన్ చైల్డ్.. వాళ్ల అవిరామ కృషి.

వివరాల్లోకి..

శ్వేత, అంకిత ధరీవాల్ ఇద్దరూ అక్కాచెల్లెళ్లు. వీళ్ల స్వస్థలం అహ్మదాబాద్. శ్వేత స్పెషల్లీ చాలెంజ్డ్. సరిగ్గా నడవలేదు. అంకితకు విటిలిగో! వీళ్ల ప్రయాణం కేవలం పిల్లల కోసం స్కిన్ ఫ్రెండ్లీ దుస్తులను తయారుచేసే సంస్థను నెలకొల్పడమే కాదు.. గుర్తింపు, గౌరవాన్ని పొందడం కూడా! ఆ ప్రయాణం దాదాపు పద్దెనిమిదేళ్ల కిందట ఓ వేసవిలో మొదలైంది. అప్పటికి శ్వేత టెక్స్‌టైల్ డిజైనర్. రచయిత కూడా. తన పిల్లల కోసం ఆర్గానిక్ కలర్స్‌తో హాయిగా స్కిన్‌ఫ్రెండ్లీగా ఉండే కాటన్ దుస్తుల కోసం వెదుకుతోంది. ఎక్కడా దొరకలేదు. అప్పుడనిపించింది వాటిని తనే తయారు చేస్తే..? అని! అంతే! సోదరి అంకిత సహాయంతో దేశమంతా తిరిగి నాణ్యమైన నేత, నైపుణ్యం గల మహిళా చేనేత కళాకారులను కలుసుకుంది. వాళ్లందరినీ తన ప్రాజెక్ట్‌లో భాగం చేసి 2017లో 'వైట్‌వాటర్'ను ప్రారంభించింది. వైట్.. స్వచ్ఛతకు, వాటర్.. పారదర్శకమైన జీవన ప్రవాహానికి చిహ్నం. అందుకే ఆ బ్రాండ్‌లోగోలో సముద్రంలో చేప ఈదుతున్నట్టుగా ఉంటుంది. 'ఇది పిల్లలు తాము సృష్టించాలనుకుంటున్న ప్రపంచంలోని భద్రత'ను సూచిస్తుంది అంటారు ఈ అక్కాచెల్లెళ్లు. దీన్ని అంకిత డిజైన్ చేసింది. ఆమె లండన్ కాలేజ్ ఆఫ్ కమ్యూనికేషన్ విద్యార్థి. దుస్తులనేమో శ్వేత డిజైన్ చేస్తుంది. ఆ డిజైన్స్‌తో పిల్లలకు స్టోరీస్ కూడా చెప్పాలనుకుంటుంది. అందుకే పిల్లల కోసం తాము తయారు చేసే టవల్స్, బెడ్ షీట్స్, దుప్పట్లు, పిల్లో కవర్స్ మీద పొయెమ్స్, జోలపాటలు, రైమ్స్‌ను రాస్తుంది. ఈ బ్రాండ్ కుర్తా సెట్స్‌నూ తయారు చేస్తుంది.

'మాది కేవలం ఒక బ్రాండ్ కాదు.. ఒక ఉద్యమం.. గుర్తింపు కోసం, గౌరవం కోసం చేసే మూవ్‌మెంట్. అందుకే మా డిజైన్స్ ఐడెంటిటీ, డిగ్నిటీ, పొయెట్రీ, పర్పస్‌తో మిళితమై ఉంటాయి. మా ఈ బ్రాండ్ ఫిలాసఫీని మా వైకల్యమే షేప్ చేసింది' అని చెబుతారు శ్వేత, అంకిత. అలా వాళ్లు పిల్లల కోసం దుస్తులనే కాదు కలలనూ నేస్తున్నారు.

హెల్త్



• పెరిగే వత్తిడి

కంటికీ కాటే..!

ఇటీవలి జీవనశైలిలో ఒత్తిడి ఓ అనివార్యమైన విషయం. ఒత్తిడి (స్ట్రెస్) ప్రభావం దేహంలోని అనేక అవయవాల మీద ప్రతికూలంగా పడుతుందన్న సంగతి తెలిసిందే. చాలామందికి తెలియనిదేమిటంటే... ఒత్తిడి ప్రభావం కంటిపై కూడా ఉంటుందని! చాలాకాలం పాటు కంటి మీద పడే ఒత్తిడి అనేక కంటి సమస్యలను తెచ్చిపెడుతుందంటున్నారు కంటి వైద్య నిపుణులు. సుదీర్ఘకాలం పడే ఒత్తిడి కారణంగా కంటికి సంబంధించి స్వల్పమైనవి మొదలు చాలా తీవ్రమైన అనర్థాల వరకూ ఏర్పడతాయని చెబుతున్నారు. అదెలాగో చూద్దాం.

ఒత్తిడి మన అంతర్గత అవయవాలపైనా, మెదడుపైనా ప్రతికూల ప్రభావాలను చూపి, అనేక ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. ఉదాహరణకు గుండె, మానసిక ఆరోగ్యం, జీర్ణవ్యవస్థ మొదలైన అంశాలపై ఒత్తిడి ప్రభావం చాలా తీవ్రంగానే పడి గుండెపోటు మొదలుకొని, జీర్ణ సమస్యలూ, మానసిక సమస్యలూ వస్తాయి. అలాగే కంటి విషయంలో ఒత్తిడి తన దుష్ప్రభావాన్ని ఎలా తెచ్చిపెడుతుందో తెలుసుకుందాం.

కంటిపై ఒత్తిడి దుష్ప్రభావం ఎలాగంటే...

కంటిపై పడే దుష్ప్రభావాలకంటే ముందుగా... అసలు ఒత్తిడి వల్ల దేహంపై కలిగే ప్రభావాలేమిటో, అసలవి ఎందుకు కలుగుతాయో చూద్దాం. అపాయకరమైన పరిస్థితుల్లో ఒత్తిడి కలుగుతుంది. తీవ్రమైన ఒత్తిడిలో దేహం 'ఫైట్' లేదా 'ఫ్లైట్' అనే పరిస్థితికి సిద్ధమవుతుంది. అంటే 'పోరాడు' కుదరకపోతే 'పారిపో' అనే పరిస్థితులకు దేహాన్ని సిద్ధం చేస్తుంది. ఈ సమయంలో దేహంలో కార్టిసోల్, అడ్రినలిన్ అనే హార్మోన్లు వెలువడతాయి. ఆ హార్మోన్ల వల్ల దేహం చాలా కొద్ది వ్యవధిలోనే పారిపోవడానికి లేదా పోరాటానికి అవసరమైన బలాన్ని ఎక్కువ మొత్తంలో విడుదలయ్యేలా చేస్తుంది. పదే పదే కలిగే ఒత్తిడి కారణంగా కండరాలు ఒత్తిడికి గురికావడం, వాటికి అవసరమైన రక్తప్రవాహం అందకపోవడం, కండరాల్లో ఇన్‌ఫ్లమేషన్ వంటి అనర్థాలు ఏర్పడే అవకాశాలుంటాయి. కంట్లో ఉండేవీ కండరాలే కావడంతో అన్ని కండరాల్లాగానే వీటిపైన కూడా ఆ దుష్ప్రభావాలు పడతాయి.

కంటిపై ఒత్తిడి పెంచే అంశాలివి...

ఎప్పుడూ ఒత్తిడికి గురయ్యేవారిలో కళ్లపై కొన్ని దుష్ప్రభావాలు పడతాయి. అన్ని రకాల ఒత్తిళ్లతో పాటు మరికొన్ని అంశాలు కళ్లపై తమ ప్రభావాన్ని నేరుగా పడేలా చేస్తాయి. అవి... ఎక్కువ సేపు స్క్రీన్‌ను చూస్తుండటం. (అది టీవీ, కంప్యూటర్, మొబైల్ స్క్రీన్ ఏదైనా కావచ్చు); నిద్రలేకపోవడం; వేళాపాళా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు తింటుండటం... ఇవన్నీ కంటిపైనా ఒత్తిడి పడేలా చేస్తాయి.


ఒత్తిడి కారణంగా వచ్చే కంటి సమస్యలివి...

- కన్ను స్ట్రెయిన్ కావడం (ఏస్తెనోపియా): డిజిటల్ స్క్రీన్స్‌కు నిత్యం ఎక్స్‌పోజ్ అవుతూ ఉండటం. ఈ కారణంగా కళ్లు స్ట్రెయిన్ అవుతుంటే తలనొప్పి, కళ్లు పొడిబారడం, మసక మసగ్గా కనిపించడం వంటివి.
- డ్రై ఐస్: ఒత్తిడి కారణంగా కళ్లలో ప్రవించే నీరు (కన్నీరు లేదా లాక్రిమస్ సెక్రిషన్) తగ్గుతుంది. దీని కారణంగా కళ్లు పొడిబారడంతో పాటు కళ్లలో ఇసకపడ్డట్లు ఫీలింగ్, ఇరిటేషన్, కళ్లమంటల వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- బ్లర్డ్ విజన్: కంటి చుట్టూతా ఉండే కండరాలు ఒత్తిడితో బిగుసుకుపోతున్న కారణంగా... చూపు స్పష్టంగా కనిపించక ఎదుటనున్నవి మసక మసగ్గా కనిపిస్తాయి. ఒక్కోసారి ఒత్తిడి కారణంగా కళ్లలో సన్నటి కన్నీటి పొర అవరించినప్పుడూ ఇలా మసగ్గా కనిపించవచ్చు.
- కన్ను అదరడం (ట్విచ్చింగ్): కన్ను అదరడం చాలా మందిలో కనిపించే సాధారణమైన అంశం. కన్ను అదరడాన్ని బట్టి కొందరు శుభ సూచనలను / అశుభసూచకాలను దీనికి ఆపాదిస్తుంటారు. ఇలా కన్ను అదరడాన్ని (ట్విచ్చింగ్‌ను) దీన్నే వైద్య పరిభాషలో 'మయోకైమియా' అంటారు. ఇది దీనివల్ల ఎలాంటి హానీ ఉండదు. అయితే ఒక్కోసారి తీవ్రమైన ఒత్తిడి కారణంగా కన్ను అదురుతుండటం చాలా ఇబ్బందిని కలిగిస్తూ ఉంటుంది.
- కాంతికి ప్రతిస్పందించడం (లైట్ సెన్సిటివిటీ): తీవ్రమైన కాంతిలో కన్ను చాలా ఇబ్బందికి గురయ్యే విషయం తెలిసిందే. ఒత్తిడితో కన్ను రెండు రకాలుగా ఇబ్బంది పడుతుంది. తీవ్రమైన ఒత్తిడి... మైగ్రేన్‌ను కలగజేస్తుందన్న విషయం తెలిసిందే. మైగ్రేన్‌లో కన్ను మామూలు కాంతిని కూడా చూడలేకపోతుంది. అలాగే ఆరుబయట తీవ్రమైన కాంతి ఉన్నప్పుడూ కన్ను తెరుచుకోడానికి చాలా ఇబ్బంది కలుగుతుంది.
- కొన్ని కంటి భ్రమలూ, భ్రాంతులు (విజువల్ హేలూసినేషన్స్): అరుదుగా కొన్ని సందర్భాల్లో కంటికి కొన్ని దిగ్భ్రమలు కలుగతాయి. దాంతో కంటి ముందు లేనివి కూడా ఉన్నట్లు కనిపిస్తాయి. ఉదాహరణకు కొన్ని కాంతిపుంజాలు వెలుగుతున్నట్లుగానూ, అవి తేలుతూ పోతున్నట్లుగానూ (వీటినే ఫ్లోటర్స్ అంటారు), మెరుపులు మెరుస్తున్నట్లుగా దిగ్భ్రమలు కలగవచ్చు. కొన్నిసార్లు తాత్కాలికంగా కన్ను దేన్నీ చూడలేకపోవచ్చు కూడా. ముఖ్యంగా ఇలాంటివి ఆక్యులార్ మైగ్రేన్ అనే కండిషన్‌లో కలుగుతాయి.

కంటిపై ఒత్తిడి తగ్గి... కన్ను ఆరోగ్యంగా ఉండాలంటే...

- ప్రతి 20 నిమిషాలకొకసారి 20 అడుగుల దూరాన్ని 20 సెకన్ల పాటు చూస్తుండాలి.
- ప్రతి రెండు గంటలకోసారి (కంప్యూటర్ చూడ్డంలాంటి) పనికి బ్రేకిచ్చి 10 - 15 నిమిషాలు రెస్ట్ ఇవ్వాలి.
- రాత్రి నిద్రకు ఉపక్రమించే గంటా లేదా రెండుగంటల ముందర మొబైల్ ఆపేయాలి.
- రాత్రి చీకట్లో లైట్ లేకుండా మొబైల్‌గానీ, లాప్‌టాప్‌గానీ చూడకూడదు.





డా॥ హరినాథ్ బాబు కర్లపూడి, సీనియర్ కంటి వైద్య నిపుణులు

మేనేజ్‌మెంట్ / చికిత్స...

లక్షణాలను బట్టి చికిత్స ఉంటుంది. ఉదాహరణకు కన్ను పొడిబారిన సందర్భాల్లో కృత్రిమంగా కన్నీటిని ఇచ్చే చుక్కల మందులూ, ల్యూబ్రికేటింగ్ ఐ డ్రాప్స్, కన్ను సరిగా చూడలేకపోతున్న సందర్భాల్లో యాంటీ గ్లేర్ కళ్లజోడు, కన్ను పూర్తిగా అలసిపోతున్నప్పుడు కంటికి సంబంధించిన కొన్ని వ్యాయామాలను డాక్టర్లు చెబుతారు. దీనికి తోడు పూర్తి దేహానికి ఒత్తిడి తొలగేందుకు యోగా, ప్రాణాయామ వంటి కొన్ని రిలాక్సేషన్ టెక్నిక్స్ అవలంబించాలంటూ చెబుతారు. ఇక కొందరికి కౌన్సెలింగ్ అవసరమవుతుంది. దీనికి తోడు దేహానికి తగినన్ని ద్రవాలు అందుతూ దేహాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచేలా నీరూ, ద్రవాహారం తీసుకోవడం, స్క్రీన్ టైమ్ తగ్గించడం, మంచి పోషకాహారం తీసుకోవడం వంటి మంచి జీవనశైలి మార్గాలను అనుసరించాల్సి ఉంటుంది.

చివరగా... ఇటీవల వైగవంతమైన జీవనశైలిలో కంటినీ, కంటి ఆరోగ్యాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు. మొదట్లో ఒత్తిడి (స్ట్రెస్) కారణంగా కంటికి వచ్చే అనారోగ్యాలు పెద్దగా ఇబ్బంది పెట్టకపోవచ్చుగానీ... ఇదే వత్తిడి దీర్ఘకాలం ఉంటూ అదేపనిగా కంటిపై ఒత్తిడి కలగజేస్తే అది మరిన్ని దుష్పరిణామాలకు దారితీయవచ్చు. అందుకే 'చికిత్స కంటే నివారణ మేలు' అనే సూక్తిని అనుసరించి సమస్య చిన్నగా ఉన్నప్పుడే దానిపై దృష్టి కేంద్రీకరించి, దాన్ని పూర్తిగా తగ్గించుకోవలన్న వాస్తవం కంటి విషయంలో మరింతగా ఆచరించాల్సిన సత్యం.

• పెద్ద పిల్లల్లో

చొల్లు చేటే..!



చాలా చిన్నపిల్లల్లో నోటి నుంచి చొల్లు / జొల్లు కారుతుండటం చాలా కనిపించేదే. వైద్య పరిభాషలో చొల్లు/జొల్లు స్రవించే కండిషన్‌ను 'సైలోరియా' అనీ, ఇంగ్లిష్ వాడుకభాషలో దీన్ని 'డ్రూలింగ్' అని అంటారు. నెలల పిల్లల్లో ముఖ్యంగా నాలుగు నెలల నుంచి 18 నెలల వరకు చిన్నపిల్లల్లో ఇది సాధారణంగా కనిపించేదే. ఆ టైమ్‌లో అంత చిన్న పిల్లల్లో అలా చొల్లు / జొల్లు స్రవిస్తుండటం చాలా సాధారణం. కానీ నాలుగేళ్లు దాటిన తర్వాత కూడా జొల్లు కారడం జరుగుతుంటే... అంటే పెద్ద పిల్లల్లోనూ ఇదే కనిపిస్తుంటే అది కొన్ని సీరియస్ సమస్యలకు సూచన కావచ్చు. పెద్దపిల్లల్లో ఇలా చొల్లు స్రవించడానికి దానికి కారణాలేమిటో, వాళ్ల విషయంలో తీసుకోవాల్సిన చర్యలేమిటో తెలుసుకుందాం.

చిన్నారుల్లో వాళ్ల నోరు, దవడ భాగంలోని ఓరల్ మోటార్ ఫంక్షన్స్ పూర్తిగా అభివృద్ధి చెందేవరకూ ఇలా నోటి నుంచి లాలాజలం వస్తుండటం మామూలే. కానీ చిన్న పిల్లల్లో నాలుగేళ్లు దాటాక కూడా చొల్లు వస్తూనే ఉంటే దాన్ని కాస్త సీరియస్‌గా తీసుకోవాలి. అంటే దాన్ని సాధారణ విషయంగా అనుకోకుండా కాస్త అబ్‌నార్మాలిటీగా పరిగణించాలి.

పెద్ద పిల్లల్లో చొల్లు / జొల్లును సీరియస్‌గా ఎందుకు తీసుకోవాలంటే...?

కొంతమంది పెద్ద పిల్లల్లో మానసిక సమస్యలు, నరాల బలహీనతకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు ఉంటే ఇలా చొల్లు / జొల్లు కారుతుండటం జరుగుతుంది. అంటే వాళ్లలోని ఆరోగ్య సమస్య కారణంగా వాళ్ల నోట్లో స్రవించిన లాలాజలాన్ని వాళ్లు తమంతట తామే మింగలేనందువల్ల ఇలా జొల్లు / సొల్లు స్రవిస్తుంటుంది.


ఇక కొందరు చిన్న పిల్లల్లో కొన్నిసార్లు ముక్కులు విపరీతంగా బిగుసుకుపోయినా, దంత (డెంటల్) సమస్యలు ఉన్నా, మింగలేకపోవడానికి ఇంకేమైనా ఆరోగ్య సమస్యలు (ఉదా: సివియర్ ఫ్యారింగో టాన్సిలైటిస్ వంటివి) ఉన్నా చొల్లు/జొల్లు కారుతుంటుంది. పైగా ఇలాంటి సమస్యలు ఉన్నప్పుడు జొల్లు కారడం మరింత పెరుగుతుంది. అయితే ఇవన్నీ తాత్కాలికం.

తొలుత తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

పెద్ద పిల్లల్లో ఇలా చొల్లు / జొల్లు కారుతున్నప్పుడు వాళ్లంతట వాళ్లే తమ లాలాజల స్రావాన్ని మింగుతుండేలా వాళ్లకు అలవాటు చేయాలి. ఇక లాలాజల స్రావం ఎక్కువగా ఉన్న పిల్లల్లో కొన్ని ప్రత్యేకమైన దంత ఉపకరణాలు (స్పెషల్ డెంటల్ అప్లయెన్సెస్) ఉపయోగించి వాలంటరీగా వాళ్లకు మింగడం ప్రక్రియను అలవాటు చేయించవచ్చు.

అడ్వాన్స్‌డ్ చికిత్సగా...

మరికొందరిలో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో (ముఖ్యంగా పెద్దవాళ్లలో, పెద్ద పిల్లల్లో) కొన్ని మందులు వాడాల్సి ఉంటుంది. ఇటీవలి కాలంలో బొట్యులినం అనే ఒక రకం ఇంజెక్షన్‌ను లాలాజల గ్రంథుల్లోకి ఇంజెక్ట్ చేస్తున్నారు.



డా॥ శివనారాయణ రెడ్డి, సీనియర్ పీడియాట్రీషియన్

జొల్లు స్రవించే పిల్లలకు ఇవీ సూచనలు...

అన్నిటికంటే ముఖ్యంగా ఏడాదిన్నర దాటాక కూడా పిల్లల్లో చొల్లు / జొల్లు స్రవిస్తుంటే ఇలాంటి సందర్భాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కొన్ని ఉన్నాయి. అవి...

- మంచి నోటి పరిశుభ్రత (గుడ్ ఓరల్ హైజీన్)
- తరచూ గుటక వేస్తూ లాలాజలం మింగడం అలవాటు చేయడం
- నోటి కండరాల కదలికలను మెరుగు పరచడం (ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ టోన్ అండ్ మూవ్‌మెంట్ ఆఫ్ ఓరల్ మజిల్స్)... ఈ చర్యలన్నీ పిల్లల్లో చొల్లు/జొల్లు స్రవించకుండా అరికట్టడానికి బాగానే ఉపయోగపడతాయి. అప్పటికీ అలాగే స్రవిస్తుంటే పిల్లల డాక్టర్‌ను సంప్రదించి, అసలు కారణం తెలుసుకోడానికి అవసరమైన పరీక్షలు చేయించాలి. ఆ పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా చికిత్సలు ఉంటాయి.




హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్, ఎథిక్స్ ఆఫీసర్ ఎంపిక

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో ఇటీవలి వివాదాస్పద పరిణామాల నేపథ్యంలో శనివారం వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరిగింది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరిగిన ఈ ఏజీఎంలో 173 క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. గత ఎన్నికల సమయంలోనే నిషేధాన్ని ఎదుర్కొన్న 57 క్లబ్‌లకు చెందిన ప్రతినిధులను ఈ సమావేశానికి అనుమతించలేదు. పది నిమిషాల్లోనే ముగిసిన ఈ ఏజీఎంలో ఎలాంటి ప్రధాన అంశాలపై చర్చ జరగలేదు. అయితే హెచ్‌సీఏలో న్యాయపరమైన వివాదాల పరిష్కారం, మార్గనిర్దేశనానికి సంబంధించి ఖాళీగా ఉన్న రెండు కీలక పదవుల ఎంపిక జరిగింది. అసోసియేషన్ అంబుడ్స్‌మన్‌గా జస్టిస్ (రిటైర్డ్) సురేశ్ కుమార్‌ను, ఎథిక్స్ ఆఫీసర్‌గా జస్టిస్ (రిటైర్డ్) కేసీ భానులను ఎన్నుకున్నారు. మరో వైపు ఏజీఎం నిర్వహిస్తున్న సమయంలో స్టేడియం బయట తెలంగాణ డిస్ట్రిక్స్ క్రికెట్ అసోసియేషన్ (టీడీసీఏ) ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. హైదరాబాద్ తరహాలో 33 జిల్లాల్లో క్రికెట్ సంఘాలకు గుర్తింపునిచ్చి, క్రికెట్‌ను ప్రోత్సహించాలని వారు డిమాండ్ చేశారు.



కోనేరు హంపి శుభారంభం


హంపి


హారిక

- క్వార్టర్స్ తొలి గేమ్‌లో విజయం
- 'డ్రా'లతో ముగించిన హారిక, వైశాలి, దివ్య
- 'ఫిడే' మహిళల ప్రపంచ కప్ చెస్

బతుమి (జార్జియా): 'ఫిడే' మహిళల ప్రపంచ కప్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి సెమీఫైనల్‌కు చేరువైంది. శనివారం యుజిన్ సాంగ్ (చైనా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్ తొలి గేమ్‌లో హంపి విజయం సాధించింది. హంపి 53 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆట కట్టించింది. ఈ పోరులో ఇద్దరి మధ్య జరిగే రెండో గేమ్‌ను హంపి 'డ్రా'గా ముగించుకున్నా సరే సెమీ ఫైనల్లోకి ప్రవేశిస్తుంది. మరో క్వార్టర్ ఫైనల్ పోరులో ఇద్దరు భారత ప్లేయర్లు ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్ తలపడగా... తొలి గేమ్ 'డ్రా'గా ముగిసింది. 31 ఎత్తుల తర్వాత ఇద్దరు ప్లేయర్లు సమ ఉజ్జీలుగా నిలిచారు. క్వార్టర్ ఫైనల్ బరిలో నిలిచిన మరో భారత ప్లేయర్ ఆర్. వైశాలి కూడా తన తొలి గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. వైశాలి, టాన్ జోంగీ (చైనా) మధ్య హోరాహోరీగా సాగిన ఈ పోరు 72 ఎత్తుల వరకు సాగి సమంగా ముగిసింది. హారిక, దివ్య మధ్య... వైశాలి, టాన్ జోంగీ మధ్య రెండో గేమ్‌లో ఎవరు గెలిస్తే వారు సెమీస్ చేరతారు. నాలుగో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ తొలి గేమ్‌లో టింగ్‌జీ లీ (చైనా) తొలి గేమ్‌లో 40 ఎత్తుల్లో స్థానిక ప్లేయర్ జాగ్‌నిడ్జ్ నానా (జార్జియా)ను ఓడించింది.

సెమీస్‌లో అర్జున్ ఓటమి

ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్ చెస్ టోర్నీ



లాస్ వేగస్: భారత చెస్ స్టార్, తెలంగాణ గ్రాండ్ మాస్టర్ ఇరిగేశి అర్జున్... ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్ చెస్ టోర్నమెంట్ సెమీ ఫైనల్లో ఓటమి పాలయ్యాడు. అప్రతిహత విజయాలతో దూసుకొచ్చిన అర్జున్... సెమీస్‌లో 0-2 పాయింట్ల తేడాతో లెవాన్ అరోనియన్ (అమెరికా) చేతిలో ఓడాడు. ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో సెమీస్‌కు చేరిన తొలి భారత చెస్ ప్లేయర్‌గా నిలిచిన అర్జున్ కీలక పోరులో ఆకట్టుకోలేకపోయాడు. తొలి గేమ్‌లో అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్న అర్జున్... రెండో గేమ్‌ను 'డ్రా' చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ పోటీలో నిలిచేందుకు రిస్కు తీసుకొని పరాజయం పాలయ్యాడు. మరో సెమీస్‌లో హాన్స్ నీమన్ (అమెరికా) 2.5-1.5తో ఫాబియానో కరువానా (అమెరికా)పై విజయం సాధించి ఫైనల్‌కు చేరాడు. తుదిపోరులో నీమన్‌తో అరోనియన్ తలపడనున్నాడు. 'వైట్ గ్రూప్' లీగ్ దశలో నార్వే దిగ్గజం, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి 'టాపర్'గా నిలిచి ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్లో పరాజయం పాలైన భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద వర్గీకరణ మ్యాచ్‌లో 1.5-0.5తో విన్సెంట్ కీమెర్ (జర్మనీ)పై గెలుపొందాడు. ఇతర క్లాసిఫికేషన్ మ్యాచ్‌ల్లో కార్ల్‌సన్ 1.5-0.5తో జవోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్)పై, హికారు నకమురు (అమెరికా) 2-0తో లెనియర్ డొమింగెజ్ పెరెజ్ (అమెరికా)పై, వెస్లీ సో (అమెరికా) 3-1తో నొదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్)పై విజయాలు సాధించారు.

రెండో వన్డే ఇంగ్లండ్‌దే

8 వికెట్ల తేడాతో భారత మహిళల జట్టు ఓటమి

- **వరుణుడి** ప్రభావంతో సిరీస్ సమం
- **మంగళవారం** నిర్ణయాత్మక పోరు



ఇంగ్లండ్ జట్టు

లండన్: బ్యాటర్ల వైఫల్యంతో ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో భారత మహిళల జట్టు పరాజయం పాలైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం వర్షం అంతరాయం మధ్య జరిగిన పోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓడింది. ఫలితంగా సిరీస్ 1-1తో సమమైంది. భారీ వర్షం కారణంగా ఆట నిర్ణీత సమయం కంటే నాలుగు గంటలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో... మ్యాచ్‌ను 29 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టు నిర్ణీత 29 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (51 బంతుల్లో 42; 5 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (34 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు) కీలక పరుగులు చేసింది. మేఘావృతమైన వాతావరణంలో బ్యాటింగ్ ప్రారంభించిన భారత జట్టు ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కోవడంలో తడబడింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (7), ప్రతీక రావల్ (3), జెమీమా రోడ్రిగ్స్ (3), రిచా ఘోష్ (2) విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఎకెల్‌స్టోన్ 3 వికెట్లు పడగొట్టగా... ఎల్ అర్లాట్, లిన్సీ స్మిత్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ 18.4 ఓవర్లలో 102/1తో ఉన్న సమయంలో మరోసారి వరుణుడు ఆటకు అడ్డుపడటంతో డక్‌వర్త్ ప్రకారం ఆతిథ్య జట్టు లక్ష్యాన్ని 24 ఓవర్లలో 115 పరుగులకు కుదించారు. ఛేదనలో ఇంగ్లండ్ 21 ఓవర్లలో 2 వికెట్లకు 116 పరుగులు చేసింది. అమీ జోన్స్ (57 బంతుల్లో 46 నాటౌట్; 5 ఫోర్లు), బ్యూమౌంట్ (35 బంతుల్లో 34; 5 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్ చెరో వికెట్ పడగొట్టారు. ఎకెల్‌స్టోన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే మంగళవారం జరగనుంది.

స్మృతి, దీప్తి మాత్రమే...

మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు శుభారంభం దక్కలేదు. పేస్‌కు సహకరిస్తున్న పిచ్‌పై ఇంగ్లండ్ బౌలర్లు విజృంభించగా... రెండో ఓవర్‌లో ప్రతీక రావల్ ఓ చక్కటి యార్కర్‌కు అవుట్ అయింది. ఈ దశలో హర్లీన్ డియోల్ (16)తో కలిసి స్మృతి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేసింది. వీరిద్దరూ రెండో వికెట్‌కు 40 పరుగులు జోడించడంతో ఇక కుదురుకున్నట్లే అనుకుంటే... ఆ తర్వాతే టీమిండియాకు అసలు కష్టాలు ఎదురయ్యాయి. ఎకెల్‌స్టోన్ వరుస ఓవర్లలో హర్లీన్, హర్మన్‌ప్రీత్‌ను ఔట్ చేసింది. జెమీమా కీలక దశలో చార్లీ డీన్‌కు రిటర్న్ క్యాచ్ ఇవ్వగా... రిచా ఘోష్ వికెట్ల ముందు దొరికిపోయింది. దీంతో భారత జట్టు 72/5తో కష్టాల్లో పడింది. అంతసేపు పోరాడిన స్మృతి కూడా వెనుదిరగగా... చివర్లో దీప్తి శర్మ కీలక పరుగులు చేసింది. గత మ్యాచ్‌లో చక్కటి పోరాటంతో జట్టును గెలిపించిన దీప్తి అదే జోరు ఇక్కడ కూడా కొనసాగించింది. హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డి (14; 2 ఫోర్లు)తో కలిసి జట్టుకు ఓ మాదిరి స్కోరు అందించింది.

ఆదినుంచే జోరు...

ఏ క్షణమైన మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశం ఉండటంతో... ఇంగ్లండ్ ఛేదనలో ముందు నుంచే ధాటిగా ఆడింది. ఇంగ్లండ్ పేసర్లు ప్రభావం చూపిన చోట మన స్పిన్నర్లు ఆకట్టుకోలేకపోయారు. దీంతో ఓపెనర్లు అమీ జోన్స్, బ్యూమౌంట్ సులువుగా పరుగులు రాబట్టారు. తొలి వికెట్‌కు 54 పరుగులు జోడించిన అనంతరం బ్యూమౌంట్ అవుటైనా... కెప్టెన్ నటాలియా సీవర్ బ్రంట్ (21; 2 ఫోర్లు) అండతో అమీ జోన్స్ జట్టును విజయానికి చేరువ చేసింది. చివర్లో మరోసారి వర్షం ముంచెత్తడంతో ఇంగ్లండ్ లక్ష్యం మరింత కుదించుకుపోవడంతో ఆతిథ్య జట్టు సిరీస్ సమం చేసింది.

స్కోరు వివరాలు

భారత మహిళల ఇన్నింగ్స్: ప్రతీక (బి) అర్లాట్ 3; స్మృతి (సి) చార్లీ డీన్ (బి) లిన్సీ 42; హర్లీన్ (సి అండ్ బి) ఎకెల్‌స్టోన్ 16; హర్మన్‌ప్రీత్ (బి) ఎకెల్‌స్టోన్ 7, జెమీమా (సి అండ్ బి) డీన్ 3; రిచా (ఎల్బీ) (బి) ఎకెలస్టోన్ 2; దీప్తి శర్మ (నాటౌట్) 30; అరుంధతి (ఎల్బీ) (బి) లిన్సీ 14; స్నేహ్ రాణా (బి) అర్లాట్ 6; క్రాంతి గౌడ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (29 ఓవర్లలో 8 వికెట్లకు) 143. వికెట్ల పతనం:** 1-6, 2-46, 3-57, 4-69, 5-72, 6-98, 7-124, 8-135. **బౌలింగ్:** లారెన్ బెల్ 6-0-29-0; ఎమ్ అర్లాట్ 6-1-26-2; చార్లీ డీన్ 6-0-31-1; సోఫీ ఎకెల్‌స్టోన్ 6-0-27-3; లిన్సీ స్మిత్ 5-0-28-1

ఇంగ్లండ్ మహిళల ఇన్నింగ్స్: అమీ జోన్స్ (నాటౌట్) 46; బ్యూమౌంట్ (ఎల్బీ) (బి) స్నేహ్ రాణా 34; సీవర్ బ్రంట్ (బి) క్రాంతి గౌడ్ 21; డంక్లి (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (21 ఓవర్లలో 2 వికెట్లకు) 116. వికెట్ల పతనం:** 1-54, 2-102. **బౌలింగ్:** అరుంధతి 5-0-21-0; క్రాంతి గౌడ్ 3-0-29-1; శ్రీ చరణి 5-0-28-0; దీప్తి శర్మ 5-0-23-0; స్నేహ్ రాణా 3-0-12-1.


స్మృతి

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా


మహేశ్‌బాబు

విలన్ ఎవరు?

మహేశ్‌బాబు హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' (వర్కింగ్ టైటిల్). రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో హీరోయిన్ ప్రియాంకా చోప్రా, హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు చేస్తున్నారు. కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా కథ ఏంటి? షూటింగ్ ఎంత వరకూ వచ్చింది? వంటి విషయాలపై చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే ఆఫ్రికా అడవుల నేపథ్యంలో సాగే 'ఇండియానా జోన్స్' స్టైల్ కథతో ఈ సినిమా రూపొందుతోందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే... ఈ కథలో విలన్ ఎవరు? అనే విషయం సినిమా ముగిసే వరకూ ఊహించలేమట. పతాక సన్నివేశాల వరకు నెగెటివ్ రోల్ తెలియనివ్వకుండా ప్రేక్షకులను సస్పెన్స్ చేయనున్నారట రాజమౌళి. ఈ చిత్రంలో మాధవన్ కీలక పాత్రలో కనిపించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. దాంతో ఆయన విలన్‌గా కనిపించనున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి.


అలా చేసేవారిపై చర్యలు తీసుకుంటాం

● 'మెగా 157' యూనిట్


చిరంజీవి

చిరంజీవి హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'మెగా 157' (వర్కింగ్ టైటిల్). అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయనతార హీరోయిన్. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం కేరళలో జరుగుతోంది. చిరంజీవి, నయనతారలపై పెళ్లి నేపథ్యంలో మెలోడియస్ మాంటేజ్ సాంగ్‌ని చిత్రీకరిస్తున్నారు. ఈ షూటింగ్‌కు సంబంధించిన సన్నివేశాలను కొందరు రికార్డు చేసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు, ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీనిపై 'మెగా 157' మేకర్స్ స్పందించి, ఓ నోట్‌ని విడుదల చేసింది. ''మెగా 157'కి సంబంధించిన కొన్ని అనధికార వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయనే విషయం మా దృష్టికి వచ్చింది. మా అనుమతి లేకుండా సెట్స్ నుంచి ఎలాంటి కంటెంట్ రికార్డు చేయొద్దని కోరుతున్నాం. అలా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం'' అని పేర్కొన్నారు.

హిందీలో సామ్రాజ్య


విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'కింగ్‌డమ్'. ఈ చిత్రంలో భాగ్య శ్రీ భోర్సే హీరోయిన్‌గా నటించగా సత్యదేవ్ కీలక పాత్రలో నటించారు. సత్యదేవ్, విజయ్‌దే వరకొండ అన్నదమ్ముల పాత్రల్లో కనిపిస్తారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన 'కింగ్‌డమ్' చిత్రం ఈ నెల 31న రిలీజ్ కానుంది. కాగా... ఈ సినిమాకు హిందీలో 'సామ్రాజ్య' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లుగా మేకర్స్ శనివారం అధికారికంగా ప్రకటించారు.

"ఓ పెద్ద సినిమా రిలీజ్ అప్పుడు వీకెండ్‌లో టికెట్ ధరలు ఎక్కువ ఉండొచ్చన్నది నా ఉద్దేశం. విదేశాల్లో ఇలానే ఉంటుంది. కానీ మనోళ్లు ఫిక్స్ చేస్తే... వారమంతా ఒకటే రేట్ ఉంటుంది. వీక్ డేస్‌లో మామూలు ధరలు ఉంచి, వీకెండ్‌లో ధరలు పెంచుకునే సౌకర్యం ఉండాలి. అప్పుడు సినిమా టికెట్లు అందరికీ అందుబాటులో ఉంటాయి. 'భారతీయుడు' సినిమా సమయంలో కలెక్టర్స్‌ను రిక్వెస్ట్ చేసి, హైదరాబాద్, వైజాగ్‌లో టికెట్ ధరలు పెంచాను. ఇది తెలిసి రామానాయుడుగారు షాక్ అయ్యారు. రత్నం భలే చేశాడన్నారు" అని నిర్మాత ఏయం రత్నం అన్నారు. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన చారిత్రక చిత్రం 'హరిహర వీరమల్లు'. జ్యోతికృష్ణ, క్రిష్ దర్శకత్వంలో ఏయం రత్నం సమర్పణలో అద్దంకి దయాకర్ రావు నిర్మించిన ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం 'హరిహర వీరమల్లు: స్పిరిట్ వర్సెస్ స్వార్డ్' ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో నిర్మాత ఏయం రత్నం చెప్పిన విశేషాలు.

పెద్ద సినిమా ఉంటేనే చిన్న సినిమాకి చాన్స్!

- నిర్మాత ఏయం రత్నం



- నా గత చిత్రాలు 'కర్తవ్యం, భారతీయుడు' వంటివాటి తరహాలోనే 'హరిహర వీర మల్లు'లో కూడా వినోదంతో పాటు సందేశం ఉంది. 17వ శతాబ్దం నేపథ్యంలో సాగే కల్పిత కథే ఈ చిత్రం. పవన్ కల్యాణ్‌గారితో 'ఖుషి, బంగారం' చిత్రాల తర్వాత నేను చేసిన మూడో సినిమా ఇది.
- సినిమా అనేది అవసరం కాదు. ప్రేక్షకులు ఆ సినిమా పట్ల ఆసక్తిగా ఉంటే థియేటర్స్‌కు వస్తారు. లేకపోతే లేదు. కొందరు ఓటీటీలో చూద్దాంలే అని రావడం లేదు. నా సినిమా బాగుంది... కనీసం పెట్టిన డబ్బులైనా తిరిగి రావాలని, టికెట్ ధరలను పెంచమని ప్రభుత్వానికి విన్నవించుకున్నాను. తెలంగాణ ప్రభుత్వం చారిత్రక సినిమా అయితే ఇస్తామన్నారు. మాది చారిత్రక సినిమాయే అని చెప్పాం.
- ఆడియన్స్ మామూలు సినిమా తీస్తే థియేటర్స్‌కు రావడం లేదు. క్వాలిటీ సినిమా అందించాలంటే నిర్మాణ వ్యయం పెరిగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో సినిమా టికెట్‌ను పావలాకు, అర్ధణాకు అమ్మితే ఎలా వర్కౌట్ అవుతుంది. ఈ పరిస్థితుల్లో టికెట్ ధరలు తక్కువగా ఉంటే సినిమా థియేటర్స్ మూసివేయాల్సి వస్తుంది. మన నేటివిటీ ఉన్న ఒకట్రెండు సినిమాలు ఆడొచ్చు. కానీ ఈ సినిమాలే ఉంటే థియేటర్స్ అనేవి ఉండవు. ఓపెనింగ్ తెప్పించే పెద్ద సినిమాల వల్లే థియేటర్స్ ఉంటాయి. అవి ఉంటేనే కదా... చిన్న సినిమాలకు చాన్స్ ఉంటుంది.

పాన్ ఇండియా కిల్లర్

డైరెక్టర్ నుంచి యాక్టర్‌గా మారి ప్రేక్షకులను తనదైన నటనతో అలరిస్తున్నారు ఎస్‌జే సూర్య. పదేళ్ల విరామం తర్వాత ఆయన 'కిల్లర్' సినిమాతో దర్శకునిగా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన హీరోగా నటిస్తుండటంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించి, దర్శకత్వం వహిస్తున్నారు. గోకులం గోపాలన్ నేతృత్వంలో ఎస్‌జే సూర్య సొంత నిర్మాణ సంస్థ ఏంజెల్ స్టూడియోస్‌పై వీసీ ప్రవీణ్, బైజు గోపాలన్ పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రీతీ అస్రాని హీరోయిన్. ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్స్‌ని విడుదల చేశారు. ''కిల్లర్'ని పాన్ ఇండియా అంతటా ఐదు భాషల్లో రిలీజ్ చేయనున్నాం. ఏఆర్ రెహమాన్ మా చిత్రానికి మ్యూజిక్ ఇవ్వబోతున్నారు. ఎస్‌జే సూర్య, ఏఆర్ రెహమాన్ కాంబినేషన్‌లో వస్తున్న ఐదో సినిమా 'కిల్లర్'' అని చిత్రబృందం పేర్కొంది.


ఎస్‌జే సూర్య, ప్రీతి


కీర్తి సురేష్

అప్పుడు బాధ మాయం!

జీవితంలో ఆనందకర క్షణాలు ఉన్నట్లే 'అప్‌సెట్' చేసే క్షణాలు కూడా ఉంటాయి. అలా మనసు పాడైనప్పుడు దాన్ని అధిగమించడానికి ఎవరేం చేస్తారనేది వారి మనస్తత్వాన్ని బట్టి ఉంటుంది. కీర్తి సురేష్ అయితే అప్‌సెట్ అయినప్పుడు... ఫుల్లుగా ఫుడ్ లాగిస్తారట. ఈ విషయం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కీర్తి సురేష్ మాట్లాడుతూ– ''నేను అప్‌సెట్ అయ్యాననుకోండి ముందు చేసే పని ఫుల్లుగా ఫుడ్ తినడం. అలాగే కారులో ఎక్కడికైనా వెళతాను. ఎవరూ లేకుండా నేనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోతాను. అలా కారు నడుపుతూ, నచ్చిన పాటలు వింటాను. ఒకవేళ బయటకు రాకుండా ఇంట్లోనే ఉన్నానుకోండి... అప్పుడు నేనెంతో ప్రాణంగా పెంచుకుంటున్న నా కుక్కపిల్లతో ఆడుకుంటాను. ఎంత బాధలో ఉన్నా వాడి (కుక్కపిల్లని ఉద్దేశించి) ముఖం చూస్తే చాలు క్షణాల్లో బాధ మాయమైపోతుంది'' అని పేర్కొన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే... కీర్తి టైటిల్ రోల్‌లో నటించిన 'రివాల్వర్ రీటా' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఇంకా రెండు మూడు చిత్రాల్లో నటిస్తున్నారు.

అమెరికాకు షారుక్ ఖాన్



షారుక్ ఖాన్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'కింగ్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో దీపికా పదుకోన్, రాణీ ముఖర్జీ, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ముంబైలోని ఓ స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. ఇందులో భాగంగా కొన్ని భారీ యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తున్నారట సిద్ధార్థ్. ఓ యాక్షన్ సీన్‌లో డూప్ లేకుండా షారుక్ స్టంట్ చేస్తుండగా గాయపడ్డారని.... కాదు... అస్వస్థతకు గురయ్యారనే వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. కండరాల నొప్పికి సంబంధించిన అత్యవసర వైద్యం కోసం ఆయన అమెరికా వెళ్లారనే వార్తలూ చక్కర్లు కొడుతున్నాయి. అయితే... షారుక్ గాయపడ్డారా? అస్వస్థతకు గురయ్యారా? అనేది తెలియాల్సి ఉంది.

వాస్తవ ఘటనలతో రాజుగాని సవాల్


రవీందర్, బాపిరాజు, డింపుల్, దామోదర ప్రసాద్, రాశీ సింగ్

''నాకు తొలి సినిమా 'గల్ఫ్' (2017)కి అవకాశం ఇచ్చిన ముగ్గురు వ్యక్తులు బాపిరాజు, సునీల్ కుమార్ రెడ్డి, రవీందర్ రెడ్డిగార్లు. 'రాజు గాని సవాల్' మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి వస్తారా? అని బాపిరాజుగారు అడిగినప్పుడు... 'తప్పకుండా సార్' అన్నాను. ఈ చిత్రం ట్రైలర్, పాటలు బాగున్నాయి. సినిమా మంచి విజయం సాధించాలి'' అని హీరోయిన్ డింపుల్ హయతి తెలిపారు. లెలిజాల రవీందర్, రితికా చక్రవర్తి జంటగా నటించిన చిత్రం 'రాజు గాని సవాల్'. లెలిజాల కమల ప్రజాపతి సమర్పణలో లెలిజాల రవీందర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఆగస్టు 8న శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా ఈ మూవీ రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి హీరోయిన్లు డింపుల్ హయతి, రాశీ సింగ్, తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్ భూషణ్, నిర్మాతలు దామోదర ప్రసాద్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్న కుమార్, గీత రచయిత గోరటి వెంకన్న, నటుడు డా. భద్రం ముఖ్య అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''మా జీవితాల్లో జరిగిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందించిన చిత్రమిది. ఓ మధ్య తరగతి వ్యక్తికి ఎదురైన ఒక పెద్ద సమస్యను ఎలా ఎదుర్కొన్నాడు? అనేది ఈ చిత్రంలో చూస్తారు'' అన్నారు చిత్ర దర్శక-నిర్మాత-హీరో లెలిజాల రవీందర్.

వధువు కావలెను



క్రిస్టియన్ మాల / 35 / 5'10" / B.Tech, MS, MBA/Bank Manager/1,50,000/-PM / అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8919759359 [HA-16228]

బ్రాహ్మణ /30Y / 5'7"/ MBA / Employee / 40,000/-PM / సొంత ఇల్లు గల వరుడికి వధువు కావలెను. కట్న పట్టింపు లేదు. Ph : 9848023736 [HA-16228]

37 సం. గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. కుల ప్రసక్తి లేదు. నో డౌరి. Ph: 6301943220 [H-783419]


Pastor seeking a Christian Bride for their son 34 years, MBBS, PGDFM and MD (Community Medicine), having own ministry in Hyd. Bride must be minimum MBBS, PG in Medicine desirable, born again, baptised by immersion, interested in full time ministry. Interested Brides / parents may please contact WhatsApp after 2PM: 8179924420 [H-783674]

★★

కుల, వయస్సు పట్టింపు లేదు / 40Yrs/ Govt.Emp/ వరునికి ఏ బాధర బందీ లేని విడో/ రెండవ పెళ్లి వధువు కావలెను.నో బ్రోకర్స్, డైరెక్ట్: 8500291151. [T-2329]

క్రైస్తవ మాల 34 సంవత్సరాలు, 5'10". MD, GM వెల్ సెటిల్డ్ Government డాక్టర్‌కు 1st or 2nd M.B.B.S / PG డాక్టర్స్ or PG వధువు కావలెను. డైరెక్ట్‌గా సంప్రదించండి. © 94419 81671. [SCA25006317]

వరుడు కావలెను



48Y / కుల పట్టింపు లేదు/C.Govt.జాబ్, VRS/90K PM /Own బిజినెస్ సొంత ఇళ్లు & రెంట్స్ 25 ఎకరాల పొలాలు Stell factory 4L/PM 30Cr ప్రాపర్టీ వధువుకు వరుడు కావలెను/ఇల్లరికం/పిల్లలు ఉన్నా ఓకే. 8106967428 [HA-16228]

రెడ్డి /విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Qly: డిగ్రీ, Age: 31/సొంత బిజినెస్లు గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) 1st or 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9121516873 [HA-16228]

రెడ్డి /2nd మ్యారేజ్ : (కుల/ఆస్తి) పట్టింపు లేదు. 31Y/ Q: B.Com/Own Business & Land Sites/ గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం) OK/ అన్ని వయస్సుల వారికి 1st లేదా 2వ సంబంధాలు కలవు. Ph: 9030062353 [HA-16228]

రెడ్డి /విడో 35Y డిగ్రీ 8 ఎకరాల పొలం సొంత ఇల్లు కలిగి పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను (ఆస్తి కుల పట్టింపు లేదు) మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. Ph: 9885463158 [HA-16228]

SC మాల (క్రిస్టియన్) / M.Sc, Govt. జూనియర్ కాలేజ్ లెక్చరర్ / 70,000/-PM / 5'4" ఎత్తు / 29 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Only Govt. Employee. Ph: 7780254061 [HA-16228]

Caste No Bar: 26/5'4"/MBBS PG వధువుకు, IAS, IPS, డాక్టర్స్, బిజినెస్ Hyd వరుడు కావలెను. (100Cr Above గల వారు మాత్రమే) Ph: 7660803720, 6305502298 [HA-16228]

కుల ప్రసక్తి లేదు/28/5'5"/10th/మంచి తెలుపు, అందము గల వధువుకి మంచి మనసున్న వరుడు కావలెను. వెరి అర్జెంట్. వాట్సాప్: 8187053655, 6303293337 [HA-16228]

రెడ్డి /విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/Qly: B.com. Own Business గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) అన్ని కులాల వారికి అన్ని వయస్సుల వారికి వివాహాలు చూడబడును. Ph: 7207510801 [HA-16228]

రెడ్డి/ విడో / 50y / Very Fair / టీచర్ / ట్యూటోరియల్ సెంటర్ / రెండు ఇల్లు గల వధువుకి స్నేహపూర్వకమైన వరుడు కావలెను. 6309688950 [H-783550]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D.V.Koti Reddy, 690,Road No:3,Banjara Hills (TV- 9, Opp: Colony)(Near The Leela Hotel) Hyd. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5PM. www.avinashreddy.com + 91 9848011818/ + 91 9393311818

వధువు కావలెను

రెడ్డి 27, BE (BITS), MS, 6', Sr. SWE, 200 K, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 29, BE, MS, 5' 10", SWE, H1, 150 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 30, BE (IIIT), MS, 5' 10", Analyst, 30 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి 26, BE, MBA, 5' 3", 30 L P/A, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 27, BE, MS, 5' 6", SWE, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 26, BE, 5' 8", SWE, 22 L P/A, Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 28, BE, MS, 5' 8", 200 K, H1, USA, HandSome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 29, BE (IIT), MS, 6', 140 K, 10 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 27, MBBS, MD, 5' 11", PG Doctor, Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 36, MS, 5' 10", Analyst, 20 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 28, BE, MS, 5' 5", SWE, 125 K, H1, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 27, MSc, 5' 3", SME, 14.5 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 28, MBBS, MS, 5' 4", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, 27, BE, 28, 5' 3", Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

కమ్మ/ విడో /50y / Eluruలో సొంత ప్లాట్లు/Hydలో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్). 7799083500, 7386660643 [H-783550]

రెడ్డి/ విడో /50y / 5'4" / V.Fair / Govt (H.M)/ సొంత అపార్ట్‌మెంట్స్ రెంట్స్/28 ఎకరాల కొబ్బరి తోట/గ్రానైట్ బిజినెస్ గల పిల్లలులేని వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 8499909096 [H-783550]

2nd Match Reddy Bride 45 yrs, Doctor, Widow, CNB, Wanted Govt / Doctor well settled Groom Ph: © 9121444957 [B-793]

★

ఆర్య వైశ్య 1st మ్యాచ్, 27 Yrs, Qlf: 10th & 28 Yrs , Qlf: డిగ్రీ & 45 Yrs, Qlf: ఇంటర్ వధువులకు వరులు కావలెను. 2nd OK. Cell: 8142334531 [SCA25006476]

★★

కుల పట్టింపు లేదు/ విడో /50y/విజయవాడ/ Hydలో Own House(Rents) ల్యాండ్స్ Well సెటిల్ పిల్లలులేని ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-821065]

వేదికలు



శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690809 [H-783550]

నల్గొండలో మాదిగ వివాహ పరిచయ వేదిక ఆదివారం ఉ॥ 10.00 గం.ల నుండి సా॥ 6.00 గం.ల వరకు తేది : 10.8.2025 నిర్వహణ: స్వప్న వివాహ వేదిక సంప్ర : 9347046175 [H-783550]

బ్రాహ్మణ పెళ్ళి సంబంధాలకై సంప్ర: వెరిఫైడ్ ప్రొఫైల్స్ & నమ్మకమైన సంస్థ. వివాహ సంబంధాల కోసం వెంటనే కాల్ చేయండి. Ph: 9949233422(Shyam) [HA-15099]

Divorcee & Widowed వధువు, వరులకు సంప్ర: వెరిఫైడ్ ప్రొఫైల్స్ & నమ్మకమైన సంస్థ. వివాహ సంబంధాల కోసం వెంటనే కాల్ చేయండి. Ph: 8522047149 (Srinivas) [HA-15099]

Inter Caste & Caste No Bar పెళ్ళి సంబంధాలకై సంప్ర: వెరిఫైడ్ ప్రొఫైల్స్ & నమ్మకమైన సంస్థ. వివాహ సంబంధాల కోసం వెంటనే కాల్ చేయండి. Ph: 9949233422(Shyam) [HA-15099]

మాదిగ-మాల వధువు, వరులకు సంప్ర: వెరిఫైడ్ ప్రొఫైల్స్ & నమ్మకమైన సంస్థ. వివాహ సంబంధాల కోసం వెంటనే కాల్ చేయండి. Ph: 8522047149 (Srinivas) [HA-15099]

కమ్మ, కాపు, రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్ర: వెరిఫైడ్ ప్రొఫైల్స్ & నమ్మకమైన సంస్థ. వివాహ సంబంధాల కోసం వెంటనే కాల్ చేయండి. Ph: 9949233422(Shyam) [HA-15099]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1549]

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహవేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

సాగర్‌లోకి కృష్ణమ్మ పరవళ్లు

- 242.72 టీఎంసీలకు చేరిన నిల్వలు
- మూడు, నాలుగు రోజుల్లో గేట్లుఎత్తే అవకాశం
- శ్రీశైలంకు మళ్లీ పెరిగిన వరద ఉధృతి
- ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి లక్ష క్యూసెక్కులు దిగువకు విడుదల



శనివారం మధ్యాహ్నం 12 గంటలకు కృష్ణా ప్రధానపాయలో ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1,705	129.72	1699.72	103	94,080	90,000
నారాయణపూర్	1,612	37.64	1612.11	33.69	1,15,000	1,01,540
ఉజ్జయిని	1,630	117.64	1629.27	114.53	9,452	19,814
జూరాల	1,045	9.66	1041.4	7.5	1,15,000	1,22,836
తుంగభద్ర	1,626	105.79	1626	80	39,592	39,339
శ్రీశైలం	885	215.81	881.9	198.36	1,56,327	89,468
నాగార్జునసాగర్	590	312.05	564.4	242.72	67,800	1,800
పులిచింతల	175	45.77	151.51	16.82	0	400

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్‌లోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నాగార్జునసాగర్‌లోకి 67,800 క్యూసెక్కులు చేరడంతో నీటి నిల్వ 564.4 అడుగుల్లో 242.72 టీఎంసీలకు చేరుకుంది. సాగర్ నిండాలంటే ఇంకా 69 టీఎంసీలు అవసరం. ఎగువన ఉన్న జలాశయాల నుంచి భారీగా వరద విడుదల చేస్తున్న నేపథ్యంలో మరో మూడు నాలుగు రోజుల్లో నాగార్జునసాగర్ నిండుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. జూరాల, సుంకేశుల బ్యారేజ్‌ల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,56,327 క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుదుత్పత్తి ద్వారా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు 68 వేల క్యూసెక్కులను దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నాయి. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 20వేల క్యూసెక్కులు, హంద్రీ నీవా కోసం 1,013 క్యూసెక్కులను ఏపీ తీసుకుంటుండగా, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1,600 క్యూసెక్కులను తెలంగాణ తీసుకుంటోంది. మహారాష్ట్ర, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కృష్ణా ప్రధాన పాయతోపాటు మలప్రభ, ఘటప్రభలు వరదెత్తుతున్నాయి. దాంతో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ఉధృతి పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 94వేల క్యూసెక్కులు చేరుతుండగా.. 90 వేల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 1.15 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.01 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 1.15 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.22 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌కి వస్తున్న 39,339 క్యూసెక్కుల వరదను వచ్చిందొచ్చినట్టుగా దిగువన శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు.

ప్రైవేట్ ప్రాక్టీస్‌లో నైతికత, బాధ్యతాయుత వైద్యం అవసరం

ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి



న్యూరో సర్జరీపై నిర్వహించిన సదస్సులో ఆస్పత్రి చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: వైద్యవృత్తిలో చికిత్స నైపుణ్యంతో పాటు నైతికత, మెడికో-లీగల్ అవగాహన, వ్యాపార ధోరణి వంటివన్నీ సమపాళ్లలో అవసరమని, వైద్యులు మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్స్ న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో, న్యూరోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఐ) 'న్యూరో సర్జరీలో ప్రైవేట్ ప్రాక్టీషనర్స్ ఫోరం'అనే కార్యక్రమం 18, 19 తేదీల్లో ఘనంగా జరిగింది. 'హోలిస్టిక్ అప్రోచ్ టు పేషెంట్ కేర్ అండ్ ప్రాక్టీస్ సస్టెయినబిలిటీ'అనే థీమ్‌తో జరిగిన ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 300 మందికిపైగా న్యూరో సర్జన్లు హాజరయ్యారు. పలు వైద్యసంబంధ అంశాలపై ఇందులో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి చర్చల ద్వారా బాధ్యతాయుతమైన, రోగి కేంద్రిత వైద్యాన్ని ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఏఐజీ హాస్పిటల్స్ డైరెక్టర్, ఎన్ఎస్ఐ ప్రైవేట్ ప్రాక్టీషనర్స్ ఫోరం చైర్మన్ సుభోద్ రాజు, న్యూరో సర్జన్లు సాయిక ల్యాణ్, అభిరామ్, సురేశ్, రఘు తదితరులు పాల్గొన్నారు. 100 మందికిపైగా సీనియర్ నిపుణులు, యువ న్యూరోసర్జన్‌లు తమ అనుభవాలు పంచుకున్నారు.

డాక్టర్ నరేంద్ర కుమార్‌కు 'ఐఏపీఎస్-ఎస్‌పీటీఎస్ ఒరేషన్' అవార్డు



అవార్డును అందుకున్న డాక్టర్ నరేంద్ర కుమార్

సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయిలో ఇండియన్ పీడియాట్రిక్ అసోసియేషన్ అందించే ప్రతిష్టాత్మక 'ఐఏపీఎస్-ఎస్‌పీటీఎస్ ఒరేషన్'అవార్డును తెలంగాణ వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ నరేంద్ర కుమార్ శనివారం అందుకున్నారు. పీడియాట్రిక్ థొరాసిక్ సర్జరీ విభాగంలో చేసిన విశేష కృషికి డాక్టర్ నరేంద్ర కుమార్‌ను ఈ అవార్డు వరించింది. ఇండోర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేశారు. దేశంలో పీడియాట్రిక్ థొరాసిక్ సర్జరీ విభాగాన్ని నరేంద్ర కుమారే ప్రారంభించారని, ఆయన కృషితో ప్రస్తుతం దేశవ్యాప్తంగా థొరాసిక్ సర్జరీలో ఎంతో మంది నిపుణులుగా ఎదిగారని.. పీడియాట్రిక్ అసోసియేషన్ కొనియాడింది. డాక్టర్ నరేంద్ర కుమార్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు.

ఇంజనీర్ల పదోన్నతులపై సమావేశం 22న

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ల పదోన్నతులపై ఈనెల 22న సాయంత్రం 4 గంటలకు శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సమావేశం కానుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజనీర్ నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, ఈఈ నుంచి సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా పదోన్నతులు కల్పించే అంశంపై నిర్ణయం తీసుకుంటారు.

నిరసన తెలిపితే అరెస్టు చేస్తారా?: ఎర్రోళ్ల శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: గోదావరి జలాలను ఏపీ సీఎం చంద్రబాబు తరలించుకుపోతున్నారంటూ విద్యార్థులు నిరసన తెలిపితే అరెస్టు చేయడం ఏంటని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల మనోభావాలను చంద్రబాబు దగ్గర తాకట్టు పెట్టడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడాల్సింది పోయి.. కాలరాయడం దురదృష్టకరమన్నారు.

హైకోర్టు జడ్జిని పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

దుబ్బాక: హైకోర్టు జడ్జి జస్టిస్ చాడ విజయ్‌భాస్కర్ రెడ్డిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. దుబ్బాక పట్టణానికి చెందిన హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్ భాస్కర్‌రెడ్డి ఇటీవల తన ఇంట్లో జారిపడటంతో నడుముకు గాయమైంది. విషయం తెలుసుకున్న సీఎం.. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు.



పొచ్చెర అందాలకు అచ్చెరువు

బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర జలపాతం జలకళను సంతరించుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో జలపాతం వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. చుట్టుపక్కల పచ్చని ప్రకృతి.. జలపాతం అందాలను రెట్టింపు చేస్తోంది.

ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా మేడారంలో పనులు

సమ్మక్క-సారలమ్మ ఆలయ ఆధునీకరణ సమీక్షలో మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: మేడారం జాతర నేపథ్యంలో సమ్మక్క-సారలమ్మ ఆలయం ఆధునీకరణలో భాగంగా చేపట్టనున్న పనులన్నీ ఆదివాసీల సంస్కృతి ప్రతిబింబించేలా ఉండాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. శనివారం సచివాలయంలో మేడారం ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మేడారం ఆలయంలో ఆధునీకరణ పనులు చేపట్టాలని, పూజారుల సూచనలకు అనుగుణంగా ఈ పనులు ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆధునీకరణ పనుల ప్రణాళికపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిపై సీతక్క పలు మార్పులను సూచించారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల్లో ఎలాంటి మార్పులు చేయకుండా ఆలయ పరిసరాల్లోనే ఆధునిక వసతులను అభివృద్ధి చేయాలన్నారు. పూజారుల విశ్రాంతి గదులు, అత్యవసర వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, మీడియా ప్రతినిధులకు అవసరమైన వసతుల కల్పనకు సంబంధించి స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే జంపన్న వాగు అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేశామన్నారు. భక్తుల కోసం మరిన్ని వసతులు కల్పించేందుకు కుంభమేళా లాంటి పెద్ద ఉత్సవాల్లో వసతులు కల్పించిన ఏజెన్సీలను సంప్రదించి వారి సలహాలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, పీఆర్ఆర్‌డీ సంచాలకులు సృజన, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన' హాస్టల్ ఉద్యోగులకు

పెండింగ్ వేతనాలు చెల్లించండి

ప్రభుత్వాన్ని ఆదేశించిన ఎస్‌హెచ్ఆర్సీ

సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమ శాఖలోని పోస్ట్-మెట్రిక్ హాస్టల్ కార్మికులకు, రోజువారీ వేతన ఉద్యోగులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్ఆర్సీ) శనివారం ఆదేశించింది. చట్టబద్ధమైన వేతనాలను తిరస్కరించడం మానవ హక్కులను, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవనోపాధి హక్కును తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఎస్‌హెచ్ఆర్సీ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ అభిప్రాయపడ్డారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలను తీసుకోవాలని కమిషన్ సిఫార్సు చేశారు. ఈ చర్యలపై రెండు నెలల్లో నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఈ మేరకు తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల, డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు జూన్ 27న దాఖలు చేసిన ఫిర్యాదును స్వీకరించి.. విచారణ చేపట్టి తుది తీర్పు ఇచ్చారు.

కుక్కల దాడిలో బాలుడి మరణంపై సుమోటో విచారణ

మెదక్ జిల్లా శివంపేట మండలం రూపాలా తండా గ్రామంలో జూలై 18న వీధికుక్కల దాడిలో మూడేళ్ల బాలుడు మృతి చెందిన విషయం తెలిసిందే. మీడియాలో వచ్చిన కథనాలను కమిషన్ సుమోటోగా కేసు విచారణకు స్వీకరించింది. 2020 నుంచి 2025 వరకు (జూలై 19) రాష్ట్రంలో వీధికుక్కల దాడులతో సంభవించిన మరణాలపై గణాంకాలతో సమగ్ర నివేదికను అందజేయాలని సీఎస్‌ను ఆదేశించింది.

నిబంధనలు ఎందుకు పాటించలేదు?

- హెచ్‌సీఏ టెండర్ల కేటాయింపుపై సీఐడీ దర్యాప్తు
- జగన్మోహన్‌రావును టెండర్లపై ప్రశ్నించిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో నిధుల గోల్‌మాల్‌పై సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో ఏ-1గా ఉన్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతోపాటు నలుగురు నిందితులను శనివారం మూడో రోజు సీఐడీ అధికారులు ప్రశ్నించారు. మూడో రోజు దర్యాప్తులో హెచ్‌సీఏ నిధుల మళ్లింపుపై దృష్టి పెట్టారు. జగన్మోహన్‌రావును శనివారం కూడా ఉప్పల్ క్రికెట్ స్టేడియంలోని హెచ్‌సీఏ కార్యాలయానికి తీసుకెళ్లి.. 2023-24, 2024-25లలో ఐపీఎల్ నిర్వహణలో పలు టెండర్ల కేటాయింపు, అందులో నిబంధనల అతిక్రమణపై ప్రశ్నించినట్టు తెలిసింది. ప్రధానంగా ఆహార పదార్థాలు, ట్రావెల్స్ కాంట్రాక్టులు, హోటల్ బుకింగ్స్‌లో ఎందుకు నిబంధనలు అతిక్రమించారని నిలదీసినట్లు సమాచారం. ఈ-టెండర్ల విధానంలో కాకుండా కొందరికి గంపగుత్తగా కాంట్రాక్టులు అప్పగించినట్టు వచ్చిన ఆరోపణలపై ఆరా తీశారు. హెచ్‌సీఏ ట్రెజరర్ శ్రీనివాసరావు, సీఈఓ సునీల్ కాంటేలను సైతం ఉప్పల్ స్టేడియానికి తీసుకెళ్లి టెండర్ల వ్యవహారంపై వివరాలు సేకరించారు. ఐపీఎల్ టికెట్ల విక్రయ కాంట్రాక్టులు మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల కంపెనీలైన 'కంపెనీస్ ఈవెంట్స్‌నౌ.కామ్', 'మేరాఈవెంట్.కామ్'సహా పలు కంపెనీలకు అప్పగించటంపై ముగ్గురిని ప్రశ్నించారు.

మరో రెండు రోజులు భారీ వర్షాలు

- గ్రేటర్ సమీప జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి: వాతావరణ శాఖ



శనివారం రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు (సా. 6 గంటల వరకు)

జిల్లా	ప్రాంతం	వర్షం (సెం.మీ.)
మేడ్చల్	మల్కారం	9.08
మహబూబ్‌నగర్	ఉడిత్యాల	8.10
మేడ్చల్ మల్కాజిగిరి	కాప్రా	7.78
రంగారెడ్డి	తట్టిఅన్నారం	7.40
సంగారెడ్డి	కంగ్టి	7.35
నిర్మల్	నర్సాపూర్	7.10

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్రంలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజులపాటు ఇలాగే వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శనివారం గ్రేటర్ హైదరాబాద్ సమీప జిల్లాల్లో జోరు వాన నమోదైంది. హైదరాబాద్, జనగామ, మహబూబ్‌నగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నల్లగొండ, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, ఆదిలాబాద్ జిల్లాల్లో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లాల కలెక్టర్లకు సూచించింది. నైరుతి రుతుపవనాల సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. గత మూడు వారాలుగా వర్షాల జాడలేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 26.23 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 20.43 సెంటీమీటర్లు మాత్రమే కురిసింది.

శ్రీవాణి ట్రస్టు తరహాలో గరుడ ట్రస్టు టికెట్

యాదగిరి క్షేత్రంలో రూ.5 వేల టికెట్.. ఈఓ వెంకట్రావ్ వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న ఈవో వెంకట్రావ్

యాదగిరిగుట్ట: తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవాణి ట్రస్టు టికెట్ మాదిరిగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోనూ రూ.5 వేల గరుడ ట్రస్టు టికెట్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఈఓ వెంకట్రావ్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఉత్తర్వులు రాగానే గరుడ టికెట్‌ను ప్రవేశపెడతామన్నారు. గరుడ టికెట్ కొనుగోలు చేసిన భక్తులకు అంతరాలయ దర్శనంతో పాటు స్వామివారి అభిషేకం లడ్డూలు ఐదు, కిలో పులిహోర ప్రసాదం అందజేస్తామన్నారు. శనివారం యాదగిరిగుట్టపై గల తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమక్షంలో వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం రూ.800 ఉన్న సత్యనారాయణస్వామి వ్రత పూజ టికెట్ ధర కూడా రూ.1,000కి పెంచనున్నట్లు తెలిపారు. వ్రత పూజలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రతిమ, శెల్లా, కనుమ ఇస్తామన్నారు. శ్రీస్వామివారి నిత్యారాధనలు, ఇతర కార్యక్రమాలను బహుళ ప్రచారం చేసేందుకు ఆధ్యాత్మిక మాసపత్రిక, టీవీ చానల్ తీసుకువస్తామని చెప్పారు. మాస పత్రికకు, చానల్‌కు యాదగిరిగా నామకరణం చేశామన్నారు. కొండ కింద సెంట్రల్ పార్కింగ్ సమీపంలో వాహన పూజలు, వాషింగ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొండకు దిగువన ఉన్న రింగ్ రోడ్డు సర్కిళ్లలో ఏర్పాటు చేసే 60 అడుగుల వివిధ దేవుళ్ల విగ్రహాలకు రూ.3.6 కోట్లు ఖర్చు అవుతుందని, దీన్ని దేవస్థానం భరిస్తుందని తెలిపారు. దాతలు ముందుకొచ్చి విరాళాలిచ్చినా తీసుకుంటామన్నారు. సమావేశంలో అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, డిప్యూటీ ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అధికారి రామారావు ఉన్నారు.

2,5,7,10 పోస్టులు జీపీవోలకు కేటాయింపు

- పది పోస్టుల్లో నాలుగు గ్రామపాలనాధికారులకు

సాక్షి, హైదరాబాద్: గ్రామపాలనాధికారుల (జీపీవో) నియామకాల కంటే ముందు జరగాల్సిన ప్రక్రియలన్నింటినీ రెవెన్యూ శాఖ పూర్తి చేస్తోంది. ఈ పోస్టుల్లో నియామకమయ్యే జూనియర్ అసిస్టెంట్/ టైపిస్టు స్థాయి ఉద్యోగులకు పదోన్నతులిచ్చేందుకు మినిస్టీరియల్ సర్వీస్ రూల్స్‌ను ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్.లోకేశ్‌కుమార్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం అప్పటికే జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో రెవెన్యూలో పనిచేస్తున్న ఉద్యోగులకు, జీపీవోలకు సీనియర్ అసిస్టెంట్ లేదా తత్సమాన స్థాయి పదోన్నతులను 60:40 నిష్పత్తిలో ఇస్తారు. అంటే ఆరు పోస్టులు అప్పటికే రెవెన్యూ శాఖలోని ఉద్యోగులకు, నాలుగు పోస్టులు కొత్తగా జీపీవోలుగా వస్తున్న పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలకు కేటాయిస్తారు. ఈ మేరకు పది పోస్టుల్లో 2,5,7,10 స్థానాలను జీపీవోలకు కేటాయిస్తున్నట్లు సీసీఎల్ఏ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



తోటపని.. పిల్లలకు మంచిదని!

దయ, ఓర్పు, బాధ్యత వంటి సుగుణాలు గాల్లోంచి వీచి పిల్లల్లో ప్రవేశించవు. తల్లి ఒడి నేర్పించాలి. తండ్రి తన భుజాల పైకి ఎక్కించుకుని లోకాన్ని చూపించాలి. గురువు చెప్పే గద్దింపు పాఠాలు నేర్వాలి. అప్పుడే బిడ్డ ఎదుగుతాడు. ఎదిగేకొద్దీ ఒదుగుతాడు. అయితే ఇల్లు, బడి మాత్రమే కాకుండా బిడ్డకు బుద్ధులు నేర్పే పాఠాల్లో మరో ముఖ్యమైనది ఒకటి ఉంది. అదే... తోట పని. తోటను చూస్తూ, తోటలో పని చేస్తూ పెరిగి పెద్దయిన పిల్లలు సాటి మనుషులకు చల్లని నీడ అవుతారని, మానవత్వానికి ఊదలు అవుతారని మనో వైజ్ఞానిక నిపుణులు చెబుతున్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

సూర్యుడికి, చెట్లకు, పక్షులకు దూరంగా ఇళ్లలోనే పెరిగి పెద్దయి ఒకేసారి బయటికి అడుగు పెట్టే పిల్లల్లో ప్రకృతి సహజ లక్షణాలైన నెమ్మది, ప్రశాంతత ఉండవు. జీవన నైపుణ్యాలు కనిపించవు. నలుగురిలో కలవటం, కలుపుకొని పోవడం తెలియవు అని సైకాలజిస్టులు చెబుతున్నారు. కెరీర్‌లో దూసుకుపోతుంటారు కానీ, జీవితంలో ఉన్న చోటే ఉండిపోతారు. అందుకే ఈ డిజిటల్ ప్రపంచపు రోబో పిల్లల్ని తోట పనికి పంపాలి. తోటపని పిల్లల్ని మలిచే కుమ్మరి వంటిది. పెద్దయ్యాక బతకటానికి లోకంలో ఎన్నో పనులు ఉంటాయి. కానీ ఎలా బతకాలో చిన్నతనంలోనే తోట పని నేర్పిస్తుంది.



తోటపనిలోకి ఎలా దింపాలి?

ఆటలా ఉంటే చాలు, పిల్లలు దేనికైనా 'సై' అంటారు. కనుక తోటపనిని కూడా వాళ్లకు ఆటలా నేర్పించాలి. ఇందుకు మీరూ వాళ్లతో కలిసి ఆటలోకి దిగాలి. వంటింటి నుంచే మీ ఆటను మొదలుపెట్టండి. టమాటాను కోసి, అందులోంచి కొన్ని విత్తనాలను తీసి, ఎండబెట్టి, ఒక చిన్న కుండీలో నాటండి. 'ఆహారం ఏదీ నేరుగా ప్యాకెట్‌లలో వచ్చేయదు. గింజ వేయటానికి నేల, మొక్క మొలిచాక సూర్యరశ్మి కోసం సూర్యుడు, మొక్క ఫలించటానికి కొంత సమయం, అప్పటి వరకు వేచి ఉండటానికి మనకు సహనం అవసరం' అని పిల్లలకు నేర్పించటానికి ఇదొక చక్కని మార్గం.

చిన్నారులకు ఆరోగ్యకరమైన అలవాటు	
	• 'ఒకరికి ఒక మొక్క'తో సత్ఫలితాలు • బాధ్యత, క్రమశిక్షణ అలవడతాయి • ఓపిక, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి

ఒక మొక్కను అప్పగించండి

పాత టీ కప్పులు, ప్లాస్టిక్ సీసాలు లేదా టిన్ డబ్బాలలో మట్టిని నింపి చిన్న చిన్న మొక్కలను నాటండి. ఆ కప్పులు లేదా డబ్బాలకు మీ పిల్లల చేత వారికి చేతనైనట్లుగా అందమైన పెయింట్స్ వేయించండి. లేదా స్టిక్కర్లతో అలంకరించనివ్వండి. అలా ఒక రీసైకిల్ పాట్ గార్డెన్‌ను తయారవనివ్వండి. అప్పుడు వారు ఆ మొక్కల్ని తమ సొంతమైనవిగా భావిస్తారు. మొక్కకు వారినే ఏదో ఒక పేరు పెట్టమని చెప్పండి. అలా వాటితో అనుబంధం ఏర్పడుతుంది. వాటి ఆలనా, పాలనను వారే ఇష్టంగా తీసుకుంటారు. రోజూ ఉదయం నిద్ర లేవగానే వెళ్లి ఆ మొక్కను పలకరిస్తారు. చిన్నతనంలో మొక్కలతో ఏర్పడిన బాంధవ్యమే, పెద్దయ్యాక సాటి మనుషులతోనూ ఏర్పడుతుంది.

సేంద్రియ ఎరువు తయారీ

వంట గది వ్యర్థాలు, తోటలో రాలిపడిన ఆకులు, మట్టి.. వీటన్నిటినీ ఒక పారదర్శకమైన సీసాలో ఒకదానిపైన ఒకటి పొరలుగా వేసి అవన్నీ కుళ్లిపోయి సహజమైన ఎరువుగా ఎలా మారుతుందో పిల్లలకు చూపించవచ్చు. నిజంగా అదొక అద్భుతమైన ప్రయోగంగా, మారువేషంలో ఉన్న ఒక సైన్స్ పాఠంలా పిల్లలకు అనిపిస్తుంది.

విత్తనం నాటితే ఓర్పు మొలుస్తుంది

- తోటపని అంటే కేవలం మొక్కల పాదుల్ని శుభ్రం చెయ్యటం, మొక్కలకు నీళ్లు పెట్టటం మాత్రమే కాదు.
- మట్టిని తవ్వటం అనేది శ్రమించటాన్ని నేర్పిస్తుంది.
- విత్తనాలను నాటడం అన్నది ఆశగా ఎదురుచూడటం అలవరుస్తుంది.
- ఎదురుచూడటం అంటే తొందరపడకపోవటం. ఓపికపట్టడం. జీవితానికి అత్యంత కీలకమైన ఈ లక్షణాలను తోటపని బాల్యంలోనే అలవరుస్తుంది.
- ఇక మొక్కలకు నీళ్లు పెట్టటం బాధ్యత అవుతుంది. నీళ్లు పెట్టడం మర్చిపోయి, మొక్కలు వాడిపోయినప్పుడు బాధ్యతను మరువకూడదని తెలిసివస్తుంది.

ఎదిగే దశలు ఉత్తేజపరుస్తాయి

తోటపని చేసే క్రమంలో మొక్కలు ఎదగటంలోని దశలు పిల్లలను ఉత్తేజపరుస్తాయి. మొక్కలు పెరగటానికి, పువ్వులు పూయటానికి, కాయలు కాయటానికి సమయం పడుతుందని వారు గ్రహిస్తారు. స్వయంగా నాటి, నీళ్లు పోసి, సంరక్షించిన మొక్కలు పుష్పించినప్పుడు, కాయలూ పండ్లూ కాసినప్పుడు తామే ప్రకృతిని పెంచి పెద్ద చేసిన గొప్ప ఆత్మవిశ్వాసపు భావన పిల్లల్లో అంకురిస్తుంది. వారిపై వారికి నమ్మకాన్ని ఏర్పరుస్తుంది. తోటపనిలోని ఈ అనుభవాలన్నీ జీవితంలో ముమ్ముందు అక్కరకు వస్తాయి.

సృజనాత్మకత, సాత్విక గుణాలు

- తోటపని ప్రకృతితో పిల్లలకు స్నేహబంధాన్ని ఏర్పరుస్తుంది. మొదట్లో భయపెట్టిన వానపాములు తరవాత నేస్తాలు అవుతాయి. వర్షం ఉత్సాహమై కురుస్తుంది.
- తూనీగలు మీదకొచ్చి వాలతాయి. సీతాకోక చిలుకలు తలపై ఎగురుతాయి.
- పక్షులన్నీ రాగాల కోయిలలే అవుతాయి. ఇవన్నీ పిల్లల్లో సృజనాత్మకతను, సాత్విక గుణాలను ప్రేరేపిస్తాయి. ముమ్ముందు జీవితంలో అలుముకునే నిరాశ, నిస్పృహలకు, అనిశ్చిత పరిస్థితులకు కూడా తోటపనే వైద్యం, చికిత్స నేర్పి పంపుతుంది.

తోటపనితో ఏమేం తెలుస్తాయి?

- → సమస్యలను ఎలా పరిష్కరించాలి?
- → ప్రణాళికతో పనిచేయడం
- → సమయం, వనరుల సద్వినియోగం
- → లక్ష్యసాధన → కష్టం విలువ

ఏమేం పెరుగుతాయి?

- → ఆత్మవిశ్వాసం → ఆత్మగౌరవం
- → ఓర్పు, సహనం → బాధ్యత
- → ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు
- → ఎలా చేస్తే పని విజయవంతమవుతుందన్న ఆలోచనా ధోరణి
- → పర్యావరణ పరిరక్షణ స్పృహ

ఏమేం తగ్గుతాయి?

- → ఒత్తిడి, ఆందోళన → కోపం, అసహనం
- → ఒక పనిని గుడ్డిగా చేయడం
- → మొక్కలను నరికేయడం/కొట్టేయడం

క్లుప్తంగా...

టేకాఫ్ అయిన ఎనిమిది నిమిషాలకు..

పుకెట్ విమానంలో సమస్యతో శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్

శంషాబాద్ (హైదరాబాద్): టేకాఫ్ తీసుకున్న ఎనిమిది నిమిషాల ప్రయాణం తర్వాత సాంకేతిక సమస్యను గుర్తించడంతో పుకెట్ విమానం వెనక్కి తిరిగి వచ్చింది. వివరాలివి. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఐఎక్స్–110 విమానం (బోయింగ్ 737) శనివారం ఉదయం 6.41 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి థాయిలాండ్‌లోని పుకెట్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బయల్దేరేందుకు టేకాఫ్ తీసుకుంది. విమానంలో 98 మంది ప్రయాణికులున్నారు. ఉదయం 6.49 గంటల సమయంలో సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్లు.. ఏటీసీ అనుమతి మేరకు విమానాన్ని వెనక్కి మళ్లించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 6.57 గంటలకు సురక్షితంగా దించారు. సాంకేతిక సమస్యల సర్దుబాటు అనంతరం మధ్యాహ్నం 1.05 గంటలకు తిరిగి పుకెట్ విమానం బయల్దేరినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

ఈ సెట్‌లో 10,186 సీట్ల కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: ఈసెట్ తుది దశ సీట్ల కేటాయింపును సాంకేతిక విద్యావిభాగం శనివారం వెల్లడించింది. తొలి దశతో కలుపుకుని ఇప్పటివరకు ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 10,186 సీట్లు భర్తీ చేసినట్టు వెల్లడించింది. ఇందులో కూడా 6,205 సీట్లు కంప్యూటర్ కోర్సుల్లోనే భర్తీ అయ్యాయి. పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ కోర్సులు చేసిన వారు ఇంజనీరింగ్, ఫార్మసీలో ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశాలు పొందుతారు. దీనికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈసెట్) నిర్వహిస్తారు. ఈసెట్‌లో ఈ ఏడాది 17,768 మంది అర్హత పొందారు. ఫైనల్ ఫేజ్‌లో 1,245 మంది బ్రాంచీలు మార్చుకున్నారు. 2,848 మంది కొత్తగా సీట్లు పొందారు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 514 మందికి సీట్లు వచ్చాయి. ఇంజనీరింగ్‌లో 2,489, ఫార్మసీలో 1,230 సీట్లు ఇంకా మిగిలిపోయాయి. ఈ నెల 22లోగా సీట్లు వచ్చిన విద్యార్థులు రిపోర్ట్ చేయాలని సెట్ అధికారులు సూచించారు.

తుది దశ ఈసెట్ సీట్ల భర్తీ వివరాలు సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

తనిష్క్–డీ బీర్స్ 'డైమండ్ ఎక్స్‌పర్‌టైజ్ సెంటర్'

సాక్షి, హైదరాబాద్: భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన ఆభరణాల బ్రాండ్ అయిన తనిష్క్.. డీ బీర్స్ గ్రూప్ భాగస్వామ్యంతో మొట్టమొదటి తనిష్క్ వజ్రాల నైపుణ్య కేంద్రాన్ని ఆవిష్కరించినట్టు తెలిపింది. ఇది సాంకేతికత ద్వారా వజ్రాల కొనుగోలులో పారదర్శకత చూపుతుంది. దీని ద్వారా స్టోర్‌లోనే వజ్రాల మూల్యాంకన ప్రక్రియను ప్రవేశపెట్టడం ద్వారా దీర్ఘకాలంలో వినియోగదారుల అవసరాలను తీర్చనున్నట్లు వెల్లడించింది. అలాగే అత్యాధునిక సాధనాలను ఉపయోగించి, వజ్రాల నాణ్యత, మూలాన్ని అంచనా వేయడాన్ని సులభతరం చేస్తుంది. ఈ ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తనిష్క్ సీఈవో అజయ్ చావ్లా మాట్లాడుతూ 'సహజ వజ్రాల రిటైల్‌లో కొత్త ప్రమాణాన్ని నెలకొల్పడమే మా లక్ష్యం. ఇది కొనుగోలు ప్రయాణాన్ని పారదర్శకంగా మారుస్తుంది. దీంతో కస్టమర్లు వారు ఎంచుకున్న వజ్రం ప్రతి కోణాన్ని అర్థం చేసుకునేందుకు మేం వీలు కల్పిస్తున్నాం' అని తెలిపారు. వేడుకలో సుస్మితా సేన్, ఫాతిమా సనా షేక్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఏఐతో హోమ్‌వర్క్!

- కృత్రిమ మేధను వినియోగిస్తున్న 58% విద్యార్థులు
- చాట్‌బాట్స్‌లో అత్యధికంగా చాట్‌జీపీటీ వాడకం
- పాఠశాలల్లో ఏఐ బోధన కోరుతున్న స్టూడెంట్స్
- ఏఐ సమాధానాలను పూర్తిగా నమ్మని నవతరం



సాక్షి, స్పెషల్ డెస్క్: స్మార్ట్‌ఫోన్ దొరికిందంటే గంటల తరబడి గేమ్స్ ఆడే పిల్లలు మనచుట్టూనే ఉన్నారు. వినోదానికి గేమ్స్ మాత్రమే కాదు.. హోమ్‌వర్క్ కూడా పూర్తి చేసేందుకు స్మార్ట్‌ఫోన్ ఉపయోగిస్తున్నారు! అది కూడా ఆధునిక సాంకేతికత అయిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో!! అవును.. ప్రపంచవ్యాప్తంగా 58 శాతం విద్యార్థులు హోంవర్క్, అసైన్‌మెంట్స్, పాఠాలపై అవగాహన పెంచుకునేందుకు ఇప్పటికే ఏఐ ఉపయోగిస్తున్నారట. అన్నింటా మనం అన్నట్టు భారతీయ విద్యార్థులూ ఈ విషయంలో ముందున్నారు.

మొత్తం 29 దేశాలు..

'అంతర్జాతీయ ఏఐ ప్రశంసా దినోత్సవం'సందర్భంగా 'స్టూడెంట్స్ స్పీక్ ఆన్ ఏఐ'పేరుతో స్కిల్స్ ప్లాట్‌ఫామ్ 'బ్రైట్‌చాంప్స్'ఒక నివేదికను విడుదల చేసింది. ఏఐ సాధించిన విజయాలు, మన జీవితాల్లో తెస్తున్న మంచి మార్పులకు గుర్తుగా ఏటా జూలై 16ను 'అంతర్జాతీయ ఏఐ ప్రశంసా దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా.. పిల్లలు ఏఐతో మమేకమవుతున్న తీరును ఈ అధ్యయనం వెల్లడించింది. భారత్, అమెరికా, వియత్నాం, యూఏఈ సహా 29 దేశాల్లోని 1,425 మంది విద్యార్థులు ఈ సర్వేలో పాలుపంచుకున్నారు. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో ఏఐని ఉపయోగిస్తున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం విశేషం. విద్యార్థులు చాట్‌జీపీటీని అత్యధికంగా వినియోగిస్తున్నారు. తాము ఎప్పుడూ మోసం చేయడానికి ఏఐని ఉపయోగించలేదని భారత్‌లో 95 శాతం, ప్రపంచవ్యాప్తంగా 86 శాతం మంది విద్యార్థులు చెప్పడం గమనార్హం.


'ఏఐ చెప్తే నమ్మేయాలా?'

మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. ఏఐ ఇచ్చే సమాధానాలను విద్యార్థులు గుడ్డిగా నమ్మడం లేదని ఈ సర్వే స్పష్టం చేసింది. దాదాపు 70 శాతానికిపైగా పిల్లలు ఏఐ ఇచ్చిన సమాధానాలతో సంతృప్తి చెందకుండా సరిచూస్తున్నారట. మరీ ముఖ్యమైన అంశం ఏంటంటే.. దాదాపు 80 శాతం పిల్లలు ఏఐ ఇచ్చిన సమాధానాలను పూర్తిగా నమ్మడం లేదు.

పిల్లలు - ఏఐ

58%	హోంవర్క్, కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఏఐ ఉపయోగిస్తున్న విద్యార్థులు
63%	ఏఐని తరచూ వినియోగిస్తున్న భారతీయ విద్యార్థులు
62%	చాట్‌జీపీటీని అత్యధికంగా ఉపయోగిస్తున్నవారు
86%	మోసం చేయడానికి ఏఐని ఉపయోగించలేదు
34%	ఏఐ పని చేసే విధానం తెలిసిన పిల్లలు
56%	ఏఐని సద్వినియోగం చేసుకునేందుకు మార్గదర్శకత్వం కోరుతున్నవారు
38%	ఉద్యోగాలను ఏఐ ప్రభావితం చేస్తుందని ఆందోళన చెందుతున్నవారు
50%	ఇమేజ్, వీడియో.. ఏఐతో రూపొందిందా లేదా అన్నది తెలియనివారు
75%	పాఠశాలల్లో ఏఐ బోధించాలని కోరుతున్న విద్యార్థులు
10%	తమకున్న ఏఐ అవగాహనపట్ల నమ్మకంగా ఉన్నవారు
29%	ఏఐ ఇచ్చిన సమాధానాలను సరిచూడని పిల్లలు
20%	ఏఐ ఇచ్చిన తప్పుడు జవాబులను నమ్మినవారు

టుడేస్ గ్రాఫిక్



ఆధారం: క్యూఎస్(క్వక్వారెలీ సైమండ్స్) బెస్ట్ స్టూడెంట్ సిటీస్ 2026 నివేదిక

- 1–100 వరకూ స్కోర్ ఇచ్చారు. 100 అంటే ది బెస్ట్ అన్నమాట. కనీసం రెండు హై ర్యాంక్‌డ్ యూనివర్సిటీలు ఉన్న 160 నగరాలకు జాబితాలో చోటు కల్పించారు. వర్సిటీల నాణ్యత, ఆ నగరంలోని భద్రత, కాలుష్యం స్థాయి, జాబ్ మార్కెట్, ఆర్థికంగా భరించగలిగే స్తోమత(ట్యూషన్ ఫీజు, జీవన వ్యయం అందుబాటులో ఉండటం) వంటి అంశాలతోపాటు విద్యార్థుల అభిప్రాయాలనూ ర్యాంకుల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకున్నారు. ఆయా విభాగాల్లో వచ్చిన స్కోరు ఆధారంగా ఓవరాల్ స్కోరును రూపొందించారు.
- ఈ జాబితాలో సియోల్‌కు తొలి స్థానం దక్కడం ఇదే మొదటిసారి. గత ఆరేళ్లుగా లండన్ తొలి స్థానంలో ఉంది. ఆర్థికంగా భరించగలిగే స్తోమత కేటగిరీలో ఈ నగరానికి స్కోరు తగ్గడంతో ఓవరాల్ జాబితాలో మూడో స్థానానికి దిగజారింది. జాబితాలో చోటు దక్కించుకున్న భారత్ నగరాలు ముంబై(131), ఢిల్లీ(117), బెంగళూరు(130), చెన్నై(140) గతేడాదితో పోలిస్తే.. మెరుగైన స్కోరును సాధించాయి.
- ఆర్థికంగా భరించగలిగే స్తోమత కేటగిరీలో 96.5 స్కోర్‌తో ఢిల్లీ తొలి స్థానంలో ఉంది. బెంగళూరు(84.3), చెన్నై(80.1) టాప్–20 జాబితాలో చోటు దక్కించుకున్నాయి. జాబ్ మార్కెట్ విభాగంలో చెన్నై మినహా మిగిలిన మూడు నగరాలు టాప్–60 జాబితాలో ఉన్నాయి.

- సాక్షి సెంట్రల్ డెస్క్

బడి కోసం రోజూ వంద కి.మీ. జర్నీ

- పుట్టిన ఊరిలోని బడిపై విద్యార్థిని మమకారం
- కుటుంబం వలస వెళ్లినా సొంతూరి బడికొచ్చి చదువు



పానేటి పద్మ

మానకొండూర్: కిలోమీటర్ దూరంలో బడి ఉంటేనే.. అబ్బా అంత దూరమా! అని ఉసూరుమనే విద్యార్థులున్న ఈ కాలంలో ఓ విద్యార్థిని తాను పుట్టి పెరిగిన ఊరిలోని బడిపై మమకారాన్ని వదులుకోలేక, అక్కడి స్నేహితులను వదిలి ఉండలేక రోజూ ఏకంగా 100 కిలోమీటర్లు ప్రయాణించి సర్కారు బడికి వచ్చి చదువుకుంటోంది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన పానేటి నర్సయ్య, దుర్గమ్మ దంపతుల చిన్న కూతురు పద్మ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. సంచారజాతికి చెందిన నర్సయ్య, దుర్గమ్మ ఏడాదిలో ఆరు నెలలు వలస వెళ్తారు. ప్రస్తుతం వీరు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి వలసవెళ్లారు. తల్లిదండ్రులతోపాటు పద్మ కూడా వెళ్లింది. అయితే, పద్మ మనసంతా పుట్టిన ఊరు.. పాఠశాలపైనే ఉంది. దీంతో మానకొండూర్ పాఠశాలలోనే చదువుకుంటా అని తల్లిదండ్రులతో చెప్పింది. ఇల్లంతకుంట నుంచి రవాణా సౌకర్యం లేకపోవడంతో వేములవాడలో ఉంటున్న అమ్మమ్మ వద్ద ఉంటూ, నిత్యం వేములవాడ నుంచి మానకొండూర్‌కు బస్సులో బడికి వచ్చి వెళ్తోంది. ఇంట్లో నుంచి ఉదయం ఆరు గంటలకు బయలుదేరి.. సాయంత్రం ఆరు గంటలకు మళ్లీ ఇల్లు చేరుకుంటోంది. రానుపోను నిత్యం 100 కిలోమీటర్లు ప్రయాణం చేస్తోంది. పద్మ రోజూ అంతదూరం ప్రయాణించడంపై ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు ఉంటున్న ప్రాంతానికి దగ్గరలో ఉన్న మంచి స్కూల్లో చేర్పిస్తామని చెప్పినా పద్మ వినడం లేదని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. తాము చెప్పినా పద్మ వినటం లేదని ఆమె తల్లిదండ్రులు చెప్పారు. రోజూ వంద కిలోమీటర్లు ప్రయాణించినా తనకు ఏమీ ఇబ్బంది అనిపించటంలేదని పద్మ తెలిపింది. చిన్నతనం నుంచి చదివిన స్కూలును, స్నేహితులను వదిలి వెళ్లలేకనే మానకొండూరు స్కూలుకు వస్తున్నట్లు తెలిపింది.

అమ్మాయిలు 45.9 శాతం.. అబ్బాయిలు 54.1 శాతం..

ఇంజనీరింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థుల జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో ర్యాంకుల వారీగా సీట్లు పొందిన విద్యార్థుల వివరాలు వెల్లడయ్యాయి. వివిధ కారణాలతో ఈఏపీసెట్–2025లో టాపర్లు సీట్లు దక్కించుకోలేకపోయారు. కేంద్రీయ విద్యాసంస్థల్లో సీట్లు సాధించే క్రమంలోనూ కొందరు విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకోకపోవడంతో వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన వారిలో కేవలం 187 మంది విద్యార్థులు మాత్రమే సీట్లు పొందారు. ఇంజనీరింగ్ తొలివిడత సీట్ల కేటాయింపులో భాగంగా ర్యాంకుల వారీగా సీట్లు పొందిన విద్యార్థుల వివరాలను కన్వీనర్ శనివారం విడుదల చేశారు. ఈసారి ఇంజనీరింగ్ సీట్లు పొందిన వారిలో అమ్మాయిలు 45.9 శాతం ఉండగా, అబ్బాయిలు 54.1 శాతంతో ముందు వరుసలో ఉన్నారు.

ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపులో 53 శాతం బీసీలు

టీజీఈఏపీసెట్–2025 కౌన్సెలింగ్ తొలి విడతలో 77,561 సీట్లు భర్తీ అయ్యాయి. ఇందులో రిజర్వేషన్లు కేటగిరీల వారీగా పరిశీలిస్తే బీసీ కేటగిరీకి చెందిన విద్యార్థులు 53 శాతం సీట్లు దక్కించుకున్నారు. జనరల్ కేటగిరీకి చెందిన విద్యార్థులు 19.9 శాతం ఉండగా.. ఎస్సీ విద్యార్థులు 16.9 శాతం, ఎస్టీ విద్యార్థులు 10.2 శాతం ఉన్నట్లు సెట్ కన్వీనర్ తెలిపారు. తొలివిడత సీట్ల కేటాయింపు తర్వాత మిగిలిపోయిన 5,493 సీట్లు రెండో విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు.


ర్యాంకు, సీట్లు సాధించిన అభ్యర్థులు, కేటగిరీల వారీగా వివరాలు సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

తల్లిదండ్రులకు పాదపూజ



రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని ప్రజ్ఞ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆచార్య రమేశ్ గురూజీ, పాఠశాల చైర్మన్ తల్లోజు వెంకటయ్య, కరస్పాండెంట్ రాఘవేందర్, ప్రిన్సిపాల్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. - కడ్తాల్

వాతావరణ మార్పులతో.. దిగుబడులు ఆ'వరి'



- 2050లో వర్షాధార వరి దిగుబడి 20 శాతం, 2080లో 10% నుంచి 47% వరకు ఢమాల్
- 2050లో నీటిపారుదల వరి దిగుబడి 3.5 శాతం, 2080లో ఐదు శాతం క్షీణత
- భారత వ్యవసాయ పరిశోధన మండలి అధ్యయనం

సాక్షి, అమరావతి: దేశంలో వాతావరణ మార్పులతో భవిష్యత్తులో వరి, గోధుమ, మొక్కజొన్న దిగుబడులపై ప్రభావం పడుతుందని భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అధ్యయనంలో తేలింది. నేల క్షీణత, వర్షపాతం, పంట దిగుబడులపై వాతావరణ మార్పుల ప్రభావం అంచనా కోసం అధ్యయనాలు నిర్వహించినట్లు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఖరీఫ్ వర్షపాతం 2050 నాటికి 4.9 శాతం నుంచి 10.1 శాతం వరకు పెరుగుతుందని.. అలాగే, 2080 నాటికి 5.5 శాతం నుంచి 18.9 శాతం పెరుగుతుందని పేర్కొంది. రబీలో కూడా 2050 నాటికి వర్షపాతం 12 నుంచి 17 శాతానికి.. 2080 నాటికి 13 నుంచి 26 శాతం పెరుగుతుందని అధ్యయనంలో వెల్లడైనట్లు తెలిపింది. ఇలా వాతావరణ మార్పుల దృష్ట్యా లవణీయత ప్రభావిత ప్రాంతం 2030 నాటికి 6.7 మిలియన్ హెక్టార్ల నుండి 11 మిలియన్ హెక్టార్లకు పెరుగుతుందని అంచనా వేసినట్లు పేర్కొంది.

దిగుబడులపై ప్రభావం..

ఇక వాతావరణ మార్పులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోకపోతే వర్షాధార వరి దిగుబడి 2050లో 20 శాతం.. 2080లో 10 శాతం నుంచి 47 శాతం వరకు తగ్గుతుందని తెలిపింది. నీటిపారుదల వరి దిగుబడి 2050లో 3.5 శాతం, 2080లో ఐదు శాతం మేర తగ్గుతుందని కూడా వివరించింది. అలాగే.. గోధుమ దిగుబడి కూడా 2050లో 19.3 శాతం, 2080లో ఏకంగా 40 శాతం మేర తగ్గుతుంది. ఖరీఫ్‌లో మొక్కజొన్న దిగుబడి 2050లో 10 శాతం నుంచి 19 శాతం వరకు.. 2080లో 20 శాతం వరకు తగ్గుతుంది.

ఈ నేపథ్యంలో.. వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయ రంగంపై పడే ప్రతికూల ప్రభావాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. తీవ్ర వాతావరణ పరిస్థితులకు అనువైన వివిధ వాతావరణ స్థితి స్థాపక వ్యవసాయ సాంకేతికతలను ప్రభావిత జిల్లాలు, ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొంది. వాతావరణ స్థితిస్థాపక రకాలను ప్రోత్సహించడం, పంట వైవిధ్యీకరణను అమలుచేయనున్నట్లు తెలిపింది. దేశంలోని పర్యావరణ వ్యవస్థలలో వాతావరణ మార్పు ప్రభావానికి అనుగుణంగా 76 ప్రోటోటైప్ ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్ నమూనాలను ఐసీఏఆర్ అభివృద్ధి చేసినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. మారుతున్న వాతావరణానికి వ్యవసాయాన్ని మరింత స్థితిస్థాపకంగా మార్చడానికి వ్యూహాలను అమలుచేస్తున్నట్లు వెల్లడించింది.

మీ బండిపై చలాన్ ఉంది.. కట్టేయండి!

- ఆర్టీఓ ట్రాఫిక్ చలాన్ పేరిట సైబర్ మోసాలు
- ఏపీకే ఫైల్స్ పంపుతున్న సైబర్ నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ సూచన



సాక్షి, హైదరాబాద్: ట్రాఫిక్ చలాన్ చెల్లించాలంటూ సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసానికి తెరతీశారు. 'RTO Traffic Challan.apk2' పేరిట వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) ఫైల్స్ పంపుతున్నారు. ఇలాంటి లింకులు వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరహా మెసేజ్‌లు రాష్ట్రవ్యాప్తంగా పలువురికి వస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అత్యంత ప్రమాదకరమైన ఫైల్ లింకులను సాయంత్రం సమయంలో ఎక్కువగా పంపిస్తున్నట్టు వెల్లడించారు. ఆ ఏపీకే ఫైల్‌ను ఎవరైనా నిజమైనదే అనుకుని క్లిక్ చేస్తే.. మన ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల అధీనంలోకి వెళుతుంది. ఆ తర్వాత మన బ్యాంకింగ్, క్రెడిట్‌కార్డుల వివరాలు తస్కరిస్తారు. ఆ తర్వాత రిమోట్‌గా ఫోన్‌ను నియంత్రిస్తూ ఆన్‌లైన్‌లో మన బ్యాంకు ఖాతాల నుంచి, క్రెడిట్ కార్డుల నుంచి డబ్బులు కొల్లగొడతారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఎస్ఎంఎస్‌లు సైతం మనకు రాకుండా చేస్తారు. గుర్తు తెలియని వాట్సాప్ నంబర్ల నుంచి వచ్చే ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయవద్దని శిఖాగోయల్ సూచించారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలని, క్రెడిట్ కార్డులకు తప్పకుండా ఓటీపీ ఆప్షన్‌ను ఎనేబుల్ చేయాలని తెలిపారు. ఏదైనా అనుమానం ఉంటే వెంటనే కార్డును బ్లాక్ చేయాలని సూచించారు. అదేవిధంగా సైబర్ నేరాలపై వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని లేదా సైబర్ ఫ్రాడ్ రిజిస్ట్రీ 8712672222లో వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

గోవుల సేవలో..

సంరక్షణకు దాతల సహాయం
- ఆవులకు ముద్దు పేర్లు
- 200 ఆవుల సంరక్షణ
- తాటిపల్లి సురభి గోశాల నిరంతర కృషి


గోశాలలోని ఆవులు

జగిత్యాల జోన్: దూడ నుంచి కాడెద్దు వరకు.. రైతుకు సేవలందించిన పశువులను వయసు మీరిన తర్వాత కబేళాలకు తరలించడం వారిని కదిలించింది. తనువు చాలించే వరకూ వాటిని రక్షించాలని అప్పుడే సంకల్పించారు. అనుకున్నదే తడవుగా స్వచ్ఛందంగా గోశాలను ఏర్పాటు చేసి 28 ఏళ్లుగా గోవులను రక్షిస్తున్నారు. వాటి పేడతో వర్మి కంపోస్టు, గోఆధారిత ఉత్పత్తులు తయారు చేసి పలువురి మన్ననలు అందుకుంటున్నారు జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామ శివారులోని సురభి గోశాల నిర్వాహకులు.

నాలుగు ఆవులతో ప్రారంభం

1997లో దాతల సహకారంతో రెండున్నర ఎకరాల్లో గోశాలను ఏర్పాటు చేశారు. ఇందులో కొంతభాగం ఆవుల కోసం షెడ్లను నిర్మించారు. కొంతభాగంలో ఆవుల పేడతో వర్మి కంపోస్టు తయారు చేస్తున్నారు. మరో 20 గుంటల భూమిలో పాడి ఆవులు, దూడల కోసం పచ్చిగడ్డిని పెంచుతున్నారు. మొదట నాలుగు ఆవులతో ప్రారంభమైన గోశాల.. ప్రస్తుతం 200 ఆవుల వరకు చేరింది. గోశాలకు స్థలం సరిపోకపోవడంతో.. మేడిపల్లి శివారులో 41 ఎకరాలు కొనుగోలు చేశారు. అందులో పశువులను మేపడంతోపాటు పదెకరాల్లో నీలగిరి చెట్లు పెంచుతున్నారు. ప్రస్తుతం గోశాలలో 160 వరకు ఆవులు ఉన్నాయి. వంద ఆవులను మేడిపల్లి శివారు షెడ్లలో ఉంచుతున్నారు. మరో 60 ఆవులను తాటిపల్లి షెడ్లలో ఉంచుతున్నారు. గోశాల చుట్టూ ప్రహరీ గోడతో పాటు.. మూడు కుటుంబాల కూలీలు ఉండేందుకు షెడ్లు నిర్మించారు.

దాతల దాతృత్వంతో..

ప్రారంభం నుంచే గోశాల దాతల సహకారంతో నడుస్తోంది. కరోనాకు ముందు ఆవుల కోసం గడ్డిని కొనుగోలు చేసినప్పటికీ.. ప్రస్తుతం చుట్టుపక్క గ్రామాల రైతులే ఉచితంగా ఇస్తున్నారు. గతంలో ఆవులకు పుట్టిన ఆంబోతులను రైతులకు అమ్మితే.. కొంత ఆర్థికంగా కలిసి వచ్చేది. ఇప్పుడు ఉచితంగా ఇస్తామన్నా.. తీసుకునేవారు లేరు. ఫలితంగా ఆవులను రక్షించాల్సిన బాధ్యత నిర్వాహకులపై పడింది. ప్రతినెలా కూలీల ఖర్చులు, పశువుల దాణా, మందులు వంటి నిర్వహణ కోసం రూ.1.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. కిలోమీటరున్నర దూరంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద వేసిన బోరు నుండి.. గోశాలలోని నీటి తొట్టెల్లోకి తాగునీటిని పంపింగ్ చేసి పశువుల దాహార్తిని తీర్చుతున్నారు. పశువుల పేడతో వర్మి కంపోస్టు, పశువుల మూత్రంతో గో-ఆర్కను తయారు చేసి విక్రయిస్తుండటంతో, వాటిద్వారా వచ్చే అదాయం గోశాలకు కొంతమేర వెసులుబాటుగా మారింది.

గోశాలలో నిత్య పూజలు.. శిక్షణ

గోశాలలో సప్త గోసైత కృష్ణ మందిరం నిర్మించడంతో పాటు రోజూ నిత్య పూజలు చేస్తుంటారు. గోశాల కమిటీ నిర్వాహకులతో పాటు.. అక్కడి కూలీలు ఆవులను గాయత్రి, లక్ష్మి, దేవత, మల్లి అంటూ పేర్లతో పిలుస్తుంటారు. దీనికి తోడు, ఏటా కార్తీక పౌర్ణమి రోజు గోశాల వన భోజనాలు, గో పూజలతో సందడిగా ఉంటుంది. వారానికోసారి ఆవులను పశువైద్యులు పరీక్షిస్తుంటారు. గోశాలలో గో ఆధారిత వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పెట్టుబడి లేని సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చేందుకు రూ.35 లక్షలతో రైతు శిక్షణ మందిరం నిర్మించారు. ఇందులో నెలకోమారు సేంద్రియ వ్యవసాయ నిపుణులతో రైతులకు సదస్సులు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం అంతంతే..

గోశాలకు పెద్దగా ప్రభుత్వ ప్రోత్సాహం అందడం లేదు. పలు పార్టీల రాజకీయ నాయకులు గోశాలకు వచ్చినప్పటికీ.. పెద్దగా నిధులు విడుదల చేసిన దాఖలాలు లేవు. ఇది చాలదన్నట్లు, పోలీసులు ఎక్కడో పట్టుకున్న ఆవులను గోశాలలో వదిలేసి వెళ్తుండటం, వాటి నిర్వహణ ఖర్చులు కూడా ఇవ్వకుండా నెలల తరబడి ఉంచుతుండటం, కేసులో ఉన్న పశువులు చనిపోతే పోస్టుమార్టమ్ చేయించడం వంటి అనవసర సమస్యలు గోశాల నిర్వాహకులకు ఇబ్బందిగా మారాయి.

దాతల సహకారంతోనే..



దాతల సహకారంతోనే సురభి గోశాలను నిర్వహిస్తున్నాం. వర్మి కంపోస్టు అమ్మితే విద్యుత్ బిల్లుల నిర్వహణకే సరిపోవడం లేదు. కూలీల జీతాలు సైతం దాతలే చెల్లించాల్సి వస్తోంది. గోశాలకు దాతలు ఇతోధికంగా సహాయం చేసి గోశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

– తురగ రాజిరెడ్డి, గోశాల అధ్యక్షుడు, జగిత్యాల

ప్రభుత్వం ప్రోత్సాహమివ్వాలి



గోశాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి. గోశాలలో అన్ని వసతులు ఉన్నందున.. గో ఆధారిత వ్యవసాయంపై శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. గోశాల అభివృద్ధికి సైతం ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

– బందారి కమలాకర్ రావు, గోశాల ప్రధాన కార్యదర్శి, జగిత్యాల


గోశాలలో శిక్షణ పొందుతున్న రైతులు


గోశాలలో పచ్చిగడ్డి పెంపకం



ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామం

గబ్బిలాలకు కేరాఫ్.. కోమటిపల్లి

- మర్రి, రావి వృక్షాలపై గబ్బిలాల ఆవాసం
- 3 వేలకు పైగా గబ్బిలాలు సంచరిస్తున్న వైనం
- ఎండకు మృత్యువాత పడకుండా స్ప్రింక్లర్ల సాయంతో కాపాడుతున్న గ్రామస్తులు

కేసముద్రం: ఏ గ్రామంలోనైనా ఒకట్రెండు గబ్బిలాలు కనిపిస్తేనే కీడు సోకుతుందని భయాందోళనకు గురవుతుంటారు. కానీ ఈ గ్రామంలో వందల సంఖ్యలో ఆవాసం ఏర్పాటు చేసుకున్న గబ్బిలాలను అక్కడి ప్రజలు పరిరక్షిస్తూ, వాటిపట్ల ప్రేమను చూపుతున్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామం గబ్బిలాలకు ఆవాసంగా మారింది. గ్రామంలో మొదటి నుంచి శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం పక్కనున్న మర్రి, రావి వృక్షాలపై వందల సంఖ్యలో గబ్బిలాలు ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. క్రమక్రమంగా వాటి సంఖ్య పెరుగుతూ వచ్చాయి. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో గబ్బిలాలన్నీ శబ్దాలు చేస్తూ, ఊరంతా తిరుగుతూ వచ్చి వృక్షాలపై వాలుతాయి. అదే సమయంలో గ్రామస్తులు తెల్లవారిందనే సంకేతంతో నిద్రలేచేవారని స్థానికులు చెబుతుంటారు. వేసవికాలం వచ్చిందంటే వడగాలులకు తట్టుకోలేక ఆలయంలో పక్కనున్న చెట్లపై నుంచి గ్రామసమీపంలోని చెరువువద్ద ఉన్న మర్రి, రావి వృక్షాలపైకి చేరుతాయి. ఎండ తీవ్రత, వడగాలులతో గబ్బిలాలు ఆకుల్లా రాలిపోతున్న దశలో దాత అందించిన స్ప్రింక్లర్ల సాయంతో చెట్లపైనున్న గబ్బిలాలకు నీళ్లను చల్లుతూ బతికించుకుంటారు. 3 వేలకు పైగా గబ్బిలాలుండటంతో కోమటిపల్లి గ్రామం గబ్బిలాలకు కేరాఫ్‌గా మారింది.

నా చిన్నతనం నుంచి చూస్తున్నా



మా ఊరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయం పక్కనున్న చెట్లపై గబ్బిలాలు ఉండటం నా చిన్నతనం నుంచి చూస్తున్నా. గబ్బిలాలంటే అందరూ భయపడతారు. కానీ మా గ్రామంలో వందల సంఖ్యలో ఉన్న గబ్బిలాలను సంరక్షిస్తుంటాం. వేసవికాలం వచ్చిందంటే అవి చనిపోకుండా స్ప్రింక్లర్లతో నీళ్లు చల్లిస్తూ బతికించుతాం.

– జి.యాదగిరి, గ్రామస్తుడు

మా గ్రామానికి ప్రత్యేకత



మా గ్రామంలో కొన్నేళ్లుగా గబ్బిలాలు ఉన్నాయి. ఆ తర్వాత క్రమక్రమంగా వాటిసంఖ్య పెరుగుతూ వచ్చింది. గబ్బిలాలతో మాకు కీడు సోకుతుందనే భయం లేదు. పైగా వాటిని సంరక్షిస్తూ, మా గ్రామప్రజలు ప్రేమను చాటుతుంటారు. చుట్టుపక్కల ఏ గ్రామంలో గబ్బిలాలు కనిపించవు. మా ఊరిలోనే వందల సంఖ్యలో గబ్బిలాలు సంచరించడం, వృక్షాలపై ఆవాసం ఏర్పరుచుకున్నాయి. అందుకే మా గ్రామం గబ్బిలాలకు ప్రత్యేకతగా నిలుస్తుంది.

– రావుల మల్లేశం, గ్రామస్తుడు


కేసముద్రం: ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలో వృక్షాలపై ఆవాసం ఏర్పాటు చేసుకున్న గబ్బిలాలు

తొలి విడత ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు ఇలా..

ర్యాంకు	సీట్లు సాధించిన అభ్యర్థులు		
	అబ్బాయిలు	అమ్మాయిలు	మొత్తం
0-100	2	1	3
101-200	3	2	5
201-500	30	6	36
501-1000	99	44	143
1001-5000	1,660	863	2,523
5001-10000	2,158	1,521	3,679
10001-20000	3,939	3,352	7,291
20001-30000	3,752	3,397	7,149
30001-40000	3,542	3,272	6,814
40001-50000	3,319	3,011	6,330
50001-100000	13,501	11,595	25,096
100001-150000	9,487	8,266	17,753
150001-చివరి వరకు	432	307	739

కేటగిరీల వారీగా సీట్లు పొందిన విద్యార్థులు ఇలా...

	సీట్లు	పురుషులు	మహిళలు
మొత్తం	77,561	41,924	35,637
ఓసీ	15,470	8,020	7,450
బీసీ	41,087	22,436	18,651
ఎస్సీ	13,083	6,767	6,316
ఎస్టీ	7,921	4,701	3,220

తుది దశ ఈసెట్ సీట్ల భర్తీ వివరాలు...

విభాగం	కాలేజీలు	ఉన్న సీట్లు	భర్తీ అయినవి	మిగిలిన సీట్లు	భర్తీ శాతం
ఇంజనీరింగ్	168	12,618	10,129	2,489	80.27
ఫార్మసీ	123	1,287	57	1,230	4.42

ప్రధాన బ్రాంచీల్లో భర్తీ

బ్రాంచీ	సీట్లు	భర్తీ	శాతం
సీఎస్ఈ	4,050	3,175	78.40
ఐటీ	604	391	64.74
ఏఐఎంఎల్	1,837	1346	69.49
ఈసీఈ	1,712	1674	97.78
ఈఈఈ	877	877	100
సివిల్	574	563	98.08
మెకానికల్	639	576	90.14
బీఫార్మసీ	1,287	57	4.43

భారమైన విదేశీ విద్య

- రెండేళ్లుగా స్కాలర్‌షిప్ రాక ఎస్సీ విద్యార్థుల ఇక్కట్లు
- విదేశాల్లో ఫీజు భరించలేకపోతున్న తల్లిదండ్రులు
- ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించాలని వేడుకోలు

సత్తుపల్లి: సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విదేశీ విద్య ఆశలు కల్పించారు.. కానీ ఏళ్ల తరబడి ఫీజులు విడుదల చేయకపోవడంతో విదేశాల్లో ఫీజు, ఇతర ఖర్చులు భరించలేక తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారు. 2022లో అప్పటి సోషల్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ రోనాల్డ్‌రోస్ గురుకులాల విద్యార్థులకు అత్యున్నత విద్యనందించేలా శాట్ క్యాంప్ ద్వారా శిక్షణ ఇప్పించారు. అదే ఏడాది ఇంటర్ విద్యార్థులకు శాట్ పరీక్ష నిర్వహిస్తే 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఐదుగురు విద్యార్థులు అమెరికాలోని కుడ్జ్‌టౌన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదివేందుకు ఎంపికయ్యారు. ఈ మేరకు 2023 ఆగస్టులో ఇంజనీరింగ్ సీఎస్‌సీ బ్రాంచ్‌లో ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన కొక్కెరగడ్డ అనూహ్య శాంతిశ్రీరాజ్, హైదరాబాద్‌కు చెందిన పి.సృజనసింహ, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన జి.అక్షయ చేరారు.

రెండేళ్లయినా..

విదేశీ విద్యపై ఆశతో అమెరికా వెళ్లి రెండేళ్లు పూర్తి కావొస్తున్నా.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఈ ముగ్గురికీ ఫీజు చెల్లించలేదు. ఏటా 6వేల డాలర్ల చొప్పున రెండేళ్లకు ఒక్కొక్కరికి 12 వేల డాలర్లను రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌గా మంజూరు చేయాల్సి ఉంది. ఏటా ఆరు వేల డాలర్ల స్కాలర్‌షిప్ ఇస్తామని అప్పటి ప్రభుత్వం చెప్పడంతో.. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో విమాన టికెట్లు, ఫీజులకు అప్పులు చేసి పంపించారు. ఇప్పటికి ఒక్కొక్క విద్యార్థిపై సుమారు రూ.46 లక్షలు వెచ్చించినా.. ప్రభుత్వం నుంచి విడుదల కాక అప్పులు ఎలా తీర్చాలా? అని ఆందోళన చెందుతున్నారు.

అధికారుల చుట్టూ తిరుగుతూ..

విదేశీ విద్య స్కాలర్‌షిప్‌లు అందించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు రెండేళ్ల నుంచి ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, సచివాలయంలో ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంతకంటే ముందు బ్యాచ్‌కు స్కాలర్‌షిప్ ఇవ్వడంతో.. ఆ ఆశతోనే విదేశీ విద్య వైపు మొగ్గు చూపామని చెబుతున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఎటువంటి మార్గదర్శకాలు ఇవ్వకపోవడంతో.. చదువు మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి వస్తుందని వాపోతున్నారు.

సీఎం జోక్యం చేసుకుంటేనే..

విదేశీ విద్య స్కాలర్‌షిప్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుంటే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం చొరవ చూపి ఎస్సీ విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయకుండా చూడాలని వేడుకుంటున్నారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించినందున తమ సమస్యలు పరిష్కరించాలని అభ్యర్థిస్తున్నారు.


శనివారం శంకరపల్లి రైల్వే స్టేషన్ నుంచి రైల్లో కాజీపేట వెళ్తున్న కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు తదితరులు

శాంతిభద్రతల పరిరక్షణలో రేవంత్ అట్టర్‌ఫ్లాప్

- కేపీ వివేకానంద్ విమర్శ

సాక్షి, హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు గాంధీభవన్‌లో వీధి భాష మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. గూండాలా నడి రోడ్డులో బలహీనవర్గాలకు చెందిన కార్పొరేటర్లపై దాడులకు పాల్పడిన మైనంపల్లిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాటు మంత్రిగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన కేటీఆర్‌ను షాడో ముఖ్యమంత్రిగా పనిచేశారని విమర్శించిన మైనంపల్లి, బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కాళ్లు ఎందుకు మొక్కారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి శనివారం కేపీ వివేకానంద్ మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ తనకు రాజకీయ పునర్జన్మ ఇచ్చారని గతంలో పొగిడిన మైనంపల్లి ప్రస్తుతం మితిమీరి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శాంతిభద్రతల పరిరక్షణలో హోంమంత్రిత్వ శాఖ బాధ్యతలు చూస్తున్న రేవంత్‌రెడ్డి అట్టర్‌ఫ్లాప్ అయ్యాడన్నారు. మైనంపల్లి తన వైఖరి మార్చుకోకుంటే ఊహించని పరిణామాలు ఉంటాయని వివేకానంద్ హెచ్చరించారు. గాంధీభవన్‌లో గాడ్సేలు మాట్లాడుతున్నారని, గతంలో రౌడీషీట్లు తెరిచి పోలీసు స్టేషన్లలో ఎవరిని బట్టలు విప్పి కొట్టారో మైనంపల్లి మర్చిపోయారని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు.

రాజ్‌భవన్‌లో ఘనంగా బోనాలు

సాక్షి, హైదరాబాద్: రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుధాదేవ్ వర్మ దంపతులు శనివారం ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు. గవర్నర్ సతీమణి సుధాదేవ్ వర్మ బోనమెత్తి ఉత్సవాల్లో పాల్గొన్నారు. దేశం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు గవర్నర్ తెలిపారు.



వర్షాకాలం కావడంతో కుండలు కొనేవారు కరువయ్యారు. వ్యాపారం మందగించడంతో చేసేదిలేక ఈ మహిళలు ఇలా ఫోన్ చూస్తూ కాలం గడుపుతున్నారు. అనంతపురం నగరంలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ప్రకృతి అందాలకు మన్యం ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన చిరునామా. ఆకాశంలో తేలియాడిన వెండి మబ్బులు, పచ్చని పొలాలపై గొడుగు కప్పినట్టుగా కనువిందు చేశాయి. పాడేరు పరిసరాల్లో ఈ సుందర దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. - సాక్షి, పాడేరు



రాత్రిపూట చురుగ్గా ఉండే గబ్బిలం పగలు మాత్రం చెట్లపైన తలకిందులుగా వేలాడుతూ విశ్రాంతి తీసుకుంటుంది. నెల్లూరు జిల్లా వెంకటాచలం సమీపంలోని హైవేకు ఇరువైపులా ఉన్న చెట్లపైన గబ్బిలాలు ఇలా గుంపులు గుంపులుగా వేలాడుతూ కనిపించాయి - సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్టుమెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వరకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 73,093 మంది స్వామిని దర్శించుకున్నారు. 31,570 మంది భక్తులు తలనీలాలు ఇచ్చారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.21 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

మద్దిలో అభిషేక సేవ

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రతి శనివారం నిర్వహించే అభిషేక సేవ సందర్భంగా ఆలయ ముఖ మండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. ఏలూరు జిల్లా పావులూరివారిగూడేనికి చెందిన శ్రీనివాస భజన మండలి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. వివిధ సేవలు, విరాళాల ద్వారా ఆలయానికి రూ.1,10,790 ఆదాయం సమకూరినట్టు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

పారిజాతగిరిలో పూజలు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో శనివారం వేకువజాము నుంచే సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, తీర్థ ప్రసాద గోష్ఠి, బాల భోగ నివేదన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు జిల్లా నలుమూలల నుంచి కొండ పైకి వచ్చి స్వామివారి ప్రత్యేక అష్టోత్తర పూజలు జరిపించుకున్నారు. ఆలయానికి విరాళాల ద్వారా రూ.17,107, పూజా టిక్కెట్ల ద్వారా రూ.15,695, ప్రసాదాల ద్వారా 23,060 కలిపి మొత్తం రూ.55,862 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి కలగర శ్రీనివాస్ తెలియజేశారు.

తింటే.. కడుపు మంటే

- సత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి నల్లమాడ వెళ్లే దారిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఓ రెస్టారెంటులో నలుగురు స్నేహితులు వెళ్లి పార్టీ చేసుకున్నారు. తినేందుకు ఆర్డర్ ఇవ్వగా.. చికెన్ ముక్కలపై విపరీతమైన ఎరుపు రంగు ఉంది. రుచి తేడాగా ఉండటంతో నిర్వాహకులను ప్రశ్నిస్తే.. కొత్తగా ఏర్పాటు చేశామని.. నిబంధనల గురించి తెలియదని చెప్పారు. రుచి కోసం మాస్టర్ ఏం చేస్తున్నాడో సరిగా తెలియదని సమాధానం ఇవ్వడంతో కస్టమర్లు అవాక్కయ్యారు.

- ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం నుంచి కొద్దిగా ముందుకెళ్లిన తర్వాత బ్రిడ్జి పక్కన ఓ ఇంట్లో మెస్ ఏర్పాటు చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లోనే వండుతూ వడ్డిస్తున్నారు. గత్యంతరం లేని ప్రజలు బస్టాండుకు సమీపంలో ఉంటుందని అక్కడే తిని వెళ్తుంటారు. అపరిశుభ్రత గురించి నిర్వాహకులను అడిగితే... 'తింటే తినండి.. లేదంటే లేదు' అని చెబుతున్నారు.

- విచ్చలవిడిగా ఆహారం కల్తీ
- బయట దొరకని నాణ్యమైన ఆహార
- అపరిశుభ్ర వాతావరణంలో వంటల తయారీ
- రంగు, రుచి కోసం ప్రమాదకర రసాయనాల వాడకం
- హోటల్ ఆహారంతో చుట్టుముడుతున్న కొత్త రోగాలు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల నామమాత్రపు తనిఖీలు
- లాభాపేక్షలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులు



సాక్షి, పుట్టపర్తి: జీవన శైలిలో వచ్చిన మార్పులతో ఆహారపు అలవాట్లు కూడా చాలా వరకు మారిపోయాయి. ప్రస్తుతం ఉరుకుల పరుగులు జీవితంలో చాలా మంది ఇంటి భోజనం కంటే హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, బేకరీ ఫుడ్‌కు ఓకే చెబుతున్నారు. ఇక వారంతాల్లో చాలామంది కుటుంబాలతో సహా బయటకు వెళ్లి బిర్యానీలు, స్పైసీ ఫుడ్ తినేందుకు ఇష్టపడుతున్నారు. కానీ హోటళ్ల నిర్వాహకులు మాత్రం డబ్బులు తీసుని ఆహారం పేరుతో అనారోగ్యాన్ని వడ్డిస్తున్నారు. నిల్వ ఉన్న పదార్థాలు, పలు రసాయనాలతో చేసిన వంటకాలు వడ్డిస్తూ జనం ప్రాణాలతో ఆడుకుంటున్నారు.

పెరిగిన పార్టీ కల్చర్..

పాతికేళ్ల క్రితం వరకు ఎక్కడికైనా వెళ్లినా భోజనం సమయానికి ఇంటికి వచ్చేవారు. రాలేని పరిస్థితులు ఉన్నపుడే మాత్రమే హోటళ్లలో తినేవారు. కొందరు ఎంత సమయమైనా ఇంటికి వచ్చే భోజనం చేసేవారు. బయటి ఆహారాన్ని తీసుకునేవారు కాదు. సంపాదనలో తక్కువ ఖర్చు చేసి, ఎక్కువ దాచుకునేవారు. కానీ ఇప్పుడు 'కల్చర్' మారింది. 'సోషియల్ బిహేవియర్'లో తేడా వచ్చింది. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోకి 'పార్టీ కల్చర్' చొచ్చుకువచ్చేసింది. బర్త్‌డే, మ్యారేజ్‌డే, ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్.. సందర్భం ఏదైనా 'పార్టీలు' ఇస్తున్నారు. ఇంటి భోజనం కంటే రెస్టారెంట్లలోని ఆహారం తినడానికే మొగ్గు చూపుతున్నారు. నలుగురు స్నేహితులు కలిస్తే డిన్నర్ బయట చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో ఉన్నారు కానీ, ఆరోగ్యకర, పోషకాహారాన్ని తింటున్నామా? లేదా? అనేది గ్రహించలేక పోతున్నారు. పైగా ఏ కల్తీ ఆహారమో కూడా కనిపెట్టలేక...హోటల్ యజమాని పెట్టింది తింటున్నారు.



కొత్తచెరువు మార్కెట్‌లో పండ్ల పరిశీలన (ఫైల్)

నిబంధనలు తూచ్..

జిల్లాలో చిన్నా, పెద్ద హోటల్స్, రెస్టారెంట్స్, దాభాలు, చాట్, నూడుల్స్ షాపులు అన్ని కలుపుకుని 4 వేలకుపైగా ఉంటాయి. వీటి ద్వారా ఏటా రూ. కోట్ల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి హోటళ్లు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖ పరిధిలో జిల్లా స్థాయి అధికారితో పాటు ఓ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మరో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరు వివిధ హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి నెలకు కనీసం 12 శాంపిల్స్ సేకరించాలన్నది నిబంధన. వీరు సేకరించిన శ్యాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపి, పరిశీలన తర్వాత కేసులు నమోదు కూడా వీరి బాధ్యతే. ఆహారం కల్తీ జరిగినట్లు తేలితే



ధర్మవరంలోని ఓ హోటల్‌లో అధికారుల తనిఖీలు (ఫైల్)

క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించే వీలుంది. కానీ జిల్లాలో ఇవేమీ జరగడం లేదు. దీన్ని ఆసరగా చేసుకున్న వ్యాపారులు చెలరేగిపోతున్నారు. విచ్చలవిడిగా ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు.

అనుమతి లేని వ్యాపారాలు..

హోటల్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. పరిశుభ్రత విషయంలో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు దరఖాస్తు చేయాలి. నిర్ణీత రుసుము చెల్లించి అనుమతి పొందాలి. కానీ జిల్లాలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు నూటికి 25 శాతానికి మించి ఉండవనేది బహిరంగ రహస్యం. పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుసైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదు. నాసిరకం ఆహార పదార్థాలు వాడటం, రోజుల తరబడి ఫ్రిడ్జిలో నిల్వ ఉంచిన వాటిని వేడి చేసి విక్రయిస్తున్నారు. ఆహారం వండే ప్రాంతాలూ తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నా.... పట్టించుకునే నాథుడు లేడు. పట్టణాల్లో అధిక శాతం మురుగుకాల్వలు, చెత్తకుప్పల పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు దర్శనమిస్తున్నా పర్యవేక్షణ కరువైంది.

నామమాత్రంగా తనిఖీలు..

జిల్లాలో ఏడాదికి 360 శ్యాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపించాల్సి ఉంది. అయితే అధికారులు జిల్లాలో నెలకు 12 శాంపిల్స్ మాత్రమే తీసి ల్యాబ్‌కు పంపిస్తున్నారు. ఇందులో ఒక్కో నెల కేవలం రెండు, మూడు మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. సీజన్‌ను బట్టి పండ్ల దుకాణాలపైనా నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. కల్తీ జరిగిన, రంగులు కలిపిన ఆహార పదార్థాలకు నాన్ స్టాండర్డ్ పేరిట ల్యాబ్ నుంచి రిపోర్ట్ వస్తే వారికి నామమాత్రపు జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఫుడ్‌సేఫ్టీ అధికారులు మేల్కొని హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఆహార కల్తీ ఇలా..

- చిక్కదనం కోసం పాలల్లో నాసిరకం పాలపొడర్లు, యూరియా, పిండి, నూనె కలిపి విక్రయిస్తున్నారు. అలాగే పరిమాణం పెంచేందుకు బోరు నీటిని కలుపుతారు.
- పశువుల ఎముకలను బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి ద్రావణాన్ని తీసి వంటనూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీని వల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- ఆకర్షణీయంగా ఉండేందుకు చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్‌లో ఎక్కువగా హానికరమైన రంగులను కలుపుతున్నారు. ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలతో పాటు అనారోగ్యానికి గురైన వాటిని వధించి బిర్యానీలో కలిపి విక్రయిస్తున్నారు.
- కారం ఎర్రగా ఉండేందుకు మిరపకాయల్లో సూడాన్ రంగులు కలుపుతున్నారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతున్నారు. వీటిని వంటలో వినియోగిస్తే కేన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- ఒకసారి ఉపయోగించిన నూనెను మళ్లీ కాచి ఆహార పదార్థాలు వండుతున్నారు. దీనివల్ల కేన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదమున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

తనిఖీలు చేస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా ఆహార తనిఖీలు చేస్తూనే ఉన్నాం. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నాం. ఆహారం కల్తీ అవుతోందని ఎవరైనా ఫిర్యాదు చేసినా... అక్కడకు వెళ్లి నమూనాలు సేకరిస్తున్నాం. ఆహారం కల్తీ జరగకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. వ్యాపారులను పిలిచి హెచ్చరిస్తున్నాం.

– రామచంద్ర, ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి

చీనీ చేదెక్కింది. రైతులకు ఈ ఏడాది నష్టాలు మిగిల్చింది. గిట్టుబాటు ధరల్లేక అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు. చేసేదేమీ లేక అయినకాటికి అమ్ముకుంటున్నారు. 2024 జూన్ నుంచి 2025 జూన్ వరకు ఏడాది పొడవునా తీసుకున్నా మార్కెటింగ్ పరిస్థితి నిరాశాజనకమే! దీంతో రైతులు ఆవేదనలో కూరుకుపోయారు. ఆదుకోవాల్సిన చంద్రబాబు సర్కారు మౌనం పాటిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చేదెక్కిన చీనీ



అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ క్రయవిక్రయాలలు

- మే నెల మినహా ఏడాది పొడవునా ధరలు తగ్గుముఖం
- టన్ను రూ.20 వేలు కూడా పలకని వైనం
- రైతులకు కోలుకోలేని దెబ్బ
- చంద్రబాబు సర్కారు మౌనముద్రపై సర్వత్రా విమర్శలు

అనంతపురం అగ్రికల్చర్: చీనీ తోటలకు 'అనంత' ప్రసిద్ధి. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా 92 వేల ఎకరాల భారీ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఏటా విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. ఇక్కడి రైతులు ప్రతికూల పరిస్థితులను అధిగమించి నాణ్యమైన చీనీ కాయలు పండిస్తున్నారు. ఏడాది పొడవునా 5.20 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఫలసాయం వస్తుండగా, ఏటా రూ.1,500 కోట్లకు పైగా టర్నోవర్ జరుగుతున్నట్లు ఉద్యానశాఖ నివేదికలు చెబుతున్నాయి. గార్లదిన్నె మండలంలో 18 వేల ఎకరాలు, యల్లనూరు 11,296, కూడేరు 9,300, పామిడి 5,300, నార్పల 5,200, పుట్లూరు 5 వేలు, ఆత్మకూరు 4,200, అనంతపురం 3,900, పెద్దపప్పూరు మండలాల్లో 3,500 ఎకరాల్లో చీనీ తోటలు విస్తరించాయి. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో చీనీ సాగు చేస్తున్నారు. ఏడాది పొడవునా పంట చేతికివస్తుంది. అయితే, మార్చి నుంచి సెప్టెంబర్ వరకు క్రయ విక్రయాలు జోరుగా ఉంటాయి. అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులోనే ఏటా లక్ష మెట్రిక్ టన్నుల వరకు క్రయ విక్రయాలు ఉంటాయి. మిగతావి తోటల నుంచి నేరుగా డబుల్ సూట్ పద్ధతిలో వ్యాపారులు కొనుగోలు చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు.

మార్కెట్‌యార్డు ద్వారా 2024 జూన్ నుంచి 2025 జూన్ మధ్య చీనీ అమ్మకాలు, ధరలు ఇలా

నెల	చీనీ అమ్మకాలు	గరిష్టం (టన్ను)	సరాసరి ధర	కనిష్ట ధర
జూన్-2024	16,591 టన్నులు	38 వేలు	20 వేలు	10 వేలు
జూలై	21,482 ,,	23 వేలు	14 వేలు	2,500
ఆగస్టు	10,189 ,,	24 వేలు	15 వేలు	8 వేలు
సెప్టెంబర్	753 ,,	24 వేలు	15 వేలు	10 వేలు
అక్టోబర్	86 ,,	33 వేలు	16 వేలు	8 వేలు
నవంబర్	1,475 ,,	39,200	18 వేలు	5 వేలు
డిసెంబర్	684 ,,	40,100	20 వేలు	4 వేలు
జనవరి-2025	454 ,,	30 వేలు	15 వేలు	5 వేలు
ఫిబ్రవరి	1,407 ,,	24,300	14 వేలు	3 వేలు
మార్చి	15,041 ,,	26 వేలు	13 వేలు	2,500
ఏప్రిల్	26,854 ,,	27 వేలు	14 వేలు	2,600
మే	19,015 ,,	43 వేలు	20 వేలు	2,600
జూన్	16,004 ,,	34 వేలు	16 వేలు	2,500

ఉత్తరాది రాష్ట్రాలకు సింహభాగం..

జిల్లాలో పండించే చీనీలో 70 నుంచి 80 శాతం వరకు రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ లాంటి ఉత్తరాది ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. చీనీ పంటకు సంబంధించి ఎకరాకు ఏటా రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో టన్ను రూ.40 వేలు, అంతకన్నా ఎక్కువ లభిస్తే కాని గిట్టుబాటు కాదు. అయితే ఈ ఏడాది మార్కెట్ పరిస్థితి దారుణంగా ఉండటంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. మేలో మాత్రమే గరిష్ట ధర రూ.40 వేల పైచిలుకు పలికింది. మిగతా నెలల్లో టన్ను సరాసరి రూ.20 వేలకు మించి పలకలేదు. ఇటీవల ధరలు మరింత పతనావస్థకు చేరుకున్నాయి. కనిష్ట ధర అయితే రూ.5 వేల లోపు పలకడం గమనార్హం. ప్రధానంగా కోతలు అధికంగా ఉండే మార్చి నుంచి ఆగస్టు మధ్యకాలంలో కేవలం మేలో మాత్రమే ఓ మాదిరి ధరలు లభించాయి.ఇలాంటి రేట్లతో ఎలా గట్టెక్కాలంటూ చీనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం ద్వారా చీనీ రైతులకు పెద్ద ఎత్తున పరిహారం ఇవ్వడంతో ఉపశమనం లభించింది. కానీ, చంద్రబాబు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో అన్నదాతలు తీవ్ర నిరాశలో కూరుకుపోతున్నారు.

ఎలాంటి సాయం అందలేదు



చీనీ పంటకు గిట్టుబాటు ధరల్లేక రైతులు దిగాలుగా ఉన్నారు. రూ. లక్షలు ఖర్చు పెట్టి ఆరుగాలం కష్టించి చీనీ చెట్లు పెంచుతారు. ధరల్లేకపోవడంతో కొంత మంది రైతులు చెట్లు నరికేస్తున్నారు. చీనీ సాగు కష్టంగా మారింది. గార్లదిన్నె మండలంలో పండే చీనీకి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. పంట చేతికి వచ్చిన సమయంలో ఈ ఏడాది మే నుంచి మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం నుంచి కూడా చీనీ రైతులకు ఎలాంటి సాయం అందలేదు. గతంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం సకాలంలో అందేవి.

– కొల్లాకర్, రైతు, పెనకచెర్ల గ్రామం, గార్లదిన్నె మండలం

నిన్ను తాక మది కోరే.. టికెట్టు భారమాయె!

మల్లన్న ఉచిత స్పర్శదర్శనానికి ని'బంధనాలు'



శ్రీశైల మల్లికార్జునస్వామి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సామాన్య భక్తుల సౌకర్యార్థం పునఃప్రారంభించిన మల్లన్న ఉచిత స్పర్శ దర్శనానికి దేవస్థానం రోజుకో నిబంధన పెడుతోంది. ఆన్‌లైన్ దరఖాస్తు తప్పనిసరి చేయడంతో పాటు నెలలో ఒకసారి మాత్రమేనంటూ దేవస్థానం వెబ్‌సైట్‌లో భక్తుల ఆధార్ లాక్ పెట్టడం గమనార్హం. ఏ క్షేత్రంలో లేని విధంగా శ్రీశైల మహాక్షేత్రంలో పరమశివుడైన మల్లికార్జున స్వామివారిని భక్తులు స్వయంగా తాకి (స్పర్శ) దర్శనం చేసుకోవచ్చు. పరమేశ్వరుడు అభిషేక ప్రియుడు. అభిషేక ప్రియుడికి ఆయనపై కొన్ని స్వచ్ఛమైన నీటిని పోసి, మారేడుదళం, బిల్వదళంతో అర్చిస్తే..సంబరపడి పోయి కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తుల నమ్మకం. కాగా సామాన్య భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఈ నెల 1వ తేదీ నుంచి ప్రతి మంగళవారం నుంచి శుక్రవారం వరకు మల్లన్న ఉచిత స్పర్శదర్శనాన్ని పునఃప్రారంభించారు. శ్రీశైల మల్లన్న ఉచిత స్పర్శ దర్శనంలో జవాబుదారీతనం, పారదర్శకతకోసం కొత్తగా టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఏ రోజుకారోజు కౌంటర్ల ద్వారా టోకెన్లను జారీ చేశారు. కంప్యూటరైజ్డ్ టోకెన్లలో భక్తుని పేరు, ఆధార్, ఫోన్ నెంబర్‌ను నమోదు చేసి టోకెన్లను ఇచ్చారు. ఈ టోకెన్లను ఉచిత దర్శనం క్యూలైన్ ప్రవేశద్వారం వద్దనున్న స్కానింగ్ ద్వారా తనిఖీ చేసి భక్తులను ఉచిత స్పర్శదర్శనానికి అనుమతించారు. రోజుకు 1000 నుంచి 1200 టోకెన్లను జారీ చేశారు. అలాగే స్పర్శదర్శనానికి పురుషులు తెల్ల పంచె, మెడలో తెల్లకండువా.. మహిళలు చీర, రవిక, చున్నీతో కూడిన సల్వార్ కమీజ్‌లను ధరించాల్సి ఉంటుంది.

ఆర్జితసేవా టికెట్ల రుసుం.. ప్రియం

జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామివారి గర్భాలయంలో అభిషేకం చేయాలంటే రూ.5 వేలు సమర్పించాల్సిందే. సామాన్యులు అంత పెద్ద మొత్తం వెచ్చించి అభిషేకం చేయించుకోలేని పరిస్థితి. సామూహిక అభిషేకం (రూ.1,500)సేవ ఉంది. ఈ సేవలో ప్రత్యేక మండపంలో భక్తులందరినీ సామూహికంగా కూర్చోపెట్టి అభిషేకాది పూజలు నిర్వహించిన అనంతరం కలశంలో నీటిని తీసుకుని స్వామివారి మీద పోసి దర్శించుకుంటారు. అయితే గర్భాలయంలో స్వామి చెంత అభిషేకం చేయలేదనే అసంతృప్తి భక్తుల్లో నెలకొంటుంది. అలాగే మల్లన్న స్పర్శదర్శనం చేసుకునేందుకు భక్తులు (ఒక్కొక్కరికి) దేవస్థానానికి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. దీంతో చాలా మంది సామాన్య భక్తులు మల్లన్నను స్పర్శదర్శనం చేసుకోలేక పోతున్నారు. భార్య, భర్త, ముగ్గురు పిల్లలు ఉన్న చిన్నపాటి కుటుంబం మల్లన్నను స్పర్శదర్శనం చేసుకోవాలన్నా రూ.2,500 చెల్లించాలి. చాలా మందికి మల్లన్నను స్పర్శదర్శనం చేసుకోవాలని కుతూహలం ఉన్నప్పటికీ ఆర్థిక స్తోమత లేక చాలా మంది దూర (దూళి) దర్శనం చేసుకుంటున్నారు.

నెలలో ఒకసారి మాత్రమే..?

దేవస్థానం కల్పిస్తున్న ఉచిత స్పర్శదర్శనం భక్తులు నెలలో ఒకసారి మాత్రమే నిర్వహించుకునేలా దేవస్థానం వెబ్‌సైట్‌లో మార్పులు చేస్తున్నారు. ఒక భక్తుడు తన ఆధార్‌కార్డుపై ఒక రోజు ఉచిత మల్లన్న స్పర్శదర్శనం టికెట్టు బుక్ చేసుకుంటే అతని ఆధార్ కార్డును నెల రోజుల పాటు దేవస్థానం వెబ్‌సైట్‌లో లాక్ పెడతారు. నెల తరువాతనే అతని ఆధార్‌కార్డుపై ఉచిత స్పర్శదర్శనం టికెట్టు బుక్ అవుతుంది.

ఉచిత స్పర్శదర్శనానికి ఆన్‌లైన్‌లో..

శ్రీశైల దేవస్థానం పునఃప్రారంభించిన మల్లన్న ఉచిత స్పర్శదర్శనానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని దేవస్థానం కొత్త నిబంధన పెట్టింది. శ్రీశైల దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా ఇతర ఆర్జిత సేవా టికెట్లు పొందేవిధంగా ఉచిత స్పర్శదర్శనానికి సైతం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని నిబంధన పెట్టారు. దర్శనానికి ఒకరోజు ముందుగా ఆన్‌లైన్‌లో టికెట్టు బుక్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీని, ఆధార్ జిరాక్స్‌ను తీసుకొస్తేనే ఉచిత స్పర్శదర్శనానికి అనుమతిస్తున్నారు.

పాన్ ఇండియా కాదు...
పాన్ వరల్డ్

• అంతర్జాతీయ స్థాయిలో ఇండియన్ సినిమాలు
• సై అంటున్న తెలుగు హీరోలు

ఇండియన్ సినిమా రేంజ్ మారిపోతోంది. ప్రపంచమంతా ఇండియన్ సినిమావైపు చూస్తోంది. జేమ్స్ కామెరూన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్, జేజే అబ్రామ్స్, డేనియల్ క్వాన్ వంటి... హాలీవుడ్ ప్రముఖ ఫిల్మ్‌మేకర్స్ 'ఆర్ఆర్ఆర్' సినిమాను మెచ్చుకున్న విషయాన్ని అంత త్వరగా మర్చిపోలేము. మన 'ఆర్ఆర్ఆర్' సినిమాకు వచ్చిన ఆస్కార్ అవార్డునూ మర్చిపోలేము. ఈ ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకుని భారతీయ ఫిల్మ్ మేకర్స్ హాలీవుడ్ రేంజ్‌కి తగ్గ సినిమాలను సిద్ధం చేస్తున్నారు. అలా పాన్ ఇండియా కాదు... పాన్ వరల్డ్ రేంజ్‌లో సినిమాలు చేస్తున్న కొందరు హీరో-దర్శక-నిర్మాతలపై ఓ లుక్ వేయండి.


• మహేశ్‌బాబు


• ప్రభాస్


• అల్లు అర్జున్


• ఎన్టీఆర్

ఇంటర్‌నేషనల్ ప్లాన్

'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న సినిమాలో మహేశ్‌బాబు హీరోగా నటిస్తున్నారు. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మాధవన్ ఓ కీలక పాత్రలో నటిస్తారని, అతనిది మహేశ్‌బాబు తండ్రి పాత్ర అనే ప్రచారం సాగుతోంది. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఫారెస్ట్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్ సన్నివేశాల చిత్రీకరణ కోసం యూనిట్ విదేశాలకు వెళ్లనుంది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ... ప్రతిసారీ తన సినిమా అనౌన్స్‌మెంట్ సమయంలోనో లేదా షూటింగ్ ప్రారంభమైన కొద్ది రోజుల తర్వాతనో తన సినిమా గురించి ఓ మీడియా సమావేశం నిర్వహించి, ఆ సినిమా కథ క్లుప్తంగా చెబుతారు రాజమౌళి. ఆ సమావేశంలోనే నటీనటుల వివరాలు, షూటింగ్ షెడ్యూల్స్, రిలీజ్ వివరాలు ఉండేవి. 'ఆర్ఆర్ఆర్' సినిమా విషయంలోనూ ఇదే జరిగింది. కానీ మహేశ్‌బాబుతో చేస్తున్న సినిమా విషయంలో రాజమౌళి ఈ పంథాను ఫాలో కాలేదు. ఆ మాటకొస్తే... ఇప్పటి వరకు రాజమౌళి-మహేశ్‌బాబు సినిమా గురించిన పూర్తి స్థాయి అధికారిక ప్రకటనే రాలేదు. మరి... దీని వెనక కారణం ఏంటో రాజమౌళికే తెలియాలి.

ఆస్కార్ ప్లాన్: 95వ ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ చిత్రం విభాగం కోసం 'ఆర్ఆర్ఆర్' సినిమా ఎంపిక అవుతుందని సినిమా లవర్స్ ఊహించారు. కానీ ఈ విభాగంలో భారతదేశం తరఫున ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' (ఇంగ్లిష్‌లో 'లాస్ట్ ఫిల్మ్ షో')ను ఎంపిక చేసింది. కానీ 'లాస్ట్ ఫిల్మ్ షో' సినిమాకు ఆస్కార్ రాలేదు. అయితే ఆస్కార్ కన్సిడరేషన్‌కు 'ఆర్ఆర్ఆర్'ను పంపి, ఆస్కార్ కమిటీ రూల్స్‌ను ఫాలో చేసి, మొత్తానికి ఆస్కార్ బరిలో 'ఆర్ఆర్ఆర్' సినిమాను రాజమౌళి అండ్ టీమ్ నిలపగలిగింది. ఓ దశలో 'ఆర్ఆర్ఆర్' సినిమాలో లీడ్ యాక్టర్స్‌గా చేసిన ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లకు కూడా బెస్ట్ యాక్టర్ విభాగంలో నామినేషన్స్ వస్తాయేమో అన్నట్లుగా హాలీవుడ్ మీడియాలో కథనాలు కూడా వచ్చాయి. ఇది జరగలేదు కానీ... 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'నాటు నాటు' పాటకు కీరవాణి, చంద్రబోస్ ఆస్కార్ అవార్డులు అందుకున్నారు. కానీ ఈసారి ఆ తరహా ఇబ్బందులు ఏవీ రాకూడదని, ఓ హాలీవుడ్ ప్రముఖ ప్రొడక్షన్ సంస్థతో భాగస్వామ్యం కావాలని రాజమౌళి ప్రణాళికలు రచిస్తున్నారట. ఇలా ఓ హాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థతో భాగం అయితే, తమ సినిమా కూడా ఇంగ్లిష్ చిత్రంగా పరిగణించబడుతుందని, అలా జరిగితే ఆస్కార్‌తో పాటు ఇతర అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో అవార్డుల కోసం చేసే దరఖాస్తులకు, అంతర్జాతీయంగా రిలీజ్, మార్కెటింగ్ చేసుకునే కార్యాచరణలు మరింత సులభతరం అవుతాయని రాజమౌళి అండ్ టీమ్... ఇలా ఇంటర్‌నేషనల్ ప్లాన్స్ రెడీ చేస్తోందట. అందుకనే ఈ సినిమా గురించిన పూర్తి అధికారిక ప్రకటన రాలేదని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. దుర్గా ఆర్ట్స్ అధినేత కేఎల్ నారాయణ కూడా ఈ సినిమా నిర్మాణంలో భాగస్వామ్యులుగా ఉంటారని ఊహించవచ్చు.

అలాగే ఈ సినిమా కోసం రాజమౌళి హాలీవుడ్ యాక్టింగ్ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నారనే వార్తలు గతంలో వచ్చాయి. దీన్ని బట్టి... ఈ సినిమాలో హాలీవుడ్ యాక్టర్స్ కూడా కనిపిస్తారని ఊహించవచ్చు.


• ఆమిర్ ఖాన్


• రణ్‌బీర్ కపూర్

విదేశీ స్పిరిట్

'బాహుబలి' సినిమాతో పాన్ ఇండియా సూపర్ స్టార్ అయిపోయారు ప్రభాస్. ఈ సినిమా తర్వాత ప్రభాస్ ఏ సినిమా చేసినా అది పాన్ ఇండియా సినిమాగానే రిలీజ్ అవుతోంది. కానీ సందీప్‌రెడ్డి వంగా డైరెక్షన్‌లో ప్రభాస్ చేయనున్న 'స్పిరిట్' మాత్రం భారతీయ భాషలతో పాటు జపాన్, చైనీస్, కొరియన్ భాషల్లోనూ విడుదల కానుంది. ఈ విషయాన్ని 'స్పిరిట్' సినిమా అనౌన్స్‌మెంట్ సమయంలోనే మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే ఈ సినిమా చిత్రీకరణ ఇంకా ప్రారంభం కాలేదు. ప్రస్తుతం 'రాజా సాబ్, ఫౌజి' సినిమాలతో ప్రభాస్ బిజీగా ఉన్నారు. ఈ రెండు సినిమాల తర్వాత 'స్పిరిట్' సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తారు ప్రభాస్. ఈ సినిమాలో తొలిసారిగా పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించనున్నారు. ఇందులో త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటిస్తారు. కొరియన్ యాక్టర్ డాన్ లీ 'స్పిరిట్' సినిమాలో విలన్‌గా నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ప్రణయ్ వంగా రెడ్డి, భూషణ్‌కుమార్ ఈ సినిమాను నిర్మించనున్నారు.

గాడ్ ఆఫ్ వార్

'ఆర్ఆర్ఆర్' (ఇందులో రామ్‌చరణ్ మరో లీడ్ రోల్ చేశారు) సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో ఎన్టీఆర్ పేరు సంపాదించుకున్నారు. ఈ గుర్తింపుకి తగ్గట్లుగా అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమాను రిలీజ్ చేసేందుకు ఎన్టీఆర్ రెడీ అవుతున్నారని తెలుస్తోంది. 'అరవింద సమేత వీరరాఘవ' వంటి హిట్ సినిమా తర్వాత హీరో ఎన్టీఆర్-దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ మైథాలజీ సినిమా రానుంది. గాడ్ ఆఫ్ వార్‌గా చెప్పుకునే కుమారస్వామి నేపథ్యంలో సాగే ఈ మైథాలజీ సినిమాను 'రామాయణ' తరహాలో అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తామని, వచ్చే ఏడాది షూటింగ్ ప్రారంభం అవుతుందని నిర్మాత నాగవంశీ ఇటీవల ఓ సందర్భంలో చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమాను నిర్మించాలనుకుంటున్నారు కాబట్టి అదే స్థాయిలో రిలీజ్‌ను ప్లాన్ చేస్తారు మేకర్స్. పైగా ఎన్టీఆర్ ఓ లీడ్ రోల్‌లో నటించిన స్పై యాక్షన్ డ్రామా 'వార్ 2' ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ వెర్షన్ థియేటర్స్‌లో విడుదలవుతోంది. ఇది కూడా ఎన్టీఆర్‌కు బాగా కలిసొచ్చే అంశమే. ఇక హృతిక్ రోషన్, కియారా అద్వానీ ఇతర లీడ్ రోల్స్‌లో నటించిన 'వార్ 2' సినిమా ఆగస్టు 14న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది.

తెలుగు హీరో వర్సెస్ హాలీవుడ్ విలన్

హీరో అల్లు అర్జున్-దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా రానుంది. ఈ సినిమా కోసం ఓ సరికొత్త లోకాన్నే సృష్టిస్తున్నారట అట్లీ. కొన్ని హాలీవుడ్ సినిమాల్లో కనిపించే మాదిరి ఈ చిత్రంలోనూ కొన్ని విచిత్రమైన జంతువులు, జీవరాసులు కనిపిస్తాయట. ఆ దిశగా అల్లు అర్జున్, అట్లీ అండ్ టీమ్ సినిమాను సిద్ధం చేస్తున్నారని టాక్. ఈ సినిమాలో అల్లు అర్జున్ నాలుగు పాత్రల్లో కనిపిస్తారని, తాత-తండ్రి-ఇద్దరు కొడుకులు... ఇలా విభిన్నమైన పాత్రల్లో అల్లు అర్జున్ కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. అలాగే ఐదుగురు హీరోయిన్స్ కూడా ఉంటారట. వీరిలో దీపికా పదుకోన్ కన్ఫార్మ్ అయిపోయారు. మిగిలిన హీరోయిన్స్ పాత్రలకు రష్మికా మందన్నా, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, భాగ్య శ్రీ బోర్సే, ఆలియా .ఎఫ్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. అలాగే ఈ సినిమాలోని విలన్ పాత్రల కోసం విన్ డీజిల్, ది రాక్...వంటి హాలీవుడ్ స్టార్ యాక్టర్స్ పేర్లను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. ఇలా అయితే తమ సినిమాను హాలీవుడ్ రేంజ్‌లో విడుదల చేసేటప్పుడు బాగుంటుందని మేకర్స్ ఆలోచిస్తున్నారట. దాదాపు రూ. 700 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాను ఒకేసారి భారతీయ భాషలతో పాటు ఇతర విదేశీ భాషల్లోనూ రిలీజ్ చేసేలా సన్నాహాలు మొదలు పెట్టారట అట్లీ అండ్ టీమ్. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సంబంధించిన లాంగ్ షెడ్యూల్ ఆ మధ్య ముంబైలో ప్రారంభమైంది. చిన్న బ్రేక్ రావడంతో అల్లు అర్జున్ వెకేషన్‌లో భాగంగా విదేశాలకు వెళ్లారట. వచ్చిన తర్వాత తిరిగి షూటింగ్ ఆరంభిస్తారు.

రామాయణ

రూ. నాలుగువేల కోట్ల భారీ బడ్జెట్‌తో 'రామాయణ' (రెండు భాగాలు కలిపి) సినిమాను నిర్మిస్తున్నామని, ఈ చిత్రంతో ప్రపంచ సినిమా అంతా భారతదేశం వైపు చూస్తుందని, ఇందులో ఏ మాత్రం సందేహం లేదని ఈ చిత్ర నిర్మాత, డీఎన్ఈజీ (డబుల్ నెగటివ్) స్టూడియో అధినేత నమిత్ మల్హోత్రా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. నమిత్ మల్హోత్రా వ్యాఖ్యలను బట్టి నితీష్ తివారి దర్శకత్వంలో రూపొందుతున్న 'రామాయణ' సినిమా అంతర్జాతీయ స్థాయిలో ఉంటుందని ఊహించవచ్చు. పైగా ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్స్ ఏఆర్ రెహమాన్, హాన్స్ జిమ్మర్‌లతో పాటు హాలీవుడ్‌లో అగ్రశ్రేణి స్టంట్ డైరెక్టర్లు టెర్రీ నోటరీ, గై నోరిస్, హాలీవుడ్ సినిమాలకు వర్క్ చేసిన ప్రొడక్షన్ డిజైనర్లు రవి బన్సాల్, రాంసే ఏవరీ వంటి బలమైన సాంకేతిక నిపుణులతో 'రామాయణ' రూపొందుతోంది. ఇక బడ్జెట్ పరంగా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రం'రామాయణ'నే అవుతుంది. ఇంకా 'డీఎన్ఈజీ' స్టూడియో గ్రాఫిక్ వర్క్ చేసిన సినిమాల్లో 8 చిత్రాలు ఆస్కార్ అవార్డులను సాధించాయి. ఇవన్నీ 'రామాయణ' సినిమా హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కుతోందని చెప్పడానికి కొన్ని ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. ఇక ఈ హిందీ 'రామాయణ' సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవిదూబే, హనుమంతుడిగా సన్నీ డియోల్, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. రెండు భాగాలుగా ఈ సినిమా విడుదల కానుంది.'రామాయణ పార్ట్ 1' 2026 దీపావళికి, 'రామాయణ పార్ట్ 2' సినిమా 2027 దీపావళికి విడుదల కానున్నాయి. ఇటీవలే విడుదల చేసిన 'రామాయణ: ది ఇంట్రడక్షన్ అనౌన్స్‌మెంట్ ట్రైలర్'కు ఆడియన్స్ నుంచి మంచి స్పందన వచ్చింది. మరి... ఈ సినిమా థియేటర్స్‌లో విడుదలైన తర్వాత, ఎంత వసూళ్లు రాబడుతుందన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది.

సూపర్ హీరో

బాలీవుడ్ హీరో ఆమిర్ ఖాన్, తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో ఓ సూపర్ హీరో సినిమా రానుంది. కార్తీతో 'ఖైదీ 2' సినిమా చేసిన తర్వాత, ఆమిర్ ఖాన్‌తో ఈ సూపర్ హీరో మూవీ చేస్తారు లోకేశ్ కనగరాజ్. కాగా ఈ సూపర్ హీరో సినిమాను గ్లోబల్ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని రెడీ చేస్తామని, రిలీజ్ కూడా అంతర్జాతీయ స్థాయిలోనే ఉంటుందని 'కూలీ' సినిమా ప్రమోషన్స్‌లో చెప్పారు దర్శకుడు లోకేశ్ కనగరాజ్. 2026 ద్వితీయార్ధంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. 2028లో విడుదలయ్యే చాన్సెస్ ఉన్నాయి. అలాగే 'మహాభారతం' ఆధారంగా ఆమిర్ ఖాన్ మూడు భాగాలుగా ఓ సినిమాలో నటించి, నిర్మించనున్నారు. ఈ ఆగస్టు నుంచి ఈ సినిమాను ప్రారంభించనున్నట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమిర్ ఖాన్ తెలిపారు. ఈ సినిమాను కూడా అంతర్జాతీయ స్థాయిలో రిలీజ్ చేయాలన్నది ఆమిర్ ప్లాన్ అని బాలీవుడ్ టాక్.

ఈ చిత్రాలతో పాటు మరికొన్ని పాన్ ఇండియా సినిమాలను పాన్ వరల్డ్ స్థాయిలో రిలీజ్ చేసేందుకు ఆయా సినిమాల హీరోలు-దర్శక-నిర్మాతలు ప్రణాళికలు వేస్తున్నారు.

– ముసిమి శివాంజనేయులు

పెళ్లి చేసుకునే ఆలోచన లేదు!


• శ్రీలీల

''ఇప్పుడు నా వయసు 24 ఏళ్లే. నా కెరీర్ ఇప్పుడే ప్రారంభం అయింది. 30 ఏళ్లు వచ్చే వరకు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేదు'' అని హీరోయిన్ శ్రీలీల చెప్పారు. 'పెళ్లి సందడి'(2021) చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమకి పరిచయమైన ఆమె బిజీ హీరోయిన్‌గా దూసుకెళుతున్నారు. అలాగే తమిళ, హిందీ చిత్రాల్లోనూ నటిస్తున్నారామె. 'ఆషికి 3' సినిమాలో కార్తీక్ ఆర్యన్‌కి జోడీగా నటిస్తున్నారు శ్రీలీల. అయితే వీరిద్దరి రిలేషన్ గురించి గత కొన్నాళ్లుగా బాలీవుడ్‌లో పలు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కాగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీలీల ప్రేమ, పెళ్లి, వ్యక్తిగత జీవితం వంటి విషయాలపై మాట్లాడారు. ''ప్రస్తుతం నాకు 24 సంవత్సరాలు. కెరీర్ పరంగా ఇంకా ఎన్నో కలలున్నాయి. ప్రస్తుతం పూర్తిగా సినిమాలపైనే దృష్టి పెట్టాను. వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించేందుకు సమయం లేదు. నా జీవితంలో పెళ్లి అనేది 30 ఏళ్ల తర్వాతే జరుగుతుంది. అప్పటి వరకు 'మీ వివాహం ఎప్పుడు?' అని నన్ను ఎవరూ అడగొద్దు. ప్రస్తుతం నేను ప్రేమలో ఉన్నానని చాలా మంది అనుకుంటున్నారు. కానీ, నిజంగా అలాంటిదేం లేదు. నాపై వచ్చిన పుకార్లన్నీ అసత్యం. నేను ఎక్కడికెళ్లినా మా అమ్మ నా వెంట ఉంటుంది. అమెరికా వెళ్లినప్పుడు కూడా నాతోనే ఉంది. అలాంటి పరిస్థితుల్లో నేను ఎవరితో ప్రేమలో పడగలను? నిజంగా ఎవరితోనైనా రిలేషన్‌లో ఉంటే మా అమ్మ మాతో కలిసి ఉండగలదా? ప్రస్తుతానికి నా తొలి ప్రాధాన్యం కెరీర్‌కే. పెద్ద సినిమా అవకాశాలు వస్తున్నాయి. ఆ సినిమాల్లో బాగా నటించి, ప్రేక్షకుల మెప్పు పొందేందుకు కష్టపడుతున్నాను. నా కంటూ కొన్ని లక్ష్యాలు ఉన్నాయి.. వాటిని సాధించిన తర్వాతే వ్యక్తిగత విషయాల గురించి ఆలోచిస్తాను'' అని తెలిపారు శ్రీలీల. ప్రస్తుతం ఆమె తెలుగులో 'మాస్ జాతర, ఉస్తాద్ భగత్‌సింగ్', తమిళంలో 'పరాశక్తి', హిందీలో 'ఆషికి 3' వంటి సినిమాలు చేస్తున్నారు.

'మిస్టర్ కార్తీక్' మళ్లీ వస్తున్నాడు


• రిచా గంగోపాధ్యాయ, ధనుష్

ధనుష్ హీరోగా రిచా గంగోపాధ్యాయ హీరోయిన్‌గా నటించిన తమిళ చిత్రం 'మయక్కమ్ ఎన్న' (2016). శ్రీ రాఘవ దర్శకత్వంలో రూపొందిన ఈ రొమాంటిక్ లవ్ స్టోరీకి మంచి ఆదరణ దక్కింది. జీవీ ప్రకాశ్‌కుమార్ అందించిన పాటలకూ మంచి స్పందన లభించడంతో మంచి మ్యూజికల్ హిట్ మూవీగా నిలిచింది. ధనుష్ పుట్టినరోజు (జూలై 28) సందర్భంగా ఈ చిత్రాన్ని ఈ నెల 27న 'మిస్టర్ కార్తీక్' టైటిల్‌తో రీ రిలీజ్ చేస్తున్నారు. ఓం శివ గంగా ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్‌పై కాడబోయిన లతా మండేశ్వరి సమర్పణలో నిర్మాత కాడబోయిన బాబురావు ఈ సినిమాను తెలుగులో రీ రిలీజ్ చేస్తున్నారు. ''ఈ చిత్రంలో హీరో-హీరోయిన్ మధ్య వచ్చే ఎమోషనల్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. ఇటీవల తమిళంలో మళ్లీ విడుదల చేయగా, మంచి విజయం దక్కింది. తెలుగులోనూ మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉంది'' అని కాడబోయిన బాబురావు పేర్కొన్నారు.


• మృణాల్ ఠాకూర్

వారం రోజులు ఆలస్యంగా...


• అజయ్ దేవగన్

కాస్త ఆలస్యంగా థియేటర్స్‌కు వస్తానంటున్నారు నార్త్ సర్దార్. అజయ్ దేవగన్ హీరోగా నటించిన తాజా హిందీ చిత్రం 'సన్నాఫ్ సర్దార్ 2'. ఈ చిత్రంలో పంజాబీ అమ్మాయిగా హీరోయిన్ మృణాల్ ఠాకూర్ నటించారు. రవికిషన్, సంజయ్ మిశ్రా కీలక పాత్రల్లో నటించారు. అజయ్ దేవగన్, జ్యోతిదేశ్ పాండే, ఎన్ఆర్ పచిసియా, ప్రవీణ్ తల్రేజా నిర్మించారు. కాగా ఈ సినిమాను జూలై 25న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. 'సన్నాఫ్ సర్దార్ 2' సినిమా ఈ నెల 25న విడుదల కావడం లేదని, ఆగస్టు 1న రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఈ వాయిదాకి కారణం 'సయారా' సినిమా. అహన్ పాండే, అనీత్ పద్దా హీరో హీరోయిన్లుగా నటించిన 'సయారా' సినిమాకు ఆడియన్స్ నుంచి మంచి స్పందన లభిస్తోంది. దీంతో ఈ సినిమాతో పోటీ ఎందుకని అజయ్ దేవగన్ తన సినిమాను ఆగస్టు 1కి వాయిదా వేసుకున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... రాజమౌళి దర్శకత్వంలో సునీల్ లీడ్ రోల్‌లో నటించిన హిట్ ఫిల్మ్ 'మర్యాద రామన్న'కు హిందీ రీమేక్‌గా రూపొందిన అజయ్ దేవగన్ 'సన్నాఫ్ సర్దార్' సినిమా 2012లో విడుదలై, సూపర్‌హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'సన్నాఫ్ సర్దార్ 2' రూపొందింది.

బిజినెస్ రీల్



ఎలక్ట్రిక్ కార్ల జోరు

- మొత్తం కార్ల విక్రయాల్లో 7 శాతానికి చేరనున్న వాటా
- కేర్‌ఎడ్జ్ అడ్వైజరీ అంచనా

న్యూఢిల్లీ: కొత్త మోడల్స్ ఎంట్రీతో పాటు రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (ఆర్‌ఈఈ) సరఫరా సమస్యలు సకాలంలో పరిష్కారమైతే, దేశీయంగా ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు మరింతగా పెరుగుతాయని కేర్ ఎడ్జ్ అడ్వైజరీ ఒక నివేదికలో తెలిపింది. 2028 నాటికి దేశీయంగా మొత్తం కార్ల విక్రయాల్లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 7 శాతానికి చేరొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ఎలక్ట్రిక్ కార్ల వినియోగం పెరగడమనేది, చార్జింగ్ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తీసుకునే చర్యలపై కూడా ఆధారపడి ఉంటుందని కేర్‌ఎడ్జ్ అడ్వైజరీ అండ్ రీసెర్చ్ సీనియర్ డైరెక్టర్ తన్వి షా తెలిపారు. ఈవీల వినియోగం పెరగడానికి ప్రధాన అవరోధంగా ఉంటున్న చార్జింగ్ మౌలిక సదుపాయాలు ఇటీవలి కాలంలో గణనీయంగా మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. దేశీయంగా 2022 క్యాలెండర్ ఇయర్‌లో 5,151గా ఉన్న పబ్లిక్ ఈవీ చార్జింగ్ స్టేషన్ల సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరం తొలినాళ్లలో 26,000కు చేరినట్లు నివేదిక తెలిపింది. మరోవైపు, 2021 ఆర్థిక సంవత్సరంలో సుమారు 5,000 యూనిట్ల స్థాయిలో నమోదైన ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు 2025 ఆర్థిక సంవత్సరం నాటికి 1.07 లక్షల యూనిట్లకు చేరాయి. సాధారణంగా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల ఆధిపత్యం ఎక్కువగా ఉండే ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాల్లో ఫోర్ వీలర్ల వాటా చాలా తక్కువగానే ఉంటుంది.

ఈఎఫ్‌టీఏ దేశాల నుంచి 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

ముంబై: విదేశీ పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా కొనసాగుతోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ తెలిపారు. నాలుగు యూరోపియన్ దేశాల కూటమి ఈఎఫ్‌టీఏ నుంచి 100 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అసోచాం మేనేజింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. ఐస్‌ల్యాండ్, లీష్టెన్‌స్టెయిన్, నార్వే, స్విట్జర్లాండ్ ఈ కూటమిలో ఉన్నాయి. ఈఎఫ్‌టీఏతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అక్టోబర్ 1 నాటికి అమల్లోకి వస్తుందని మంత్రి చెప్పారు. మరోవైపు, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, అడ్వాన్స్‌డ్ సైబర్ స్కిల్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు.

ఇక్రిశాట్‌తో టఫే ఎంవోయూ



హైదరాబాద్: ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సెమీ-ఎరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్)తో ట్రాక్టర్ల తయారీ సంస్థ టఫే అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దీని ప్రకారం రైతులకు పర్యావరణహితమైన సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు, పటాన్‌చెరులోని ఇక్రిశాట్ క్యాంపస్‌లో జేఫార్మ్ అడాప్టివ్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ సెంటర్‌ను నెలకొల్పనున్నారు. పరిశోధనల ఆధారిత సొల్యూషన్స్, శిక్షణతో రైతులకు సాధికారత కల్పించే క్రమంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద 1964లో జేఫార్మ్‌ను టఫే ప్రారంభించింది. 2019లో తెలంగాణలో పీజేటీఎస్ఏయూతో కలిసి జేఫార్మ్ అండ్ ప్రొడక్ట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసింది.

సీఎస్ఆర్ కార్యకలాపాల్లో పరమేశు బయోటెక్

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉన్న పరమేశు బయోటెక్, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద చేపట్టే కార్యక్రమాలపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లాలోని దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) కొత్త భవంతి నిర్మాణానికి రూ. 50 లక్షల విరాళం అందించినట్లు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యకు సంబంధ కార్యక్రమాల కోసం గతంలో రూ. 50 లక్షల విరాళం అందించినట్లు తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-7-2025

విశాఖ	540-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	503-00
విజయవాడ	520-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	6.70

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బొనాంజా!!

తొలిసారిగా బోనస్ ఇష్యూ

- 1:1 నిష్పత్తిలో జారీ
- రూ. 5 ప్రత్యేక మధ్యంతర డివిడెండ్
- క్యూ1లో లాభం రూ. 16,258 కోట్లు



ముంబై: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తమ షేర్‌హోల్డర్లకు బంపర్ బొనాంజా ప్రకటించింది. తొలిసారిగా బోనస్ షేర్లు జారీ చేయనుంది. 1:1 నిష్పత్తిలో షేరు ఒక్కంటికి ఒక షేరు చొప్పున కేటాయించనుంది. ఇందుకోసం ఆగస్టు 27ని రికార్డు తేదీగా నిర్ణయించారు. ఇష్యూని బోర్డు ఆమోదించిన రెండు నెలల్లోగా, అంటే సెప్టెంబర్ 18లోగా బోనస్ షేర్లు క్రెడిట్ అవుతాయని బ్యాంకు వెల్లడించింది. సుమారు రూ. 766.79 కోట్ల విలువ చేసే షేర్లను బ్యాంకు జారీ చేయనుంది. జూన్ క్వార్టర్ ఆఖరు నాటికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ. 2 లక్షల వరకు ఆథరైజ్డ్ షేర్ క్యాపిటల్ గల చిన్న రిటైల్ షేర్‌హోల్డర్లు 36 లక్షల పైగా ఉన్నారు. వీరి వాటా సుమారు 10.32 శాతం వరకు ఉంటుంది. గతంలో 2011లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ. 10 ముఖ విలువ చేసే షేర్లను రూ. 2 ముఖ విలువ చేసే అయిదు షేర్లుగా విభజించింది. ఆ తర్వాత 2019లో వాటిని రూ. 1 ముఖ విలువ చేసే రెండు షేర్లుగా విడగొట్టింది. కంపెనీ షేరు ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 10 శాతం పెరిగి బీఎస్ఈలో ప్రస్తుతం రూ. 1,957 వద్ద ఉంది. బీఎస్ఈ రికార్డుల ప్రకారం బ్యాంక్ ఇప్పటివరకు ఎన్నడూ బోనస్ షేర్లు ప్రకటించలేదు.

2026 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 1 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై రూ. 5 చొప్పున ప్రత్యేక మధ్యంతర డివిడెండ్‌ను కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది. దీనికి జూలై 25 రికార్డు తేదీగా ఉంటుంది. ఆగస్టు 11న బ్యాంక్ డివిడెండ్ చెల్లిస్తుంది. 2024 మేలో రూ. 19.5 చొప్పున తుది డివిడెండ్ ఇచ్చిన బ్యాంకు, గత నెలలో రూ. 22 చొప్పున మరోసారి డివిడెండ్ చెల్లించింది. అంతకు ముందు 2022 మేలో రూ. 15.5 చొప్పున, 2023 మేలో రూ. 19 చొప్పున డివిడెండ్ ఇచ్చింది.

కన్సాలిడేటెడ్ లాభం స్వల్పంగా డౌన్..

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 16,258 కోట్ల నికర లాభం ప్రకటించింది. ఇది క్రితం క్యూ1లో నమోదైన రూ. 16,475 కోట్లతో పోలిస్తే స్వల్పంగా 1.31 శాతం తక్కువ. మరోవైపు, స్టాండెలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం రూ. 16,174 కోట్ల నుంచి సుమారు 12 శాతం వృద్ధితో రూ. 18,155.21 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ. 83,701 కోట్ల నుంచి రూ. 99,200 కోట్లకు ఎగిసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన మాత్రం ఆదాయం రూ. 1.17 లక్షల కోట్ల నుంచి రూ. 1.33 లక్షల కోట్లకు చేరింది.

జూన్ క్వార్టర్ వివరాలు..

- సమీక్షా కాలంలో మొత్తం వ్యయాలు రూ. 59,817 కోట్ల నుంచి రూ. 63,467 కోట్లకు పెరిగాయి.
- స్టాండెలోన్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 5.4 శాతం పెరిగి రూ. 31,438 కోట్లకు చేరింది.
- నికర వడ్డీ మార్జిన్ 3.46 శాతం నుంచి 3.35 శాతానికి తగ్గింది.
- నిర్వహణ వ్యయాలు రూ. 16,621 కోట్ల నుంచి రూ. 17,434 కోట్లకు పెరిగాయి. ఇందులో రూ. 6,158 కోట్ల మేర ఉద్యోగులపై వ్యయాలు, రూ. 11,276 కోట్లు ఇతరత్ర వ్యయాలు ఉన్నాయి.
- మొత్తం ప్రొవిజన్లు రూ. 2,602 కోట్ల నుంచి రూ. 14,442 కోట్లకు ఎగిశాయి. ఇందులో 'ఫ్లోటింగ్ ప్రొవిజన్' రూ. 9,000 కోట్లు ఉన్నట్లు బ్యాంకు తెలిపింది.
- అసెట్స్ నాణ్యత స్వల్పంగా క్షీణించింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి మార్చి త్రైమాసికంతో పోలిస్తే 1.33 శాతం నుంచి 1.4 శాతానికి పెరిగింది.
- స్థూల రుణాలు రూ. 26,53 లక్షల కోట్లకు (6.7 శాతం వృద్ధి, డిపాజిట్లు 16.2 శాతం పెరిగి రూ. 27.64 లక్షల కోట్లకు చేరాయి.
- కాసా నిష్పత్తి 38.2 శాతం నుంచి 33.9 శాతానికి తగ్గింది. సేవింగ్స్ అకౌంట్ డిపాజిట్లు రూ. 6.39 లక్షల కోట్లుగా ఉండగా, కరెంట్ అకౌంట్ డిపాజిట్లు రూ. 2.98 లక్షల కోట్లుగా ఉన్నాయి.
- కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన చూస్తే హెచ్‌డీబీ ఐపీవో ద్వారా వచ్చిన నిధుల కారణంగా ఇతర ఆదాయం రూ. 21,730 కోట్లకు పెరిగింది.
- స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.40 శాతంగా, నికర ఎన్‌పీఏల నిష్పత్తి స్వల్పంగా పెరిగి 0.47 శాతంగా నమోదైంది.
- అనుబంధ కంపెనీ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీవోకి రావడంతో అందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వాటా 94.32 శాతం నుంచి 74.19 శాతానికి తగ్గింది.

యస్ బ్యాంక్ లాభం 59% అప్

క్యూ1లో రూ. 801 కోట్లు

- సెప్టెంబర్ నాటికి ఎస్ఎంబీసీ డీల్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ. 801 కోట్ల నికర లాభం ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నమోదైన రూ. 502 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 59.4 శాతం అధికం. నిధుల సమీకరణ వ్యయాలు తగ్గడం, అసెట్ క్వాలిటీ మెరుగుపడటం, వడ్డీయేతర ఆదాయం పటిష్టంగా ఉండటం, వంటి అంశాలు వరుసగా ఏడో త్రైమాసికంలోనూ లాభాలను మెరుగుపర్చుకోవడానికి దోహదపడినట్లు బ్యాంకు తెలిపింది. సమీక్షాకాలంలో యస్ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 5.7 శాతం పెరిగి రూ. 2,371.5 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 10 బేసిస్ పాయింట్లు పెరిగి 2.5 శాతంగా నమోదైంది. మరోవైపు, ట్రెజరీ లాభాల కారణంగా వడ్డీయేతర ఆదాయం 46.1 శాతం పెరిగి రూ. 1,752 కోట్లకు చేరింది. ప్రధానమైన ఫీజుల ఆదాయం 3 శాతం వృద్ధి చెంది రూ. 1,268 కోట్లుగా నమోదైంది. ఇందులో రిటైల్ వాటా 56.4 శాతంగా ఉంది. పటిష్టమైన పనితీరుతో కొత్త ఆర్థిక సంవత్సరంలోకి అడుగుపెట్టినట్లు యస్ బ్యాంక్ ఎండీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. సుమితోమో మిత్సుయి కార్పొరేషన్ బ్యాంక్ (ఎస్ఎంబీసీ) డీల్ సెప్టెంబర్ నాటికి పూర్తి కావచ్చని పేర్కొన్నారు. బ్యాంకులో 20 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు ఎస్ఎంబీసీ ఒప్పందం కుదుర్చుకుంది.

ఆస్తుల నాణ్యత మెరుగు

- నిర్వహణ లాభం 53.4 శాతం పెరిగి రూ. 1,358 కోట్లకు చేరింది. పన్ను యేతర ప్రొవిజన్లు 34.1 శాతం పెరిగి రూ. 284 కోట్లకు చేరాయి.
- మొత్తం డిపాజిట్లు 4 శాతం పెరిగి రూ. 2,75,843 కోట్లకు చేరాయి. కమర్షియల్ బ్యాంకింగ్, మైక్రోబ్యాంకింగ్ సెగ్మెంట్లలో డిమాండ్‌తో రుణాలు 5 శాతం పెరిగి రూ. 2,41,024 కోట్లకు పెరిగాయి.
- అసెట్ నాణ్యత స్థిరంగా ఉంది. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 1.6 శాతం, నికర ఎన్‌పీఏలు 0.3 శాతంగా ఉన్నాయి.
- ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి (పీసీఆర్) 80.2% మెరుగుపడ్డాయి.
- సమీక్షాకాలంలో మొత్తం రూ. 1,170 కోట్ల రికవరీలు, అప్‌గ్రేడ్‌లను బ్యాంకు ప్రకటించింది.
- స్లిప్పేజీలు క్రితం క్వార్టర్‌లో రూ. 1,223 కోట్లుగా ఉండగా, తాజాగా రూ. 1,458 కోట్లకు ఎగిశాయి.
- క్యూ1లో మూడీస్, ఇక్రా తదితర ఏజెన్సీలు బ్యాంకు రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేశాయి.

ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభం 46 శాతం డౌన్

రూ. 200 కోట్లకు పరిమితం

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రైవేట్ రంగ ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభం రూ. 200 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో నమోదైన రూ. 372 కోట్లతో పోలిస్తే 46 శాతం క్షీణించింది. మార్చి త్రైమాసికంలో లాభం రూ. 69 కోట్లుగా నమోదైంది. తాజాగా నికర వడ్డీ మార్జిన్ 5.67 శాతం నుంచి 4.5 శాతానికి పడిపోవడంతో నికర వడ్డీ ఆదాయం 13 శాతం నెమ్మదించింది. రూ.1,481 కోట్లకు తగ్గింది. ఇతరత్రా ఆదాయం 33 శాతం పెరిగి రూ. 1,069 కోట్లకు చేరడంతో లాభాలకు కాస్త దన్ను లభించింది. అధిక రిస్కులు-అధిక మార్జిన్ల అన్‌సెక్యూర్డ్ రుణాల పోర్ట్‌ఫోలియోను సమీక్షాకాలంలో 10 శాతం మేర తగ్గించుకున్నట్లు బ్యాంక్ ఎండీ ఆర్ సుబ్రమణియకుమార్ తెలిపారు. సెక్యూర్డ్ రిటైల్ విభాగంలో 23 శాతం వృద్ధి సాధించినట్లు పేర్కొన్నారు. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రుణ వృద్ధి 14-15 శాతంగా ఉంటుందనే గైడెన్స్‌ను కొనసాగిస్తున్నట్లు ఆయన చెప్పారు. క్యూ1లో మొత్తం స్లిప్పేజీల పరిమాణం రూ. 1,060 కోట్లుగా నమోదైంది.

అంచనాలు మించిన ఐసీఐసీఐ బ్యాంక్

- క్యూ1లో లాభం 15 శాతం అప్
- రూ. 12,768 కోట్లు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశీయంగా రెండో అతి పెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ ఐసీఐసీఐ బ్యాంక్ నికర లాభం (స్టాండెలోన్) రూ. 12,768 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం నమోదైన రూ. 11,059 కోట్లతో పోలిస్తే సుమారు 15 శాతం పెరిగింది. ఇది సుమారు రూ. 11,747 కోట్లుగా ఉంటుందని విశ్లేషకులు అంచనా వేశారు. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 10.6 శాతం పెరిగి రూ. 19,553 కోట్ల నుంచి రూ. 21,635 కోట్లకు చేరింది. ఇది సుమారు రూ. 20,923 కోట్లుగా ఉండొచ్చని అంచనాలు నెలకొన్నాయి. ట్రెజరీ కార్యకలాపాలు మినహా, ఇతరత్రా ఆదాయం 13.7 శాతం పెరిగి రూ. 7,264 కోట్లకు ఎగిసింది. మరోవైపు, కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం 15.9 శాతం వృద్ధితో రూ. 13,558 కోట్లకు చేరింది. క్రితం క్యూ1లో ఇది రూ. 11,696 కోట్లు. మొత్తం వడ్డీ ఆదాయం రూ. 38,996 కోట్ల నుంచి రూ. 42,947 కోట్లకు చేరింది. అసెట్స్ రూ.24,07,395 కోట్ల నుంచి రూ. 26,68,636 లక్షల కోట్లకు చేరాయి.

తగ్గిన ఎన్‌పీఏలు..

సమీక్షాకాలంలో బ్యాంక్ అసెట్ నాణ్యత మెరుగుపడింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి (జీఎన్‌పీఏ) 2.15 శాతం నుంచి 1.67 శాతానికి దిగి వచ్చింది. నికర ఎన్‌పీఏ నిష్పత్తి 0.43 శాతం నుంచి 0.41 శాతానికి గ్గింది. నికర వడ్డీ మార్జిన్ 4.41 శాతం నుంచి 4.34 శాతానికి తగ్గింది. అయితే, ప్రొవిజనింగ్ భారీగా పెరిగింది. మార్చి త్రైమాసికంలో రూ. 1,332 కోట్లుగా ఉన్న ప్రొవిజనింగ్ రూ. 1,815 కోట్లకు ఎగిసింది. బ్యాంక్ షేరు ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 11 శాతం పెరిగి, దాదాపు రూ. 1,427 వద్ద ఉంది.

డిపాజిట్లు 12.8% అప్

- సమీక్షా కాలం ఆఖరు నాటికి డిపాజిట్లు 12.8 శాతం పెరిగి రూ. 16,08,517 కోట్లకు చేరాయి. కాసా (కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్) నిష్పత్తి 38.7 శాతంగా ఉంది. కరెంట్ అకౌంట్ డిపాజిట్లు 11.2 శాతం, సేవింగ్స్ అకౌంట్ డిపాజిట్లు 7.6 శాతం పెరిగాయి.
- దేశీయంగా రుణాల పోర్ట్‌ఫోలియో 12 శాతం పెరిగి రూ. 13,31,196 కోట్లకు చేరింది.
- నికర వడ్డీ మార్జిన్ 4.36 శాతం నుంచి 4.34 శాతానికి నెమ్మదించింది. వడ్డీయేతర ఆదాయం (ట్రెజరీ మినహాయించి) 13.7 శాతం వృద్ధితో రూ. 6,389 కోట్ల నుంచి రూ. 7,264 కోట్లకు చేరింది.
- ఫీజు ఆదాయం వార్షికంగా రూ. 5,490 కోట్ల నుంచి 7.5 శాతం వృద్ధితో రూ.5,900 కోట్లకు పెరిగింది.
- రిటైల్ రుణాలు వార్షికంగా 6.9 శాతం పెరిగాయి. మొత్తం లోన్ పోర్ట్‌ఫోలియోలో వీటి వాటా 52.2 శాతంగా ఉంది. కార్పొరేట్ పోర్ట్‌ఫోలియో 7.5 శాతం పెరిగింది.
- క్యూ1లో బ్యాంక్ కొత్తగా 83 శాఖలు ప్రారంభించింది. దీంతో మొత్తం శాఖల సంఖ్య 7,066కి, ఏటీఎంలు, క్యాష్ రీసైక్లింగ్ మెషిన్ల సంఖ్య 13,376కి చేరుకుంది.

నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.23,422 కోట్లు

- జూన్‌లో 5.2 శాతం పెరుగుదల
- కేర్ ఎడ్జ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: జీవితేతర బీమా (నాన్ లైఫ్) కంపెనీల ప్రీమియం ఆదాయం జూన్‌లో రూ.23,422 కోట్లుగా ఉంది. 2024 జూన్ నెల ప్రీమియం ఆదాయంతో పోల్చి చూస్తే 5.2 శాతం వృద్ధి చెందింది. కానీ, 2024 జూన్ నెలలో నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థల ప్రీమియం ఆదాయం 8.4 శాతం వృద్ధి చెందడం గమనార్హం. ''1/ఎన్ నిబంధనకు మారాల్సి రావడం పరిశ్రమ పనితీరుపై ప్రభావం చూపించింది. దీంతో హెల్త్ ఇన్సూరెన్స్‌లో వృద్ధి సింగిల్ డిజిట్‌కు నిదానించింది. ప్యాసింజర్ వాహన బీమా వృద్ధి ఆగిపోయింది. ఈ ప్రభావాన్ని బీమా సంస్థలు ఇతర వాణిజ్య మర్గాల రూపంలో కొంత వరకు తగ్గించుకోగలిగాయి'' అని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ తన నివేదికలో వివరించింది. ప్రీమియం వృద్ధి మోస్తరుగానే ఉన్నప్పటికీ 2024-25లో నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.3 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించినట్టు గుర్తు చేసింది. నియంత్రణపరమైన మద్దతు, ఇన్సూర్‌టెక్‌కు ఆమోదం (టెక్నాలజీ ఆధారిత బీమా సంస్థలు), డిజిటలైజేషన్ వేగవంతం కావడం, మధ్యతరగతి ప్రజలు పెరగడం అనుకూలించినట్టు తెలిపింది.

వృద్ధి వేగం

''బీమా ట్రినిటీకి ప్రభుత్వ పరమైన మద్దతుతో నాన్‌లైఫ్ ఇన్సూరెన్స్ రంగంలో వృద్ధి వేగాన్ని అందుకోనుంది. రిటైల్ హెల్త్ విభాగంలో స్టాండలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు (ఒక్క ఆరోగ్య బీమా సేవలు అందించేవి) తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తాయి'' అని కేర్‌ఎడ్జ్ తెలిపింది. మోటారు బీమా వృద్ధి విషయమై రానున్న రోజుల్లో వాహన అమ్మకాలను నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే, థర్డ్ పార్టీ బీమా టారిఫ్‌ల సవరణను పరిశీలించాల్సి ఉంటుందని తెలిపింది. ప్రతిపాదిత కాంపోజిట్ లైసెన్స్ అమల్లోకి వస్తే మధ్య కాలానికి ఈ రంగంలో పోటీతత్వం పూర్తిగా మారిపోతుందని అభిప్రాయపడింది. 1/ఎన్ నిబంధన అన్నది పాలసీలకు సంబంధించిన ప్రీమియం మొత్తాన్ని ఆరంభంలోనే కాకుండా.. కాలవ్యవధి మొత్తానికి సమానంగా వెల్లడించడానికి సంబంధించినది.

సెంట్రల్ బ్యాంక్ ఫలితాలు భేష్

- నికర లాభం రూ.1,169 కోట్లు
- తగ్గిన ఎన్‌పీఏలు, పెరిగిన ఆదాయం



ముంబై: ప్రభుత్వరంగ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయమైన ఫలితాలు ప్రకటించింది. ఆదా యం మెరుగవడం, మొండి రుణాలు (ఎన్‌పీఏలు) తగ్గడంతో ఏప్రిల్-జూన్‌లో రూ.1,169 కోట్ల నికర లాభా న్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం(2024- 25) ఇదే క్యూ1 నికర లాభం రూ.880 కోట్లతో పోలి స్తే ఇది 33% అధికం. వార్షిక ప్రాతిపదికన మొత్తం ఆదాయం రూ.9,500 కోట్ల నుంచి రూ.10,374 కోట్లకు ఎగసింది. బ్యాంకు వడ్డీ ఆదాయం రూ.8,335 కోట్ల నుంచి రూ.8,589 కోట్లకు చేరుకుంది. నిర్వహణ లాభం 19% పెరిగి రూ.2,304 కోట్లకు చేరింది. ఆస్తుల నాణ్యత మెరుగవడంతో స్థూల మొండి బకాయిలు 4.54% నుంచి 3.13 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.73% నుంచి 0.49 శాతానికి తగ్గాయి. స్థూల అడ్వాన్సులు 9.97% పుంజుకొని 2,50,615 కోట్ల నుంచి రూ.2,75,595 కోట్లకు చేరుకున్నాయి. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 96.17 % నుంచి 97.02 శాతం పెరిగింది. కనీస మూలధన నిష్పత్తి 15.6% నుంచి 17.6 శాతానికి మెరుగైంది. మొత్తం వ్యాపారం 11% వృద్ధి చెంది రూ.6,35,564 కోట్ల నుంచి రూ.7,04,485 కోట్లకు ఎగసింది.

యూనియన్ బ్యాంక్ లాభంలో 12% వృద్ధి

తగ్గిన మొండిబాకీలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2025 ఏప్రిల్-జూన్ కాలానికి రూ.4,116 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024 ఇదే కాలానికి ఆర్జించిన రూ.3,679 కోట్లతో పోలిస్తే ఇది 12% అధికం. మొత్తం ఆదాయం రూ.30,874 కోట్ల నుంచి రూ.31,791 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.26,364 కోట్ల నుంచి అధికమై రూ.27,296 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం రూ.9,412 కోట్ల నుంచి రూ.9,113 కోట్లకు దిగివచ్చింది. నిర్వహణ లాభం 11% క్షీణించి రూ.7,785 కోట్ల నుంచి రూ.6,909 కోట్లకు తగ్గింది. స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) 4.54% నుంచి 3.52 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.90% నుంచి 0.62 శాతానికి తగ్గాయి. మొండి రుణాలకు ప్రొవిజన్ల కేటాయింపు రూ.1,651 కోట్ల నుంచి రూ.1,153 కోట్లకు తగ్గాయి. స్థూల అడ్వాన్సులు 6.83% పుంజుకొని 9,12,214 కోట్ల నుంచి రూ.9,74,489 కోట్లకు చేరుకున్నాయి. ప్రొవిజన్ కవరేజ్ రేషియో(పీసీఆర్) 116 బేసిస్ పాయింట్లు పెరిగి 93.49 శాతం నుంచి 94.65 శాతానికి చేరింది. మొత్తం వ్యాపారం 5% వృద్ధి చెంది రూ.21,08,762 కోట్ల నుంచి రూ.22,14,422 కోట్లకు ఎగసింది.

గిల్‌కు ఇప్పుడే అసలు పరీక్ష!

- ఆలోచనల్లో స్పష్టత అవసరం
- కోర్ గ్రూప్ సిద్ధం చేసుకోవాలి
- భారత సారథికి గ్రెగ్ చాపెల్ సూచన

న్యూఢిల్లీ: సారథి అంటే కేవలం మైదానంలో ఫీల్డింగ్ సెట్ చేయడం... బౌలర్లను మార్చడం మాత్రమే కాదని నాయకుడిగా జట్టులో స్ఫూర్తి నింపాలని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ గ్రెగ్ చాపెల్ అన్నాడు. ఇంగ్లండ్‌తో 'ఆండర్సన్–టెండూల్కర్' ట్రోఫీలో భాగంగా ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడిన భారత జట్టు 1–2తో వెనుకబడి ఉంది. ఈ సిరీస్ ద్వారానే భారత జట్టు పగ్గాలు అందుకున్న 25 ఏళ్ల శుబ్‌మన్ గిల్‌ను ఉద్దేశించి చాపెల్ ఓ వ్యాసంలో ఈ వ్యాఖ్యలు చేశాడు. గిల్‌కు అసలు పరీక్ష ఇక ముందే ఎదురవనుందన్న చాపెల్... అతడు ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉందని అన్నాడు. నాయకుడంటే సహచరుల్లో నమ్మకం నింపే వాడని... జట్టు సమావేశాల్లో తనకు ఏం కావాలో అది స్పష్టంగా వెల్లడించగలిగినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నాడు. ఈ సిరీస్‌లో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన చేస్తున్న గిల్... ముందుందు సారథిగాను విజయవంతమవుతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో చాలా సందర్భాల్లో పైచేయి కనబర్చే విధంగా కనిపించిన టీమిండియా... చివరకు పరాజయం పాలవగా బుధవారం నుంచి ప్రారంభం కానున్న నాలుగో టెస్టులో ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆడటంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. పనిభారం కారణంగా ఈ సిరీస్‌లో బుమ్రా మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడతాడని టీమ్ మేనేజ్‌మెంట్ ఇదివరకే స్పష్టం చేయగా... ఇప్పటి వరకు అతడు రెండు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగాడు. మరి సిరీస్ సమం చేయాల్సిన అవసరమున్న ఈ కీలక పోరులో అతడు ఆడతాడా లేదా అనేది చూడాలి. ఈ నేపథ్యంలో ఆసీస్ మాజీ కెప్టెన్... గిల్‌కు పలు సూచనలు చేశాడు. అవి అతడి మాటల్లోనే...


గ్రెగ్ చాపెల్



'ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా సిరీస్ గెలవాలంటే ఇక మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గాలి. ఇలాంటి సమయంలో శుబ్‌మన్ గిల్‌పై అందరి దృష్టి నిలవనుంది. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు అతడు బ్యాట్‌తో ఆకట్టుకున్నాడు. కెప్టెన్‌గానూ కొన్ని సందర్భాల్లో ఫర్వాలేదనిపించాడు. అయితే ఇలాంటి ఎన్నో కఠిన క్షణాలు ఎదుర్కొన్నప్పుడే సారథిలోని సామర్థ్యం బయటపడుతుంది. జట్టును ఎలా తీర్చిదిద్దాలకుంటున్నాం అనే స్పష్టత కెప్టెన్‌కు ఉండాలి. అది కేవలం తన మాటల ద్వారానే కాకుండా తన చర్యల ద్వారా ప్రస్ఫుటించాలి. ఫీల్డ్‌లో మరింత కఠినంగా ఉండాలి. లార్డ్స్ టెస్టులో ప్రత్యర్థులు సమయాన్ని వృథా చేస్తున్న సమయంలో గిల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. సారథిగా అది అతడి బాధ్యత. ముందుందు కూడా దీన్ని కొనసాగిస్తాడా చూడాలి. ఈ సిరీస్‌ను పరిశీలించుకుంటే భారత జట్టు ప్రత్యర్థికి సులువుగా పరుగులు చేసే అవకాశం ఇచ్చింది. దీంతో పాటు కొన్ని సులువైన క్యాచ్‌లు సైతం నేలపాలు చేసింది. అలాంటివి తగ్గించుకోవాల్సిన అవసరముంది. స్లిప్ ఫీల్డింగ్ మరింత మెరుగవ్వాలి. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు జట్టు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముందడుగు వేయాలి. కోర్ గ్రూప్‌ను సిద్ధం చేసుకోవాలి. జట్టులోని ప్రతి ఆటగాడికి వారి బాధ్యతలు వివరించాలి. అప్పుడే ప్లేయర్లకు తమ కర్తవ్యం బోధపడుతుంది. ఫామ్ లేమితో తంటాలు పడుతున్న ఆటగాళ్లకు కోలుకునే అవకాశం ఇచ్చేందుకు జాతీయ జట్టు సరైన స్థానం కాదనే విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. ప్రతి మ్యాచ్‌లో పరుగులు చేయడం ఎవరికీ సాధ్యం కాదు. అయినా ఆటగాళ్లపై విశ్వాసం ఉంచి వారిలో నమ్మకం పెంచాల్సిన బాధ్యత సారథిదే. ఇప్పుడు భారత జట్టు అలాంటి పరిస్థితిలోనే ఉంది. సిరీస్‌లో వెనుకబడి ఉన్న దశలో అతడు జట్టును ఎలా నడిపిస్తాడో చూడాలి. తనదైన ముద్ర వేసేందుకు ఇదే సరైన సమయం. మంచి జట్టును ఎంపిక చేసుకోవాలి. క్రికెట్ జట్టు క్రీడ. ఇందులో ఒక్కరిద్దరు మెరుగైన ప్రదర్శన చేస్తే సరిపోదు. సమష్టిగా సత్తాచాటాలి. భాగస్వామ్యాలతోనే భారీ స్కోర్లు సాధ్యమవుతాయి. ఒక్క ప్లేయర్ ఎప్పుడూ మ్యాచ్‌ను గెలిపించలేడు. మంచి స్పెల్‌లు, మంచి సెషన్‌లతోనే మ్యాచ్ ఫలితాలు అనుకూలంగా వస్తాయి. ఆలోచనలు స్పష్టంగా ఉండాలి. అప్పుడే ఈ సిరీస్‌తో పాటు భవిష్యత్తులోనూ అతడు జట్టును మెరుగైన దిశలో నడిపించగలడు'

క్వార్టర్ ఫైనల్‌లో భారత్

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్


రుజులా

సాలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలి పోరులో శ్రీలంకపై గెలుపొందిన భారత జట్టు... శనివారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)పై విజయం సాధించింది. గ్రూప్ 'డి'లో భాగంగా జరిగిన పోరులో భారత్ 110–83 పాయింట్ల తేడాతో యూఏఈని చిత్తుచేసింది. భారత్ తరఫున తొలి మ్యాచ్ మహిళల సింగిల్స్‌లో రుజులా 11–5తో మైసా ఖాన్‌పై గెలుపొందింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో లాల్‌రమ్‌సంగా–తరిణి జంట 11–6తో యూఏఈ జోడీపై నెగ్గింది. తన్వీ శర్మ, రిషిక కూడా విజయాలు సాధించడంతో భారత జట్టు సునాయాసంగా గెలుపొందింది. ఇదే గ్రూప్‌లో ఉన్న హాంకాంగ్ కూడా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించి నాకౌట్ దశకు చేరింది. ఇక ఆదివారం జరగనున్న పోరులో హాంకాంగ్‌తో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు గ్రూప్ 'డి' టాపర్‌గా నిలవనుంది. ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ అత్యుత్తమంగా 2011లో కాంస్య పతకం నెగ్గింది. ఆ తర్వాత మరోసారి పతకం సాధించలేకపోయింది. గతేడాది క్వార్టర్ ఫైనల్లో మలేసియా చేతిలో ఓడి రిక్త హస్తాలతో వెనుదిరిగింది. మొత్తం 17 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరితే పతకం ఖాయం కానుంది.

ప్రియాకు రజతం, మనీషాకు కాంస్యం





బుడాపెస్ట్ (హంగేరి): పొలియాక్ ఇమ్రె–వర్గాయానోస్ స్మారక అంతర్జాతీయ ర్యాంకింగ్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో భారత రెజ్లరు పతకాల పంట పండిస్తున్నారు. రెండో రోజు 2 స్వర్ణాలు సహా నాలుగు పతకాలు గెలుపొందగా... మూడో రోజు పోటీల్లో ప్రియా రజతం, మనీషా కాంస్యం గెలిచారు. శనివారం జరిగిన మహిళల 76 కేజీల క్లాస్ కేటగిరీలో ప్రియా రజత పట్టుపట్టింది. క్వార్టర్స్‌లో ఆమె 7–2తో కజకిస్తాన్‌కు చెందిన ఎల్మిరా సిదికొవాపై గెలిచింది. సెమీఫైనల్లో ప్రియా టెక్నికల్ పాయింట్‌తో వాలెరియా ట్రిఫొనొవా (కజకిస్తాన్)పై విజయం సాధించింది. అయితే స్వర్ణ పతక పోరులో ఈ జోరు కొనసాగించడంలో విఫలమైంది. బ్రెజిల్ ప్రత్యర్థి తమిరెస్ మార్టిన్స్ మచాదోతో కడదాకా పోరాడినప్పటికీ చివరకు ప్రియా 3–4తో పరాజయం చవిచూసింది. 62 కేజీల కేటగిరీలో మనీషా తొలి రౌండ్‌లోనే కంగుతింది. అమిన తండెలొవా (రష్యా) చేతిలో ఓడింది. అయితే అమిన ఫైనల్ చేరడంతో మనీషాకు రెపిచేజ్ రౌండ్‌లో తలపడే అవకాశం దక్కింది. ఇందులో ఎలాంటి పొరపాటుకు తావివ్వకుండా క్రిస్టినా సజికినా (కజకిస్తాన్)పై గెలిచి కాంస్య పతకం గెలుచుకుంది. ఈ ఈవెంట్‌లో ఇప్పటివరకు భారత రెజ్లర్లు 8 పతకాలు సాధించారు. మహిళలలో అంతిమ్, హర్షిత స్వర్ణాలు గెలుపొందగా, నేహా రజతం, నీలమ్ కాంస్యం గెలిచారు. పురుషుల విభాగంలో సుజీత్ కల్కల్ బంగారు పతకం, రాహుల్ కాంస్యం నెగ్గారు. నేడు గ్రీకో రోమన్ కేటగిరీలో పోటీలు జరుగుతాయి. ఇందులో ఏడుగురు భారత రెజ్లర్లు పోటీ పడేందుకు సిద్ధమయ్యారు.

రోజర్ బిన్నీ తప్పుకుంటారా?

70 ఏళ్లు పూర్తి చేసుకున్న బీసీసీఐ అధ్యక్షుడు


- నిబంధనల ప్రకారం వైదొలగాలి
- ఆశలు రేపుతున్న కొత్త క్రీడాబిల్లు



న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్, ప్రస్తుత భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు రోజర్ బిన్నీ శనివారం (19 జూలై) నాటి పుట్టినరోజుతో 70 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఇప్పుడున్న జాతీయ క్రీడా నియమావళి (స్పోర్ట్స్ కోడ్) ప్రకారం ఏవరైనా క్రీడా సమాఖ్య కార్యవర్గ సభ్యుడు గరిష్టంగా 70 ఏళ్ల వయసు వరకే పదవిలో కొనసాగాలి. వయోపరిమితి మించితే వైదొలగాల్సి ఉంటుంది. అయితే బీసీసీఐ ఒక స్వతంత్ర క్రీడా సంఘమైనా... మిగతా జాతీయ క్రీడా సమాఖ్యల మాదిరి భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) గొడుగు కింద లేకపోయినా... లాస్‌ఏంజెలిస్ ఒలింపిక్స్ (2028)లో క్రికెట్ ఉండటంతో ఇకపై స్పోర్ట్స్ కోడ్ ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటీవల మీడియాలో ఆయన తప్పుకుంటారని, తాత్కాలిక అధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా బాధ్యతలు చేపడతారని వార్తలు ప్రముఖంగా వచ్చాయి. దీంతో అతను తప్పుకోవడంపై నేడో రేపో ప్రకటన ఉండొచ్చనే ఊహాగానాలు కూడా వినిపించాయి. కానీ బిన్నీ నుంచి అలాంటి ప్రకటన కాదు కదా... కనీసం సంకేతాలు కూడా రాలేదు.

కొత్త 'కోడ్'పై కోటి ఆశలు

రోజర్ బిన్నీ పదవిని వీడకపోవడానికి కారణం కూడా లేకపోలేదు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నూతన క్రీడా బిల్లును ప్రవేశపెట్టబోతోంది. దీనికి సంబంధించిన ముసాయిదా ఎప్పుడో సిద్ధమైంది. ఈ శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంట్ ముందుకు ఈ బిల్లు రానుంది. ఇందులో ఉన్న కొత్త నిబంధన వృద్ధండ పిండాలకు ఊరటనిచ్చేలా ఉంది. గరిష్ట వయోపరిమితికి వెసులుబాటు కల్పిస్తుంది. అంటే నామినేషన్ల సమయంలో 69 ఏళ్లకు పైబడి 70 ఏళ్లలోపు ఏ ఒక్కరోజు మిగిలున్నా... అలాంటి సందర్భంలో ఆ వ్యక్తి పోటీపడేందుకు... గెలిస్తే పూర్తి పదవీకాలం కొనసాగేందుకు కొత్త క్రీడా పాలసీలో అవకాశం ఉంది. దీంతో ఈ బిల్లు పాస్ అయితే 70 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వరకు బిన్నీలాంటివారు పదవిలో కొనసాగవచ్చు. పైగా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ), అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఫిఫా), అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)లో గరిష్ట వయోపరిమితి లేనేలేదు. ఒకవేళ విమర్శలు ఎదురైతే రాజీవ్ శుక్లాకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించడం లేదంటే స్పోర్ట్స్ కోడ్ బిల్లు వరకు వేచి చూసే ధోరణితో ఉండాలని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నాయి.



కౌంటీ చాంపియన్‌షిప్‌కు

గైక్వాడ్ దూరం

వ్యక్తిగత కారణాలతో తప్పుకున్న రుతురాజ్

లండన్: భారత మిడిలార్డర్ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ కౌంటీ చాంపియన్‌షిప్ చివరి దశ పోటీల నుంచి తప్పుకున్నాడు. ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లు ఆడేందుకు కౌంటీ క్లబ్ యార్క్‌షైర్ జట్టుతో 28 ఏళ్ల గైక్వాడ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. మంగళవారం డిఫెండింగ్ చాంపియన్ సర్రేతో మ్యాచ్ ద్వారా గైక్వాడ్ కౌంటీ అరంగేట్రం చేయాల్సి ఉండగా... వ్యక్తిగత కారణాలతో టోర్నీకి అందుబాటులో లేకుండాపోయాడు. ఈ మేరకు యార్క్‌షైర్ యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించింది. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రుతురాజ్ గైక్వాడ్ రంజీ ట్రోఫీలో మహారాష్ట్ర జట్టును నడిపిస్తున్నాడు. గాయం కారణంగా ఈ ఏడాది ఐపీఎల్ మధ్యలోనే తప్పుకున్న గైక్వాడ్... కెరీర్‌లో జాతీయ జట్టు తరఫున 6 వన్డేలు, 23 టి20లు ఆడాడు.

రేపటి నుంచి సీనియర్ మహిళల హాకీ శిబిరం

బెంగళూరు: భారత సీనియర్ మహిళల హాకీ ప్రాబబుల్స్ జట్టుకు రేపటి నుంచి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కోసం 40 మందితో కూడిన కోర్ గ్రూప్ జాబితాను హాకీ ఇండియా (హెచ్ఐ) ఎంపిక చేసింది. బెంగళూరులోని భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కేంద్రంలో ఈ నెల 21 నుంచి ఆగస్టు 29 వరకు ఈ శిబిరం నిర్వహించనున్నట్లు హెచ్ఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది ఆసియా కప్, వచ్చే ఏడాది మహిళల ప్రపంచకప్ నేపథ్యంలో ఈ శిబిరం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రపంచ కప్‌కు ఏడాది సమయం ఉన్నప్పటికీ ఆసియా కప్‌లో విజేతగా నిలిచే జట్టు మాత్రమే ఆ మెగా టోర్నీకి నేరుగా అర్హత సంపాదిస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భారత జట్టు చూస్తోంది.

'అదే నా అత్యుత్తమ మ్యాచ్'

భారత్‌తో వరల్డ్ కప్ సెమీస్‌పై రసెల్



కింగ్‌స్టన్ (జమైకా): అంతర్జాతీయ టి20లకు రిటైర్మెంట్ ప్రకటించిన విధ్వంసక ఆటగాడు ఆంద్రీ రసెల్ తన కెరీర్‌లో 84 మ్యాచ్‌లలో వెస్టిండీస్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 163.08 స్ట్రయిక్‌రేట్‌తో 1078 పరుగులు చేసిన అతను విండీస్ రెండు టి20 వరల్డ్ కప్ విజయాల్లో (2012, 2016) భాగంగా ఉన్నాడు. తన కెరీర్ విశేషాల గురించి చెబుతూ అతను తన అత్యుత్తమ మ్యాచ్ గురించి ప్రస్తావించాడు. 2016 వరల్డ్ కప్‌లో భాగంగా ముంబైలో జరిగిన సెమీ ఫైనల్ పోరు తన 'బెస్ట్' అని అతను వెల్లడించాడు. వాంఖెడే మైదానంలో జరిగిన ఈ పోరులో ముందుగా భారత్ 192 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో రసెల్ ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. ఆ సమయంలో విండీస్ విజయానికి 41 బంతుల్లో 77 పరుగులు అవసరం కాగా...20 బంతుల్లోనే 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో అజేయంగా 43 పరుగులు చేశాడు. కోహ్లి వేసిన చివరి ఓవర్లో వరుసగా ఫోర్, సిక్స్ బాది అతను మ్యాచ్‌ను ముగించాడు. ఫైనల్ చేరిన విండీస్ ఆపై ఇంగ్లండ్‌ను ఓడించి రెండో సారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. 'నిస్సందేహంగా భారత్‌తో సెమీస్ మ్యాచే నా కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన. 190 పరుగుల లక్ష్యం...సొంతగడ్డపై ఆడుతున్న భారత్‌కే ప్రేక్షకుల నుంచి పూర్తి మద్దతు ఉంది. తీవ్ర ఒత్తిడి మధ్య బరిలోకి దిగా. అయితే పిచ్ బ్యాటింగ్‌కు బాగా అనుకూలంగా ఉండటంతో నా ప్రణాళిక ప్రకారం చెలరేగి జట్టును గెలిపించా' అని రసెల్ గుర్తు చేసుకున్నాడు.

రాహుల్ గొప్పగా ఆడుతున్నాడు

మాజీ కోచ్ రవిశాస్త్రి


రాహుల్
రవిశాస్త్రి

న్యూఢిల్లీ: నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకున్న భారత బ్యాటర్ కేఎల్ రాహుల్... ఇంగ్లండ్ పర్యటనలో మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడని టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి అన్నాడు. మరో మూడు నాలుగేళ్ల పాటు అతడు ఇదే జోరు కొనసాగించే అవకాశం ఉందని రవిశాస్త్రి ఆశాభావం వ్యక్తం చేశాడు. 'ఆండర్సన్–టెండూల్కర్' సిరీస్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రాహుల్ 62.50 సగటుతో 375 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు ఒక హాఫ్ సెంచరీ ఉన్నాయి. ప్రస్తుతం సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో శుబ్‌మన్ గిల్, రిషబ్ పంత్, జేమీ స్మిత్ తర్వాత నాలుగో స్థానంలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో రవిశాస్త్రి మాట్లాడుతూ... 'రాహుల్ తన బ్యాటింగ్ శైలిలో స్వల్ప మార్పులు చేసుకున్నాడు. బ్యాటింగ్ స్టాన్స్‌తో పాటు డిఫెన్స్ ఆడే తీరులో మరింత మెరుగయ్యాడు. దీంతో పరుగులు చేయడం అతడికి మరింత సులువవుతోంది. దీంతో పాటు బౌల్డ్, ఎల్బీడబ్ల్యూ అయ్యే అవకాశాలు చాలా వరకు తగ్గాయి. గతంలో ఇలా చాలా సార్లు అతడు అవుటయ్యేవాడు. నైపుణ్యం పరంగా రాహుల్ చాలా మెరుగ్గా ఉన్నాడు. ఈ సిరీస్‌లో బంతి ఎక్కువ స్వింగ్ అయిన దాఖలాలు లేవు. ఒకవేళ అనుకోకుండా ఏదైన బంతి అనూహ్యంగా దూసుకొచ్చినా దాన్ని ఎదుర్కొనేందుకు రాహుల్ సిద్ధంగా ఉన్నాడు. ఇదే తీరు కొనసాగితే మరి కొన్నేళ్ల పాటు రాహుల్ అత్యున్నత స్థాయి ప్రదర్శన కొనసాగించగలడు. ఈ సిరీస్‌లో అతడి బెస్ట్ మనం చూస్తున్నాం. ప్రస్తుతం రాహుల్ కెరీర్ అత్యుత్తమ దశలో ఉంది. ఇలాగే సాగితే మరెన్నో శతకాలు అతడి ఖాతాలో చేరతాయి. ముందుందు టీమిండియా స్వదేశంలో చాలా మ్యాచ్‌లు ఆడనుంది. దీంతో కెరీర్ ముగించే సమయానికి అతడి టెస్టు సగటు 50కి చేరువవడం ఖాయం' అని వివరించాడు. జాతీయ జట్టు తరఫున ఇప్పటి వరకు 61 టెస్టులు ఆడిన 33 ఏళ్ల రాహుల్ 35.26 సగటుతో 3632 పరుగులు చేశాడు. అందులో 10 శతకాలు, 18 అర్ధ శతకాలు ఉన్నాయి.

బెంగాల్ ప్రాబబుల్స్‌లో షమీ



కోల్‌కతా: భారత వెటరన్ సీమర్ మొహమ్మద్ షమీ దేశవాళీ క్రికెట్ టోర్నీల్లో సత్తా చాటడం ద్వారా టీమిండియాకు ఎంపికవ్వాలనే లక్ష్యంతో ఉన్నాడు. ఈ సీనియర్ పేసర్ ఈ సీజన్ ఐపీఎల్ తర్వాత మళ్లీ బరిలోకే దిగలేదు. ప్రస్తుతం ఇంగ్లండ్‌లో పర్యటిస్తోన్న భారత జట్టుకు దూరమైన షమీ త్వరలోనే మొదలయ్యే దేశవాళీ సీజన్‌కు సిద్ధమవుతున్నాడు. దీర్ఘకాలంగా వేధించిన చీలమండ గాయం నుంచి కోలుకుని ఈ ఏడాది పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఆడిన షమీ ఆ టోర్నీలో 9 వికెట్లతో రాణించాడు. ఈ మెగా టోర్నీలో రోహిత్ నేతృత్వంలోని టీమిండియా విజేతగా నిలిచింది. అయితే తదుపరి ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున బరిలోకి దిగినప్పటికీ కేవలం 6 వికెట్లే పడగొట్టాడు. అన్ని ఫార్మాట్లలో ఆడే ఫిట్‌నెస్ ఉన్నప్పటికీ దీనిపై సంతృప్తి చెందని సెలక్టర్లు ఆసీస్ టూర్‌కు అతన్ని పక్కన బెట్టారు. అయితే బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) శనివారం ప్రకటించిన 50 మంది సభ్యులు గల ప్రాబబుల్స్‌లో అతనే ప్రధాన ఆటగాడిగా ఉన్నాడు. బెంగాల్‌తో పాటు దులీప్ ట్రోఫీలో ఈస్ట్‌జోన్ తరఫున కూడా బరిలోకి దిగేందుకు షమీ ఆసక్తి కనబరుస్తున్నాడు. ఈ ఏడాది నుంచి మళ్లీ ఇంటర్–జోనల్ పాత పద్ధతిలోనే నిర్వహించే దులీప్ ట్రోఫీ వచ్చే నెల 28 నుంచి జరుగుతుంది. షమీతో పాటు ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న పేసర్ ఆకాశ్ దీప్, బ్యాటర్ అభిమన్యు ఈశ్వరన్‌లు కూడా బెంగాల్ జంబో ప్రాబబుల్స్‌లో ఉన్నారు. పేసర్ ముకేశ్ కుమార్, బెంగాల్ కెప్టెన్ అనుస్తుప్ మజుందార్, స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ షహబాజ్ అహ్మద్, వికెట్ కీపర్–బ్యాటర్ అభిషేక్ పొరెల్ ప్రాబబుల్స్ జాబితాకు ఎంపికయ్యారు.





వీరంతా సరదాగా ఊయలలో ఊగుతున్నారనుకుంటే ఎవరైనా పొరపాటుపడ్డట్టే. ఏరియల్ యోగాలో ఇదంతా ఓ భాగం. ఇండోనేసియాలోని బండా అసె నగరంలోని మహిళల జిమ్‌లో శనివారం కనిపించిన దృశ్యమిది.

40 ఏళ్లుగా నాటౌట్!

ఉగాండా అధ్యక్షునిగా ముసేవేని రికార్డు

ఈసారి కూడా మళ్లీ ఎన్నికల బరిలోకి • ప్రత్యర్థిగా మాజీ పాప్ స్టార్



వయసు 80 ఏళ్లు. అందులో దేశాధ్యక్షునిగానే ఏకంగా 40 ఏళ్లు! ఇదీ, ఉగాండా ప్రెసిడెంట్ యోవేరి ముసేవేని ట్రాక్ రికార్డు! అయినా తనివి తీరలేదేమో, ఈ వయసులో కూడా మళ్లీ అధ్యక్ష బరిలో దిగుతున్నారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ఆయనే అభ్యర్థి అని పాలక నేషనల్ రెసిస్టెన్స్ మూవ్‌మెంట్ (ఎన్‌ఆర్‌ఎం) పార్టీ ప్రకటించింది. అందుకు ముసేవేని అంగీకరించారు కూడా. ఎన్‌ఆర్‌ఎం గెలుపు నల్లేరుపై నడకే అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన 40 ఏళ్ల రికార్డును మరింత మెరుగు పరుచుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

జనవరిలో ఎన్నికలు

ఉగాండాలో 2026 జనవరిలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. పాప్ స్టార్ నుంచి రాజకీయ నాయకుడిగా మారిన బాబీ వైన్ వాటిలో ముసేవేని ప్రధాన ప్రత్యర్థిగా నిలిచే అవకాశం కనిపిస్తోంది. విపక్ష నేషనల్ యూనిటీ పార్టీ తనను నామినేట్ చేస్తే ముసేవేనిపై తలపడేందుకు సిద్ధమని ఆయన ఇప్పటికే ప్రకటించారు. ''దేశంలో అణచివేత పెరుగుతోంది. విపక్షాల్లో కొనసాగడమే దుర్భరంగా మారింది. విపక్ష నేతలపై నేరుగా ఉగ్రవాది ముద్ర వేస్తున్నారు'' అన్నారాయన. వైన్ 2021 సార్వత్రిక ఎన్నికల్లో కూడా బరిలో దిగినా ముసేవేని చేతిలో ఓటమి చవిచూశారు. మరో ప్రముఖ ప్రతిపక్షం ఫోరం ఫర్ డెమొక్రటిక్ చేంజ్ (ఎఫ్‌డీసీ) నేత కిజ్జా బెసిగ్యే దేశద్రోహ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మాజీ సైనికాధికారి అయిన ఆయన గత నవంబర్ నుంచి నిర్బంధంలో ఉన్నారు.

పశుల కాపర్ల కుటుంబం

యోవేరి ముసేవేని 1944లో ఉగాండాలోని ఎంబారా జిల్లాలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు పశువుల కాపర్లు, పెంపకదారులు. ఆయన మిషనరీ పాఠశాలల్లో చదివారు. టాంజానియాలోని దారెస్సలాం విశ్వవిద్యాలయంలో చదువుతుండగా ఆఫ్రికన్ విముక్తి ఉద్యమాలతో అనుబంధం ఏర్పడింది. వామపక్ష విద్యార్థి సంఘానికి చైర్మన్ అయ్యారు. నేషనల్ రెసిస్టెన్స్ మూవ్‌మెంట్ (ఎన్‌ఆర్‌ఎం) ఆధ్వర్యంలోని సాయుధ దళమైన నేషనల్ రెసిస్టెన్స్ ఆర్మీకి నేతృత్వం వహించారు. 1980ల్లో నాటి అధ్యక్షుడు ఒబోటే పాలనకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధం చేశారు. 1986లో తిరుగుబాటు నాయకుడిగా అధికారాన్ని చేజిక్కించుకున్నారు. నాటి నుంచి ప్రతి ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ వస్తున్నారు. ఆయన పదవిలో కొనసాగడానికి వీలుగా రాజ్యాంగాన్ని రెండుసార్లు సవరించి మరీ వయో,, పదవీకాల పరిమితులను తొలగించారు! ఆ తర్వాత 2001, 2006, 2011, 2016 ఎన్నికల్లో ముసేవేని వరుస విజయాలు సాధించారు. 2017లో మరోసారి రాజ్యాంగ సవరణ చేసి అధ్యక్ష అభ్యర్థుల వయో వయో పరిమితిని పూర్తిగా ఎత్తేశారు. తద్వారా 2021లో తిరిగి ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఉగాండాను ముసేవేని ప్రగతి పథంలోకి నడిపించారు. రాజకీయ స్థిరత్వం అందించారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మార్చారు. మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. పత్రికా స్వేచ్ఛకు మద్దతిచ్చారు. ఇదంతా నాణేనికి ఒకవైపే ముసేవేనిపై తీవ్ర అవినీతి మచ్చలున్నాయి. దాంతో కొన్నేళ్లుగా ఆయన ఆదరణ, ప్రాబల్యం తగ్గుతూ వస్తున్నాయి. విపక్ష నేతలను వేధించడం, నిర్బంధించడం వంటి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఉత్తర ఉగాండాను దశాబ్దాలుగా భయభ్రాంతులను చేస్తున్న లార్డ్స్ రెసిస్టెన్స్ ఆర్మీ (ఎల్‌ఆర్‌ఏ)ని కట్టడి చేయడంలో విఫలమయ్యారని ముసేవేని ఆరోపణలు ఎదుర్కొన్నారు. సోమాలియాలో ఆఫ్రికన్ యూనియన్ దళానికి సైనిక సాయం చేసి ప్రశంసలు కూడా అందుకున్నారు. అయితే 2013లో దక్షిణ సూడాన్ చెలరేగిన అంతర్యుద్ధంలో ప్రభుత్వానికి మద్దతిచ్చివిమర్శలపాలయ్యారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

రాజ్యాంగాన్ని చంపేస్తున్నారు

ప్రధాని మోదీపై ఖర్గే ధ్వజం

మైసూరు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని చంపేస్తున్నారంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు రాజ్యాంగాన్ని మార్చేందుకు యత్నిస్తే దేశ ప్రజలు అడ్డుకుంటారని స్పష్టం చేశారు. శనివారం కర్నాటక ప్రభుత్వం మైసూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖర్గే ప్రసంగించారు. 'మోదీ, రాజ్యాంగం కారణంగానే మీరు సీఎం, ఆ తర్వాత పీఎం అయ్యారు. రాజ్యాంగానికి విధేయుడిగా ఉంటూ పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. కానీ, ఇప్పుడు రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారు'అంటూ నిప్పులు చెరిగారు. 'రాజ్యాంగాన్ని సవరించాలని లేదా పునర్లిఖించాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు మాట్లాడుతున్నాయి. మీరెన్ని ప్రయత్నాలు చేసినా రాజ్యాంగాన్ని మార్చడానికి ప్రజలు మాత్రం అంగీకరించరు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీకి అవకాశమిస్తే ప్రజలకు హక్కులే లేకుండా పోతాయి'అని ఖర్గే హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా 42 దేశాల్లో పర్యటనలు సాగించిన మోదీకి హింసాత్మక ఘటనలతో అట్టుకుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్ వెళ్లేందుకు మాత్రం సమయం దొరకడం లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పటి వరకు రెండు పర్యాయాలు మణిపూర్‌కు వెళ్లారన్నారు. ప్రథమ ప్రధాని నెహ్రూ హయాంలో నెలకొల్పిన సంస్థలను బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు అమ్మేస్తోందని ఆరోపించారు. ఎయిర్‌పోర్టులు, రోడ్లు, విమానయాన సంస్థలు..ఇలా ప్రతి ఒక్కటీ మోదీకి ఇష్టులైన వారికి కట్టబెడుతున్నారని ఖర్గే పేర్కొన్నారు.

జస్టిస్ యాదవ్ అభిశంసనకూ నోటీసివ్వాలి

సీపీఎం నేత జాన్ బ్రిట్టాస్ డిమాండ్

న్యూఢిల్లీ: జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు నోటీసు విషయంలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు సానుకూలంగా ఉన్నాయని సీపీఎం నేత జాన్ బ్రిట్టాస్ తెలిపారు. దీంతోపాటు, జస్టిస్ శేఖర్ యాదవ్ అభిశంసనకు సైతం నోటీసులు పంపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థ సమగ్రతను, పారదర్శకతను కాపాడాల్సిన అవసరముందని మేమంతా భావిస్తున్నాం. జస్టిస్ వర్మ అభిశంసనపై అనుకూలంగా ఉన్నాం. అభిశంసన ప్రక్రియలో మేం కూడా పాలుపంచుకుంటాం. అదేవిధంగా, జస్టిస్ యాదవ్‌ను అభిశంసించాలంటూ మేమిచ్చిన నోటీసు రాజ్యసభ చైర్మన్ వద్ద పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వం ఈ రెండు నోటీసులను పరిగణనలోకి తీసుకోవాలి'అని బ్రిట్టాస్ కోరారు. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో మార్చిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సగం కాలిన నోట్ల కట్టలు బయటపడినట్లు ఆరోపణలు రావడం తెల్సిందే. ఈ ఆరోపణలను జస్టిస్ వర్మ ఖండించారు. తాను గానీ, తన కుటుంబంగానీ స్టోర్‌రూంలో కరెన్సీని దాయలేదంటూ కొట్టిపారేస్తున్నారు. అదే సమయంలో, గతేడాది జరిగిన ఓ కార్యక్రమంలో జస్టిస్ యాదవ్ విద్వేష ప్రసంగం చేశారంటూ ఆరోపణలు వచ్చాయి. ఆయన్ను అభిశంసించాలంటూ ప్రతిపక్ష రాజ్యసభ ఎంపీలు డిసెంబర్‌లో సభాధ్యక్షుడికి నోటీస్ అందజేశారు.

థాయ్‌లాండ్‌లో మాయలేడి

బౌద్ధ గురువులు, సన్యాసులతో శృంగారం

- బ్లాక్‌మెయిల్ చేసి రూ.102 కోట్లు వసూలు

బ్యాంకాక్: అందం ఎరవేసి బౌద్ధ గురువులు, సన్యాసులను ఉచ్చులోకి లాగి, రూ.100 కోట్లకుపైగా వసూలు చేసిన మాయలేడి వ్యవహారం థాయ్‌లాండ్‌లో సంచలనం సృష్టిస్తోంది. గత నెలలో బ్యాంకాక్‌లోని బౌద్ధ ఆలయం నుంచి ఫ్రా థెప్ అనే సీనియర్ గురువు అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులకు నివ్వెరపోయే నిజాలు తెలిశాయి. అతడి అదృశ్యం వెనుక 'మిస్ గోల్ఫ్' అనే మహిళ ప్రమేయం ఉన్నట్లు వెల్లడయ్యింది. ఆమె ఇంట్లో సోదాలు చేయగా, 80 వేలకుపైగా సెక్స్ ఫొటోలు, వీడియోలు ఉన్న ఫోన్లు లభించాయి. ఆమె అసలు పేరు విలావన్ ఎమ్సావత్ అని గుర్తించారు. వయసు 30 ఏళ్లు. బౌద్ధ సన్యాసులకు వలవేసి, ఏకాంతంగా ఉన్నప్పుడు వారికి తెలియకుండా ఫొటోలు, వీడియోలు చిత్రీకరించడం, వాటిని చూపించి బ్లాక్‌మెయిల్ చేసి, భారీగా డబ్బులు వసూలు చేయడం ఆమె దినచర్య అని పోలీసుల విచారణలో వెల్లడయ్యింది. బెదిరింపులు, బలవంతపు వసూళ్లు, మనీ లాండరింగ్ కేసులో ఎమ్సావత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చాలామంది బౌద్ధ గురువులు, సన్యాసులు ఆమె వలలో చిక్కినట్లు గుర్తించారు. గత మూడేళ్లలో వారి నుంచి 385 బాత్స్ (రూ.102 కోట్లు) వసూలు చేసింది. అదృశ్యమైన ఫ్రా థెప్ ఆచూకీ ఇంకా లభించలేదు. అతడితో ఎమ్సావత్‌కు 2024 మే నెలలో సంబంధం ఏర్పడింది. అతడితో తాను బిడ్డను కన్నట్లు చెబుతోంది. బిడ్డ సంరక్షణ కోసం ఫ్రా థెప్ నుంచి తనకు రూ.1.90 కోట్లు ఇప్పించాలని డిమాండ్ చేస్తోంది. ఎమ్సావత్ బౌద్ధ సన్యాసుల నుంచి డబ్బులతోపాటు ఖరీదైన వస్తువులు, వాహనాలు కూడా స్వీకరించింది. అయితే, ఆ సొమ్మును ఆన్‌లైన్ జూదంలో పెట్టింది. బౌద్ధ ఆలయాలకు భక్తుల నుంచి విరాళంగా వచ్చిన డబ్బును సన్యాసులు ఈ మాయలేడికి ధారపోసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. భగవంతుడి సన్నిధిలో ఉంటూ ఆదర్శవంతమైన జీవితం గడపాల్సిన బౌద్ధ సన్యాసులు శారీరక సుఖాల కోసం ఆరాటపడడం పట్ల జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒడిశాలో అమానవీయం

15 ఏళ్ల బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగులు

విషమంగా మారిన బాధితురాలి ఆరోగ్య పరిస్థితి

భువనేశ్వర్: ఒడిశాలోని పూరీ జిల్లాలో దారుణం జరిగింది. 15 ఏళ్ల బాలికపై గుర్తు తెలియని దుండుగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. 70 శాతం కాలిన గాయాలతో బాధితులు భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు చెప్పారు. బయాబర్ గ్రామంలోని నవగోపాల్‌పూర్ బస్తీలో శనివారం చోటుచేసుకున్న ఈ అమానవీయ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాలిక తన స్నేహితురాలి ఇంటికి వెళ్తుండగా, ముగ్గురు వ్యక్తులు మోటార్‌సైకిల్ వచ్చి అడ్డగించారు. సమీపంలోని భార్గవి నది గట్టుకు బలవంతంగా లాక్కెళ్లారు. చేతులు కట్టేసి పెట్రోల్ చల్లి, నిప్పంటించి, వెంటనే అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలి కేకలు విన్న స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు. ఆసుపత్రికి తరలించి, పోలీసులకు సమాచారం చేరవేశారు. అనంతరం పోలీసులు ఆమెను మెరుగైన చికిత్స కోసం ఎయిమ్స్‌కు తరలించారు. బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక ఎనిమిదో తరగతి వరకు చదుకుంది. మధ్యలో చదువు మానేసింది. ఆమె తండ్రి మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బాలిక పట్ల రాక్షసంగా ప్రవర్తించిన దుండగులను త్వరలో అరెస్టు చేస్తామని ఒడిశా డీజీపీ వై.బి.ఖురానియా ప్రకటించారు. బాలికను హత్య చేయడానికి ఎందుకు ప్రయత్నించారన్నది తెలియరాలేదు. మరోవైపు ఈ ఘటనపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని మండిపడ్డాయి. మహిళలపై నిత్యం అఘాయిత్యాలు జరుగుతున్నప్పటికీ బీజేపీ ప్రభుత్వం మొద్దునిద్ర వీడడం లేదని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆరోపించారు. విపక్ష తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సైతం తీవ్రంగా స్పందించింది. 'బేటీ బచావో' అంటే ఇదేనా? అని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులు రక్తంతో తడిచాయని విమర్శించింది. ఒడిశాలో వారం రోజుల క్రితమే కాలేజీ విద్యార్థిని(20) ఆత్మాహుతికి పాల్పడింది. ప్రొఫెసర్ లైంగికంగా వేధిస్తుండడంతో భరించలేక తనకు తానే నిప్పంటించుకొని మృతిచెందింది. ఈ ఘటన రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కలచివేసింది.

పంజాబ్ ఆప్ ఎమ్మెల్యే రాజీనామా

రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు అన్మోల్ వెల్లడి

చండీగఢ్: పంజాబ్‌లోని అధికార ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన నాయకురాలు అన్మోల్ గగన్ మాన్(35) అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు శనివారం వెల్లడించారు. ఖరార్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన అన్మోల్ తన నిర్ణయాన్ని ఎక్స్ వేదికగా ప్రకటించారు. రాజీనామాను ఆమోదించాలంటూ స్పీకర్ కుల్తార్ సింగ్ సంధ్వాన్‌కు విజ్ఞప్తి చేశారు. 'పార్టీకి నా శుభాభినందనలు. పంజాబ్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తుందని ఆశిస్తున్నాను'అని పేర్కొన్నారు. రాజీనామాకు కారణాలను మాత్రం వెల్లడించలేదు. ఈ పరిణామంపై ఆప్ స్పందించాల్సి ఉంది. రాజకీయాల్లోకి రాకమునుపు అన్మోల్ నేపథ్య గాయనిగా పనిచేశారు. 2020లో ఆప్‌లో చేరారు. ఆప్ యువజన విభాగం సహాధ్యక్షురాలిగా ఉన్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో అకాలీదళ్ అభ్యర్థిపై సుమారు 38 వేల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. మాన్ మంత్రివర్గంలో పర్యాటక, సాంస్కృతిక, కార్మిక శాఖలను నిర్వహించారు. 2024లో మంత్రి పదవి కోల్పోయిన నలుగురిలో అన్మోల్ ఒకరు. 2024లో లాయర్ అయిన షాబాజ్ సింగ్ సోహిని ఈమె వివాహమాడారు.

కరుణానిధి పెద్ద కుమారుడు

ముత్తు కన్నుమూత

చెన్నై: తమిళనాడు దివంగత సీఎం కరుణానిధి పెద్ద కుమారుడు, సీఎం స్టాలిన్ సోదరుడు ఎంకే ముత్తు(77) శనివారం కన్నుమూశారు. నటుడు, నేపథ్య గాయకుడు అయిన ముత్తు వయో సంబంధ సమస్యలతో చనిపోయారని కుటుంబసభ్యులు తెలిపారు. సీఎం స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి విషయం తెల్సిన వెంటనే ముత్తు నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. మాజీ గవర్నర్ తమిళిసై సహా పలువురు నేతలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. శనివారం సాయంత్రం బీసెంట్ నగర్‌లోని విద్యుత్ శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియలకు స్టాలిన్ సోదరి, ఎంపీ కనిమొళి, సోదరులు అళగిరి తదితరులు హాజరయ్యారు. కరుణానిధికి ముగ్గురు భార్యలు కాగా, మొదట భార్య పద్మావతికి పుట్టిన కుమారుడే ముత్తు.

గవర్నర్‌ను క్షమాభిక్ష కోరవచ్చు

కర్ణాటక మహిళకు సుప్రీంకోర్టు అనుమతి

న్యూఢిల్లీ: కాబోయే భర్తను హత్య చేసిన కేసులో దోషిగా తేలిన కర్ణాటక మహిళ శుభాకు సుప్రీంకోర్టు భారీ ఊరట కల్పించింది. కర్ణాటక గవర్నర్ నుంచి క్షమాభిక్ష కోరేందుకు ఆమెకు అనుమతి ఇచ్చింది. సామాజిక పరిస్థితులు, ఒత్తిళ్ల కారణంగా మహిళలు కొన్ని సందర్భాల్లో నేరాలకు పాల్పడుతున్నారని న్యాయస్థానం పేర్కొంది. శుభా 20 ఏళ్ల వయసులో కాలేజీలో చదువుకుంటున్న సమయంలో నిశ్చితార్థం జరిగింది. ఈ పెళ్లి ఆమెకు ఎంతమాత్రం ఇష్టం లేదు. కుటుంబ సభ్యుల ఒత్తిడికి తలొగ్గాల్సి వచ్చింది. కాబోయే భర్తను హత్య చేస్తే తనకు ఈ పెళ్లి తప్పుతుందని భావించింది. తన మిత్రులైన అరుణ్ వర్మ, వెంకటేశ్, దినేశ్‌తో కలిసి అతడిని హత్య చేసింది. శుభాపై నేరం రుజువైంది. అయితే, బలవంతంగా పెళ్లి చేసేందుకు పెద్దలు ప్రయత్నించడంతో విధిలేని పరిస్థితుల్లో అతడిని చంపాల్సి వచ్చిందని శుభా మొరపెట్టుకుంది. గవర్నర్‌ను క్షమాభిక్ష కోరేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. శుభా వినతి పట్ల సానుకూలంగా స్పందించింది.

28 ఏళ్ల పాటు మారువేషంలో..

ట్రాన్స్‌జెండర్‌లా జీవిస్తున్న బంగ్లాదేశీ అరెస్ట్

భోపాల్: బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసల పర్వంలో ఒకరిని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్‌చేశారు. 28 ఏళ్లుగా భారత్‌లో అక్రమంగా ఉంటున్న అబ్దుల్ కలామ్ అనే వ్యక్తిని మధ్యప్రదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అబ్దుల్ బంగ్లాదేశ్ నుంచి పదేళ్ల వయసులో భారత్‌కు అక్రమంగా వచ్చి ముంబైలో 20 ఏళ్లపాటు నివసించాడు. ఎనిమిదేళ్లుగా నేహా కినార్ పేరిట ట్రాన్స్‌జెండర్‌గా మారువేషంలో భోపాల్ నగరంలో జీవిస్తున్నాడు. ఈ 28 ఏళ్ల కాలంలో భారత్‌లో తప్పుడు ధృవీకరణ పత్రాలతో ఓటర్ గుర్తింపు కార్డ్, ఆధార్ కార్డ్ చివరకు భారత పాస్‌పోర్ట్ సైతం సంపాదించాడు. పలు మార్లు స్వదేశానికి వెళ్లి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. భారత్‌లోకి అక్రమ మార్గాల్లో చేరుకున్నాక మారువేషాల్లో పలువురు జీవిస్తున్నారన్న సమాచారంతో భోపాల్ పోలీసులు నిఘా బృందాలు సమిష్టిగా దర్యాప్తుచేసి అబ్దుల్‌ను ఎట్టకేలకు అరెస్ట్‌చేశారు. దీంతో ఇలా ఎంత మంది బంగ్లాదేశీయులు మారువేషాల్లో భారత్‌లో నివసిస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది.

వలసదారు నిర్బంధంపై నిరసన

ఇద్దరు జర్నలిస్టులు సహా 13 మంది అరెస్ట్

సిన్సినాటి: ఈజిప్ట వలసదారుడు, సిన్సినాటి చిల్డ్రన్స్ ఆస్పత్రి మాజీ ఉద్యోగి సాలిమన్ నిర్బంధాన్ని నిరసిస్తూ గురువారం రాత్రి సిన్సినాటిలో చేపట్టిన నిరసన ఉద్రిక్తతలకు దారి తీసింది. సాలిమన్‌ను గత వారం సిన్సినాటి ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధంలోకి తీసుకున్నారు. దీనిని నిరసిస్తూ 'బిల్డ్ బ్రిడ్జెస్ నాట్ వాల్స్'అని రాసిన బ్యానర్‌ను చేబూనిన కొందరు ఓహాయో నది వంతెన మీదుగా వెళ్తుండగా పోలీసులతో ఘర్షణ చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు సిటీ బీట్ అనే పత్రికకు చెందిన జర్నలిస్ట్, ఫొటోగ్రాఫర్ సహా 13 మందిని అరెస్ట్ చేశారు. జర్నలిస్ట్ మాడెలిన్ ఫెనింగ్, ఫొటోగ్రాఫర్ లుకాస్ గ్రిఫ్ఫిత్‌లపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం వీరిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. నిరసనకారులు తమను దూషిస్తూ, బెదిరింపులకు గురిచేస్తూ దాడికి దిగారని పోలీసులు ఆరోపిస్తున్నారు.

ఐఎస్‌ఎస్ వైపూ ట్రాఫిక్ బిజీ!

- స్టార్‌లైనర్ మరో ఏడాదిదాకా ఎగరలేదు
- ఖాళీలేకుండా బిజీబిజీగా అంతరిక్షయానాలు
- తీరికలేకుండా గడుపుతున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం
- 2026 ఏడాదిలో బోయింగ్ స్పేస్‌క్రాఫ్ట్‌కు ఛాన్స్

వాషింగ్టన్: తిరుమల తిరుపతి దేవస్థానంలో దర్శనం కోసం వరసబెట్టి భక్తులు క్యూ లైన్లలో నిల్చున్నట్లు ఇప్పుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)కి సైతం వ్యోమనౌకలు ఒకరకంగా క్యూ కట్టాయి. కొద్ది వారాల వ్యవధిలో సరకు రవాణా స్పేస్‌క్రాఫ్ట్ లేదా వ్యోమగాములను తీసుకొచ్చే వ్యోమనౌకలు ఒకదాని వెంట మరోటి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి రాకపోకలు సాగిస్తూ ఐఎస్‌ఎస్ మార్గాన్ని బిజీగా మార్చేశాయి. నాసా, రోస్‌కాస్మోస్, స్పేస్ ఎక్స్ సంస్థల వ్యోమనౌకలు తమ వంతు కోసం వేచిచూస్తున్నాయి. బోయింగ్ వారి ప్రతిష్ఠాత్మక స్టార్‌లైనర్ వ్యోమనౌక మరో ఏడాదిదాకా ఐఎస్‌ఎస్‌కు పయనమయ్యే అవకాశం దక్కదని తాజా షెడ్యూల్‌ను బట్టి తెలుస్తోంది. చరిత్రలో ఎన్నడూలేనంతగా ఐఎస్‌ఎస్‌కు స్పేస్‌క్రాఫ్ట్‌ల రాకపోకలు ఇటీవలకాలంలో ఎక్కువయ్యాయి. గత రెండు మూడు వారాలపాటు యాగ్జియం-4 మిషన్ వారి డ్రాగన్ 'గ్రేస్' క్యాప్సూల్ ఐఎస్‌ఎస్ 'ఔట్‌పోస్ట్' వద్ద 'పార్కింగ్'లో ఉండిపోయింది. ఇటీవలే అది భారత వ్యోమగామి శుభాంశు శుక్లాసహా నలుగురు వ్యోమగాములను సురక్షితంగా భూమికి తీసుకొచ్చింది. దీంతో క్రూ-11 మిషన్ ప్రయోగానికి రంగం సిద్ధమైంది. ఇదిగాక ఇప్పటికే ఐఎస్‌ఎస్ వద్ద రష్యా అంతరిక్ష సంస్థ పంపిన ప్రోగ్రెస్-92 కార్గోషిప్ అక్కడ తిష్టవేసింది. దీంతోపాటు మరోమూడు వ్యోమనౌకలు ఐఎస్‌ఎస్ వద్దే ఉన్నాయి. స్పేస్‌ఎక్స్ డ్రాగన్, సోయూజ్ ఎంఎస్-27, ప్రోగ్రెస్ రీ-సప్లై నౌకలు అక్కడ ఉన్నాయి. చాలా రోజులుగా ఐఎస్‌ఎస్‌లో విధుల్లో ఉండి అలసిపోయిన వ్యోమగాములను భూమి మీదకు తీసుకొచ్చేందుకు, అక్కడ నిండుకున్న సరుకులను భూమి నుంచి మోసుకొచ్చేందుకు తరచూ ఇలా వ్యోమనౌకలు ఐఎస్‌ఎస్‌కు వస్తూనే ఉన్నాయి. ఈ స్పేస్‌క్రాఫ్ట్‌ల ట్రాఫిక్ ఈ ఏడాది చివరిదాకా కొనసాగనుంది. డిసెంబర్‌లోపు మరో ఆరు వ్యోమనౌకలు అక్కడికి చేరుకోనున్నాయి. కొత్త వ్యోమగాములను మోసుకెళ్లడం, సరకుల తరలింపు, ఆధునిక శాస్త్రసాంకేతికత సంబంధ ఉపకరణాలను మోసుకుంటూ ఇవి అటూఇటూ తిరగనున్నాయి. అత్యంత బరువైన ప్రయోగ పేలోడ్‌లను తరలించనున్నాయి. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన 2000 సంవత్సరం నుంచి చూస్తే ఐఎస్‌ఎస్‌కు ఇంతటి భారీ ఎత్తున వ్యోమగాములు, సరకులు, ప్రయోగ పరికరాల రాకపోకలు పెరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. అమెరికా నాసా, రష్యా వారి రోస్‌కాస్మోస్, ఎలాన్‌మస్క్ స్పేస్‌ఎక్స్, స్టార్‌లైనర్ ఇలా అన్ని సంస్థల స్పేస్‌క్రాఫ్ట్‌లు అంతరిక్షయానాన్ని బిజీగా మార్చాయి.

క్యూ వరస నుంచి తప్పకున్న స్టార్‌లైనర్

భారతీయ మూలాలున్న మహిళా అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్‌సహా బుచ్ విల్మోర్‌ను బోయింగ్ వారి స్టార్‌లైనర్ వ్యోమనౌక 2024 జూన్‌లో ఐఎస్‌ఎస్‌కు పంపించింది. అయితే తిరుగుప్రయాణంలో అది మొరాయించడంతో వ్యోమగాములు లేకుండానే పలుసార్లు వాయిదాల తర్వాత ఒంటరిగా భూమికి తిరిగొచ్చింది. దీంతో 2025లో స్టార్‌లైనర్ మరోసారి ఐఎస్‌ఎస్‌కు వెళ్లలేదు. ఇలా స్పేస్‌షిప్‌ల ట్రాఫిక్ నుంచి ఇది తప్పుకుంది. న్యూ మెక్సికోలోని నాసా వారి వైట్‌శాండ్స్ పరీక్షకేంద్రంలో ఈ స్టార్‌లైనర్ వ్యోమనౌకకు సమగ్రస్థాయిలో పరీక్షలు జరుపుతున్నారు. 2026లో జరపబోయే ఐఎస్‌ఎస్ ప్రయాణానికి సురక్షితమేనా కాదా అనేది నిర్ధారించుకునేందుకు కీలక సమీక్షా పరీక్షలు జరుపుతున్నారు. నెలల తరబడి నిరీక్షణ తర్వాత సునీతా విలియమ్స్ చివరకు క్రూ డ్రాగన్ ఫ్రీడమ్ వ్యోమనౌకలో తిరుగుపయనమైన విషయం విదితమే. అంతర్జాతీయ అంతరిక్ష సందర్శకుల తాకిడి ఎక్కువైతే ఐఎస్‌ఎస్ మార్గం మరింత బిజీగా మారనుంది.

'ఉపాధి'లో మొబైల్ పర్యవేక్షణ దుర్వినియోగం

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పారదర్శకత కోసం ప్రస్తుతం వినియోగిస్తున్న నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ దుర్వినియోగం అవుతోందని కేంద్రం తెలిపింది. తప్పుడు సమాచారంతో కొందరు మోసాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలంటూ శనివారం గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్రాలను అలెర్ట్ చేసింది. మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా రోజువారీ హాజరు, పని ప్రదేశాల ఫొటోలను సంగ్రహించే వ్యవస్థను తారుమారు చేస్తున్నట్లుగా గుర్తించామని పేర్కొంది. 'ప్రత్యక్ష పని చిత్రాలకు బదులుగా ఫొటోలనే ఫొటో తీస్తున్నారు. మస్టర్ రోల్స్‌లో కార్మికుల ఫొటోలన్నీ ఒకేలా ఉన్నాయి. రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయిల్లో పర్యవేక్షణ, జవాబుదారీతనం లేదనేందుకు ఇవే తార్కాణం. ఇది చాలా ఆందోళనకరం. పథకం ఉద్దేశాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలు ఆర్థిక అవకతవకలు, అవినీతికి దారితీస్తాయి. అంతిమంగా పథకం లక్ష్యం దెబ్బతింటుంది'అని ఆ లేఖలో స్పష్టం చేసింది. తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

శాతవాహనుల కాలంలో 'పసకరులు' అంటే ఎవరు?

శాతవాహన యుగం

1. కొంతమంది చరిత్రకారులు శాతవాహనుల తొలి రాజధాని 'ధాన్యకటకం' కాదని తేల్చారు. అయితే వారి తొలి రాజధాని ఏది?
   1) కొండాపురం 2) రాచకొండ
   3) ఏలేశ్వరం 4) కోటిలింగాల
2. శాతవాహనులు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) పి.టి. శ్రీనివాస్
   3) డాక్టర్ సుక్తాంకర్
   4) డాక్టర్ కె.గోపాలాచారి
3. శాతవాహనులు విదర్భ ప్రాంతానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) పి.టి. శ్రీనివాస్
   3) కె.పి.జయస్వాల్ 4) డాక్టర్ సుక్తాంకర్
4. శాతవాహనుల తొలి ప్రాంతం మహారాష్ట్ర అని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) సుక్తాంకర్
   3) పి.టి.శ్రీనివాస్ 4) కె.పి.జయస్వాల్
5. శాతవాహనుల మూలస్థానం పైఠాన్ ప్రాంతమని పేర్కొన్నవారు?
   1) డాక్టర్ కె.గోపాలాచారి
   2) కె.వి.జయస్వాల్
   3) వి.వి.మిరాసి 4) డాక్టర్ సుక్తాంకర్
6. కరీంనగర్ జిల్లాలో మహానగర శిథిలాలు బయల్పడిన ప్రాంతం ఏది?
   1) కోటిలింగాల 2) కదంబపూర్
   3) తొగర్రాయి 4) పెద్దబంకూర్
7. నాణేలపై కనిపిస్తున్న తొలి శాతవాహన రాజు ఎవరు?
   1) శ్రీముఖుడు 2) నారన
   3) గోబద 4) సమగోపుడు
8. శాతవాహన వంశ స్థాపకుడు, మొదటి పాలకుడు ఎవరు?
   1) మొదటి శాతకర్ణి 2) కన్హుడు
   3) రెండో శాతకర్ణి 4) శ్రీముఖుడు
9. శ్రీముఖుడి పాలనా కాలం?
   1) క్రీ.పూ. 231-200
   2) క్రీ.పూ. 231-208
   3) క్రీ.పూ. 231-205
   4) క్రీ.పూ. 225-200
10. శ్రీముఖుడు మొదట అవలంబించిన మతం?
    1) జైనం 2) వైదికం
    3) బౌద్ధం 4) శైవం
11. పుష్యమిత్ర శుంగుడు ఉత్తర భారతదేశంలో మౌర్యవంశాన్ని నిర్మూలించి మగధలో క్రీ.పూ. 187లో శుంగవంశాన్ని స్థాపించే సమయంలో పాలన కొనసాగిస్తున్న శాతవాహన రాజు?
    1) శ్రీముఖుడు 2) కన్హుడు
    3) మొదటి శాతకర్ణి 4) రెండో శాతకర్ణి
12. రాప్సన్, బారువా అనే చరిత్రకారులు ఏ నదిని 'కణ్ణబెణ్ణా'గా పేర్కొన్నారు?
    1) గంగా 2) గోదావరి
    3) కృష్ణా 4) వైన్ గంగా
13. శ్రీముఖుడి తర్వాత రాజ్యాధికారానికి వచ్చిన పాలకుడు?
    1) కన్హుడు 2) పులోమావి
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) మొదటి శాతకర్ణి
14. నానాఘాట్ శాసనాన్ని వేయించిందెవరు?
    1) దేవీ నాగానిక 2) గౌతమీ బాలశ్రీ
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) రెండో శాతకర్ణి
15. రెండో శాతకర్ణి మగధ, కళింగ ప్రాంతాలను కూడా ఆక్రమించి పాలన సాగించాడని ఏ పురాణంలో పేర్కొన్నారు?
    1) మత్స్య 2) గరుడ
    3) వరాహ 4) యుగ పురాణం
16. ఏ పాలకుడి కాలంలో శక, యవన, కళింగ, పహ్లావాదులు శాతవాహనుల రాజ్య భాగాలను ఆక్రమించారు?
    1) స్వాతికర్ణ 2) లంబోదరుడు
    3) అపీలకుడు 4) మేఘస్వాతి
17. 'బృహత్కథ', 'వాత్స్యాయన కామసూత్ర', 'కావ్య మీమాంస'లో ఏ పాలకుడికి సంబంధించిన ప్రశంస కనిపిస్తుంది?
    1) శ్రీముఖుడు 2) మొదటి శాతకర్ణి
    3) కుంతల శాతకర్ణి 4) రెండో శాతకర్ణి
18. శర్వవర్మ, గుణాఢ్యుడు ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
    1) కుంతల శాతకర్ణి
    2) యజ్ఞశ్రీ శాతకర్ణి 3) హాలుడు
    4) మొదటి పులోమావి
19. శాతవాహనుల్లో 15వ రాజు?
    1) హాలుడు
    2) మొదటి పులోమావి
    3) గౌరకృష్ణ 4) రెండో శాతకర్ణి
20. 'గాథాసప్తశతి' గ్రంథ రచయిత ఎవరు?
    1) హాలుడు 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) మొదటి పులోమావి
    4) గౌతమీపుత్ర శాతకర్ణి
21. 'త్రి సముద్ర తోయ పీతవాహన' అనేది ఎవరి బిరుదు?
    1) మొదటి పులోమావి
    2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) యజ్ఞశ్రీ శాతకర్ణి
    4) మొదటి శాతకర్ణి
22. ఏ పాలకుడి కాలంలో తెలుగు ప్రాంతమంతా శాతవాహనుల ఆధీనంలోకి వచ్చింది?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి
    3) మొదటి పులోమావి
    4) హాలుడు



23. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలన్నింటినీ కలిపి పాలించిన చివరి శాతవాహన చక్రవర్తి ఎవరు?
    1) రెండో శాతకర్ణి
    2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) శివశ్రీ 4) రెండో పులోమావి
24. శాతవాహన వంశానికి చెందిన చివరి పాలకులు రాజ్యాన్ని పంచుకొని పాలించారని కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం. ఆ సమయంలో తెలంగాణ ప్రాంతం ఎవరి పాలనలో ఉందని వారు పేర్కొన్నారు?
    1) కౌశికీ పుత్ర శాతకర్ణి
    2) నాలుగో పులోమావి
    3) విజయశ్రీ
    4) చంద్రశ్రీ
25. 'ధాన్యకటకం'ను రాజధానిగా చేసుకొని పాలించిన రాజు?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి
    3) నాలుగో పులోమావి
    4) హాలుడు
26. శాతవాహనుల్లో చివరి పాలకుడెవరు?
    1) విజయశ్రీ 2) చంద్రశ్రీ
    3) శివశ్రీ 4) నాలుగో పులోమావి
27. నాలుగో పులోమావిని ఓడించే నాటికి శ్రీశాంతమూలుడు ఎక్కడ బలవంతమైన నాయకుడిగా ఉన్నాడు?
    1) విదర్భ 2) విజయపురి
    3) మహారాష్ట్ర 4) కళింగ
28. శాతవాహన పాలకుల వరుసక్రమం?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి, రెండో పులోమావి, గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి, గౌతమీపుత్ర శాతకర్ణి, హాలుడు, యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) గౌతమీపుత్ర శాతకర్ణి, రెండో పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి
    4) హాలుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, రెండో పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి
29. శాతవాహనుల కాలంలో ద్రవ్యపరమైన ఆదాయాన్ని భద్రపరిచే వ్యక్తిని ఏమని పిలిచేవారు?
    1) మహామాత్రులు 2) హిరణ్యకుడు
    3) మహాసేనాపతి 4) నిబంధకారుడు
30. శాతవాహనుల కాలంలో రాజాజ్ఞలు, రాజ్య వ్యవహారాలను పత్రాల్లో రాసి భద్రపరిచే వ్యక్తి?
    1) నిబంధకారుడు 2) లేఖకుడు
    3) హిరణ్యకుడు 4) అమాత్యుడు
31. నిబంధకారులకు మరో పేరు?
    1) అమాత్యులు 2) మహామాత్రులు
    3) అక్షపటకులు 4) భాండాగారికులు
32. కరీంనగర్ జిల్లాలోని మునులగుట్ట అనేది?
    1) వైదిక స్థావరం 2) విద్యా కేంద్రం
    3) బౌద్ధ స్థావరం 4) జైన స్థావరం
33. శాతవాహన కాలంలో 'కులపెద్దలను' ఏ పేరుతో పిలిచేవారు?
    1) గ్రామణి 2) నిబంధకారులు
    3) అక్షపటకులు 4) గహపతులు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

34. శాతవాహనుల కాలంలో పంటలో ఎన్నో వంతును భూమిశిస్తుగా వసూలు చేసేవారు?
    1) 6 2) 5 3) 4 4) 3
35. శాతవాహన శాసనాల్లో కనిపిస్తున్న 'స్కంధావారం' అనే పదానికి అర్థం?
    1) మిలటరీ క్యాంప్
    2) కంటోన్మెంట్ 3) రక్షణదుర్గం
    4) రాజకోట
36. శాతవాహన శాసనాల్లో కనిపిస్తున్న 'కటకం' అనే పదానికి అర్థం?
    1) సైనిక శిబిరం 2) రక్షణ దుర్గం
    3) రాజకోట 4) సైన్యాగారం
37. ఖారవేలుడు ఏ నగరాన్ని గాడిదలతో తొక్కించి నేలమట్టం చేశాడు?
    1) వినుకొండ 2) పిథుండ
    3) హన్మకొండ 4) ఓరుగల్లు
38. శాతవాహన కాలంనాటి చేతివృత్తిదారులైన 'సాలెవారు' అంటే?
    1) వధకులు 2) కాసకారులు
    3) కోలికులు 4) తిలపిష్టకులు
39. శాతవాహనుల కాలంలో 'గధికులు' అనే చేతివృత్తి వారు చేసే పని?
    1) మెరుగు పెట్టడం
    2) కుండల తయారీ
    3) కంచు పని
    4) సుగంధ ద్రవ్యాల తయారీ
40. శాతవాహనుల కాలంలో వృత్తిపనివారు చెల్లించే పన్ను పేరేమిటి?
    1) కరుకర 2) శ్రేణి
    3) శ్రేష్ఠి 4) కాలిక
41. శాతవాహనుల కాలంలో 'సేలవధకులు'గా ఎవరిని పేర్కొనేవారు?
    1) కవులు 2) సాలెవారు
    3) శిల్పులు 4) మేదరివారు
42. శాతవాహనుల కాలంలో 'పసకరులు' అంటే ఎవరు?
    1) కంచు పనివారు 2) సాలెవారు
    3) శిల్పులు 4) మేదరివారు
43. కులాలు వేటి నుంచి ఆవిర్భవించాయి?
    1) వృత్తి సంఘాలు 2) ధర్మాలు
    3) స్మృతులు 4) వర్తక సంఘాలు
44. శాతవాహనుల కాలం నాటి ప్రజల ప్రధాన ప్రయాణ సాధనం?
    1) గుర్రం బండి 2) ఎడ్ల బండి
    3) కుక్కల బండి 4) ఒంటె బండి
45. శాతవాహనుల కాలంలో విదేశాలతో వర్తకం చేసేవారిని ఏమని పిలిచేవారు?
    1) శ్రేణులు 2) నిగమాలు
    3) సార్థవాహులు 4) బిడారులు
46. శాతవాహనుల 'నాణేల'పై ప్రధానంగా కనిపించేది?
    1) ఓడముద్ర 2) చాపముద్ర
    3) వృషభం 4) సింహం
47. శాతవాహనుల 'టంకసాల' నగరం ఏది?
    1) కొండాపురం 2) పెదబంకూరు
    3) ధూళికట్ట 4) హన్మకొండ
48. శాతవాహనులతో ఎక్కువగా వర్తక వ్యాపారం నిర్వహించిన విదేశీయులు?
    1) అరేబియన్లు 2) పర్షియన్లు
    3) గ్రీకులు 4) రోమన్లు
49. శాతవాహనులు సముద్ర తీరంతోపాటు ఏ నదుల ద్వారా కూడా విదేశీ వ్యాపారం నిర్వహించేవారు?
    1) కృష్ణా, గోదావరి
    2) మూసీ, గోదావరి
    3) మూసీ, కృష్ణా
    4) గంగా-గోదావరి
50. 'గౌతమీ బాలశ్రీ' ఎవరి తల్లి?
    1) మొదటి శాతకర్ణి 2) రెండో శాతకర్ణి
    3) శ్రీముఖుడు 4) గౌతమీపుత్ర శాతకర్ణి
51. శాతవాహనుల కాలంలో అధికంగా చెలామణిలో ఉన్న లోహం ఏది?
    1) వెండి 2) బంగారం
    3) రాగి 4) కంచు

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 3; 5) 1; 6) 2; 7) 3; 8) 4; 9) 2; 10) 1; 11) 3; 12) 4; 13) 1; 14) 1; 15) 4; 16) 2; 17) 3; 18) 1; 19) 4; 20) 1; 21) 2; 22) 1; 23) 2; 24) 1; 25) 2; 26) 4; 27) 2; 28) 4; 29) 2; 30) 1; 31) 3; 32) 4; 33) 4; 34) 1; 35) 1; 36) 4; 37) 2; 38) 3; 39) 4; 40) 1; 41) 3; 42) 4; 43) 1; 44) 2; 45) 3; 46) 1; 47) 1; 48) 4; 49) 2; 50) 4; 51) 1.

మెడ, తోక, పొలుసులు లోపించిన జీవులు ఏవి?

మాదిరి ప్రశ్నలు

1. కార్డేటాలలో ఏ నిర్మాణం ఉండటాన్ని ముఖ్య లక్షణంగా పేర్కొంటారు?
   1) హృదయం 2) చర్మం
   3) మెదడు 4) పృష్ఠవంశం
2. జీవశాస్త్రంలో విచిత్ర జీవులుగా వేటిని పేర్కొంటారు?
   1) హెమీ కార్డేట్‌లు 2) సెఫలో కార్డేట్‌లు
   3) యూరో కార్డేట్‌లు 4) కార్డేట్‌లు
3. సకశేరుకాల ఉద్భవానికి సంబంధించిన డింభకం ఏది?
   1) బైపిన్నేరియా లార్వా
   2) బఫియోప్లూటియస్
   3) ఆరిక్యులేరియా 4) ఎఖైనోప్లూయస్
4. 'శీతల రక్త జీవులు (బాహ్యోష్ణ సకశేరుకాలు)'గా వేటిని పేర్కొంటారు?
   1) చేపలు 2) ఉభయచరాలు
   3) సరీసృపాలు 4) పైవన్నీ
5. కింది వాటిలో 'ఉష్ణరక్త జీవులు (అంతరోష్ణ సకశేరుకాలు)' ఏవి?
   1) సరీసృపాలు 2) పక్షులు
   3) క్షీరదాలు 4) 2, 3
6. అధిక సంఖ్యలో ఉన్న సకశేరుకాలేవి?
   1) చేపలు 2) ఉభయచరాలు
   3) సరీసృపాలు 4) పక్షులు
7. చేపల్లో ఏవిధమైన హృదయం ఉంటుంది?
   1) సిరా హృదయం
   2) ధమని హృదయం
   3) మిశ్రమ హృదయం 4) ఏదీకాదు
8. చేపల హృదయం విశిష్ట లక్షణం ఏది?
   1) మంచి రక్తం ప్రవహించడం
   2) చెడు రక్తం ప్రవహించడం
   3) మిశ్రమ రక్తం ప్రవహించడం
   4) ఎలాంటి రక్తం ప్రవహించకపోవడం
9. విచ్ఛిన్న విస్తరణను ప్రదర్శించే చేపలు ఏవి?
   1) నియోసెరటోడస్
   2) ప్రోటాప్టిరస్ 3) లెపిడో సైరస్
   4) పైవన్నీ
10. కాలేయ నూనెకు ప్రసిద్ధమైన చేప?
    1) స్టోన్ ఫిష్ 2) బ్లూవేల్
    3) కాడ్ ఫిష్ 4) సిల్వర్ ఫిష్
11. దోమ డింబకాలను ఆహారంగా తీసుకుంటూ మలేరియా వ్యాధి నివారణకు దోహదపడే చేపలు ఏవి?
    1) ఎక్సోసీటస్ 2) హిప్పోకాంపస్
    3) గాంబూసియా యసినిస్
    4) పైవేవీ కావు
12. కింది వాటిలో నిజమైన చేపలు ఏవి?
    1) జెల్లీ ఫిష్ 2) సిల్వర్ ఫిష్
    3) కటిల్ ఫిష్ 4) షార్క్ ఫిష్
13. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన చేప?
    1) స్టోన్ ఫిష్ 2) గోల్డెన్ ఫిష్
    3) సిల్వర్ ఫిష్ 4) స్టార్ ఫిష్
14. బెంగాలీలకు ప్రీతిపాత్రమైన హిల్సా చేప 1 కిలోల బరువు పెరుగడానికి ఎన్నేళ్లు పడుతుంది?
    1) 4 2) 3 3) 2 4) 5
15. ఇక్తియాలజీ అనేది వేటి గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
    (Tech.Asst. in Archaeology-2012)
    1) చేపలు 2) సరీసృపాలు
    3) పక్షులు 4) క్షీరదాలు
16. బొటనవేలు లేకపోవడం అనేది కింది వాటిలో ఏ జీవి లక్షణం?
    1) కోతి 2) మానవుడు
    3) కుందేలు 4) కప్ప
17. భూమి మీద మొదట నివసించిన జీవులు ఏవి?
    1) తొండలు 2) డిప్నాయ్ చేపలు
    3) కప్పలు 4) సర్పాలు
18. రెడ్ ఇండియన్లు బాణాల చివరన విషంగా ఏ కప్ప చర్మగ్రంథుల స్రావాలను పూస్తారు?
    1) హైలా 2) రాకోఫోరస్
    3) పిల్లోబేటస్ 4) ఎలైటస్
19. కింది వాటిలో ప్రపంచంలో అత్యంత విషపూరిత ఉభయచరాల్లో ఒకటి ఏది?
    (Gr-II, 2005)
    1) బ్లూ డార్ట్ మండూకం
    2) రాటిల్ స్నేక్ 3) స్పెర్మ్ వేల్
    4) గ్రీన్ టర్టిల్
20. బాహ్య ఫలదీకరణం జరిపే జీవులు ఏవి?
    1) చేపలు 2) కప్పలు
    3) బల్లులు-పాములు
    4) 1, 2
21. టాడ్‌పోల్ లార్వా రూప విక్రియను నియంత్రించే హార్మోన్ ఏది?
    1) అడ్రినలిన్ 2) థైరాక్సిన్
    3) ఈస్ట్రోజన్ 4) ఆక్సిటోసిన్
22. 'వేసవి కాల నిద్ర' అంటే ఏమిటి?
    1) శీతాకాల సుప్తావస్థ
    2) ప్రతికూల పరిస్థితులు
    3) గ్రీష్మకాల సుప్తావస్థ
    4) కోమా
23. స్పాన్ అంటే..?
    1) కప్ప అండాల సమూహం
    2) పుట్టగొడుగుల విత్తనాలు
    3) కప్ప శుక్రకణాల సమూహం
    4) 1, 2
24. రెండు కర్ణికలు, ఒక జఠరికతో కూడిన హృదయం ఏ జీవుల్లో ఉంటుంది?
    1) చేపలు 2) కప్పలు
    3) పాములు 4) పక్షులు-క్షీరదాలు
25. కప్పల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
    1) ఇక్తియాలజీ 2) బాట్రకాలజీ
    3) టార్పిడాలజీ 4) ఓఫియాలజీ
26. రూప విక్రియ ప్రదర్శించే జీవి ఏది?
    1) పాము 2) కప్ప
    3) హైడ్రా 4) చేప



27. మెడ, తోక, పొలుసులు లోపించిన జీవులు ఏవి?
    1) చేపలు 2) కప్పలు
    3) సరీసృపాలు 4) పక్షులు
28. సర్పాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) కదిలే కనురెప్పలు ఉంటాయి
    2) కదలని కనురెప్పలు ఉంటాయి
    3) కనురెప్పలు ఉండవు
    4) నిమేశక పటలం ఉంటుంది
29. విషసర్పాల్లో విషగ్రంథులు వేటి రూపాంతరం?
    1) ఆస్య గ్రంథులు
    2) లాలాజల గ్రంథులు
    3) తైల గ్రంథులు
    4) అశ్రు గ్రంథులు
30. కింది వాటిలో పాము కరిచినప్పుడు విరుగుడుగా పనిచేసే మంచి ఇంజెక్షన్ ఏది?
    1) పెన్సిలిన్ 2) యాంటీవీనమ్
    3) యాంటీబయాటికిన్
    4) స్ట్రెప్టోమైసిన్
31. నాగుపామును దేని ఆధారంగా గుర్తిస్తారు?
    1) నలుపురంగు 2) పడగ
    3) రాళ్లలో నివసించడం వల్ల
    4) పడగ, మూడో అదివోష్ఠ పొలుసు
32. సర్పాల్లో మధ్య చెవి ఉండదు. అవి శబ్దాలను వేటి ద్వారా గ్రహిస్తాయి?
    1) నాలుక 2) చర్మం
    3) ముట్టె 4) గాలి
33. పాము విషానికి విరుగుడు ఇంజెక్షన్లను ఎక్కడ తయారు చేస్తున్నారు?
    1) A.C.D., ఢిల్లీ
    2) IICT, హైదరాబాద్
    3) హాప్‌కిన్ ఇన్‌స్టిట్యూట్, ముంబై
    4) పింప్రి, పుణే

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

34. సరీసృపాలన్నింటిలో మొసళ్లలో ఉన్న ప్రత్యేక లక్షణం ఏది?
    1) దృఢమైన దవడ కండరాలు
    2) నేలమీదకు రాగలిగే శక్తి
    3) నాలుగు గదుల గుండే
    4) అండం చుట్టూ గట్టి పెంకు ఉండటం
35. పక్షుల్లో ఉండే ప్రధాన లక్షణం?
    1) ముక్కు 2) రెక్కలు
    3) పొలుసులు 4) ఈకలు
36. పాముల గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
    1) ఇక్తియాలజీ 2) ఓఫియాలజీ
    3) లెపిడాప్టరాలజీ 4) ఎంటమాలజీ
37. కింది వాటిలో శిశుత్పాదక సర్పం ఏది?
    1) కోబ్రా 2) కట్లపాము
    3) రక్తపింజర 4) రాట్ సర్పం
38. రక్తపింజర విషం ఏ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది?
    1) జీర్ణ వ్యవస్థ 2) రక్తప్రసరణ వ్యవస్థ
    3) శ్వాస వ్యవస్థ 4) విసర్జన వ్యవస్థ
39. నాగుపాము విషం ఏ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది?
    1) శ్వాస వ్యవస్థ 2) రక్తప్రసరణ వ్యవస్థ
    3) నాడీ వ్యవస్థ 4) జీర్ణ వ్యవస్థ
40. చలనంలో సర్పాలకు సహాయపడేవి ఏవి?
    1) తల 2) పొలుసులు
    3) పర్శుకలు 4) తోక
41. అతి తక్కువ కాలం చూలు మోసే జీవి?
    1) మేక 2) గుర్రం
    3) అపోజం 4) చుంచెలుక
42. కింది వాటిలో విష సర్పం కానిది?
    1) సముద్ర సర్పం 2) కట్లపాము
    3) రక్తపింజర 4) పైథాన్
43. కింది వాటిలో విష సర్పం ఏది?
    1) పైథాన్ 2) కట్లపాము
    3) ట్రీ స్నేక్ 4) రాట్ స్నేక్
44. ఒక వ్యక్తి కాలికి ఏదో జీవి కరవడం వల్ల రెండు గాట్లు పడ్డాయి. ఆ గాట్ల ఆధారంగా కింది వాటిలో అది ఏ జీవి అయి ఉండవచ్చు?
    1) తేలు 2) ఎలుక
    3) విషరహిత సర్పం
    4) విషపూరిత సర్పం
45. పరిసరాలను బట్టి రంగులు మార్చేది?
    1) పిల్లి 2) ఎలుక
    3) ఊసరవెల్లి (కెమీలియాన్)
    4) తొండ
46. కింది వాటిలో దీర్ఘకాలం జీవించే జంతువు?
    1) ఏనుగు 2) ఒంటె
    3) నక్క 4) తాబేలు
47. డైనోసార్ ఒక...? (UPSC-1989)
    1) సరీసృపం 2) ఉభయచరం
    3) క్షీరదం 4) పక్షి
48. 'డైనోసార్' అనే పదానికి అర్థం?
    1) ఘోర పాకుడు జంతువు
    2) భయంకరమైన పాకుడు జంతువు
    3) ఘోర బల్లి
    4) అధమ పాకుడు జంతువు
49. కింది వాటిలో ఎగిరే డైనోసార్‌గా ప్రసిద్ధి చెందింది ఏది?
    (Polytechnic College, Lecturers)
    1) స్పైనోసారస్ 2) టైరోసారస్
    3) అర్జంటినో సారస్ 4) ఏదీకాదు
50. విషం గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
    (Asst.social welfare officer in A.P. 2012)
    1) మార్ఫాలజీ 2) ఆస్టియాలజీ
    3) టాక్సికాలజీ 4) కాంకాలజీ
51. భూమిపై అతి పెద్ద పక్షి ఏది?
    (Asst.social welfare officer in A.P. 2012)
    1) ఈము 2) ఆస్ట్రిచ్
    3) ఆల్ బట్రాస్ 4) సైబీరియన్ క్రేన్
52. కింది వాటిలో దేనిలో వాతులాస్థులు ఉంటాయి?
    1) గబ్బిలం 2) తిమింగలం
    3) పక్షులు 4) ఎక్సోసీటస్
53. పక్షుల్లో కనిపించే దృష్టి లక్షణం ఏది?
    1) మోనాక్యులార్-టెలిస్కోపిక్ దృష్టి
    2) బైనాక్యులర్-మయోపిక్ దృష్టి
    3) బైనాక్యులర్-టెలిస్కోపిక్ దృష్టి
    4) మోనాక్యులర్- మయోపిక్ దృష్టి
54. పక్షుల గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
    (Gr-II, 2012)
    1) హెర్పిటాలజీ 2) ఆర్నిథాలజీ
    3) ఇథాలజీ 4) ఫినాలజీ
55. కింది వాటిలో పక్షుల్లో ఏవి ఉండవు?
    (Gr-II, 2001)
    1) నరాలు 2) చెమట గ్రంథులు
    3) కనురెప్పలు 4) వాతులాస్థులు
56. నేలపై అతి వేగంగా పరుగెత్తే జంతువు?
    (Gr-I, 1998)
    1) లేడి 2) చిరుతపులి
    3) గుర్రం 4) పెద్దపులి
57. స్వేద గ్రంథులు లేని క్షీరదం?
    1) కోతి 2) ఆవు
    3) తిమింగలం 4) పంది
58. గబ్బిలం, తిమింగలం ఏ వర్గానికి చెందినవి?
    1) పక్షులు 2) సరీసృపాలు
    3) క్షీరదాలు 4) ఉభయచరాలు
59. కింది వాటిలో క్షీరదాల అత్యంత ప్రధాన లక్షణం ఏది?
    1) హెమియోథర్మిక్ 2) విభాజక పటలం
    3) శిశు ఉత్పాదకాలు
    4) డైకాండైలిక్
60. ఏ జీవికి వేళ్లు ఉండవు కానీ, గోళ్లు ఉంటాయి?
    1) కంగారు 2) అపోజం
    3) బ్లూవేల్ 4) ఒంటె
61. గుడ్లు పెట్టే క్షీరదం?
    1) డక్‌బిల్ ప్లాటిపస్ 2) ఎకిడ్నా
    3) గబ్బిలం 4) 1, 2
62. ప్రపంచంలో అతి పెద్ద ప్రాణి ఏది?
    (Gr-I, 1998)
    1) ఇండియా ఏనుగు 2) బ్లూవేల్
    3) రైనోడాన్ 4) ఆఫ్రికా ఏనుగు
63. మానవుడి తర్వాత అతి తెలివైన క్షీరదం?
    (S.I.-2008)
    1) బ్లూవేల్-తిమింగలం
    2) డాల్ఫిన్ 3) ఆఫ్రికా ఏనుగు
    4) కంగారు
64. జంతువుల ప్రవర్తనను అధ్యయనం చేసే శాస్త్రం ఏది? (Gr-I, 2010)
    1) ఎంటమాలజీ 2) ఇథాలజీ
    3) ఎకాలజీ 4) యూజెనిక్స్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 4; 6) 1; 7) 1; 8) 3; 9) 4; 10) 3; 11) 3; 12) 4; 13) 1; 14) 2; 15) 1; 16) 4; 17) 3; 18) 3; 19) 1; 20) 4; 21) 2; 22) 3; 23) 4; 24) 2; 25) 2; 26) 2; 27) 2; 28) 3; 29) 2; 30) 2; 31) 4; 32) 2; 33) 3; 34) 3; 35) 4; 36) 2; 37) 3; 38) 2; 39) 3; 40) 3; 41) 3; 42) 4; 43) 2; 44) 4; 45) 3; 46) 4; 47) 1; 48) 2; 49) 2; 50) 3; 51) 2; 52) 3; 53) 1; 54) 2; 55) 2; 56) 2; 57) 3; 58) 3; 59) 2; 60) 3; 61) 4; 62) 2; 63) 2; 64) 2.

'నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ' ఎక్కడ ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

జీవ వైవిధ్యం

భూమిపై ఉన్న విభిన్న జీవ జాతుల సముదాయాన్నే 'జీవ వైవిధ్యం'గా పేర్కొనవచ్చు. ఇది మానవుడికి అనేక విధాలుగా ఉపయోగపడుతూ భూమిపై మనుగడ సాగించడానికి తోడ్పడుతోంది. ఆహార, శక్తి వనరులు, ఔషధాలు, కలప, నార, పీచు రూపంలో మొక్కలు మానవుడికి ఉపయోగపడుతున్నాయి. జంతువులు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, భూమిపై ఉన్న ప్రతి జీవి మానవుడికి ఏదో ఒక విధంగా ఉపయోగపడుతున్నాయి.

ఇంతటి ప్రాధాన్యం ఉన్న జీవ వైవిధ్యానికి ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న చర్యల వల్ల నష్టం వాటిల్లుతోంది. ఇంతకుముందెన్నడూ లేనివిధంగా దీనికి తీవ్ర స్థాయిలో ముప్పు పొంచి ఉన్నట్లు యూఎన్‌ఈపీ (United Nations Environment Programme) ఇటీవల ప్రకటించింది. గత శతాబ్దకాలంలో అనేక వన్య జీవులు కనుమరుగైన నేపథ్యంలో జీవ వైవిధ్యాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల్లో పర్యావరణ అంశాల ప్రాధాన్యం పెంచారు. అందువల్ల అభ్యర్థులు ఈ అంశంపై అవగాహన పెంచుకోవాలి.

జీవ వైవిధ్యం - నేపథ్యం

జీవ సంబంధ వైవిధ్యం (Biological Diversity) అనే పదాన్ని మొదట రేమండ్ ఎఫ్. డాస్‌మన్ అనే పరిరక్షణవేత్త 1968లో "A Different Kind of Country" పుస్తకంలో ఉపయోగించాడు. 1985లో వాల్టర్ జి. రోజెన్ అనే శాస్త్రవేత్త 'జీవ వైవిధ్యం'(Bio diversity) అనే సంక్షిప్త పదాన్ని ప్రతిపాదించాడు.

జీవులతో ముడిపడి ఉన్న అన్ని రకాల వైవిధ్యాలను జీవ సంబంధ వైవిధ్యంగా పేర్కొంటారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ (IUCN) ప్రకారం.. ఒక భౌగోళిక ప్రాంతంలోని మొత్తం జన్యువులు, జాతులు, జీవావరణ వ్యవస్థల సముదాయమే జీవ వైవిధ్యం. ప్రకృతిలో ఇది సహజంగా ఉంటుంది. జీవ వైవిధ్య పరిరక్షణ భావన 1980 నుంచి బలపడింది. అడవులను సంరక్షించడంలో భాగంగా.. అక్కడ ఉండే అన్ని రకాల జీవులు, వాటి తెగలు, వాటిలోని విభిన్న జన్యువులు, జీవులు మధ్య ఉన్న సంబంధాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు సూచించారు.

జీవ వైవిధ్యం - వివిధ స్థాయిలు

1. జన్యు వైవిధ్యం (Genetic Diversity): ఒక జాతి జీవుల్లో ఉండే విభిన్న జన్యువుల సముదాయమే జన్యు వైవిధ్యం.
ఉదా: మనుషుల్లో వివిధ తెగలు (ఆస్ట్రలాయిడ్, మంగోలాయిడ్, నిగ్రాయిడ్); మానవుడిలో విభిన్న రక్త గ్రూపులు.



2. జాతి వైవిధ్యం (Species Diversity): ఒక నిర్దిష్ట ప్రాంతంలోని విభిన్న జాతులకు చెందిన జీవుల సముదాయాన్ని 'జాతి వైవిధ్యం'గా పేర్కొంటారు. దీని ఆధారంగా ప్రపంచంలో అత్యధిక జీవ వైవిధ్యం ఉన్న 17 మెగా బయోడైవర్సిటీ దేశాలను గుర్తించారు. ఈ రకమైన వైవిధ్యం జీవుల వర్గీకరణలో ఉపయోగపడుతుంది.

3. ఆవరణ వ్యవస్థ వైవిధ్యం (Ecosystem Diversity): విభిన్న రకాల భూచర, జలచర ఆవరణ వ్యవస్థల సముదాయాన్ని 'ఆవరణ వ్యవస్థ వైవిధ్యం' అంటారు.

పైన పేర్కొన్నవాటితో పాటు మైక్రోబియల్ డైవర్సిటీ, అగ్రి బయోడైవర్సిటీ లాంటి విభిన్న స్థాయి జీవ వైవిధ్యం కూడా ఉంటుంది. రాబర్ట్ విట్టేకర్ అనే శాస్త్రవేత్త జీవ వైవిధ్యాన్ని 3 రకాలుగా విభజించాడు.

1. α - జీవ వైవిధ్యం: దీన్ని Species Richness అంటారు. ఒక ఆవరణ వ్యవస్థలోని జాతి వైవిధ్యాన్ని ఇది తెలుపుతుంది.
2. β - వైవిధ్యం: రెండు భిన్న ఆవరణ వ్యవస్థల్లో జాతి వైవిధ్యంలోని భేదాన్ని ఇది తులనాత్మకంగా తెలుపుతుంది.
3. γ - వైవిధ్యం: ఒక విశాల భౌగోళిక ప్రాంతంలోని విభిన్న జీవ సమాజాల్లో మొత్తం వైవిధ్యాన్ని 'గామా వైవిధ్యం'గా పేర్కొంటారు.

మెగా బయోడైవర్సిటీ దేశాలు

మెక్సికో 2002లో ప్రపంచవ్యాప్తంగా అధిక జీవ వైవిధ్యం, సంప్రదాయ విజ్ఞానానికి నిలయంగా ఉన్న దేశాలను (Like-minded Mega Diverse Countries) గుర్తించింది. Conservation International గుర్తించిన 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితా..

1. ఆస్ట్రేలియా 2. బ్రెజిల్
3. చైనా 4. కొలంబియా
5. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో
6. ఇక్వెడార్ 7. ఇండియా
8. ఇండోనేషియా
9. మడగాస్కర్
10. మలేషియా
11. మెక్సికో
12. పపువ న్యూగినియా
13. పెరూ
14. ఫిలిప్పీన్స్
15. దక్షిణాఫ్రికా
16. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
17. వెనిజులా

ఈ జాబితాలో పేర్కొన్న మొదటి దేశంలో అత్యధిక జీవ వైవిధ్యం, చివరి దేశంలో తక్కువ జీవ వైవిధ్యం ఉంటుంది.

జీవ వైవిధ్య హాట్ స్పాట్స్

అధిక జీవ వైవిధ్యానికి నిలయంగా ఉండి ముప్పు పొంచి ఉన్న జీవ భౌగోళిక ప్రాంతాలను 'బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్'గా పేర్కొంటారు. నార్మన్ మేయర్స్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త ఈ భావనను మొదటిసారిగా ప్రతిపాదించాడు. 1985-90లో ఈయన ప్రచురించిన "The Environment" అనే ఆర్టికల్‌లో దీని గురించి ప్రస్తావించాడు. 1996లో Conservation International ఈ భావనపై పరిశోధన చేసి మేయర్స్‌తో ఏకీభవించింది.

ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతాన్ని బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌గా గుర్తించడంలో రెండు అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.

1. కనీసం 1500 జాతుల నాళిక కణజాలయుత మొక్కలు (Vascular Plants) ఎండమిక్ (స్థానియ) జాతులుగా ఆ ప్రాంతానికే పరిమితమై ఉండాలి.
2. కనీసం 70 శాతం తమ సహజ ఆవాసాన్ని లేదా వృక్షజాలాన్ని కోల్పోయి ఉండాలి.

1999లో ఇలాంటి 25 ప్రాంతాలను గుర్తించారు. ఆ తర్వాత మరో 10 ప్రదేశాలను గుర్తించారు. నార్మన్ మెయిర్స్ 1999లో "Hotspots: Earth's Biologically Richest and Most Endangered Terrestrial Eco-region" పుస్తకాన్ని ప్రచురించారు. 2000లో దీన్ని 'నేచర్' అనే అంతర్జాతీయ పత్రికలో ప్రచురించారు. 2007లో రస్సల్ మిట్టర్ మియర్ అనే శాస్త్రవేత్త "Hotspots Revisited" అనే గ్రంథాన్ని రచించాడు.

ప్రపంచంలో ప్రస్తుతం 35 బయోడైవర్సిటీ హాట్‌స్పాట్లు ఉన్నాయి. అవి:

ఉత్తర, మధ్య అమెరికా
1. కాలిఫోర్నియా ఫ్లోరిస్టిక్ ప్రావిన్స్
2. మ్యాడ్రియన్ పైన్ ఓక్ ఉడ్‌లాండ్స్
3. మిసో అమెరికా
4. కరేబియన్ దీవులు

దక్షిణ అమెరికా
1. టంబెస్ చోకో మ్యాగ్డెలిన
2. ట్రాపికల్ ఆండీస్
3. చిలీయన్ వింటర్ రెయిన్‌ఫాల్ వాల్డీవియన్ ఫారెస్ట్
4. బ్రెజిల్ సిర్రాడో
5. బ్రెజిల్ అట్లాంటిక్ ఫారెస్ట్

యూరప్, మధ్య ఆసియా
1. కాకాసస్
2. మధ్య ఆసియా అడవులు
3. మధ్యధరా ప్రాంతం
4. ఇరాన్ అనతోలియన్

ఆఫ్రికా
1. పశ్చిమ ఆఫ్రికా - గినియా అడవులు
2. సక్యులెంట్ కరూ
3. కేప్ ఫ్లోరోస్టిక్ ప్రాంతం
4. మపుటలాండ్ - పాండో లాండ్ అల్బని
5. తూర్పు ఆఫ్రికా తీర అడవులు
6. ఈస్టర్న్ ఆఫ్రోమోంటేన్
7. హార్న్ ఆఫ్ ఆఫ్రికా
8. మడగాస్కర్-హిందూ మహాసముద్ర దీవులు

ఆసియా పసిఫిక్
1. పశ్చిమ కనుమలు - శ్రీలంక
2. హిమాలయాలు
3. ఇండో బర్మా
4. నైరుతి చైనా
5. ఫిలిప్పీన్స్
6. సుందా లాండ్
7. వాలేసియా
8. న్యూ కాలిడోనియా
9. ఈస్ట్ మెలనేసియా అడవులు
10. పాలినేసియా మైక్రోనేసియా
11. న్యూజిలాండ్
12. జపాన్
13. నైరుతి ఆస్ట్రేలియా
14. తూర్పు ఆస్ట్రేలియా

మాదిరి ప్రశ్నలు

1. ఐక్యరాజ్యసమితి 'జీవ వైవిధ్య దశాబ్దం'గా దేన్ని ప్రకటించింది?
ఎ) 2001-10 బి) 2011- 20
సి) 2021-30 డి) 1991-2000
2. 'అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం' ఏ రోజు నిర్వహిస్తారు?
ఎ) ఏప్రిల్ 22 బి) మే 22
సి) జూన్ 20 డి) డిసెంబర్ 21
3. "Convention on Biological Diversity" అంతర్జాతీయ ఒప్పందాన్ని రూపొందించింది?
ఎ) యునెస్కో బి) యూఎన్‌ఈపీ
సి) ఎ, బి డి) ఏదీకాదు
4. భారత్‌లోని ఏ ప్రాంతంలో 'లయన్ టెయిల్డ్ మకాక్' అనే కోతి కనిపిస్తుంది?
ఎ) పశ్చిమ కనుమలు
బి) ఈశాన్య హిమాలయాలు
సి) తూర్పు కనుమలు
డి) అండమాన్ నికోబార్ దీవులు
5. "Conservation International" అనే అంతర్జాతీయ పరిరక్షణ సంస్థ ఎక్కడ ఉంది?
ఎ) మెక్సికో బి) నైరోబి
సి) లండన్ డి) వాషింగ్టన్
6. ప్రపంచంలోని 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితాలో లేనిది?
ఎ) శ్రీలంక బి) వెనిజులా
సి) కొలంబియా డి) ఇండోనేసియా
7. ప్రపంచంలోని మెగా బయోడైవర్సిటీ కేంద్రాల్లో భారత్ స్థానం?
ఎ) 3 బి) 5 సి) 7 డి) 9
8. జీవవైవిధ్య సంరక్షణ కోసం కుదుర్చుకున్న "Convention on Biological Diversity" (BD) అంతర్జాతీయ ఒప్పందం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
ఎ) 1993 బి) 1994
సి) 1995 డి) 1996
9. 'నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ' ఎక్కడ ఉంది?
ఎ) చెన్నై బి) బెంగళూరు
సి) తిరువనంతపురం డి) గాంగ్‌టక్
10. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (UNEP) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
ఎ) జెనీవా బి) న్యూఢిల్లీ
సి) వాషింగ్టన్ డి) నైరోబి
11. 'వరల్డ్ ఎర్త్ డే'ను ఎప్పుడు నిర్వహిస్తారు?
ఎ) మార్చి 22 బి) ఏప్రిల్ 22
సి) సెప్టెంబర్ 16 డి) అక్టోబర్ 12
12. భారత్‌లో ఉభయచర వైవిధ్యం అధికంగా ఉన్న ప్రాంతం ఏది?
ఎ) వింధ్య పర్వతాలు
బి) పశ్చిమ కనుమలు
సి) పశ్చిమ హిమాలయాలు
డి) తూర్పు కనుమలు
13. బట్టమేక పక్షులు (Great Indian Bustard) ఎక్కువగా ఏ రాష్ట్రంలో కనిపిస్తాయి?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తెలంగాణ
సి) మధ్యప్రదేశ్ డి) రాజస్థాన్
14. కర్ణాటకలో ఎన్ని టైగర్ రిజర్వులు ఉన్నాయి?
ఎ) 4 బి) 5 సి) 6 డి) 7
15. ఏ జీవి నుంచి లభించే ప్రత్యేక నూనెను ఔషధాలు, పర్ఫ్యూమ్‌ల తయారీలో ఉపయోగిస్తారు?
ఎ) చింకారా బి) కృష్ణజింక
సి) కస్తూరి జింక డి) సాంబారు దుప్పి
16. 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' చిహ్నం ఏది?
ఎ) ధ్రువ ఎలుగుబంటి
బి) పాండా
సి) నీలి తిమింగలం డి) ఏదీకాదు
17. 'వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) గౌహతి
సి) డెహ్రాడూన్ డి) తిరువనంతపురం
18. దేశంలో ఆసియా సింహం సంరక్షిత ప్రాంతం ఏది?
ఎ) గిర్ అడవులు
బి) వేనాడ్ అభయారణ్యం
సి) పెంచ్ జాతీయ పార్కు
డి) పైవన్నీ

సమాధానాలు

1) బి; 2) బి; 3) బి; 4) ఎ; 5) డి;
6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి;
11) బి; 12) బి; 13) డి; 14) సి; 15) సి;
16) బి; 17) సి; 18) ఎ.

It is the people who matters in a democracy



BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Though many companies (1)/ believe that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ No error (5)
2. Eat has the selectional restriction (1)/ that it must be following by a kind of food, (2)/ so 'I eat sky' (3) / is not possible. (4)/ No error (5)
3. There was (1)/ no way he could (2)/ keep going (3)/ below all that pressure. (4)/ No error (5)
4. It was not until morning (1)/ that the sheer scale (2)/ of the damage (3)/ could be seen. (4)/ No error (5)
5. Trade sanctions (1)/ were imposed (2)/ against any country (3)/ that refuses to sign the agreement. (4)/ No error (5)

Directions (Q. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. You'll have to study <u>any books</u> on Freud before writing a paper on psychoanalysis.
1) Much books 2) few books
3) some books 4) more books
5) No correction required
7. A European visitor to the Far East must accommodate <u>self from</u> the habits of life that may seem very strange to him.
1) Himself to 2) his self to
3) himself for 4) his self from
5) No correction required
8. He joined postgraduate course in the same college in which he had studied <u>for the three previous years.</u>
1) from previous three years
2) during the previous three years
3) three years previous
4) during the three previous years
5) No correction required
9. She always <u>manage</u> to hurt her mother's feelings.
1) do manage
2) does manage
3) did manages
4) do managed
5) No correction required
10. It is the people <u>who matters</u> in a democracy.
1) whom matters
2) whose matters
3) whose matter
4) who matter
5) No correction required

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. We were surprised to know that our friend was of royal ______.
1) dissent 2) decent
3) descent 4) dissuade
5) dispute
12. ______ of the highly educated people is a huge ______ on the country's resources.
1) Fight, draw
2) Position, aspect
3) Plight, drain
4) Struggle, issue
5) Rank, exhaust
13. No ______ reasons have been given for the sudden flight of refugees ______ this area.
1) proper, for
2) correct, along
3) suitable, among
4) valid, from
5) compelling, counter
14. The modern ______ of communication have ______ distance.
1) ways, deep
2) methods, destroyed
3) paths, shortened
4) means, annihilated
5) gadgets, developed
15. These remarks about the dominance of casteism in elections are quite ____ to the present ____.
1) apposite, position
2) opposite, fact
3) relevance, media
4) significance, party
5) applaudable, generation

Directions (Q. 16 - 20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) These days technology has revolutionized the very concept of a wrist watch. 3
B) Almost a majority of the people wear a watch worn round the wrist, it measures time in minutes, hours etc. 1
C) The day is not far when we shall have a little TV fitted into a wrist watch. 4
D) A wrist watch may be wound or automatic. 2
E) Wrist watches have become an integral part of human beings, due to their utilities. 6
F) One may have a choice of leather or metal of gold or silver while choosing a strap for the wrist watch. 5

16. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
1)A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The international fight against Islamic State moved up a _____ (21) on Saturday as Turkish police arrested a Belgian suspect heading for Syria in connection with ____ (22) week's Paris attacks, hours after the UN Security Council unanimously ______ (23) all its members to combat the extremist group.

A day after the EU imposed ____ (24) new external border controls, authorities in Belgium raised the alert level in the capital to level four - signifying a "serious and imminent threat" as the _______ (25) for the remaining jihadi who killed 130 people in Paris entered its second week. The presumed ringleader of the Paris attacks, Abdelhamid Abaaoud, a 28-year-old Belgian national of Moroccan origin, was ______ (26) to have been in Syria but died in a ferocious seven-hour gunfight ______ (27) police at a rundown apartment in St-Denis, north of Paris, on Wednesday. Another ______ (28) member of the unit, Salah Abdelslam, a 26-year-old Frenchman living in Brussels, is the subject of an international manhunt. His brother, Brahim, who blew himself up in the attacks, spent time in a Belgian prison with Abaaoud, while a third Molenbeek resident, Bilal Hadfi, was also among the Paris suicide bombers. Belgian Special Forces ______ (29) four people in the capital's Place du Grand Sablonon Saturday afternoon, while the Brussels Metro system is expected to be shut down until Sunday afternoon at the earliest. Shops ______ (30) closed, some shopping malls were shuttered, professional football was cancelled, concerts were called off and music venues, museums, and galleries shut their doors for the weekend.

21. 1) gear 2) ahead 3) above 4) always 5) alone
22. 1) lost 2) last 3) late 4) lastly 5) lasted
23. 1) urge 2) urging 3) urged 4) pledged 5) plead
24. 1) tight 2) treat 3) tread 4) tough 5) track
25. 1) hate 2) hurt 3) heat 4) hurt 5) hunt
26. 1) thought 2) thinking 3) think 4) thinned 5) thanked
27. 1) from 2) with 3) for 4) form 5) firm
28. 1) suspense 2) suspect 3) suspected 4) suspecting 5) suspects
29. 1) convicted 2) allowed 3) acquitted 4) arrested 5) prosecuted
30. 1) are to 2) will be 3) will been 4) have been 5) were

KEY

1) 3; 2) 2; 3) 4; 4) 5;
5) 4; 6) 3; 7) 1; 8) 2;
9) 2; 10) 4; 11) 3; 12) 3;
13) 4; 14) 4; 15) 1; 16) 4;
17) 1; 18) 5; 19) 1; 20) 3;
21) 1; 22) 2; 23) 3; 24) 4;
25) 5; 26) 1; 27) 2; 28) 3;
29) 4; 30) 5.